

బాలబంధు బి.వి. నరసింహారావు

సంపూర్ణ రచనల సంకలనాలు

2

- జీవన రేఖలు • బి.వి.వ్యాసాలు • బి.వి గురించి స్నేహితుల వ్యాసాలు
- చలంతో లేఖలు (సంజీవదేవ్‌గారి ముందుమాట)

జీవనరేఖలు

(ఆత్మకథ)

బి.వి. వ్యాసాలు

బి.వి.గారి గురించి

స్నేహితులు, పరిచయస్తుల వ్యాసాలు

చలంతో లేఖలు

(సంజీవదేవ్ ముందుమాట)

“బాలబంధు”

జీవనరేఖలు (ఆత్మకథ)

బి.వి. వ్యాసాలు

బి.వి.గారి గురించి

స్నేహితులు, పరిచయస్తుల వ్యాసాలు

చలంతో లేఖలు

(సంజీవదేవ్ ముందుమాట)

బాలబంధు సంపూర్ణ రచనలు

ప్రధమ ముద్రణ

బి.వి. శతజయంతి సంచికలు, మూడు భాగాలు విడిగా - ఆగస్టు 15, 2013

రూపకల్పన .. పెద్ది సాంబశివరావు, 94410 65414

Teluguthejam.com

సహాయం.. గాలం రమేష్, యస్. చంద్రిక

కథలు

1. బంగారు పిచ్చుక

ఏ నాటిదో ఈ కథ.



అనగనగా ఒక బంగారు పిచ్చుక ఉండేది. అది పట్టునారతో ఒక చక్కని గూడు అల్లుకొని అందులో మెత్తని ఈకలు పరుచుకొని ముద్దయిన రెండు ముత్యాల గుడ్లు పెట్టుకుంది.

ఒకనాడు పిచ్చుక మేతకు వెళ్ళడం చూచి, పక్క నున్న పల్లెటూరి కుర్రవాడు ఒకడు మెల్లగా వచ్చి, ఆ గూటిని గుడ్లతో సహా దొంగిలించుకు పోయాడు.

పిచ్చుక తిరిగి వచ్చి చూచుకొంది. గూడులేదు. గుడ్లు లేవు. గోడుగోడున ఏడ్చింది. కష్టపడి అల్లుకొన్న గూడూ, కన్న గుడ్లూ పోతే ఏడవదూ మరి?

కనబడిన అందరినీ అడగడం మొదలు పెట్టింది పిచ్చుక... “నా గూడు దొంగిలించారా? నా గూడు దొంగిలించారా?” అని. అలా అలా తిరిగే కుక్కపిల్ల నడిగింది. “నా గూడు దొంగిలించావా?” అని. 'కుయ్యో మొర్రో నే నెరుగను' అంది కుక్కపిల్ల. ఆడుకొనే ఆవుదూడ నడిగింది పిచ్చుక “నా గూడు దొంగిలించావా?” అని. “అయ్యో! అంబా! నే నలాంటి పని ఎప్పుడూ చెయ్యను” అంది ఆవుదూడ.

తరువాత పిచ్చుక తుమ్మెద నడిగింది, తూనీగ నడిగింది. చెరువునడిగింది, చెట్టునడిగింది, పువ్వు నడిగింది, పిల్లకాల్వ నడిగింది. “నా గూడు దొంగిలించారా?” అని. "రామ రామ అలాంటి దొంగపని మే మెన్నడూ చెయ్యం” అన్నారు వాళ్ళంతా.

ఇక చేసేదేమీ లేక పిచ్చుక కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. పిచ్చుక ఏడ్పు విని కుక్కపిల్ల, ఆవుదూడ, తుమ్మెద, తూనీగ, చెరువు, చెట్టు, పువ్వు, పిల్లకాలవ ఎంతో జాలిపడి, "పిచ్చుకమ్మా! ఏడవకు. నీ గూడు దొంగిలించిన దొంగను పసికట్టి తెస్తాం” అన్నారు.

దొంగను ఎలా పసికట్టగలరు?” అని అడిగింది పిచ్చుక.

“దొంగైతే నా ముందుకే రాడు” అంది కుక్కపిల్ల.

“నా వెనక్కే రాడు” అంది ఆవుదూడ.

“నా రొద విని చెదరగొట్టడు” అంది తుమ్మెద.

"నన్ను పట్టుకొని బాధపెట్టడు" అంది తూనీగ.

"నా గట్టునే నడవడు" అంది చెరువు.

"నా నీడనే నిలవడు" అంది చెట్టు.

"నన్ను తుంచి వాసన చూడడు" అంది పువ్వు.

"నన్ను దాటిపోడు" అంది పిల్లకాలువ.

"ఎందుచేత?" అని అడిగింది మళ్ళీ పిచ్చుక.

"దొంగనన్న బెంగచేత. దొరికితే శిక్షిస్తామన్న భయంచేత" అన్నారు వాళ్ళంతా.

పిచ్చుకమ్మ వాళ్ళ దయ కెంతో కృతజ్ఞత తెలిపింది.

"దొంగను పట్టాలి! పట్టితీరాలి!!" అని వాళ్ళు దిక్కులు పిక్కటిల్లేలాగ మూడుసార్లు గట్టిగా కేకలు వేశారు.

గూడు దొంగిలించుకు పోయిన కుర్రవాడు వాళ్లింటిలో ఒక మూల ఉన్నాడు. ఈ కేకలు విన్నాడు. కంగారు పడ్డాడు. తన గుట్టు దాగదని భయపడ్డాడు. చేసిన పని చాలా చెడ్డదని కూడా గ్రహించాడు. 'ఏమి చెయ్యడమా?" అని ఒక నిమిషం ఆలోచించాడు. చేసిన తప్పు దిద్దుకోవడానికి, తీసిన గూడును తీసినచోటే గప్ చుప్ మనకుండా పెట్టిరావడానికి నిశ్చయించుకున్నాడు.

కుర్రవాడు పిచ్చుకగూడు చేత్తో పుచ్చుకొని, దొడ్డి దారిని పిల్లిలాగ మెల్లగా వెళ్ళి తీసినచోటునే పెట్టి, తిరిగి వస్తున్నాడు. దారిలో పిచ్చుక ఎదురయింది. దాన్ని చూడగానే అతనికి గుండె గతుక్కుమంది. మెల్లగా ధైర్యం తెచ్చుకొని, గొంతుక సర్దుకొని "పిచ్చుకమ్మా! నీ గూడూ గుడ్లూ దొంగిలించింది నేనే. నిజం చెపుతున్నా. వాటిని తీసినచోటే పెట్టివస్తున్నా. కోప్పడకు. ఎవరికీ నా మీద కోపం కలగకుండా చూడు" అని బ్రతిమాలడం ప్రారంభించాడు.

ఆ కుర్రవాని మాటలు విని పిచ్చుక ఆశ్చర్యపడింది. ఆనందపడింది. "అయ్యో నా బుజ్జితండ్రీ! నీ తల్లి కడుపు చల్లగుండా. నిజం చెప్పిన నీ మీద ఎవరికైనా కోపం కలుగుతుందా? గౌరవం కలుగుతుందిగాని" అంటూ తుర్రున ఎగిరి వెళ్ళి తన గూటిని గుడ్లను సురక్షితంగా ఉండడం చూచింది. పట్టలేని సంతోషం పొందింది.

అక్కడ నుంచి పిచ్చుక పరుగున పోయి, "కుక్క పిల్లా! ఆవుదూడా! తుమ్మెదా! తూనీగా! చెరువూ! చెట్టూ! పువ్వూ! పిల్లకాలవా! విన్నారా ఈ మాట? నా గూడూ గుడ్లూ దొరికినాయి. తీసుకువెళ్లిన ఒక బుజ్జి నాన్న తిరిగి తీసుకువచ్చి ఇచ్చాడు. అతడు దొంగకాడు; దొడ్డనిజాయితీ కలవాడు. మీ రెవరూ అతని మీద ఆగ్రహించకండి. మీరెవరూ శ్రమపడి వెతకడానికి బయలుదేరనక్కరలేదమ్మా" అని మైమరచి చెప్పడం ప్రారంభించింది.

అంతా ఆ మాటలు విన్నారు. "అంత బుద్ధిమంతుడైన బుజ్జివాణ్ణి ఒకసారి ఇక్కడకు తీసుకురా. మేమూ చూస్తాం. ఆనందిస్తాం" అన్నారు.

పిచ్చుకమ్మ బయలుదేరింది. ఒక పిలుపు పాట పాడుకుంటూ -

''రావయ్య నా బుజ్జి
రావయ్య తండ్రీ!
నిజము చెప్పిన నీకు
నిండు దీవెనలు !
తప్పు చేసినవారు
ఒప్పుకుంటారా?
నిజము ఘనతెరిగినా
నీకె తగుగాక !
మా వారలందరూ
మంచి గౌరవము
నీ కీయ దలచారు

నిక్కముగ, రమ్ము."

పిచ్చుకమ్మ ఆ కుర్రవాణ్ణి తన మిత్రులందరికీ చూపించడానికి ఆహ్వానించి తోడితెచ్చింది. అందరూ అతని చుట్టూ చేరారు.

కుక్కపిల్ల ఆవుదూడ చెంగుచెంగున వాని చుట్టూ ఆనందంగా గంతులువేశాయి. తుమ్మెద జుమ్మని గానం చేసింది. తూనీగ పైన ఒయ్యారంగా నాట్యం చేసింది. చెరువు పందు ముత్తయిదువులా నిండుగా మురిసి చూచింది. చెట్టు నిలబడి నీడనిచ్చి ఆదరంగా చూచింది. పువ్వు కలకల నవ్వి కమ్మని సువాసన విరజిమ్మింది. పిల్లకాలువ ఉల్లాసంగా ఉరుకుతూ పక్కనే ప్రవహించింది. పిచ్చుకమ్మ ఆపుకోలేని వేగంతో ఆనందాశ్రులు రాల్చింది.అందరూ కలిసి ఆ కుర్రవాణ్ణి.

''అందుకో ఓ బుజ్జి
అందాల బాలా!
మా హృదయ కుసుమాల
మంచి ఒక మాలా!
నిజము చెప్పిన నీకు
నిండు దీవెనలు
కలకాల మీ గాథ
ఇలను వర్థిల్లు." అని కీర్తించాయి.

2. గిరిజ అమ్మమ్మ

అదొక చిన్నవూరు. అందంగా వుంటుంది. వెడల్పు తక్కువ. పొడవు ఎక్కువ. అక్కడి పిల్లల కది పెద్ద వూరుగానే కనబడుతుంది. ఊళ్లో పెద్ద ఇళ్లూ, చిన్న గుడిసెలూ ఉన్నాయి. పెద్దచెట్లూ, చిన్న మొక్కలూ ఉన్నాయి. ఆ యిళ్లూ, ఆ చెట్లూ అలా వుండడం ప్రకృతి సహజమే అనుకుంటారు అక్కడున్న పెద్దవాళ్లలో చాలామంది.

ఊరు చిన్నదైనా చూడడానికి అందంగానే ఉంది. ఆ వూళ్లో ఒక చిన్న పాప ఉంది. పేరు గిరిజ. వయసు ఆరేళ్ళు. బొద్దుగా బంతిలాగ ఉంటుంది. గుండ్రని ముఖం. పెద్దకళ్లు. చిరునవ్వుతో వుండే చిన్ని నోరు. గిరిజ చాలా చురుకైన పిల్ల. ఎప్పుడూ సంతోషంగా చలాకీగా ఉంటుంది.

గిరిజ అమ్మమ్మగారి వూరూ అదే. గిరిజ ఆ వూళ్లోనే పుట్టింది. వాళ్ళ అమ్మా అక్కడే పుట్టింది. వాళ్ల అమ్మమ్మ కూడా అక్కడే పుట్టి ఉంటుందని గిరిజ నమ్మకం. అంతెందుకు, ప్రపంచంలో ఉన్నవాళ్ళందరూ ఎప్పుడో ఒకప్పుడు ఆ వూళ్లోనే పుట్టివుంటారని గిరిజ గట్టి నమ్మకం.

గిరిజ అమ్మమ్మ పేరు గవరమ్మ. గవరమ్మ పేరే మనమరాలి దగ్గరకు వచ్చేటప్పటికి గిరిజగా మారి వుంటుంది. గవరమ్మకు గిరిజ అంటే పంచప్రాణాలు. డెబ్బైఏళ్లు దాటుతున్న పండుముసలి అయినప్పటికీ గవరమ్మ ఓపిగ్గా వుండి తన పనులన్నీ తానే చేసుకుంటుంది.

అమ్మమ్మగారి ఇల్లు వూరికి ఆ చివర. గిరిజ ఇల్లు వూరికి ఈ చివర. రోజు కొకసారైనా గిరిజ అమ్మమ్మ గారి ఇంటికి వెళ్ళి రాకుండా వుండదు. అమ్మ ఇచ్చిన తాయిలం అమ్మమ్మకు, అమ్మమ్మ ఇచ్చింది అమ్మకు, అటు ఇటు ఇస్తూ, తెస్తూ ఆసులో కండెలాగ తిరుగుతూ వుంటుంది. అమ్మకు, అమ్మమ్మకు గిరిజ అంటే అల్లారుముద్దు. వాళ్లు చెప్పిన పనులన్నీ చేస్తూ వుంటుంది. చేస్తూ ఉన్నందుకు వాళ్ళు గిరిజకు తినడానికేదో పెడుతూ వుంటారు.

ఒకనాడు గిరిజ చిన్న మూట భుజాన మోసుకుంటూ అమ్మమ్మ గారింటికి వస్తోంది. అల్లంత దూరాన ఉండగానే అమ్మమ్మ చూసింది. చప్పున ఎదురువెళ్ళి మూటను ఒక చేత్తో, ముద్దుల మనుమరాలిని మరొక చేత్తో తీసుకుంది. “నా చిట్టితల్లీ! ఇంత బరువు మోయగలిగావుటే? భుజాలు నొప్పి పెట్టలేదమ్మా?” అని అడిగింది. “లేదమ్మమ్మా!” అని ఒయ్యారంగా చేతులు తిప్పుకుంటూ జవాబు చెప్పింది గిరిజ.

ఇద్దరూ కిలకిల నవ్వుకున్నారు. లోపలికి వెళ్ళారు.

ఆ దినమంతా గిరిజ అమ్మమ్మతోనే వుంది. అమ్మమ్మతోనే తింది. రాత్రి పుచ్చపువ్వులాంటి వెన్నెట్లో అమ్మమ్మ పక్కలోనే పడుకుంది.

అమ్మమ్మ చెప్పిన కాకి, నక్క, తాబేలు కథలు ఆప్యాయంగా వింటూ 'అమ్మమ్మా! కాకీ, నక్కా ఆటికి మాట్లాడ్డం వచ్చా?" అని ప్రశ్నించింది. "ఆ కాలంలో అన్నీ మాట్లాడేవేనమ్మా. అది సత్తెకాలం. ఈ నాడైతే అన్నీ విడ్డూరంగా మారిపోయాయి." అని జవాబు చెప్పింది అమ్మమ్మ.

కాలం తీరిన అమ్మమ్మ, కాలం తీరాన వున్న మనుమరాలితో కమ్మకమ్మగా ఎన్నో వూసులు చెప్పుకుంది. "తల్లీ! నువ్వు రోజురోజుకీ యించక్కగా పెద్దదానవై పోతున్నావు. నేను ముసలి వరుగునై పోతున్నా. అయినా బెంగలేదు. నీలో నన్ను చూసుకుంటున్నా. నేనూ చిన్నప్పుడు నీలాగ బొద్దుగా, ముద్దు ముద్దుగా వుండేదాననటమ్మా" అంటూంటే గిరిజ ముచ్చటపడుతూ వింది.

తరువాత కొంతసేపటికి నిద్రపోయింది. గవరమ్మ కూడా చాలా పొద్దుపోయేవరకు కృష్ణా, రామా అనుకుంది. తరువాత తానూ నిద్రపోయింది.

తెల్లవారి అమ్మమ్మ, మనుమరాలిని లేపి పళ్లుతోమి, ముఖం కడిగి, స్నానం చేయించి చద్ది పెట్టింది. తిన్న తరువాత తన పనుల కడ్డం లేకుండా అమ్మమ్మ మనుమరాలి కొక అట్టుముక్క నిచ్చి పెరటిలో తిన్నెమీద తింటూ కూర్చోమని పంపించింది.

అట్టుముక్క తింటున్న గిరిజకు దగ్గరగా చేరి చిన్నవీ పెద్దవీ కాకులు చెట్ల మీద వాలిన రంగురంగు పిట్టలూ చూస్తున్నాయి. కూస్తున్నాయి. గిరిజ వాటితో ముచ్చటిస్తూ అట్టు ముక్కను కొంచెం కొంచెం తుంచి వాటికి వేస్తోంది.

పెద్ద కాకులన్నీ చిన్నవాటిని నెట్టివేస్తూ టక్కు టక్కున అట్టు ముక్కలను ముక్కుతో అందుకొని తింటున్నాయి. చిన్నవాటి కేమీ దొరకనియ్యడంలేదు. అది చూచి గిరిజ "ఛీ! పాడు ముండల్లారా! చిన్నవాటి కందనియ్యకుండా అంతా మీరే తింటున్నారు, కొడతా!" అంది.

"బలమున్న పెద్ద పక్షులు బలంలేని చిన్న పక్షులను అవతలికి తోసివేసి అంతా తామే తింటాయన్న లోకం పోకడ ఆ పసికూన కేమి తెలుసు!"

ఇంతలో ఒక వింతపిట్ట నిమ్మచెట్టు మీద వాలి కమ్మగా కూయడం ప్రారంభించింది. అది విని ఆ పాప "అబ్బా! నీకు పాడటం వచ్చా? పాడు. అట్టుముక్క పెడతా" అంది. అప్పుడే లోపలి నుంచి అమ్మమ్మ "చిట్టి తల్లీ! రా" అని పిలిచింది. అన్నీ మరిచి గిరిజ బుడిబుడి నడకతో లోపలికి వెళ్ళింది.

చేసిన పిండివంటకాలు ఒక చిన్న మూటలో కట్టి అమ్మమ్మ గిరిజ భుజానపెట్టి "తల్లీ! ఈ మూట పదిలంగా తీసుకువెళ్లి అమ్మకు యియ్యి. ఎక్కడా ఆగకు. దిక్కులు చూడకు. తిన్నగా ఇంటికి వెళ్ళు" అని కొంతదూరం సాగనంపింది. తిరిగి వెళ్ళే మనుమరాలివంక అదే చూపు చూస్తూ గవరమ్మ ఇలా అనుకుంటోంది...

"నా చిట్టితల్లి వస్తుందంటే ఆనందం. వచ్చి వెళ్ళి పోతూ వుంటే చెప్పలేని ఆవేదన వచ్చి యిక్కడున్నంత సేపూ నాకు నిండుగా పండుగ్గా ఉంటుంది. వెళ్ళిపోతూ వుంటే నాలో అంతా వెలితి అయినట్లు, చీకటి అయినట్లు వుంటుంది. బెంగగా వుంటుంది. నా చిట్టి తల్లిలో నన్ను చూచుకుంటూ కాలం వెళ్ళబుచ్చుకుంటూ ఉంటున్నా" అని అలా ఆలోచనలోపడ్డ అమ్మమ్మ కళ్ళ నుండి రెండు నీటిచుక్కలు మిలమిల మెరుస్తూ నేలమీద రాలినవి.

3. అన్నీ చెప్పిన చిన్ని గాథ

'అన్నీ!' అని పిలుస్తారు నన్ను. అంతా అలా పిలవరు. తాతయ్య 'నన్నీ!' అంటారు. అమ్మమ్మ అంటుంది. తలొకలాగ పిలుస్తారు.

ఎందుకలా పిలుస్తారు అని అమ్మ నడిగితే 'అన్నీ' అంటే ఎవరికి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు పిలవొచ్చట. అప్పుడు నాకు అన్నీ అంటే తెలిసిందన్న మాట.

అమ్మ నన్ను ఏంపేరూ పెట్టి పిలవదు. సైగచేసి పిలుస్తుంది. అమ్మ సైగలన్నీ నాకు తెలిసిపోతాయి కూడా. ఇంకెవ్వరికీ తెలియవు.

ఒకసారి అమ్మ నావంక అలా చూసింది - 'రా' అన్నమాట. ఒకసారి ఇలా చూసింది. 'వద్దు' అన్నమాట. అప్పుడు నేను మా వెంకు, కాంతి, జాని, బుడి వాళ్ళతో ఆడుకోకుండా అమ్మదగ్గరకు వెళ్లిపోయా.

"ఇలా కూచో. ఈ బొమ్మల పుస్తకం చూసుకో" అంది అమ్మ. బొమ్మలన్నీ సైగలే చేస్తాయి! అమ్మలాగే చూస్తాయి. నాకన్నీ తెలిసిపోతాయి. అమ్మన్నా, బొమ్మలన్నా నాకు బోలెడంత ఇష్టం.

అమ్మ నన్ను ఎప్పుడూ కొట్టదు. తిట్టదు. అన్నీ ఇస్తుంది. అమ్మ చెప్పిందంతా చేస్తా. ఎందుకో అలా చేస్తా నన్నమాట.

వెంకు మావయ్య లేడూ. వాడంటే నాకు బలేకోపం. అందరినీ ఏడిపిస్తాడు. నన్నూ ఏడిపిస్తాడు.

అన్నీ బన్నీ

కొనలేని వన్నీ

మినపప్పు సున్నీ!

అని ఉడికిలిస్తాడు. నన్ను ఉడికిలిస్తుంటే అమ్మ కూడా చూసింది. మరి వూరుకుంది. ఎందుకో!

అమ్మ దగ్గరికి మెల్లిగా వెళ్లా. వెంకు అలా వెళ్లి పోయాడులే. "అమ్మా! మావయ్య చూడవె! పాటకట్టి ఏడిపిస్తున్నాడూ" అన్నా.

అమ్మ కూడ ఒక బలే పాటకట్టి చెప్పింది.

వెంకూ, పెంకూ

పెట్రోలు బంకూ

చేయమంటె జంకూ.

అని 'నువ్వు కూడా పాడవే. మావయ్య పని అవుతుంది' అంది.

మావయ్య నన్ను ఉడికిలిస్తే, నేను మావయ్యని ఉడికిలించా. మావయ్య ఒకసారంటే, నేను రెండు సార్లు అని ఉడికిలించా. అంటే బోలెడన్ని సార్లు అన్నానన్న మాట. ఉడికిలి ఉడికిలి మావయ్య కుక్కపిల్ల అయిపోయాడులే!

మొన్న ఒకసారి మా బుజ్జి కుక్కపిల్లని, ఏదో కుక్క కరవొస్తే, తోక యిలా పెట్టుకొని పారిపోయి వచ్చింది. ఇంట్లో మూల దూరింది. అలా మావయ్య ఓడిపోయి కుక్కపిల్ల అయ్యాడన్నమాట.

నేనూ, మావయ్యా ఇలా పాటకట్టి ఉడికిలించుకుంటుంటే అమ్మమ్మ వింది. 'ఏమిటా మాటలూ మీరూనూ' అని సాగదీసుకుంది. మాటలంట మాటలు, పాటలైతేనూ! అమ్మమ్మకి ఒక పాటా తెలియదుగా. గోడు.

తాతయ్య దగ్గరికి నేను వెళ్ళను. అసలు వాళ్లు కూడా ఎవరూ వెళ్ళరు. అమ్మమ్మ వద్దంటుంది. ఏదో రాసుకుంటారంట. ఎవళ్లో పెద్దవాళ్లు వచ్చి మాట్లాడతారంట. ఇంతమంది మేం ఉన్నాంగా! మాతో ఒకసారన్నా మాట్టాడరే తాతయ్య మరి? ఏమో నాకు తెలవదు.

రావుగారు వస్తే, అమ్మ 'నమస్తే' పెట్టింది. రావుగారంటే తెలుసా? బి.వి. గారు, పాటలు పాడరూ, ఆయన. బలేగా పాడతారులే, కాంతీ, జానీ, బుడి, నేనూ అంతా రావుగారి పాటలు వింటాం. రేడియో పాటలకంటే కూడా బలేగా ఉంటాయి. గమ్మత్తులు చెపుతారు. నవ్వుతారు. అందరినీ నవ్విస్తారు.

ఒకసారే, పందెం వేసుకున్నాం అందరం. నవ్వాం. మేమంతా ఓడిపోయాం. రావుగారే గెలిచారు. చాలాసేపు నవ్వారు.

అమ్మ నవ్వలేదు. అమ్మమ్మ నవ్వింది. తాతయ్య నవ్వారు. అమ్మ ఒక్కతే నవ్వలేదు.అమ్మ నవ్వదు అసలు. ఎందుకో? ఒకసారన్నా నవ్వుతుందేమోనని చూస్తా. ఎప్పుడూ నవ్వదు.

రావుగారు ఎప్పుడన్నా వస్తారా, పెద్దవాళ్లతోనూ మాట్లాడుతారు. మాతోనూ మాట్లాడతారు. మాతోనే చాలా సేపు మాట్లాడతారు. అందుకే రావుగారంటే నాకెంతో ఇష్టం. పాటలు కూడా పాడతారుగా.

ఒకసారి నేను రావుగారికి నమస్తే పెట్టాను. అమ్మ కూడా చూసింది. ఆయన నన్ను చాలా మెచ్చుకున్నారు. "తల్లీ! ఎవరు చెప్పారమ్మా? ఎందుకమ్మా నమస్తే?" అని ముద్దు చేశారు. అమ్మ అంది కదా "ఎవరు చెప్పారే రావు గారికి నమస్తే అనమని?"

అమ్మ నమస్తే అంటుంది కదూ, నేనూ నమస్తే అన్నాను. అలా అనడం నాకు ఇష్టమయిందీ!

అమ్మ అసలు నవ్వదు అని చెప్పాను కదూ! ఎప్పుడూ బెంగమొగం పెట్టుకుంటుంది. ఒకసారి అమ్మా, నేనూ ఉన్నాం నిమ్మచెట్టు పక్క అప్పుడు అమ్మ ఏడ్చింది. చాలాసార్లు అలా ఏడ్చింది! 'ఎవరితోనూ చెప్పొద్దు' అంది. అసలు నేనెందుకు చెపుతాను, అమ్మ ఏడిస్తే ఎవరన్నా చెపుతారా ఎక్కడన్నా?

ఏడిస్తేనే కామోసు అమ్మ కళ్లు పెద్దగా అయినాయి. ఎప్పుడన్నా చాలాసార్లు ఏడుస్తుంది కదూ! అద్దంలో కళ్లూ పెద్దగానే ఉన్నాయి. నేను కూడా ఇంత చిన్నగా ఉన్నప్పుడు ఏడ్చానట. అందుకని నా కళ్లూ పెద్దగా అయినాయి తెలుసా?

చిన్నప్పుడు నేను ఏడిస్తేను ఎత్తుకునేవారట. ఇప్పుడు నన్ను ఎవరూ ఎత్తుకోరు. అమ్మకూడా ఎత్తుకోదు. అసలు ఇప్పుడు నేను ఏడవను కదూ, అమ్మకు ఎత్తుకోడానికి తీరుబడి కూడా వుండదు. బోలెడన్ని పనులు చెయ్యాలి ఇంటో. చిన్నప్పుడు నన్ను అమ్మ ఎత్తుకునేదేమో! అప్పుడు అమ్మకు బోలెడన్ని పనులు లేవేమో!

'అమ్మా! నన్ను చిన్నప్పుడు ఎవరు ఎత్తుకునేవారే?' అంటేను. అమ్మ మొగం తిప్పుకుని నిమ్మచెట్టు పక్కకి వెళ్లిపోయింది. నాకు అర్థమయిపోయింది. ఇంకెప్పుడూ అమ్మని ఆ సంగతి అడగను బాబూ.

చీకటిపడిం తరవాత అన్నం తింటాం. దీపాలు కూడా ఉంటాయి. ఎలక్ట్రిక్ దీపాలు. అప్పుడు అమ్మ నన్ను చిన్న మంచంమీద పడుకోబెట్టి, మంచి జోలపాట పాడి నిద్రపోబెడుతుంది. ఆ పాట పాడితేనే నాకు నిద్ర వస్తుంది.

''జోజోకన్నా!

జో కొడుతున్నా

కళ్లు మూసుకో

కమ్మగ పడుకో -

అనే పాట.

ఇంకా ఉంది పాట

దూర తీరముల

కరిగిన నాన్నా,

తిరిగి వచ్చులే

తీరును వెతలే"

ఈ పాట పాడి అమ్మ నిమ్మచెట్టు దగ్గరికి వెళ్లి పోయింది. అమ్మ నిమ్మచెట్టు దగ్గరికి వెళ్లిపోయినా, అమ్మ పాట నాకు చెవుల్లో కమ్మగా వినబడుతూనే వుంది. అమ్మ వచ్చి చూస్తే నిద్రపోయానట. అమ్మే చెప్పింది. ఒకసారి గమ్మత్తు మాట అమ్మను అడిగాను. ఎవ్వరూ అక్కడ లేరులే. ఎవరన్నా వుంటే అమ్మను ఏమీ అడగకూడదుగా, నాకు తెలుసు.

'అమ్మా! నేను ఇంత ఉన్నప్పుడు నీ వొళ్లో కూచున్నానే, అప్పుడు చాలా మంది కూడ వచ్చారు. నువ్వు బెంగ మొగంతో వున్నావూ, నాకు బిస్కత్తులు కూడ ఇచ్చారూ, ఏమిటమ్మా అది?'

'అది పెళ్ళి' అంది.

'ఎవరికమ్మా పెళ్ళీ?'

'ఆ బల్లమీద కూచున్నవాళ్ళకి' అంది. నేనూ కూచున్నాను కదూ ఆ బల్లమీద. నాక్కూడా పెళ్ళా అమ్మా అప్పుడు ?

'తప్పు!' అంది అమ్మ.

తప్పు అంటుందే? నాకు తెలిసింది కాదు. పెళ్ళి ఎక్కడన్నా తప్పు అవుతుందా? మొన్న వాళ్ల శాంతికి పెళ్ళి అయింది. రాముకి పెళ్ళి అయింది. అవన్నీ తప్పేనా? అమ్మను అడగ కూడదు.

అమ్మను ఏదైనా గట్టిగా అడిగితే మళ్లీ నిమ్మచెట్టు పక్కకి వెళ్ళిపోతుంది కదూ. అందుకని నేను ఊరుకున్నా.

ఒకసారి రావుగారు మా ఇంటికి వచ్చినప్పుడు నన్ను చాలా చాలా అడిగారు. "పాపా! నీకు పాటలు వచ్చా?" అని అడిగారు. మా ఇంట్లో రేడియో ఉందిగా. రావుగారింట్లో రేడియో లేదేమో! అందుకే అడిగారు.

అప్పుడు మరి పెద్దమ్మ, పెద్ద మావయ్య, అమ్మా, నేనూ అంతా కలసి రేడియోలో పాడినట్లు పెద్ద మావయ్య అందరితో కూడ చెప్పాడు. రావుగారితో చెప్పలేదేమో! అందుకే నన్ను అడిగారు.

నన్ను రోడ్డుమీదికి వెళ్ళొద్దంటారు. అంతా, మరి చాలా మంది రోడ్డుమీదికి వెళ్ళి, బస్సుల మీద టౌనుకి వెళతారేం? 'పెద్దవాళ్లు వాళ్లు. నువు చిన్న పిల్లవు. వెళ్ళకూడదు..!' అంటారు. చాలామంది చిన్న పిల్లలు కూడ బస్సులో వెళుతుంటే నేను చూశానే. ఒకసారి అందరూ పిల్లలే ఒక కారులో వెళుతుంటే కూడా చూశా.

“ఆ చిన్న పిల్లలందరూ అలా వెళ్ళొచ్చా? హాయిగా తిరగొచ్చా? నేనొక్కదాన్నే వెళ్ళకూడదా? పెద్దదాన్నయితే గాని వెళ్ళకూడదా? అయితే త్వరగా పెద్దదాన్నయి అలా బస్సులోనూ, కారులోనూ నా యిష్టం వచ్చిన చోటికి వెళ్ళి పోవాలని ఉంది.

ఈ మాటలు అమ్మ వింది. నేను అమ్మను చూడలేదు. చప్పున అమ్మ ముఖం తిప్పేసుకుంది. నిమ్మచెట్టు పక్కకి వెళ్ళిపోయింది.

అబ్బా! అమ్మ నిమ్మచెట్టుపక్కకి వెళ్ళటం నాకు బాగుండదు. నిమ్మచెట్టు నరికేస్తే, ఇంక అమ్మ ఎప్పుడూ దాని పక్కకు వెళ్ళకుండా మంచి మొఖంతో సర్దాగా ఉంటుంది. నవ్వుతుంటుంది.

నేను దబ్బున పెద్దదాన్నవుతా, బస్సులోను, కారులోను ఎక్కి, ఇష్టమొచ్చిన చోటికి వెళతా. నాకు బలే హాయిగా ఉంటుంది బాబు అప్పుడు.

నేను పెద్దదాన్ని అయినాను. అమ్మ కింక నా వలన ఎలాంటి బాధ, విచారం లేకుండా చూడాలి. నా జీవిత రహస్యం నాకు తెలిసింది. తెలియకుండా ఉంచడానికి ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. అమ్మకింక నేనొక సమస్యగా ఉండరాదని నిశ్చయించుకున్నా.

మా నాన్న నా రాక కోసం ఏడు సాగరాల మధ్య ఎదురు చూస్తున్నాడు. కళ్లుమూత పడని కలల్లో మునిగి ఉన్నాడు.

వెళుతున్నా - నాన్న కోసం - నా కోసం నా స్వేచ్ఛ కోసం. ఇంక నేనీ పంజరాన బందీగా పడి వుండలేను.

4. పాణి మామయ్య

'అందరూ తెగ చెప్పుకునేలాగ తనకు పేరు రావడం ఎలాగా' అని పాణి మామయ్య ఆలోచించడం మొదలు పెట్టాడు. అందరూ తన పేరు గొప్పగా చెప్పుకుంటుంటే విని ఆనందించాలని పగటి కలలు కంటున్నాడు.

తన పేరు ఊరికే చెప్పుకోమంటే ఎవరైనా చెప్పుకుంటారా? చెప్పుకోరు. ఏం చెయ్యాలి? మార్గమేమిటి? పోనీ పత్రికల్లో తన పేరు పడితే? అందరూ ఇదిగా చెప్పుకుంటారు.

దేశంలో లక్ష పత్రికలున్నాయి. దిన పత్రికలు, వార పత్రికలు, పక్ష పత్రికలు, మాస పత్రికలు - రకరకాల పత్రికలున్నాయి. పిల్లలకూ, పెద్దలకూ, స్త్రీలకూ ప్రత్యేక పత్రికలున్నాయి.

పత్రికల్లో పేరు పడడానికి ఏం చెయ్యాలి? ఏమీ లేదు. ఏదో ఒక కథ, ఒక పద్యం, లేదా ఒక పాట రాసి పంపిస్తే, పత్రికల వాళ్ళు వేసుకుంటారు. రచయిత ఫలానా అని పేరు ప్రకటిస్తారు. పేరు ముందు ఏదైనా కొంచెం బిరుదు కూడ తగిలించుకోవచ్చు. ఇదొక బ్రహ్మాండమైన విషయం కాదు.

కథలు, పద్యాలు, పాటలు రాయడమంటే పాణి మామయ్యకు పెద్ద కష్టమైన పనికాదు. తెలుగు బాగా తెలుసు. చదువుకునే రోజుల్లో తనకు ప్రతి క్లాసులో తెలుగులో ఫస్టు మార్కు వచ్చేది. ఇక భావాలంటారా? వాటికీ లోటు లేదు. అనుభవం చేత రకరకాల పుస్తకాలు చదవడంచేత. గొప్ప గొప్పవాళ్ళతో స్నేహం చేయడంచేత, నాలుగు ప్రదేశాలు చూచిరావడం చేత, బోలెడన్ని భావాలు తాను సంపాదించుకున్నాడు.

ఇక పేరు కోసం రాయడం ప్రారంభించాడు పాణి మామయ్య.

జలజల పువ్వులు

కలకల నవ్వులు

    గణగణ గంటలు

    కణకణ మంటలు

తళతళ మెరుపులు

ఫెళఫెళ ఉరుములు

    గుసగుస మాటలు

    మిసమిస తోటలు

బడబడ వానలు

దడదడ బానలు

ఘుమఘుమ ధూపము

ధుమధుమ కోపము

ఈడూ జోడూ వుంటేగా

ఇంపూ సొంపూ తెలిసేది.

చదువూ సంధ్యా లుంటేగా

సరసం, విరసం తెలిసేది

రాళ్ళూ రప్పాలుంటేగా

ఇళ్లూ గుళ్ళూ కట్టేది.

బిడ్డా పాపా లుంటేగా

అడ్డం దిడ్డం తిరిగేది

చైనా అను దేశ మెప్పు

డైనా చూశావ?

క్వైనా అను మందు నెప్పు

డైనా కొన్నావ?

పైనాపిలుపండు నెప్పు

డైనా తిన్నావ?

ఇలాంటివెన్నో పాటలు రాశాడు మామయ్య.

ఎన్నో రకాల రచనలు చేసి పాణి మామయ్య పత్రికలన్నింటికీ పంపించాడు. దాని వలన అతడు డబ్బు సంపాదించుకోవాలని ఎప్పుడూ ఆశపడలేదు. అతనికున్న ఆశల్లా - పెద్దపేరు, ఘరానా పేరు సంపాదించుకోవాలన్నదే. తన రచనల్లోని అర్థాలు, అందాలు ఒకవేళ అందరూ గ్రహించుకోలేరేమోనని, వాటన్నిటికీ వివరాలు కూడ రాసి జోడించి పంపించాడు.

తన రచనలన్నీ పెద్దపెద్ద అక్షరాల్లో అందంగా అచ్చవుతాయి. అందరూ చదివి ఎంతో సంతోషిస్తారు. అభినందనలు, ప్రశంసలు పంపిస్తారు. దేశం నాలుగు మూలలా తన పేరు మారు మ్రోగుతుంది. అంతకంటే తనకు కావలసిందేముంది?

పంపించిన రచనలన్నీ పత్రికలవాళ్ళ దగ్గర నుంచి "ప్రకటించడానికి వీలుపడలేదు" అని తిరిగి వచ్చాయి పాణి మామయ్యకి. తిరిగివచ్చినందుకు అతడే మాత్రం విచారించలేదు. ఆ రచనల్లోని గొప్పతనాన్ని తెలుసుకోలేక పత్రికల వాళ్ళు తిప్పి పంపించి ఉండాలి. లేదా ఆ రచనలను ప్రకటిస్తే మిగిలిన రచనలకు దెబ్బ తగులుతుందని భయపడి వాళ్ళు అలా చేసి వుండాలి - అని సమాధాన పడ్డాడు పాణి మామయ్య.

‘‘ఈ పత్రికల్లో పడితే వచ్చే పేరు ఏ మాత్రం? నా రచనలన్నీ కొన్ని పుస్తకాలుగా అచ్చువేసి, అందరికీ అందిస్తా. గొప్ప గొప్పవాళ్ళు చదివి తమ తమ అభిప్రాయాలను వెల్లడిస్తారు. అప్పుడైనా యీ పత్రికల వాళ్ళు చచ్చినట్లు ఆ పెద్దల అభిప్రాయాలను ప్రచురించి తీరతారు. నా గౌరవానికి తగినట్లు నా పేరు పైకి వస్తుంది" అని ఎన్నో విధాల ఊహించుకున్నాడు పాణి మామయ్య ఊరటకోసం.

పుస్తకాల అచ్చుకి డబ్బు తగలేస్తుంటే ఇంట్లో వాళ్ళు, బంధువులు, స్నేహితులు "ఎందుకువచ్చిన దుబారా?" అని హెచ్చరించారు పాణి మామయ్యని. కానీ, "పేరు మజా వీళ్ళకేమి అర్థమవుతుంది?" అని అనుకొని అతడు అచ్చుపని పూర్తిచేశాడు.

మూడు సంపుటాలుగా వేశాడు రచనలన్నీ. మొదటిది : కథల సంపుటి - వెయ్యి కాపీలు; రెండవది : పద్యాల సంపుటి -వెయ్యి కాపీలు; మూడవది : గేయ సంపుటి - వెయ్యికాపీలు. ప్రతి సంపుటి మీద పసందైన బిరుద మొకటి పేరుకు ముందు ఏర్పాటు చేశాడు.

అచ్చు వేయించిన పుస్తకం ఒక్కటి కూడ అమ్ముడు పోలేదు. ఉచితంగా అందుకున్న వాళ్ళల్లో ఒక్కడైనా పోనీ అని అభిప్రాయం పత్రికాముఖాన కాకపోయినా, వుత్తరం ద్వారానైనా అందించినవాడు లేకపోయాడు. మూడువేల కాపీలు అచ్చువేయిస్తే ముద్దుగా ముగ్గురైనా తన పేరు చెప్పుకున్న పాపానపోలేదని పాణి మామయ్య తనలో తాను కొంచెం అనుకున్నాడు.

పాణి మామయ్య మేనల్లుడు రవిబాబు. ఆ అబ్బాయి అక్షరాలు, గుణింతాలు పూర్తిచేసి యిప్పుడే మాటల పుస్తకం పట్టాడు. పేరులు కూడబలుక్కొని చదవగలడు. పుస్తకాల అట్టలమీద వున్న పేరులు గాని, సినిమా పేపర్లలోని పేర్లుగాని పెద్దచ్చులోనివి చూసి చదవగలడు.

ఒకసారి రవిబాబు బీరువాలో వున్న మామయ్య పుస్తకాలు చూశాడు. పైన కనబడిన పేరు చదివి ఎంతో సంబరపడుతూ "పాణి మామయ్యా! నీ పేరు చూశా" నంటూ పరుగెత్తాడు గదిలో కుర్చీమీద కూర్చున్న మామయ్య దగ్గరకి.

"ఎక్కడ చూశావురా?" అని ఆత్రంగా అడిగాడు మామయ్య. ఒకవేళ తన పేరు ఏ పత్రికలోనైనా పడిందేమోననుకొని.

రవిబాబు మామయ్య చెయ్యి పట్టుకుని బీరువా దగ్గరకు తీసుకువెళ్ళి "చూడు నీ పేరు బోలెడు పుస్తకాల మీద వుంది" అని చూపించాడు. ఇంత భూప్రపంచంలో యీ మాత్రం ఎవరూ అచ్చులో వున్న తన పేరు ఉచ్చరించిన వారే లేకపోయారు. రవిబాబు ఎంతో సర్దాగా తన పేరు అన్ని పుస్తకాల మీద వరుసగా చూపిస్తూ చదువుతూంటే పాణి మామయ్యకు గిలిగింతలు పెట్టినట్లయింది.

బోలెడు పుస్తకాల మీద మామయ్య పేరుండడం చూచినప్పటి నుంచి రవిబాబు తన పేరు కూడా వాటిమీద వుంటే ఎంతో బాగుండు ననుకున్నాడు. దానికి మార్గ మేమిటా అని చాలా ఆలోచించాడు.

వాళ్ళ బళ్ళో కొందరు పెద్దపిల్లలు రబ్బరు ముక్కల మీద బ్లేడుతో పేర్లు చెక్కుకొని, సిరా రాసి తెల్లకాగితాల మీద అచ్చుగుద్దుకోవడం చూశాడు. రవిబాబు తాను కూడా 'రవి' అన్న రెండక్షరాలు ఒక రబ్బరు ముక్కమీద ఎవరితోనో చెక్కించుకొని తెచ్చుకున్నాడు. మామయ్య అచ్చుపుస్తకాలన్నిటి మీద తెలుపు కనబడిన చోటల్లా 'రవి', 'రవి' అని సిరా రాసి రబ్బరు ముద్రలు కొట్టుకున్నాడు. మామయ్య పేర్లకంటే తన పేర్లే ఎక్కువ అచ్చుగుద్దుకొని అతడు పొంగిపోయాడు.

పాణి మామయ్య కీ విషయం ఏమీ తెలీదు. అతడు పేరు రావడం ఎలాగా అన్న ఆలోచనతోనే కూర్చుంటున్నాడు దినమంతా. ఒక నాటకం గాని, సినిమా సంభాషణ గాని రాసి, పెద్ద పెద్ద కంపెనీలవారికిచ్చి పేరు తెచ్చుకోవాలని యోచిస్తున్నాడు.

నాటకం రాసి నాటకాల కంపెనీలచుట్టూ తిరిగాడు. లాభం లేకపోయింది. సినిమా సంభాషణ (స్క్రిప్టు) రాసి, ఫిల్ము కంపెనీలచుట్టూ తిరిగాడు. లాభం లేకపోయింది. ఈ తిరగడానికి అతనికెంతో శ్రమ, డబ్బు వ్యయమయింది. చివరకు పాణి మామయ్యకు తలనొప్పి పట్టుకుంది. ఎవరు మాట్లాడించినా తలనొప్పిగా వుండేది. 'కాఫీ కావాలా' అన్నా, 'భోజనానికి లెమ్మ'న్నా తలనొప్పి ఎక్కువయ్యేది.

ఇలాంటి సమయంలో రవిబాబు నాలుగు పుస్తకాలు చేత్తోపట్టుకొని, చరచర వచ్చి, 'మామయ్యా! ఇలా చూడు నా పేరు కూడా బోలెడు పుస్తకాలమీద పడింది" అని తాను రబ్బరు ముక్కతో అచ్చుగుద్దుకున్న పేర్ల ముద్రలు చూపించాడు.

పాణి మామయ్యకి తన పుస్తకాలన్నీ అలా ఖరాబైపోవడం చూడగానే ఎక్కడలేని ఉక్రోషం వచ్చింది. “వెధవా! నా పేరంతా పాడుచేశావురా?” అని వూచి పుచ్చుకుని రవిని దవడ వాచేలా ఒక లెంపకాయ గట్టిగా కొట్టాడు.

ఆ దెబ్బతో రవి గింగురెత్తి ఏడుస్తూ వెళ్ళి పోయాడు. పాపం రవి తన పేరు సరదా తీర్చుకుందామనుకున్నాడు గాని, పాణి మామయ్య పేరు పాడుచేద్దామనుకోలేదు.

ఏమైతేనేం - రవిబాబు దవడ వాచింది.

పాణి మామయ్యకు కొంచెం ఉపశమనం కలిగింది.

5. గడియారం

గడియారం 'టిక్కు టిక్కు'

గంటలు నిముషాలు చూపు

గడియారం టిక్కు టిక్కు :

కాలం హద్దును కొలిచే

మూలం, అంకెలజాలం ॥



నీలో గడియార ముంది

నాలో గడియార ముంది

నికరమైన హెచ్చరికలు

నిత్యము మన కిచ్చేందుకు ॥

జ్ఞానికి అజ్ఞానికి ఈ

జాడ లెంతొ అవసరమే,

వోలె మాత్రము అ

వీని గ్రహియించడు ॥

ఈ పాట రఘు వాళ్ళ చిన్నబళ్ళో పంతులుగారు పెద్ద తరగతి పిల్లలకు నేర్పుతుండగా విన్నాడు. తానూ కలిసి వాళ్ళతో అన్నాడు. తత్వంలాంటి ఈపాట తనకు ఎంతవరకు అర్థమయిందో కాలేదో చెప్పలేము. అసలు ఆ పెద్ద తరగతి పిల్లలకు మాత్రం ఎంతవరకు అర్థమైనట్లో! ఆ మాటకు వస్తే బోధించే పంతులు గారికి మాత్రం ?

మాటల సందర్భంలో ఒకసారి రామ్మూర్తిగారు సుందరమ్మగారితో అన్నారు "విన్నావూ? ప్రతివాడిలో గడియారం ఒకటి వుంటుంది. అది టిక్కు టిక్కు మంటూ వుంటుంది. అయితే అతడు బైటిగడియారం మీద ఆధారపడినంతగా తన లోపలి గడియారం మీద ఆధారపడడు. చిక్కు అక్కడే వస్తూంటుంది." అని,

ఆ మాటలు విన్న సుందరమ్మగారు నిజమే అన్నట్లు తలవూపింది. అర్థమయ్యే తలవూపిందో, కాకే తలవూపిందో చెప్పలేము.

రఘు పక్క గదిలో ఆడుకుంటున్నాడు. వాళ్ళ అమ్మా నాన్నా మాట్లాడుకునే మాటలు విన్నాడు. గడియారం పాట తరువాత, గడియారం మాట అతడిప్పుడు విన్నాడు. తనకదేమీ

అర్థంకాలేదు. రామ్మూర్తిగారు ఈ మధ్యనే ఒక టిక్కు టిక్కుమనే గడియారం వాళ్ళ బడి కోసం కొనితెచ్చి ఇంటిలో వుంచిన సంగతి మాత్రం రఘు ఎరుగును.

రఘు మొదటి తరగతి చదువుతున్నాడు. కోమలమైన మనసు గలవాడు. కోటి వూహలు గలవాడు.

ఒకసారి రఘు వాళ్ళ నాన్న తన కోసం కొనితెచ్చిన కథా సూచక చిత్రాలు చూచుకుంటూ, ఎన్నో వూహించుకుంటూ తనలో తాను ఎంతైనా ఆనందించుకుంటున్నాడు. అటు ఇటు పోయేవాళ్ళందరినీ పిలిచి బొమ్మలు చూపుతున్నాడు. వాళ్ళు బొమ్మలు చూస్తూంటే.

'చెట్టు మీద కాకితో నక్క యేమంటోంది?

'ఎలుకలన్నీ ఆ గంటచుట్టూ ఎందుకు చేరాయి?'

'ఆ కుక్క నీళ్ళల్లో ఏమి చేస్తోంది?'

అని, ఈ రకం ప్రశ్నలవర్షం కురిపిస్తున్నాడు వాళ్ళ మీద. తగిన జవాబులు చెప్పలేక వాళ్ళంతా తబ్బిబ్బవుతున్నారు.

మరొకసారి సుందరమ్మగారు గారెలు వండుతూ వుంటే రఘు మెల్లగా ఆమె దగ్గరకు చేరి, "అమ్మా! గారెలు నూనెలో వేస్తే చుఁయ్మంటాయేం?' అని అడిగాడు.

సుందరమ్మగారు ఎంతకాలం నుంచో గారెలు వండుతోంది గాని తనకెవ్వరూ ఇలాంటి ప్రశ్న వేసివుండలేదు. పోనీ ఇలాంటి ప్రశ్నకు తానెప్పుడూ సమాధానం వూహించుకునీ వుండలేదు. కొడుకు అంతచక్కగా అడిగినందుకు ఆమె ఎంతో మురుసుకొని "అన్నీ చిత్రంగా అడుగుతాడమ్మా మా చిట్టిబాబు" అనుకొంది.

"బొమ్మలు చూసికూడా ఏమీ చెప్పలేకపోయారు వాళ్ళంతా" "గారెలు నూనెలో వేస్తే ఎందుకు చుఁయ్ మంటాయో అమ్మ ఎరగనే ఎరగదు" అని అనుకున్నాడు రఘు. ఆ పైన తానేమనుకున్నాడో మనకు తెలియదు.

ఒకనాడు చాల చిత్రం జరిగింది.

రామ్మూర్తిగారు తెచ్చిన గడియారం వూడదీసి లోపల ఏమి వుందో చూడాలన్న కోరిక రఘుకి కలిగింది. కల్తీ, చాకూ తెచ్చి ఎలాగో దాన్ని వూడదీసి లోపల టిక్కు టిక్కుమనే యంత్రాన్ని చూశాడు. తిరిగి దాన్ని యథాప్రకారం సర్దుదామని ప్రయత్నం చేశాడు. కాని సాధ్యపడలేదు. నాన్న వచ్చి ఏమంటారోనన్న భయంతో అతని గుండెకాయ టిక్కు టిక్కుమని కొట్టుకోసాగింది. చేసింది తప్పాయె. ఆ సంగతి తనకే తెలిసింది.

రెండుచేతులూ గుండెకాయమీద పెట్టుకొని కంగారుతో "అమ్మో! టిక్కు టిక్కుమని కొట్టుకుంటోంది లోపల! టిక్కు టిక్కుమని కొట్టుకుంటోంది లోపల!" అంటున్నాడు.

లోపల పనిచేసుకుంటున్న అమ్మ ఆ మాటలు విని "బాబూ! గడియారం జోలికి వెళ్ళకు. నాన్నగారు కోప్పడతారు" అంది.

''లేదే అమ్మా! చాల గబగబా కొట్టుకుంటోందే! గట్టిగా కొట్టుకుంటోందే!" అని ఏడ్పు సాగించాడు.

ఏమిటోనని అమ్మ లోపల నుంచి చప్పున వచ్చింది. కళ్లారా చూసింది. "ఏమిటిరా యీ పని? నాన్నగారు. చూస్తే చంపుతారు" అంది.

"అందుకే నా లోపల గడియారం టిక్కు టిక్కుమని కొట్టుకుంటోందే. నాన్నగారికి తెలియకుండా గడియారం వూడదీశానని, తప్పు చేశానని అది టిక్కు టిక్కుమని కొట్టుకుంటోందే" అని గోలపెట్టి ఏడవడం ప్రారంభించాడు.

అమ్మకిదంతా అయోమయంగా వుంది, కొడుకుని కేకలెయ్యడమా, సముదాయించడమా అమ్మకు తోచింది. కాదు. "పాపం! కుర్ర సన్యాసి ఏదో తెలియక ముందు గడియారం విప్పి వుంటాడు. దాన్ని తిరిగి సరిచెయ్యలేక పోయాడు. చేసింది తప్పని గ్రహించి భయపడుతున్నాడు" అని జాలిపడింది ఆమె.

"ఊరుకో! ఫరవాలేదు నాన్నగారికి చెపుతా. కొట్టరులే, ఏడవకు" అని వూరడిస్తుండగా రామ్మూర్తిగారు అప్పుడే బడి నుంచి వచ్చారు ఇంటికి.

"ఏమిటీ గొడవ?" అని అడిగి విషయమంతా తెలుసుకున్నారు. ఇట్టే గ్రహించారు. చిన్న వెధవకి యిలాంటి తప్పు చేశానన్న భావన తనలో తనకు కలిగినందుకు అద్భుతమనిపించింది ఆయనగారికి. ఒక్క క్షణం పాటు నిలుచున్న చోటునే నిలబడిపోయి ఆలోచించారు.

తానొక బడిపంతులై అనేక పసిపిల్లల తత్వం బాగా తరిచి చూచిన వాడు కాబట్టి, చప్పున కుమారుణ్ణి దగ్గరకు తీసుకొని "ఫరవాలేదులే. ఏం జేస్తాం? వూరుకో. తప్పని నీ లోపల గడియారమే టిక్కు టిక్కుమని చెప్పింది కదా! ఇక ముందు ఎప్పుడూ ఇలాంటి పనిచెయ్యకే?" అని రఘు భయం, బెంగ తొలగించారు రామ్మూర్తిగారు.

'ఆహా! తన కుమారుడు ముందు ముందు ఎంత గొప్పవాడు కాగలడో' అన్న భావం అప్పుడే కలిగింది రామ్మూర్తిగారికి.

ఇక ఆ తల్లికి ఎలాంటి భావం కలిగిందో మరి!

6. న్యాయం

చెట్టుపై చినిచిన్ని

పిత్తలున్నాయి !

పిత్తలన్నీ గోల

పెత్తు తున్నాయి ॥



తువ్వాయి మెడలోన

మువ్వాయి వుంది

మువ్వాయి ఎంతైన

ముద్దవ్వుతోంది ॥

మా తమ్ముడు మల్లిబాబు డాబా మీద ఆడుకుంటూ ఈ పాట పాడుతున్నాడు -

అప్పుడే నాన్న బజారునుంచి బిళ్ళలు, బిస్కత్తులు తెచ్చారు. అక్కడ నేనొక్కణ్ణి ఉన్నా. మల్లిబాబు డాబా మీద ఆడుకుంటున్నాడన్నా కదూ! అమ్మ వంటింట్లో వుంది.

నాన్న చేతిలోని పొట్లాలు చూసి "అవేమిటి?" అని అడిగాను.

"తినేవి!"అన్నాడు.

"ఎవరికి?" అన్నా.

"తమ్ముడికి" అన్నాడు.

"నాకో మరి?" అని ప్రశ్నించా, న్యాయంగా.

"తినే తాయిలాలు పెద్దవాళ్ళు చిన్నవాళ్ళ కియ్యాలి" అని తీర్పు చెప్పాడు.

"అయితే నువ్వు పెద్దవాడవు. నేను చిన్నవాడిని,నువ్వు నా కవి యియ్యడం న్యాయం" అన్నా.

"అలాగా? అయితే పెద్దవాడవైన నువ్వు ఈ రెండు పొట్లాలు అందుకొని, చిన్నవాడైన తమ్ముడికి కాస్త యిచ్చి, న్యాయం పాలించు" అన్నాడు.

నేనేమీ మాటాడలేకపోయా నపుడు. ఇంతలో బాబి డాబా మెట్లు దిగి చరచరా వచ్చాడు. మా మాటలు విన్నాడు కాబోలు. నాన్న నా కందించే పొట్లాలు చూసి, "ఏంతవి?" అని అడిగాడు.

నేను నాన్న యిచ్చిన రెండు పొట్లాలు మెల్లగా అందుకొని బాబి కిచ్చా.

బాబీ గబగబా రెండు చేతులతో అవి తీసుకొని, ఒక పొట్లం చింపి, పట్టినన్ని బిళ్ళలు జేబునిండా వేసుకున్నాడు. అదేపనిగా తనవంక చూస్తున్న నాకు వాడు "ఇదుగోరా" అని గుప్పెడు బిళ్ళలు ఈయబోయాడు.

"తీసుకోవడమా? మానడమా?" నాకేమీ తోచలేదు.

అంతా కనిపెట్టి చూస్తున్న నాన్న "పుచ్చుకోరా, పాపం బాబి అన్నమీద ఎంతో భక్తి కొద్దీ బిళ్ళలిస్తుంటేనూ" అన్నాడు.

మాట్లాడకుండా తమ్ముడిచ్చిన బిళ్ళలు తీసుకున్నా.

ఇంతలో ఒక బలే ఆలోచన నా బుర్రలో మెరిసింది. వెంటనే నా బిళ్ళల్లో కొన్ని తీసుకువెళ్లి నాన్నకిచ్చా.నాన్న ఆశ్చర్యంతో "ఓరి! పిడుగా!చాలా గడుసుపని చేశావురా" అని పగలబడి నవ్వాడు.

ఇదంతా వంటింటి కిటికీ గుండా చూస్తున్న అమ్మ ఒకటే నవ్వు.

బాబిగాడితో సహా మేమంతా ఆ వంక చూసి నవ్వడం ప్రారంభించాం.

తరువాత నాన్న మా బాబినీ నన్నూ డాబామీదకు తీసుకువెళ్ళి కూర్చోబెట్టి, కులాసాగా ఒక పాట నేర్పాడు.

ప్రేమతో మొక్కల
బెంచుట న్యాయం !
మొక్కలు పూలను
ఇచ్చుట న్యాయం||

ప్రేమతొ పశువుల
బెంచుట న్యాయం
పశువులు పనులను
చేయుట న్యాయం ॥

ప్రేమతో పిల్లల
బెంచుట న్యాయం
పిల్లలు బుద్ధిగ
మెలగుట న్యాయం ॥

7. రాజు బాబు

రాజుబాబు రాకకోసం మా బడిపిల్లలందరూ తహ తహలాడుతున్నారు. ఆడపిల్లలు మరీ ఆదుర్దాగా వున్నారు. ఎప్పుడు రాజుబాబు వస్తాడా, ఎంచక్కా అతని ముద్దు మాటలు విందామా అనుకుంటూ.

ముప్పైమైళ్ళ దూరం నుంచి రావాలి మరి రాజుబాబు. అంత దూరాన వుంది వాళ్ళ వూరు మాకు. రాజుబాబు వాళ్ళ రామయ్య పంతులతో కలిసి, బస్సుమీద వస్తున్నట్లు మాకు ముందుగానే వుత్తరం వచ్చింది. అంతా ఎదురు చూస్తున్నాం.

రామయ్య పంతులు రాజుబాబుకి చదువుచెప్పే గురువు. రాజుబాబు వూరుకి, రామయ్య పంతులు చదువు చెప్పే వూరుకి రెండు మైళ్ళు. పిల్లలకి చక్కగా చదువుచెప్పి వాళ్ళని తయారు చేయడంలో రామయ్య పంతులు చాలా గట్టివాడు. ఆ సంగతి తెలిసి రాజుబాబుని, వాళ్ళ తల్లిదండ్రులు దూరమనకుండా చదువుకి రామయ్యపంతులు దగ్గరికే పంపిస్తున్నారు. కొడుకు బాధ్యతంతా పంతులుకే వదిలిపెట్టి, ఏదికావాలంటే అది, పిల్లవాని కోసం వారు ఏర్పాటు చేసి పెడుతున్నారు.

రాజుబాబుని గురించి నేను మొట్టమొదటిగా తెలుసుకున్నది రామయ్యపంతులు నాకు రాసిన వుత్తరాన్ని బట్టి. అందులో రామయ్యపంతులు బాబుని గురించి బహు వివరంగా రాశాడు. పైగా "మీ గురించి ఎక్కువగా విన్నాను. పిల్లల విషయంలో మీరు పెద్ద కృషి చేస్తున్నారట. నా దగ్గర ఒక ఆరు సంవత్సరాల వయసు కుర్రవాడున్నాడు. చాలా చురుకైనవాడు. వయసుకు మించిన ఊహలున్న వాడు. అన్ని సంగతులు అట్టే అవలీలగా గ్రహించి బ్రహ్మాండమైన ప్రశ్నల వర్షం కురిపిస్తాడు. వాటికి సమాధానం చెప్పడం నాబోటివాని శక్తికి మించినపని అవుతోంది. ఆ అబ్బాయి ఒక సిరిగల వారి ఏకైక పుత్రుడు. ఎలాగైనా మంచి అభివృద్ధిలోకి తేవలసినదని వారి తల్లిదండ్రులు నాకు ఒప్పగించారు. ఆ కుర్రవాని విషయంలో నన్నేమి చెయ్యమంటారు?' అని రాశాడు.

ఆ వుత్తరం చదివేటప్పటికి నాకు చెప్పలేని ఆనందం కలిగింది. 'ప్రశ్న అడగడం పిల్లల్లో ఒక శుభ లక్షణం' అన్న సత్యాన్ని ఈ బడుగు పంతులు కనిపెట్టగలిగాడు కదా అని గర్వం కూడా కలిగింది. "తప్పకుండా అలాంటి కుర్రవాణ్ణి త్వరలో ఒకసారి చూస్తాను. నాకు తోచిన సలహా చెపుతాను" అని పంతులికి తిరుగు జవాబు రాశా.

నాకూ రామయ్యపంతులుకీ ఇంతకు పూర్వం ఏ మాత్రం పరిచయమూ లేదు. ఈ వుత్తరాలే మమ్మల్ని ఎంతో దగ్గరకు చేర్చాయి. విలువైన బాల మనస్తత్వ పరిశోధనకు నాకు మంచి అవకాశాన్నిచ్చాయి.

నా వుత్తరం అందిందే తడవుగా రామయ్యపంతులు తిరిగి నాకొక వుత్తరం రాశాడు - "అయ్యా ! శుభస్య శీఘ్రమన్నారు! మా రాజుబాబుని రేపే మీ దర్శనార్థం బస్సుమీద తీసుకొస్తున్నా. మిమ్మల్ని చూడాలని మా బాబు కూడా ఎంతో తొందర చేస్తున్నాడు. వారి తల్లిదండ్రులు కూడ పంపడానికి అంగీకరించారు. ఇంతవర కెన్నడూ తల్లిదండ్రుల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళని బాబు ఎందుకో మీ తావుకి ప్రయాణమంటే ఉబలాటపడుతున్నాడు" అంటూ.

ఈ ఉత్తరాల సంగతి, రాజుబాబు విషయం మా బడి పిల్లలకు విడమర్చి చెప్పాను. అలాంటి కుర్రవాణ్ణి తప్పకుండా చూడాలన్న కుతూహలం వాళ్ళందరిలో పెరిగింది.

మరునాడు మా పిల్లలంతా బస్సు ఎప్పుడు వస్తుందా. బడి కెదురుగా రోడ్డుమీద ఎప్పుడు నిలుస్తుందా. అందులోంచి అమాంతంగా రాజుబాబు దిగివచ్చి అందరికీ ఎప్పుడు ఆనందమిస్తాడా, అని గుటకలు మింగుతూ ఎదురు చూస్తున్నారు.

బస్సు వచ్చింది. బడి కెదురుగా ఆగింది. రాజుబాబు, రామయ్యపంతులు అందులోంచి దిగారు. బాబుది బంగారు ఛాయ. నవ్వు మొగం, అతని నడక ఠీవి, హేటు, బూటు, బుష్ కోటు - పల్లెటూరి పేదపిల్లలకు వింతగా విలువగా కనబడినాయి. రామయ్యపంతులు గంపెడు సామగ్రితో - రెండు సంచులనిండా పుస్తకాలు, వింతవస్తువులు, ఒక తాటాకు బుట్టనిండా మామిడిపళ్ళు, చంకలో గొడుగుతో సిద్ధమైనాడు. వచ్చినవారి నిట్టే పోల్చుకోగలిగాము. ఎందుకంటే, వారి రూపాలు మా మనోదృష్టి కిదివరకే పరిచయం.

రావడంతోనే రామయ్యపంతులు నాకు గౌరవ వందనం చేశాడు. రాజుబాబున్నూ "నమస్కారమండీ" అన్నాడు నన్నెరిగినట్టు. వచ్చినవారిని చుట్టుముట్టారు వింతగా, ప్రేమగా చూస్తూ పిల్లలు.

అందరినీ ఎవరి స్థలాల్లో వారిని కూర్చోబెట్టి, వచ్చిన అతిథులను కుశల ప్రశ్నలు వేసి మర్యాద చేశాం. అందరూ కూర్చున్న తరువాత రాజుబాబు తెచ్చిన మామిడిపళ్ళు ముక్కలుగా కోసి, అతని రాకకు సూచకంగా అందరికీ పంచిపెట్టాం. బాబు తెచ్చిన పుస్తకాలు, వింత వస్తువులు, మా వాళ్ళంతా పరిశీలనగా చూడసాగారు. కొత్తంటూ లేకుండా వచ్చిన క్షణం నుంచీ రాజుబాబు వాళ్ళందరిలో కలిసిపోయాడు. అరమరిక లేకుండా అందరితో చనువుగా మాటాడడం, అడిగిన ప్రతి ఒక్కరికీ అందంగా జవాబు తడువుకోకుండా చెప్పడం మాకు ముచ్చట కలిగించింది. నా దగ్గరకు వచ్చి బాబు "ఏమండీ! మీకు పిల్లలంటే సంబర మంటగా?" అని ఎవరో చెప్పినట్టు అడిగాడు. ఆ మాట వినేసరికి నాకు ఒళ్ళంతా ఒక్కసారి పులకరించింది. బాబుని అమాంతంగా ఎత్తుకుని ముద్దాడాను.

ఆ దినం రెండు పూటలు బాబు బళ్లో బాలబాలికలందరితో బహు ఉత్సాహంగా గడిపాడు. అందరినీ వాళ్ళ వూరు రమ్మని ఆహ్వానించాడు. “మీ వూరు వస్తే ఏం పెడతావు బాబూ?” అంటే, “మామిడిపళ్ళు, పూతరేకులు పెడతా" నన్నాడు. చిరిగిన లాగూ చొక్కా తొడుగుకున్న ఒక కుర్రవాణ్ణి చూసి బాబు “ఆ అబ్బాయికి మంచి డ్రస్సు కొనుక్కోడానికి డబ్బులేదా? పాపం వాళ్లు బీదవాళ్ళ?" అన్నాడు. “నువ్వు వాడికి లాగూ చొక్కాలూ కొనిపెడతావా?” అంటే “మా వూరు వస్తే మా నాన్నగారితో చెప్పి కొనిపెడతా” నన్నాడు. “మీ వూరు రావడానికి వాడికి డబ్బు లేదుగా” అంటే “మా అమ్మగారిచ్చిన పదిరూపాయలున్నాయిగా. వాడికి టిక్కెట్టు కొంటాను" అన్నాడు మోతుబరిగా.

మరొక పిల్లను చూసి “ఏఁ ఆ అమ్మాయి అలా బెంగతో వుంది ఎందుకు? దానికి పాఠం రాలేదా? పంతులు గారు కోప్పడ్డారా?” అన్నాడు బాబు. నిజంగా ఆ అమ్మాయి సంగతి తెలిసి అన్నాడా బాబు అని మాకు అనుమానం. ఆశ్చర్యం కలిగాయి. రామయ్య పంతులు వుత్తరంలో రాసింది అక్షరాల నిజమన్నట్లు రుజువయింది మాకు బాబు విషయం.

బాబు తెచ్చిన బొమ్మల సినిమా పిల్లలంతా తొక్కిసలాడుతూ చూస్తుంటే “ఎందుకలా తోసుకుంటారు? ఒక్కొక్కళ్ళే చూడరాదా మెల్లగా?" అన్నాడు ఎంతో ఆరిందాగా.

బాబు తెలివి తేటలకు ముద్దుగొలిపే మాటలకి, మర్యాద మన్ననలకి మా పిల్లలంతా ముగ్ధులైనారు. ధరించిన దుస్తులు మాయకుండా, మణగకుండా పరిశుభ్రంగా వుంచుకొన్న బాబు తీరు మా పిల్లల కొక చల్లని గుణపాఠమయింది.

సాయంకాలం బాబు గౌరవార్థం మా పిల్లలు ఒక ఉల్లాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దానికి అధ్యక్షులుగా రామయ్య పంతుల్నే కోరి వుంచారు.

జాతీయ గీతంతో కార్యక్రమం ప్రారంభమయింది. మొదట సాంస్కృతిక మంత్రిణి అతిథులకు ఆహ్వానం గౌరవంగా, క్లుప్తంగా తెలిపింది. సుశీలాదేవి 'మేం బాలలం' అన్న ఉపన్యాసాన్ని, శాస్త్రి “మహోపన్యాసం” ఇచ్చారు. కృష్ణకుమారి వెనక చిన్న కొప్పు, ముఖాన పెద్ద బొట్టు, చంకలో ఒక తట్టతో తయారై వచ్చి జానపద నృత్యం చేసింది. తరువాత ఆరుగురు మగపిల్లలు:

పల్లెటూరి పిల్లలండి మేము, మా
వల్ల గాదటంచు చెప్పబోము

చెట్టులెక్కగలము, పెద్ద
గట్టులెక్కగలము మేము
పట్టుదలకు వస్తె ఎంతో

పెట్టినదీ పేరు మేము

మోసములకు దోసములకు

దాసుల మే మసలు కాము

రోసమంటె మాదె సొమ్ము

కాసుకుపై గురుతుసుమ్ము ॥

అని పాడుతూ అతి చురుకుగా, ఉత్సాహంగా నాట్యం చేశారు. కొందరు బాలగీతాలు కూడా పాడారు. ఈ పాటలకు, ఆటలకు వంతవాద్యాలన్నీ బాలబాలికలే నిర్వహించారు.

రాజుబాబు, రామయ్యపంతులు, ప్రదర్శనలన్నీ రెప్పవాల్చకుండా చూశారు. చాలా సంతోషించారు. చివరికి అధ్యక్షుడు బాలలందరినీ ప్రశంసించి, ఆశీర్వదించాడు. కొన్ని హిత వచనాలు బాలల కందించాడు. ఒకసారి వచ్చి వాళ్ళ బడిని పిల్లలని చూడవలసిందని, వాళ్ళకు తమ ప్రదర్శనలతో సంతోషాన్ని కలిగించవలసిందని కోరాడు. వందన సమర్పణ, జనగణమన గీతంతో కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి అయింది.

మరునాడు ఉదయం భోజనానంతరం రాజుబాబు, రామయ్య పంతులుతో వాళ్ళ గ్రామానికి తిరుగు ప్రయాణమైనాడు. వచ్చినప్పటి నుండి ఒక పండుగగా వున్న బాబు, ప్రయాణమై వెళ్ళిపోతూవుంటే వీడ్కోలిచ్చే మా అందరికీ ఎంతో బెంగ అనిపించింది. బాలికలు చాలామంది వచ్చారు. విడిచిపెట్టలేక మా బాలికలు, విడిచి వెళ్ళలేక బాబు చాలా బాధపడ్డారు. ఆ దృశ్యం చూస్తూంటే నాకూ రామయ్య పంతులుకీ కళ్ళనీళ్ళు తిరిగాయి. బస్సులోని ప్యాసింజర్లంతా విస్తుపోయి వింతగా చూశారు.

బాబు ప్రతిచర్యను, ప్రతిమాటను జాగ్రత్తగా పరిశీలించి పుస్తకంలో రాసుకున్నా, అతనికున్న అభిరుచులన్నీ పసిగట్ట గలిగాను. మేడలో నివసించే తనకి - నేలపై పూరి గుడిసెల్లో బ్రతికే మా పిల్లలకీ మధ్య అంతరమే లేనట్లు భావించి మెలగిన బాబు పవిత్రవర్తనమే. పరిమళవర్తనమే అతని భావిజీవిత వికాసానికి వన్నె తెస్తుందని నాకు తట్టింది.

మరుసటిదినం రాజుబాబు నాన్నగారి పేర ఒక ఉత్తరం రాశా. అందులో బాబుకి ఉజ్వలమైన భవిష్యత్తున్నది. అతని విద్యాబుద్ధుల విషయంలో మీరు తీసుకున్న శ్రద్ధాసక్తులు మెచ్చుకో తగ్గవి. ముఖ్యంగా రామయ్యపంతులు వంటి గురువు మీ వత్సకు లభించడం ఒక వరము” అని రాస్తూ...

రాజుబాబు మీకు మాకు

మోజుబాబు ముద్దు బాబు :

మింటి తార కట్టుల ప్రతి

కంటిలోన మెరసె బాబు

పన్నీటితో దీపమ్మును

ప్రతి గుండెలో పెట్టె బాబు.

పగడాలతో మేలి ముగ్గు

ప్రతిముంగిట పెట్టె బాబు

మూగగుండె వీణలపై

రాగమ్మును పలికెను. అను

రాగమ్మును పలికె బాబు||

అని చిన్న పాటతో నా ఉత్తరం ముగించా. రాజుబాబు వాళ్ళవూరు వెళ్ళి, అక్కడ నుంచి ఒక ఉత్తరం ముద్దుగా మూడు ముక్కల్లో అక్కలందరికీ రాశాడు. అందులో ధనలక్ష్మి అక్కను మరువకుండా పేర్కొన్నాడు. మా బాలికలు కూడా బాబుకి పెద్ద ఉత్తరం ఒకటి రాశారు. నాటి నుండి వుత్తరాలు రాజుబాబు, మా పిల్లల మధ్య సరసర నడుస్తున్నాయి.

8. పాలపిట్ట - ఈక

రమణ మూడవ తరగతికి నాయకుడు. పిల్లలందరిలో కొంచెం వురవగా వుంటాడు. మంచి మాటకారి. పది నిమిషాలపాటు ఏ విషయం గురించి అయినా మంచినీళ్ళు అడగకుండా ఉపన్యాసం దంచెయ్యగలడు. ఈ ధోరణి అతనికి అక్షరాలు నేర్చుకుంటున్న నాడే పట్టుపడింది.

అక్షరాలు దిద్దుకుంటున్నప్పుడు ఒకసారి రమణ నలుగురు పిల్లల్ని చుట్టూ కూర్చోబెట్టుకుని, దేన్ని గురించో మురిసిపోతూ వర్ణించి చెపుతున్నాడట. ఆ పిల్లలు కళ్ళూ నోళ్ళూ తెరుచుకొని వింటున్నారట. అంతలో తరగతి మాష్టారు వచ్చి, సంగతంతా చూసి "ఏమిరో! రమణా! గొప్ప ఉపన్యాసం దంచేస్తున్నావ్!" అన్నారట. అప్పటి నుంచి రమణకి తన ఉపన్యాసం మీద గట్టి నమ్మకం ఏర్పడింది.

రమణ ట్రూపు - రంగ, చంద్రం, వెంకన్న, వాళ్ళు అతనికి నమ్మిన బంటులు. రమణ మాటంటే వాళ్ళందరికీ ఒక విధమైన గురి వుంది. అతడు చెప్పిన ప్రతిదాన్లో ఏదో సత్యమున్నదని వాళ్ళు నమ్ముతారు.

ఒకనాడు తరగతిలో పిల్లలంతా ఉన్నారు. మాష్టారు ఇంకా రాలేదు. రమణ, తన నేస్తాలు కలిసి, బృందగానం ప్రారంభించారు.

రమణ -'పాఠాలు! పాఠాలు!

ప్రతిరోజు పాఠాలె!

విసుగెత్తి పోతోంది

అసలె మతి చెడుతోంది' అని మొదలు పెట్టాడు.

రంగ - 'అటు కదల రాదంట

ఇటు కదల రాదంట

ఎప్పుడూ కూర్చుండి,

ఏదో చదవాలంట' అని అందుకున్నాడు.

చంద్రం -చెట్టుపై ఒక చిన్న

పిట్ట పాడుతు నన్ను

'పాఠాలు మాని ఇక

బైటాడుకో" అంది అని పొడిగించాడు.

వెంకన్న -ఈల పాటలు విసరు

గాలి బాలొకటి నను

'పాఠాలు మాని ఇక

బైటాడుకో' అంది అని పూర్తిచేశాడు.

నలుగురూ కలిసి మళ్ళీ మొదటి చరణం పాడారు. పిల్లలంతా గొల్లుమంటూ కోలాహలంగా చప్పట్లు కొట్టి సరదా ప్రకటించారు.

ఇదంతా తరగతి మాష్టారు బైటనిలబడి విన్నారు. మెల్లగా తరగతిలోకి వచ్చారు. పిల్లలంతా ఒక్కసారిగా కురిసి వెలిసిన వానలాగా సద్దుమాని సర్దుకు కూచున్నారు. మాష్టారు రమణ వంక చూసి "ఒరే! ఆ పాటలో ఇంకో చరణం మిగిలి ఉందిరా. మీరు పాడడం మరిచి పోయారు. అది నేను పాడతాను. శ్రద్ధగా వినండి. అంటూ"

కాని, ఆ గోడపై

కాలాన్ని చూపించు

గడియారమంటోంది

'గడియ వృధా చేయ'కని

పాడి వినిపించారు. పిల్లలైతేనేమి, వాళ్ళకది అర్థమయింది. వాళ్ళ ముఖాలు వెలవెల పోయాయి. ఇది కనిపెట్టిన మాష్టారు, సందర్భం మార్చి "ఒరే! మన మూడవ తరగతి పిల్లలంతా సాయంకాలం ఎక్కడికైనా వెళ్ళి చిత్ర వస్తువులు వెతికి తెచ్చుకోండి. మంచి వస్తువులు తెచ్చిన వారికి మార్కు లెక్కువ" అన్నారు. ఆ మాటలు విని పిల్లలు కాస్త గాలి పీల్చి కుదుటపడ్డారు. సంతోషం వాళ్ళ ముఖాల మీద తొంగిచూసింది.

రమణ - గ్రూపు నలుగురు సాయంకాలం వింత వస్తువుల సంపాదన కోసం పొలాలకేసి బయలుదేరారు. నలుగురూ నాలుగువైపులకు వెళ్ళారు. ఒక గంట దాటిన తరువాత వాళ్ళు రకరకాల వస్తువులు సంపాదించుకొని, బయలు దేరిన చోటికే వచ్చి కలుసుకున్నారు.

రంగ చుక్క చుక్కల చెట్టుబెరడు తెచ్చాడు. చంద్రం ఏటి వొడ్డున దొరికిన నున్నని రాళ్ళు కొన్ని తెచ్చాడు. వెంకన్న తాటి మొవ్వలో వుండే మెత్తని బొంద పువ్వు తెచ్చాడు.

ఇక రమణ తెచ్చింది ఒక పాలపిట్ట ఈక. అది అతనికి ఒక పుట్ట దగ్గర దొరికిందట. ఆ పాలపిట్ట - ఈక చేత్తో పట్టుకొని, అందరికి చూపిస్తూ "అబ్బా! పుస్తకంలో తెల్లకాగితం మీద అంటించుకుంటే ఉంటుందీ! చాల గొప్పగా ఉంటుందిలే.

‘‘ప్రపంచంలో వున్న నీలం, ఆకుపచ్చ రంగులు దీనిలో ఉన్న రంగుల కింద దిగతుడుపే. షాపుల్లో అమ్మే పాల పిట్ట రంగు కూడ దీనికి పోటీ రాలేదు. ఆకాశం రంగుగాని, సముద్రం రంగు గాని, చివరికి ఇంద్రధనుస్సులో వుండే రంగులు గాని దీని రంగుకి తక్కువే.

“నేను ఏ వస్తువు దొరుకుతుందా అని జాగ్రత్తగా వెతుకుతూ వెళుతున్నా. ఒక పుట్టపక్క ఏదో నా కంటికి జిగేల్మని మెరిసింది. కదులుతున్నట్టనిపించింది. పాకే పురుగో, మేత కోసం దిగిన పిట్టో అనుకున్నా, తీరా దగ్గరకు వెళ్ళి చూస్తే అదొక రంగురంగుల పిట్ట - ఈక. సామాన్యంగా పాలపిట్ట, పుట్టమీదే వాల్తుందంటారు. కొంచెంసేపు పరకాయించి చూసి, అది పాలపిట్ట ఈకే అని పోల్చుకున్నా.

“నా కొకసారి గమ్మత్తయిన కల వచ్చింది. ఆ కలలో నేను పైకి ఎగిరిపోతున్నానట. ఒక చిత్రమైన పక్షిమీద ఎక్కి పైకి ఎగిరిపోతున్నానట. ఆ పక్షికి నాలుగు కాళ్ళున్నాయి. కనబడేలాగ, వినబడేలాగ రెండు చెవులున్నాయి. దాని ముక్కు ఎర్రగా రంపంలాగా రెండు గజాల పొడవు వుంది. దాని యీకల రంగులున్నాయీ - అబ్బ వర్ణించి చెప్పలేను. ప్రపంచంలో ఉన్న రంగులన్నీ దాని ఈకలకున్నాయి. అందులో కొన్ని ఈకలు సరిగా దీన్ని పోలి వున్నాయి.”

అని యీ విధంగా చెప్పిన విషయం చెప్పకుండా రమణ ఉపన్యసిస్తుంటే తక్కిన ముగ్గురూ మూగబొమ్మల్లాగ కళ్ళప్పగించి వింటున్నారు.

చుట్టూ చీకటి ముసురుకొస్తోంది. దూరంగా నక్క కూతలు కూడ వినబడుతున్నాయి. అంతా యిక యిళ్ళ ముఖం పట్టారు.

రమణ తనకు దొరికిన పాలపిట్ట ఈకను అమ్మకు చూపించాలనుకున్నాడు. అమ్మ ఎంతో ఆనందిస్తుంది. “నాయనా! ఎంత చక్కని వస్తువు తెచ్చావురా! తెలివితేటలంటే నిజంగా నీవేరా. ఎందుకు ఇంతమంది పిల్లలున్నారీవూళ్ళో” అని మెచ్చుకుంటుంది.

అప్పుడు నేను ఎంతో గర్వంగా పొలాలన్నీ ఎలా తిరిగిందీ, ఎంత శ్రమపడి ఈ యీకను సంపాదించిందీ ఉపన్యాసం దంచేస్తా. ముందుముందు ఇలాంటి వెన్నో గొప్ప వస్తువులు తెస్తానమ్మా అని అమ్మకు వాగ్దానం చేస్తా. ఇలా వూహించుకుంటూనే రమణ ఇల్లు చేరుకున్నాడు.

గుమ్మంలో అమ్మ తనకై ఎదురుచూస్తోంది. "ఏం చెప్మా! ఇంత చీకటిపడిన తరువాత కూడా రమణ అన్నానికి రాలేదు” అని ఆదుర్దాగా వుంది.

అమ్మను చూడగానే రమణ - తాను తెచ్చిన వస్తువుని చూపిస్తూ "అమ్మా! ఈ పాలపిట్ట ఈక నేనెంతో కష్టపడి, పొలాలన్నీ వెతికి తీసుకువచ్చా. మా మాష్టారు పుస్తకంలో అంటించుకోవడానికి ఇలాంటివి సంపాదించుకోమన్నారే” అన్నాడు.

కొడుకుచేతిలోని ఈకను అమ్మలాక్కొని, అవతల విసిరిపారేసి,"ఛీ! వెధవా! తిండీ తిప్పలు మరిచి నలుగురు కుర్రకుంకల్ని వెంటేసుకుని పొలాలన్నీ అడ్డగాడిదలా తిరిగి వచ్చావా? 'ఇదిగోనే ఆస్తి సంపాదించుకు వచ్చానే' అని గొప్ప నిరవాకం చేసినట్టు చెపుతున్నావా? పైగా పుస్తకాల్లో అంటించుకోవడానికి మీ మాష్టారు ఇలాంటివే సంపాదించుకు రమ్మన్నారంటావా? ఇదేం చదువులురా అర్థంపర్థం లేని చదువులు - చాలు చాలు కాళ్ళు కడుక్కురా అన్నం తిందువుగాని" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పాపం! రమణ నిలువునా నీరైపోయాడు. అతని ఊహలన్నీ గాలి కెగిరిపోయాయి. ఒక్క క్షణం పాటు ఏమీ తోచక నిలుచున్న చోటే నిలిచిపోయాడు.

అమ్మ విసిరి పారవేసిన పాలపిట్ట - ఈక మెల్లగా తీసుకొని జేబులో దాచుకున్నాడు.

అమ్మ తిట్టినా, రమణ తన వస్తు సేకరణ కార్యక్రమం మానలేదు. చిత్ర చిత్రమైన వస్తువులు సేకరిస్తూనే వున్నాడు. కాని తిరిగి ఏనాడూ అమ్మ మెప్పుకోసం అతడు ఆశించలేదు. తెచ్చిన వస్తువులు చూపించలేదు.

9. పాటల 'ఫ్లా'

నేను కనబడడం తడవు, నిరంజన్ బాబు అడగడం మొదలెడతాడు. "మామయ్యగారండీ! పాటలు రాసి పెట్టండీ? చిన్న పుస్తకం కుట్టించుకున్నానండి" అంటూ.

నిరంజన్ బాబు మా మేనల్లుడు. ఐదో సంవత్సరం వయసు. ఉత్సాహం, చురుకుతనం కలవాడు. అన్నీ అవలీలగా చదివెయ్యగలడు. వాళ్ళ నాన్నగారు ఒక ట్రయినింగు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. బోధనాపద్ధతులన్నీ ఎరిగినవాడు. కొత్తపద్ధతిలో మాటలు పూర్తిచేసి బాబుకి చదవడం రాయడం సులువుగా బోధించాడు.బాబుకి పాటలంటే బహు ఇష్టం. బొమ్మలన్నా అంతే. ప్రతిపాటకు ఒక బొమ్మ ఉండాలంటాడు. బొమ్మ కింద పాటలేకపోతే, "ఎందుకు బొమ్మ? పాటలేని బొమ్మ పాడు బొమ్మ?" అంటాడు.

నాకు ఏదో బొమ్మలు కూడ ఒక మోస్తరుగా వేయడం వచ్చును గనక బాబు చేతిలో బ్రతికిపోయా. కేవలం పాటలే రాసి పెట్టి వుంటే బాబు నన్ను కదలనిచ్చేవాడు కాదు. అడిగినప్పుడల్లా ఒక పాట, దానికి సరిపోయే ఒక బొమ్మ రాసిపెట్టి నందుకు బాబుకి నా మీద మంచి భక్తి కుదిరింది. నన్ను చూచీ చూడడంతోనే కుర్చీ సర్దుతాడు. వాళ్ళ అమ్మతో "మామయ్యగారికి కాఫీ" అంటాడు. వాళ్ళ నాన్నగారితో "మామయ్యగారికి పేపరు" అంటాడు. కాఫీ, పేపరు నాకు సమయానికి సప్లయిచేస్తున్నందుకు బాబు ముద్దుతీర్చడం నాకు కనీస ధర్మంగానే కనబడింది.

ఒకసారి నిరంజన్ తన పుస్తకంలో రాసియిచ్చిన యీ పాట మురిసిపోతూ చదువుకుంటున్నాడు.

తాతా! తాతా! ఎందుకు గడ్డం ?
తలపుల తలుపుగ అది నాకడ్డం.
అవ్వా! అవ్వా! ఎందుకు నడ్డీ?
అది నా బ్రతికినదానికి వడ్డీ.
బుజ్జీ! బుజ్జీ ఎందుకు అల్లరి?
ఒజ్జకు భక్తితొ ఇచ్చే చిల్లరి.
పాపా! పాపా! ఎందుకు నవ్వులు?
ప్రతి లత పూసిన బంగరు పువ్వులు.
ఆవూ! ఆవూ! ఎందుకు పాలు?
అది నా లేగకు మిగిలితే చాలు
మిరపా! మిరపా! ఎందుకు కారం?
కొరికితె మీకే తెలుసును సారం.

అంతలోనే వాళ్ళ నాన్నగారు బడినుండి యింటికి వచ్చారు. బాబు పాడేపాట విన్నారు. చాల "బాబూ! ఎక్కడిదీ పాట? ఎవరు రాసి యిచ్చారు?" అని అడిగారు.

"నాన్నగారూ! మామయ్యగారే. ఇందాక రాసి యిచ్చారు నాన్నగారూ" అని ఆద్యంతాల గౌరవ సంబోధనతో నిరంజన్ జవాబు చెప్పాడు. అంతటితో ఆగలేదు. పరుగున వచ్చి, తన చిన్న నోటు పుస్తకం తెరిచి, నాన్నగారికి పాటలు, బొమ్మలు అన్నీ చూపించాడు. నాన్నగారిని పూర్తిగా చూడనిస్తేగా- "నాన్నగారూ! మామయ్యగారే ఇంకా చాలా చాలా పాటలు రాసిపెడతానన్నారండీ. పుస్తకమంతా రాసి పెడతానన్నారండీ. బొమ్మలు కూడా వేసి పెడతానన్నారండీ" అంటూ ఆపకుండా చెప్పుకుపోతున్నాడు.

మా మల్లినాథరావు బావని ఏదో ఆకర్షించి ఆపింది. వాళ్ళ అబ్బాయి పుస్తకంలో వున్న పాటల్ని తను పరిశీలనగా చూడడం మొదలుపెట్టాడు. అందులో వున్న మరొక పాట.

అమ్మన్నా, బొమ్మన్నా
అంత ఇష్టమేమొ నాకు.

అమ్మలాగె బొమ్మకూడ
అన్ని సైగలేను నాతో.

అమ్మలాగె మామిడమ్మ
కొమ్మ కొమ్మ బిడ్డలమ్మ

బిడ్డలున్న మామిడమ్మ
దొడ్డతల్లి కాదటమ్మ

మొగ్గకేమొ సిగ్గటమ్మ
పువ్వదేమొ నవ్వేనమ్మ

సిగ్గుదాటి మొగ్గనవ్వి
చెలరేగి పువ్వు కాదటమ్మ.

పాటలు పరీక్షలో పడ్డ బావగారు కాళ్ళు కడుక్కోవడం, మంచినీళ్లు తాగడం మరచి పోయారు. అప్పుడే నేనూ వచ్చా. నిరంజన్ నన్ను చూసి, పొంగిపోతూ "నాన్నగారండీ! అదుగో మామయ్యగారు వచ్చారండీ. ఇంకా పాటలు రాస్తారండీ. పుస్తకమంతా రాస్తారండీ" అని చంకలు కొట్టుకుంటూ అన్నాడు.

"ఏ పాట కావాలిబాబూ?" అని అడిగాను నేను.

"అంకెలపాట రాయండి మామయ్యగారూ!" అన్నాడు. అంతలోనే ఏదో తట్టి, "మామయ్య గారండీ! పాటలు దేనిమీదైనా రాయొచ్చాండీ?" అని ప్రశ్నించాడు.

"ఓఁ దేనిమీదైనా రాయొచ్చు. అల్లుడు మీదా, జల్లెడ మీదా కూడా రాయొచ్చు" అన ఆ మాటకు బాబు, బావ, చెల్లి అంతా నవ్వారు.

అంకెలపాట బాబు పుస్తకంలో రాయడానికి ప్రారంభించా. నే రాసే పద్ధతిని బావ బహు జాగ్రత్తగా చూస్తున్నాడు. ఆ దినం అథమం ఆరు పాటలైనా పూర్తి చెయ్యాలని, బాబు పుస్తకమంతా నింపివెయ్యాలని సంకల్పించుకున్నా నేను.

పక్కను బావ, ఎదురుగా బాబు కనపడుతుంటే ఉత్సాహం రెండింతలయింది నాకు. పాట ప్రారంభించా

ఒకటి ఒకటి రెండు
చక చక మని రండు.
రెండు ఒకటి మూడు
చెండు తెచ్చి ఆడు.
మూడు ఒకటి నాల్గు.
చూడు గెలుపు కల్గు.
నాలు గొకటి ఐదు

ఆ పైన పాదం స్ఫురించలేదు. భాషకు భావానికి సంబంధం కుదరక, యతిప్రాసలు అతక్క నే చాలా గంద్రగోళపడుతున్నా, పక్కనే ఉన్న బావ చప్పున -

' ప్రాలు మాలై కైదు...'అని పాదం పూర్తి చేసాడు.

నాకు ఎక్కడలేని ఆశ్చర్యం కలిగింది. ఏమిటిది? బావకింత కవితాశక్తి ఉన్న సంగతి నే నిదివరకు ఎరగను. అతడు చక్కని వక్త. సామర్థ్యమున్న ఉపాధ్యాయుడు, అన్నిటిలో అభిరుచి కలవాడు అన్న సంగతి మాత్రం నే నెరుగుదును.సరే ఇంకేఁ - బావ సాయం దొరికింది. ఆయనగారి ఆసరా చూచుకొని ఆ పైన పాటను సులువుగా పూర్తి చేశా.

ఐదు ఒకటి ఆరు
సైదు ఆట జోరు.
ఆరు ఒకటి ఏడు
మీరు మీరు జోడు
ఏడు ఒకటి ఎనిమిది

ఎందుకంత నెమ్మది. ఎనిమిదొకటి తొమ్మిది కని విని ఎరుగమ్మిది. తొమ్మిదొకటి పాది తుదకు బయము మాది.

అలా `రావుద్వయం' - మేము జంటకవులమైనాము.

అంతలోనే మా చెల్లి కాఫీ తయారు చేసి, రెండు గ్లాసుల్లో తెచ్చి అక్కడుంచింది. కాఫీ గతప్రాణిని నేను వెంటనే తాగాను. బావ మాత్రం ఏదో మైకంలో ఉన్నాడు. అతని మనసు కాఫీమీద లేదు. పాటలకవిత్వం మీదే లగ్నమైపోయి వుంది. నేనూ, నిరంజన్ బావను స్మృతికి తెచ్చి కాఫీ కాస్త పట్టించాము.

బావకు పాటల ఫ్లూ బాగా తగిలింది. ఆ బిగిని కొన్ని పాటలు పూర్తిచెయ్యాలన్నాడు. ఆరు పాటల కోటా నాకుండనే వుంది. మూడు పాటలింతకు ముందే పూర్తిచేశా. మిగిలిన మూడూ పూర్తి చెయ్యాలని కూర్చున్నా. పెద్ద జలపడిన నూతిలో నీరులా, అల్లుడు ఆ వంకా, బావ యీ వంకా వుంటే, నాలో పాటలవూట పై పైకుబుకుతోంది. మూడు మకుటాలూ ఆలోచించుకున్నా. మూడు పాటలూ ఒకేసారి పూర్తిచేయడానికి సంసిద్ధమైనా.

పిల్లలంటే మల్లి మొగ్గలు
తల్లి మనసే విరిసి వెన్నెల
లల్లుకొను జాబిల్లి నిగ్గులు.
కదిపితే ఘలు
ఘల్లు మ్రోగే
కంచు మువ్వలు
మించు నవ్వులు
డెందమున ఆ
నంద మెంతో
విందు గూర్చే
కందుకమ్ములు ||
ఊసులెన్నో
మోసు లెత్తే
బాస కరము
ప్రాస బద్ధము ||

చిన్నారిలోకము

వారి లోకము -చి
న్నారి లోకమూ
అల్లరి యందాలలోన
కొల్లగ నార్జించి పేరు
ఎల్లరి హృదయాలలోన
మల్లెలు విరియించు తీరు ॥వా॥

ఏ దృశ్యమొ, ఏ శబ్దమొ
ఏదొ కంటికి చెవికి సోక
కలుగుల్లో ఎలుకల్లా
బిల బిల మని తొంగిచూడు ॥వా॥

తమలో తా మెల్ల వేళ
తగ మురియుచు, మురపించుచు
తాత కథలు, పాత కథలు
ప్రీతి చెప్పుకొనుచు నుండు ॥వా॥

గిలిగింతలు లేకె కులుకు
కీరములటు చక్కబలుకు
ఏదొ ఆట, ఏదొ పాట
ఎంతో హాయి, హాయి బాట ॥

మంచి నేత్రం

రాత్రికి ఉన్నవి
నేత్రాలెన్నో
పగటికి ఒకటే
పసందు నేత్రం!

చుక్కలకంటే
సూర్యం డెక్కువ

కాంతిని జగతికి

కలిగించును గా ||

మనసున కున్నవి

కనులవి ఎన్నో

హృదయానికి గల

దొకటే కన్నూ

మనసున వందలు

మరగే ఊహల

కంటె హృదయమున

గల దయ గొప్పది ॥

ఈ విధంగా ఆరు పాటలు అతి శీఘ్రంగా పూర్తి చేసి నిరంజన్ బాబు పుస్తకం నింపేశా. తగిన చిత్రాలు కూడ పాటలకు సూచనగా వేశా. బాబు ఆనందం ఆ సమయాన చూడవలసిందేగాని రాయడానికి అలివికాదు.

ఇంతలో మా చెల్లి “వంట అయింది వెంటనే భోజనానికి మీరిద్దరూ లేచిరండి" అని లోపల్నించి మమ్ము పిలిచింది. తలపెట్టిన కార్యం నిర్విఘ్నంగా కొనసాగింది అన్న సంతోషాన 'బావా అంటే బావా' అనుకుంటూ మేమిద్దరం భోజనానికి లేచాం. మా వెంట సత్రకాయలా నిరంజన్ బాబు తన పుస్తకం చంకలో పెట్టుకొని భోజనానికి సిద్ధమైనాడు.

భోజన సమయాన బావ అన్నాడు - "ఏనాటినుంచో వుంది నా మనసులో మన యిద్దరి పేర్లూ కలసి కాస్త ప్రచారంలోకి వచ్చేది ఎలాగా అని, బావా! యీనాడు అది సిద్ధించింది” అని.

"ఔను. బావా! పాటల పూ మనిద్దరినీ యీ పూట చిత్రంగా కలిపింది. కృష్ణార్జునుల వంటి మనం. కలిసి చదువుకొన్న మనం, ఒకచోట కలిసి పనిచేసే మనం ఈ పాటల పూ కవిద్వయంగా ఆంధ్ర మహిళ ఆగస్టు సంచికలో అఖండ కీర్తిని ఆర్జిద్దాం” అన్నా.

వంటింట్లో చెల్లి ఒకటే నవ్వు. నిరంజన్ బాబు కూడ అదే పనిగ ముసి ముసి నవ్వులు నవ్వుతున్నాడు.

10. మమకారం

పిల్లలంటే
పిందెలంటే
నవ్వు లొలికే
పువ్వు లంటే
ఎంత మమకారం! ఆహా !
ఏమి చెప్పను; మీనాక్షికి !!

మీనాక్షి పెరటిలో చెట్టున కాసిన పిందెలవంక అదే పనిగ చూస్తూ వుంటుంది. చెట్టునున్న పిందెలకంటే, నేల రాలిన పిందెలనే ఎంతో బెంగతో చూస్తూ వుంటుంది.

ఆమెకు తొలి కాన్పులో ఒక బిడ్డ పుట్టి పురిటిలోనే పోయాడట. మలికాన్పులో పుట్టిన బిడ్డ ఒక ఏడాది వరకు పెరిగి పోయాడట. అప్పటి నుంచి మీనాక్షి అదోలాగ మారిపోయింది.

పెరటిలో వున్న మొక్కల్ని ఎంతో ప్రేమతో పెంచుతూ వుంటుంది. ఏదైనా చిన్న మొక్క ఒకటి చచ్చి పోయిందంటే, ఆమె విచారం ఇంతింతని చెప్పడానికి వీలు లేదు. మొక్కలన్నీ పూతపెట్టి, కాయలు కాయడం ప్రారంభిస్తే, ఆమె ఆనందానికి అంతుండదు.

ప్రతిరోజు పక్కింటి వారి కుక్కపిల్ల ఒకటి భోజనాల వేళకు వస్తూ వుంటుంది. దానికి మీనాక్షి యింత తిండి పడవేయడం, అది తిని సంతోషంగా తోకాడించడం, అలవాటై పోయింది.

ఇలా మొక్కలమీద, కుక్కలమీద మమకారం పెంచుకుంటున్న సమయాన, పట్నానికి బదిలీ చేశారన్న పిడుగులాంటి వార్త మీనాక్షికి భర్త వినిపించాడు.

"అయ్యో! అలవాటైన వూరు విడిచిపెట్టి ఎలాగ వెళ్ళిపోవడము?" అనిపించింది మీనాక్షికి. ఆమె భర్తతో అన్నదికదా "ఏమండీ! పక్కింటివారు ఆ కుక్కపిల్లను మన కిస్తామంటున్నారు పెంచుకోవడానికి. దాన్ని మనతో కూడ తీసికెళదాం. మనతోపాటే యింత తింటుంది; ఉంటుంది."

ఆ మాటలకు భర్త కస్సుమని, "వెధవ సంత! ఎందుకా కుక్కపిల్ల మనకు? పదిచోట్ల తిరిగేవాళ్ళకి ఒక గుదిబండలాగ! వద్దు!" అని నిష్కర్షగా చెప్పేశాడు. ఇక మీనాక్షి ఏమనలేక కుక్కపిల్లను తలచుకొని లోపల ఎంతో కుమిలిపోయింది.

పట్నంలో చిన్న యిల్లు అద్దెకు తీసుకున్నారు. వెళ్ళిన రాత్రి మీనాక్షికి కొత్త యింట్లో నిద్ర పట్టలేదు. తాను పడుకొన్న గది ప్రక్కనే ఒక మాలతి తీగ గుబురుగా పాకి పూలు పూచింది. ఆ పూలమీద నుంచి వచ్చే గాలి మీనాక్షికి కొంచెం హాయినిచ్చింది.

మామూలుగా మీనాక్షి కొంచెం పొద్దెక్కి లేవడం అలవాటు. రాత్రి విచ్చిన మాలతి పువ్వులన్నీ తాను నిద్ర నుండి లేచి చూసేసరికి కనపడేవి కావు. ఏమయి పోయేవో తెలిసింది కాదు. పనిచేసే పిల్లను పిలిచి, మీనాక్షి, "ఏమే! మాలతి పువ్వులను ఎవరు కోసుకు పోతూ వుంటారు?" అని అడిగింది.

"పక్కింటి శాస్త్రుర్లుగారు కోసుకెళుతూంటారండీ!" అంది పనిపిల్ల.

"చక్కగా చెట్టున పూసిన పువ్వులను ఎందుకు కోసుకు వెళ్ళడం? ఈసారి ఆయన గారు పువ్వులు కోయడానికి వచ్చినపుడు నాతో చెప్పు" అని ఏర్పాటు చేసింది మీనాక్షి.

మరునాటి ఉదయం బ్రాహ్మడు పువ్వులు కోయడానికి రావడం తెలుసుకొని, మీనాక్షి "ఏమండీ! చెట్టునున్న పువ్వులు ఎందుకు కోసుకు వెళుతుంటారు?" అని అడిగింది.

"అమ్మా! స్వామి పూజకోసం" అని ఆ బ్రాహ్మడు బదులు చెప్పాడు. మనకోసం యిచ్చిన పువ్వులు భగవంతుడు తన కోసం కావాలంటాడటండీ?" అంది మీనాక్షి.

"బాగుంది మీ వరస. నాకు పెద్ద విషయం చెప్పడానికే పూనుకొన్నారు. ఈ ఇల్లు అద్దెకు ఏర్పాటు చేయించి పెట్టింది నేను. ఈ యింటి అజమాయిషీ అంతా నాదే. అడగండి కావాలంటే మీ వారిని. మీకీ పూలచెట్ల ప్రసక్తేమీ లేదు" అంటూ పూలు రాల్చుకొని, సజ్జలో వేసుకొని తన దారిని తాను వుడాయించాడు బ్రాహ్మడు.

మీనాక్షి గుండె గతుక్కుమంది. తీగను నిర్దయగా పట్టుకొని, పూలకోసం బ్రాహ్మడు గట్టిగా వూపుతుంటే మీనాక్షి ఎంతో బాధపడింది. కన్నీళ్ళు తెచ్చుకుంది. పూలు పోగొట్టుకొని అందవిహీనమైపోతున్న మాలతీ తీగను చూడడం మనసొప్పక మీనాక్షి తన మంచం పక్క గదిలోకి మార్చుకుంది.

పక్క గది కిటికీలోంచి చూస్తే ఒక జమీందారు గారి నాలుగంతస్తుల పెద్ద మేడ, విశాలమైన దొడ్డి కనబడుతుంది. ఆ దొడ్డిలో జమీందారు గారి బుజ్జిబాబుని పనిపిల్లలు ఆడిస్తూ వుంటారు. ఆ పిల్లవాడు కేవలం ఒక బంగారు బొమ్మలా ముద్దులు మూట కట్టినట్టుంటాడు. మీనాక్షి మొదటిసారి ఆ పిల్లవాణ్ణి చూసి మైమరచిపోయింది. ఒక్కసారి ఆ బాబుని ఎత్తుకోవాలని, ముద్దులాడాలని ఉబలాటపడింది.

ఆ భర్త సాయంకాలం ఆఫీసు నుండి రాగానే మీనాక్షి అతనితో "ఏమండీ! ఆ మేడవారి బాబుని చూశారా? ఎంత ముద్దొస్తున్నాడనుకున్నారు! ఎలాగైనా ఒకసారి ఆ బాబుని మన యింటికి, అడిగి తీసుకు వద్దురు. ఎత్తుకోవాలని వుంది" అని తన కోరికను వెల్లడించింది.

ఆ మాటలు విన్న భర్త "బాగుంది! చాల బాగుంది !! నీ కన్నీ విడ్డూరమైన కోరికలు కలుగుతూ వుంటాయి. బోడి గుమాస్తాగాడిని నేను వెళ్ళి, 'అయ్యా! మీ కుర్రవాణ్ణి ఒకసారి యిలా యిప్పించండి. మా ఆవిడ ఎత్తుకుందామని చాలా సర్దాపడుతోంది' అని అడిగిరానా? చాలు, చాలు. ఇలాంటి పిచ్చి కోరికలు కాస్త కట్టిపెట్టు" అని గట్టిగానే మందలించాడు.

మీనాక్షి బిక్క చచ్చింది. కిక్కురు మనకుండా వూరుకుంది. కాని లోపలున్న కోరిక మాత్రం చావలేదు. "పిల్లల మీద ప్రేమ విషయంలో జమీందారులని, సామాన్యులని తేడాలుంటయ్యా?" అని తనలో తాననుకొంది.

మరునాడు మీనాక్షి ఒక అణా పిప్పరమెంట్లు తెప్పించి, భర్తను ఆఫీసుకు వెళ్ళనిచ్చి, పనిపిల్లద్వారా అవి ఒంటరిగా దొడ్డిలో ఆడుకుంటున్న మేడవారి బాబుకి యిమ్మని పంపించింది. పిల్ల వెళ్ళి బిళ్ళలు బాబు కిస్తుంటే చూచి, మీనాక్షి పట్టరాని సంతోషం పొందింది. కన్నుల్లో ఆనందాశ్రులు చిందింది.

గుమాస్తాగారు సాయంకాలం ఇంటికి యింతముఖం చేసుకొని వచ్చారు. భార్యవంక చూసి "ఏమిటీ గొడవ? పనిపిల్ల నెవరు పంపించారు జమీందారు గారి ఆవరణలోకి? వాళ్ళ అబ్బాయికి పిప్పరమెంటు బిళ్ళలిచ్చిరమ్మని పిల్లను పంపించింది నువ్వేనా? దానికి వాళ్ళ కెంతో ఆగ్రహం వచ్చింది. ఇలాంటిది తిరిగి జరిగితే పిల్లను పోలీసుల కప్పగిస్తామన్నారు" అని ధుమధుమలాడాడు.

మీనాక్షి కళ్ళు నీళ్ళతో గిర్రున తిరిగాయి. పిల్లవాడి చేతిలోని బిళ్ళలు లాగిపారేసి, పుచ్చుకున్నందుకు వాళ్ళు అతణ్ణి రెండు లెంపకాయలు కూడ వెయ్యడం మీనాక్షి తన కళ్ళారా చూసింది. భర్త వచ్చి తాను చేసినపని చాల తప్పని అన్నప్పుడు ఆమెకు చెప్పలేని బాధ కలిగింది.

"నేనీ వూళ్ళో యింక వుండలేను. మరొక వూరికి బదిలీ చేయించుకోండి. పోదాం" అంటూ అక్కడ నిలబడలేక గదిలోకి వెళ్ళిపోయింది మీనాక్షి.

"ఎంత మమకారం - ఆహా!

ఏమి చెప్పను – మీనాక్షికి||

పిల్లలంటే

పిందె లంటే

నవ్వు లొలికే

పువ్వు లంటే -

11. పాలబడి

'పాలబడి' అని ఎప్పుడూ మీరు విని ఉండరు. చదువుబడి అని విని వుంటారు. నిజంగా పాలబడి ఒకటి వుంది. అది ప్రభుత్వం వారు ఏర్పాటు చేసింది. పాలు తాగి, పిల్లలు చదువుకోవడానికి ఆ బడి ఏర్పాటు చేశారు. పాలు తాగే చిన్న పిల్లలుకూడా ఆ బడికి రోజూ వస్తూ వుంటారు. రెండు సంవత్సరాలు దాటి ఆరు సంవత్సరాల లోపు ఈడుగల బాలలు వచ్చి అక్కడ చదువుకుంటారు.

మేమంతా దానిని పాలబడి అనే పిలుస్తాం. అలా పిలిస్తేనే తప్ప ఆ పిల్లలకు అర్థం కాదు. పూటకు ఒక గ్లాసు నిండా కాచి పంచదార కలిపిన పాలు ప్రతి బాలకి ఇస్తుంటారు. ఆ పాలబడి మీద ఒక చక్కని పాట కూడ ఆ బాలలు పాడతారు.

బాలలకు ఒక మంచి
పాలబడి ఉంది.
ప్రతిపూట పాలు, పం
పక మవ్వుతుంది.
అమ్మలా మా పంతు
లమ్మ నిత్యమ్ము
తల దువ్వి, సరిజేసి
దయజూచు మమ్ము.
పాటలూ కత లెన్నొ
పంతుళ్ళు మాకు
నేర్పుతూ ఉంటారు
నీతి గరపుటకు
ఆనంద మారోగ్య
మందించు తీరు.
ఆటలను వారు మా
కట నేర్పుతారు.

పాలీయడంతో పాటు పాటలుకూడా అక్కడ పంతుళ్లు నేర్పుతారు. చిన్న చిన్న పాటలు, ఎన్నెన్నో పాటలు. ఒక్క పూటైనా మానకుండా బాలలు చక్కగా బడికి హాజరౌతారు. పాలమీద భక్తితో హాజరౌతారో, పాటల మీద భక్తితో హాజరౌతారో, లేక పాలూ పాటలూ అందించే పంతుళ్ళ మీద భక్తితో హాజరౌతారో గాని, పిల్లలు మాత్రం క్రమంగా హాజరౌతారు.

స్వేచ్ఛ అంటే ఆ పాలబడి పిల్లలదే స్వేచ్ఛ, ఆనందమంటే ఆ పాలబడి పిల్లలదే ఆనందం. ఇష్టమైనప్పుడు పాటలు నేర్చుకోవచ్చు. ఇష్టమైనప్పుడు ఆటలు ఆడుకోవచ్చు. గంతులు వెయ్యవచ్చు. గంద్రగోళం చెయ్యవచ్చు. అలసిసొలసినప్పుడు అలా నిద్రపోవచ్చు. ఆటంక మేమీ ఉండదు. సరిగా వేళకు మాత్రం పాలు ఇస్తూ వుంటారు వాళ్ళకి. అదేమి చిత్రమోగాని పాలు వచ్చే వేళకి పడుకున్న బాలలు కూడా గంటకొట్టినట్టు గబుక్కున లేస్తారు. గ్లాసులు తీసుకుని, 'క్యూ'లో పాలకోసం నిలబడతారు. అలా అలవాటయింది వాళ్ళకి.

బడికి వచ్చే బాలలతీరు ముద్దుముచ్చట గొలుపుతుంది. బంతుల్లాంటి బాలలు దొర్లు కుంటూ, ఒకరి బుజాన ఒకరు చేతులుంచుకొని, లేక ఒకరి చేయి ఒకరు పట్టుకొని గునగున బడికి నడిచి వస్తారు. దారి పొడుగునా మజిలీలు వేసుకుంటూనే వస్తారు. వస్తూ వస్తూ, దారిలో అట్టే నిలబడి పోతారు. వాళ్ళ కళ్ళకు ఏమి కనబడిందో! వాళ్ళ చెవులకి ఏమి వినబడిందో!

వాళ్ళు ఇంటి నుండి బడికి, బడి నుండి ఇంటికి సురక్షితంగా చేరడం పూచీ పాలబడి పంతులమ్మ, పంతులయ్య మీద ఉంటుంది. ఎందుకంటే చిన్న పిల్లలు ఎటైనా తప్పి పోయినా, వేళకు ఇళ్లకు చేరకపోయినా వాళ్ళ తల్లి దండ్రులు ఎంతో కంగారుపడతారు. పంతుళ్ళ మీద విరుచుకపడతారు.

పాలబడి పని ప్రారంభమయింది. బాలలంతా బడికి చేరుకున్నారు. పంతుళ్ళకు నమస్తే చెప్పారు. వందేమాతరం చెప్పారు, వరుసగా చేతులు జోడించి నిలబడ్డారు.

తాతకు జేజేలు

గాంధీ తాతకు జేజేలు,

బాలల తాతకు జేజేలు,

బంగరు తాతకు జేజేలు.

అని చెప్పి తరువాత

తెలుగు పిల్లలం

తెలుగు పిల్లలం

తెలివితేట లెన్నో కలిగి

మెలగుపిల్లలం.

అనిపాడి, తమ పదహారణాల తెలుగుదనాన్ని ప్రకటించుకున్నారు. అదే వాళ్ళకు ప్రార్థన. అదే చదువుకు ప్రారంభ సూచన.

ఆ పాలబడిలో చదువంతా పాటల్లోనే. ఆటల్లోనే సాగుతుంది. అందరూ పాటలు పాడగలరు. చాలా చాలా పాటలు పాడగలరు. పాడుతూ ముద్దుగా అభినయించగలరు. ఆ బాలల కన్ను అలా తిప్పితే, మూతి ఇలా తిప్పితే అభినయమవుతుంది. చేయి అలా కదిపితే, కాలు ఇలా కదిపితే నాట్యమవుతుంది. నోరెత్తి పాడితే సంగీత మవుతుంది.

పంతులమ్మ చిన్న వయసు పిల్లల బాధ్యత వహిస్తూ పాటలు, ఆటలు నేర్పుతుంది. పంతులయ్య నాలుగు సంవత్సరాలకు పైబడిన పిల్లల పూచీ వహిస్తూ పాటలు, ఆటలు నేర్పుతాడు. పంతులమ్మ పిల్లలకు తలదువ్వటం, పాలుతాగిన తరువాత మూతులు కడగటం, తుడవటం చేస్తుంది. వేళకు ఒక యిత్తడి బాల్చీనిండా కాచిన పాలు తెచ్చి గ్లాసుల్లో పోసి 'క్యూ'లో నిలబడిన బాలకు అందిస్తారు.

పంతులమ్మ తన వర్గంలోని చిన్న పిల్లలందరినీ పేరుపేరునా పిలిచి నేర్పిన పాటలు ఒప్పగించుకుంటోంది. పాటలు ఒప్పగించిన బాలలు తమకు తామే ముందు ఆనందామోద సూచకంగా చప్పట్లు కొట్టటం, తక్కిన వారంతా దానికి వంత గలపడం చేస్తున్నారు.

''లక్ష్మీ! అని పిలవగానే లక్ష్మివచ్చి,

> చిన్న చిన్న పాపలం
> నిన్న మొన్న పాపలం
> కల్లబొల్లి మాటలు
> అల్లిబిల్లి యాటలు
> లేత లేత చూపులు
> పూత మెరుగు రూపులు

అని పాడింది.

“భేషూ” అని పిలవగానే బంతిలాంటి బంగారుఛాయ బాలుడు, బుంగమూతి బాలుడు మెల్లగా వచ్చి -

> పాపా! పాపా! నాన్నొస్తారు
> పళ్ళూ బిళ్ళలు కొనితెస్తారు
> అల్లరి మానితె అన్నీ నీకే
> అల్లరిచేస్తే అన్నీ నాకే.

అని చల్లగా పాడి వెళ్ళాడు.

తరువాత నరసు వచ్చి -

బంగారు గూటిలో
పచ్చన్ని చిలక
ఉంగ్రాల తాతయ్య
కున్నాది పిలక
చెల్లాయి కుంది
నల్లన్ని పలక
పాపాయి కుంది
బంగారు గిలక.

పాట పాడింది.

వీరిరెడ్డి వచ్చీ రాని ముద్దు మాటల్లో -

కొత్త మెత్తారు
వత్తారు నిన్న
మంతి మంతీ కతలు
మాకు చెపుతారు
బెత్తమూ ఎత్తరూ
కొత్తరూ కోప్పడరు
మంతి మేత్తారు
మాకు వత్తారు.

ఒప్పగించాడు.

చివరికి బేబి, ఒక రబ్బరు బొమ్మ చేత్తో పట్టుకు వచ్చి అభినయిస్తూ -

బన్నీ! అంటే తెలుసా?
బన్నీ అంటే బొమ్మ
కొత్త కొత్త బొమ్మ
మెత్త మెత్త బొమ్మ
రంగు రంగు బొమ్మ
బుంగ మూతి బొమ్మ.
పాలుపోసి

నీళ్ళు పోసి
పక్కమీద - పండబెట్టి
జోలపాడి - జోకొడతా.
పండుకుంది - బన్ని బొమ్మ
పిల్లలార - అల్లరొద్దు.

ఊరుకోండి! ఉష్! ఉష్!! అని పాడింది. ఈ విధంగా బాలకొక పాట వంతున విసుగూ విరామం లేకుండా వచ్చి ఒప్పగిస్తున్నారు. తరగతి అంతా సంతోషంలో మునిగి వున్నారు. దారినబోయే అమ్మలక్కలు పనులు మరచి కొంతసేపు నిలబడి ముచ్చటగా పాటలు వింటున్నారు.

ఇంతలో ఏదో అలికిడి అయింది. అది ఆ బాలలందరికీ గుర్తే. పంతులయ్య పాలబాల్చీ తెచ్చాడు. నిద్ర పోయే బాలలు కూడ దిగ్గున మేల్కొన్నారు. కళ్ళు నులుముకొన్నారు. గబగబ వెళ్ళి గ్లాసులు తెచ్చుకున్నారు. క్యూలో నిలబడ్డారు. పంతులయ్య గ్లాసుల్లో పాలుపోసిందే తడవుగా పిల్లలు గడగడ తాగారు. పంతులమ్మ పిల్లల మూతులు కడిగి తువాలుతో తుడిచి శుభ్రపరిచింది.

పాలు తాగిన పిమ్మట పిల్లలు కొంచెం స్థాయిలో బడ్డారు. గోడకానుకొని వరుసగా కూర్చొని, పంతులయ్య చెప్పే చిన్న చిన్న కథలు వింటూ కొన్ని నిముషాల కల్లా ఒకరి తరువాత ఒకరు నిద్ర మైకంలో పడ్డారు. అలా కొంత సేపు బడి అంతా నిశ్శబ్దం. అదే బడి పనికి విరామకాలం.

నిద్ర పోయిలేచిన పిల్లలందరి ముఖాలు చన్నీటితో కడిగి పంతులమ్మ రుమాలతో తుడిచింది. తిరిగి బడిపని ప్రారంభమయింది. ఈసారి పంతులయ్య తన వర్గం పిల్లలను వరుసగా పిలిచి పాటలు ఒప్పగించుకుంటున్నాడు.

మొదట అనుసూ, వరలక్ష్మి వచ్చి "నవ్వులందు కొనే బాలలు ఆనందంగా ఆరోగ్యంగా వుంటారు. కోపాలకి గురైన బాలలు కుమిలికృశిస్తారు" అన్న మాటలు చెప్పి, పాటలోని ఒక్కొక్క భాగాన్ని ఒక్కొక్కరు పాడారు.

నవ్వులన్నీ - పువ్వులేకద!
పువ్వులన్నీ - పుణికిదెచ్చీ
బుట్టలోపల - పెట్టి ఉంచీ.
చిట్టి బాలల చేతికిచ్చెద
బాలలకు అవి పరమమిత్రులు
కోపాలసలు శాపాలుకద !

కోరి విడచుట కూడదూకద
నుంచీ వట్టి వానిని - పెట్టె
గట్టిగా తాళంబు వేసెద
బాలలకు అవి పరమ శత్రువులు.

చివరకు, ప్రసాదు, సత్యన్నారాయణ, వెంకటరమణ వచ్చి బృందగానం చేశారు ముగ్గురూ.

పాడేపిట్టలు - ఆడే పిట్టలు
పట్టుకవచ్చీ - కొట్టుక వచ్చీ,
సొమ్ము కోసమై - అమ్మేవారిని
చూస్తే కోపం - వస్తోందెంతో

తాగే లేగను

పాలను అన్నీ - బాగా పిండుక
సొమ్ముకోసమై - అమ్మే వారిని
చూస్తే కోపం - వస్తోందెంతో
గట్టున చెట్టున - కాసినవన్నీ
బిడ్డల కసలే - పెట్టక తినకా
సొమ్ము కోసమై - అమ్మేవారిని
చూస్తే కోపం – వస్తోందెంతో...

పాటల కార్యక్రమం పిమ్మట, నాటి పాలబడి విడుపు గంట మోగింది. బాలలందరూ పంతుళ్ళకు నమస్తే చెప్పి, ఎవరి ఇళ్ళకు వాళ్ళు బయలుదేరారు. బడి మూసి పంతుళ్లూ వాళ్ళని అనుసరించారు.

ఆ పాలబడి ఆ పాటలబడి. ఆ పాటలు పాడే ఆ బాలలు నా ఎదలో మెదులుతూ వుండి, నన్నొక పసివాణ్ణి చేస్తున్నట్లనిపిస్తుంది. మా మధ్య యీ మధుర బాంధవ్యం ఏనాటిదో.

12. బాల రాజ్యం

బాలలంతా -

ఎందుకింత భేదము?

కింద మీదు వాదము ??

బుద్ధి కలిగి పెద్ద లంత

ఒద్దికతో కూరుచుంటె

పిల్లలమే అన్ని పనులు

పిలిచి, చేసి, పెట్టలేమె ?

ఎందుకింత భేదము?

కింద మీదు వాదము ??

కుల, మత, దైవాల పేర

కోటి కలహ బీజాలను

నాటి జీవితాల నెల్ల

నాశనంబు చేసుకొనుచు ?

ఎందుకింత భేదము ?

కింద మీదువాదము??

అని పాడుకుంటూ, బారులుతీరి నడుస్తున్నారు. అంతూ దరీలేని ఆకాశంకింద. అంతూ దరీలేని సముద్ర తీరాన అలా నడుస్తున్నారు, బారులుతీరి. పైన పెద్ద గొడుగులా గొప్పగా వుంది ఆకాశం. పక్కన కోటి తరంగాలతో గోలపెడుతోంది సముద్రం హెూరుమని.

నడిచి నడిచి ఆ బాలలు ఒక బంగారు ఇసుకతిన్నె మీద బంతిచుట్టి కూర్చున్నారు.

"అక్కడే చేరారు
ఆ బాల లంతాను
ఆడుకోడానికి ఆ సముద్ర తటాన
పిచుక గూళ్ళెన్నెన్నో
పిల్లలక్కడ చేరి
ఇసుకతో గవ్వలతో
ఇంపుగా నిర్మించి
ఆడుకోడానికి
ఆకులతో, పుల్లలతో
అందాల పడవల్లు
కట్టుకొని వేవేగ
కడలిపై తేలించి
ఆడుకోడానికీ.
కడలి గర్భమునుండి
కమనీయ ముత్యాలు
పగడాలు, వేవేలు
పండునని తెలియకనె
కడలి గర్భమునుండి
మేలైనది బాలల రాజ్యం!!!

కల్లోలములు రేగి
ముంచెత్తు లోకాల
నంచు తా మెరుగకనె
ఆడుకోడానికీ, ఆ బాలలంతాను
అక్కడే చేరారు ఆ సముద్రతటాన"
ఆ లోకం వాళ్ళది.
కాలమంతా ఒకటే,
తీరమంతా ఒకటే వాళ్ళకి.
తీరి కెరిగిన బాల లంతాను
తీయ పూవుల మాల లంతాను
విసువూ లేదు. విరామం లేదు వాళ్ళకి.
పువ్వుల్లా కలకల మంటూ
పులుగుల్లా కిలకిల మంటూ
లేగల్లా ఆగక చెంగున
డేగల్లా వేగమె రింగున
అందంగా ఆనందంగా
ఆడుతు మరి గంతులు వేస్తూ
కాలాన్నే తీయగ మార్చే

13. పేను పెసరచేను

పేను ఒకటి పెసరచేను వేసుకొంది. అది ఏపుగా పెరిగింది.

కాపు నిండుగా కాసింది.



పల్లకిపై వెళుతూ ఆ దేశం రాజు పెసరచేను చూశాడు.

అది పేను వేసుకున్నట్టు తెలుసుకున్నాడు.

ఆశ్చర్యం చెందాడు. అసూయ చెందాడు. అంతలో ఆగ్రహం చెందాడు.

పేనుకింత పెసరచేనా, చేను ఇలా పెరుగుటేనా, అల్పజీవి పైకి రావటం నేను సహించడమేనా? అనుకున్నాడు.

భటుల్ని పిలిపించాడు. వాళ్ళని వెళ్ళి పెసర మాగాణమంతా మారణం చేసి రమ్మని ఆజ్ఞాపించాడు.

భటులు మందలు మందలు పశువులు తోలుకువెళ్ళి పెసరచేను చిందర వందర చేసి వచ్చారు.


అప్పుడు రాజు కడుపుమంట చల్లారింది. కళ్ళు రెండూ చల్లబడ్డాయి.

పేను తన చేను చూసుకొని గొల్లున గోలపెట్టి ఏడ్చింది. ఆ ఏడుపు విని లోకమంతా తల్లడిల్లి పోయింది.

నల్లి, బల్లి, పిల్లి, నాగుపాము పేనుగోడు విన్నాయి. జాలిపడ్డాయి. పేనుని ఓదార్చాయి.

అవి రాజుమీద కసి తీర్చుకోవడానికి నిశ్చయించుకున్నాయి. పేనుతో కలిసి అవి బయలుదేరాయి.

చడీ చప్పుడూ లేకుండా ఆ ఐదు ప్రాణులు రాజు నిద్రించే మందిరంలో ప్రవేశించాయి. సమయంకోసం ఎదురు చూస్తున్నాయి.



సమయం దొరగ్గానే బల్లి చప్పున రాజు తలమీద పడింది. తత్తరపడే రాజు జుత్తులో పేను దూరి కుట్టింది. పరుపు కింద నక్కివున్న నల్లి రాజు వీపున కరిచింది. పైకి లేవబోయే

రాజు కళ్ళు రెండూ పిల్లి పీకివేసింది. లేచి ముందుకి నడవబోయే రాజు కాలుమీద నాగుబాము చటుక్కున కాటువేసింది.

రాజు వెంటనే నురుగు కక్కి చచ్చిపోయాడు.

అల్పప్రాణులైతేనేం అవన్నీ కలిసి రాజు అంతం చూశాయి.

రాచరికం అంతమైంది. దేశంలో శాంతి కలిగింది.

ప్రజలంతా బహు సంతోషించారు. సుఖంగా జీవించారు. తిరిగి పేను పెసరచేను తీరిగ్గా వేసుకొంది. కావిళ్ళతో పెసలు పండించుకొంది. కమ్మగా జీవితం గడుపుకొంది.

14. అడవి బడి

అనగనగా ఒక అడవి ఉంది. అందులో ఒక బడి ఉంది. అదే 'అడవిబడి'.

ఆ బడిలో ఏనుగు గున్న, సింహ శాబకం (పిల్ల), ఎలుగుపాప, మర్కటకిశోరం (కోతికూన) లేడి కూచి, కుందేలు కూన, ఎలుకపిల్ల చదువుకుంటున్నారు. వాళ్ళకి చదువు నేర్పేది ఏనుగు మాష్టారు. ఏనుగు మాష్టారు ఎంతో మంచివారు. శిష్యుల్ని దయగా చూస్తారు. గొప్పగా ప్రోత్సహిస్తారు.

అడవిబడిలో అందరూ శ్రద్ధగా చదువుకుంటారు. కొట్టుకోరు. తిట్టుకోరు. ఆగడాలు అసలే చెయ్యరు. చెప్పినట్లు వింటారు. గురువుగారు చేయమన్నట్లు చేస్తారు. ఆడుకుంటారు. పాడుకుంటారు. ఆనందంగా వుంటారు. అందువల్ల వాళ్ళకి చదువు చక్కగా ఒంటపట్టుతున్నది.

ఒకనాడు అడవిబడి పిల్లలందరూ ఒకమాట అనుకున్నారు. ప్రతి ఒక్కరూ ఒక్కొక్క పాట రాసి వాళ్ళ అమ్మలకు ఈ వసంత కాలంలో కానుకగా అందించాలని.

పాటలు రాయడానికి సిద్ధమైనారు. ఏనుగు గున్న ఒక నీటి మడుగులో ఏకాంతంగా నిలబడి పాటను ఊహించుకుంటోంది. ఎంత ఊహించినా దానికి ఒక్కపాదమే స్ఫురించింది.

సింహ శాబకం మొగం చిత్రంగా పైకెత్తి, కళ్ళుమూసి కమ్మని పాట అల్లడం మొదలుపెట్టింది. ఎంతకూ దానికీ ఒక్కపాదం కంటే ముందుకు సాగలేదు.

ఎలుగుపాపకి ఒకే పాదం కుదిరింది. మర్కట కిశోరం చెట్టు కొమ్మకు తనతోక చుట్టి తీవ్రంగా పాట కూర్చడం సాగించింది. దానికి ఒక్క పాదమే కుదిరింది.

లేడికూచి కుదురుగా నిలబడి పాట కట్టడం మొదలు పెట్టింది. పాపం దానికీ ఒక్క పాదమే తట్టింది.

కుందేలుకూన చెట్టు మొదట వేళ్ళమీద కూర్చొని ప్రయత్నించి ప్రయత్నించి ఒక్కపాదం పూర్తి చేసింది.

ఇంక ఎలుకపిల్ల నేలమీద కాళ్ళతో గీరుతూ ఒక్కపాదం మాత్రమే రచింప గలిగింది.

సాయంకాలం వాళ్ళందరూ ఏనుగు మాష్టారు దగ్గరకు వెళ్ళి తమ కృషి వివరించి, తాము కూర్చిన ఒక్కొక్క పాదం వినిపించారు.

ఏనుగు గున్న ఊహించిన పాదం
ఎంత మంచిదో మా అమ్మ
సింహ శాబకం అల్లిన పాదం
ఎవరిని బాధించదు మా అమ్మ
ఎలుగు పాపకి కుదిరిన పాదం -
బలే నెమ్మది మా అమ్మ
మర్కటకిశోరం కూర్చిన పాదం -
బహు అందమైనది మా అమ్మ
లేడికూచి కట్టిన పాదం -
భయమెరగనిది మా అమ్మ
కుందేలు కూన పాదం -
కుదురైనది మా అమ్మ
ఎలుకపిల్ల రాసిన పాదం -
గొప్ప బలశాలి మా అమ్మ

కొందరు తమ గేయం పాదాలు వినిపించినప్పుడు మిగిలినవాళ్ళు నవ్వడం ప్రారంభించారు. మేష్టారు వాళ్ళని వారించారు. చివరికి ఆయన అందరి పాదాలు బాగానే వున్నాయని ప్రోత్సహించి, అన్ని పాదాలు కలిపితే అవి మంచి పాటవుతుందన్నారు.

అలా మాష్టారు అన్ని పాదాలను ఒక పాటగా కూర్చి, అది అందరి తల్లులకూ ఈ వసంత కాలంలో గొప్ప కానుకగా అందించండన్నారు.

అడవిబడి పిల్లల అందమైన పాట ఇది
ఎంత మంచిదో మా అమ్మ
ఎవరిని బాధించదు మా అమ్మ
బలే నెమ్మది మా అమ్మ
బహు అందమైనది మా అమ్మ
భయమెరుగనిది మా అమ్మ
కుదురైనది మా అమ్మ
గొప్ప బలశాలి మా అమ్మ
ఎంత మంచిదో మా అమ్మ!

15. భీమసేనుడు

భీముడు లేని భారతమా!

వ్యాసమహర్షి పద్ధెనిమిది పురాణాలు వ్రాశాడు. వాటిని అష్టాదశపురాణాలు అంటారు. అందులో భారతం అతిప్రశస్తం. నాలుగు వేదాలసారం అందులో ఉండడంచేత అది 'పంచమవేదం' అని పిలువబడుతోంది. ఇంకా, భారతం భక్తికి, శక్తికి, యుక్తికి దర్పణం పడుతోంది.

భారతంలో పాండవులకు కౌరవులకు మధ్య పెద్దయుద్ధం జలిగింది. అనేకమంది యోధులు అందులో పాల్గొన్నారు. అనేక లక్షలసైన్యం పాల్గొన్నది.

ధృతరాష్ట్రుడు పాండురాజ స్వయంగా అన్నదమ్ములు. విదురుడు కూడ వారి తమ్ముడే. ధృతరాష్ట్రుని కుమారులైన దుర్యోధన దుశ్శాసనాదులు, పాండురాజ కుమారులైన ధర్మ రాజ, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఇరుపక్షాలుగా ఏర్పడి యుద్ధం చేశారు.

తమ బలపరాక్రమాలను, శౌర్యధైర్యాలను అవసరంవచ్చి నప్పుడు లోకోద్ధరణ కుపయోగించడానికి వెనుదీయకూడదనే ఆదర్శాన్ని మనయువత ఈయననుంచి నేర్చుకోవాలి. ఇక చదవండి.

-ప్రధాన సంపాదకుడు.

భారతంలో శ్రీకృష్ణునిపాత్ర ఎంతో ఉంది. అతడు పాండవుల మేనత్త కుమారుడు. కురు పాండవుల మధ్య రాయబారం నడిపాడు. అది ఫలించలేదు. యుద్ధం తప్పలేదు. శ్రీకృష్ణుడు పాండవుల పక్షంలోనే ఉండి, యుద్ధ తంత్రం నడిపాడు.

పంచపాండవులలో రెండవవాడు భీమసేనుడు. అతి బలాఢ్యుడు. వజ్రకాయుడు. గదాయుద్ధం, మల్ల యుద్ధంలో మంచినేర్పు గడించినవాడు. ఎప్పుడూ ఎక్కడా భయమన్నది ఎరగనివాడు. మహాపట్టుదల గలవాడు. అనుకొన్నది ఆచరించి తీరేవాడు. అన్యాయాన్ని సహించేవాడు కాదు. అన్న మాట వేదవాక్కుగా పాటించేవాడు. అమ్మంటే అతిభక్తి ప్రదర్శించేవాడు. భార్యయైన ద్రౌపదిపై అమితప్రేమ గలవాడు. సోదరులకు గొప్ప అండగా ఉండేవాడు.

భీమసేనుని గుణగణాలు, ధైర్యసాహసాలు, రాక్షస సంహారాలు పిల్లలకూ, పెద్దలకూ అద్భుతంగా ఉంటాయి. భీమసేనుడు లేని భారతాన్ని మనం ఊహించుకో లేము.

జననం : పాండురాజు భార్య కుంతీదేవి. ఆమె కన్యగా ఉండగా దుర్వాసమహర్షి ఆమెకు ఒక మంత్రం ఉపదేశించాడు. అది పఠిస్తే కోరినదేవుడు ప్రత్యక్షమై కోరికలను ప్రసాదిస్తాడు. ఆ మంత్ర ప్రభావంవల్ల కుంతి, ఆమె సవతి మాద్రి ఐదుగురు కుమాళ్లను కన్నారు.

ధర్మరాజు పుట్టిన తర్వాత పాండురాజు తన భార్య కడుపున అతిశక్తి సంపన్నుడు, అన్నకు అండదండగా ఉండే వాడు ఒక పుత్రుడు కలిగితే బాగుండు ననుకున్నాడు. ఆ సంగతి భార్యకు చెప్పాడు. ఆమె అప్పుడు వాయుదేవుని ప్రార్థించి అతని వరప్రసాదంవల్ల తన రెండవ కుమారుణ్ణి కన్నది. రూపం, తేజం, దార్యంచూపి ఆ పిల్ల వాడికి భీమసేనుడు అనే పేరు పెట్టారు. భీమసేనుడు అన్నకు అండదండగా ఉండి, అనేక అద్భుతాలు సాధించగలడని ఆకాశవాణి పలికింది.

చిత్రంగా కుంతికి భీముడు జన్మించిన రోజునే ధృతరాష్ట్రుని భార్య గాంధారికి దుర్యోధనుడు జన్మించాడు. వాళ్ళిద్దరూ ఆ జన్మవిరోధులయ్యారు. ఒకరి అంతం ఒకరు చూడాలన్న పట్టుదలతో ప్రవర్తించారు.

ఉక్కులాంటి శరీరం : భీమసేనుడు పుట్టిన పదోనాడు పాండురాజదంపతులు వనదేవతను పూజించడానికి కొండలమధ్యకు పయనమైనారు. దారిలో ఒకపులి గర్జిస్తూ కుంతిమీద పడబోయింది. కుంతి భయపడి చంకలోని బాబుని చటుక్కున రాళ్ళపై జారవిడిచింది. ఇంతలో పాండురాజు పులిని తరిమి, పుత్రునికి ఎలాంటి అపాయం కలిగిందోనని చూశాడు. శిశువుకి చిన్న గాయంకూడ తగల్లేదు. పైగా అతడు కేరింతలాడుతున్నాడు. అప్పుడు వారు తమ కుమారుడి శరీరం ఉక్కులాంటిదవడం వల్ల చెక్కుచెదరలేదని, ముందు ముందు అతడు ఎన్నెన్ని అద్భుతకార్యాలు చేయగలడోనని అనుకొన్నారు.

ధృతరాష్ట్రునికి దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన వందమంది పుత్రులు కలిగారు, 'వైశ్య' అనే స్త్రీవల్ల యుయుత్సుడు అనే పుత్రుడు కలిగాడు. ఒకేతండ్రికి కలిగినా కౌరవులు యుయుత్సుడంటే చులకనగా చూసేవారు. యుయుత్సునికి పాండవులమీద అభిమానం, ప్రేమ. పాండవులకూ అతనిపట్ల అట్టి భావమే ఉండేది.

మాద్రి సహగమనం : ధృతరాష్ట్రుడు పుట్టుకతోనే గ్రుడ్డివాడు. అతడు పేరుకు మాత్రం రాజు. అతని పేరుమీదుగా రాజ్యపాలనంతా తమ్ముడైన పాండురాజే చూస్తుండేవాడు. పెదతండ్రి భీష్ముడు, తమ్ముడు విదురుడు తనకు సలహాలిస్తుండేవారు. పాండురాజు ఎంతోకాలం జీవించలేదు. అతడు మరణించినపుడు రెండవ భార్య మాద్రి

తన ఇద్దరు కుమాళ్ళ నకుల సహదేవులను కుంతికి ఒప్పగించి, తాను భర్తతో సహగమనం చేసింది.

ఐకమత్యానికి మరోపేరు : పాండురాజు మరణానంతరం ధృతరాష్ట్రుడు తమ్ముని బిడ్డలను, తన బిడ్డలను పెంచుతూ విద్యాబుద్ధులు చెప్పిస్తున్నాడు. రాజ్యపాలన భీష్ముడు, విదురుడు చూస్తున్నారు.

భీష్మ విదురుల ఆలనపాలనలో, అనురాగంలో పాండవులు ఐదుగురూ ఏ లోటూ లేకుండా పెరుగుతున్నారు. తల్లిని మురిపిస్తున్నారు. తమమధ్య అన్యోన్యం, ఐకమత్యం పెన వేసుకోగా చూసేవారికి చక్కగా వారందరూ ఒక్కరుగానే కనబడుతున్నారు.

భీముడంటే గుండెమంట?

పాండవులంటే సహజంగా అసూయ, అసహనం ఉన్న దుర్యోధనుడు, వారిమధ్య ఉన్న సోదరభావానికీ, వారిపైన భీష్మ విదురులకున్న ప్రేమ వాత్సల్యానికి ఎంతో బాధ పడుతూండేవాడు. ప్రత్యేకంగా భీముడంటే అతని గుండె మండిపోతూండేది. కారణం భీముని బలం, విశాల వక్షస్థలం, తీక్ష దృష్టి, దృఢమైన నడక.

అన్నమాటపై ఆదరం : ఒకరోజు పాండవులు కౌరవులు ఒకతోటలో ఆడుకోవడానికి వెళ్ళారు. కొంతసేపు ఆడుకున్నారు. అలసిపోవడంవల్ల ఎవరికివారు వేరువేరుగా రెండు జట్లుగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఇంతలో దుర్యోధనుని తమ్ముళ్ల కళ్ళకు ఎదురుగా విరగకాసిన మామిడిచెట్టు కనిపించింది. పోలోమంటూ వాళ్ళు ఆ చెట్టెక్కి కాయలుకోసుకొని ఆబగా తినడం ప్రారంభించారు. భీముడుకూడా చెట్టు దగ్గరకు వెళ్ళి రెండు పండ్లు తనకిమ్మన్నాడు. చెట్టుపైన వాళ్లు అతనిమాటలు వినిపించుకోలేదు. పైగా భీముణ్ణి చూసి నవ్వుతున్నారు. భీముడికి సివమెత్తింది. వాళ్ళపని ఎలా పట్టించాలా అనుకుంటున్నాడు. ఇంతలో వెనుకనుంచి అర్జునుడు 'భీమన్నా!' అని పిలవడంతో అర్థమయింది. భీముడు తన రెండుచేతులతో ఆ మామిడిచెట్టును పట్టుకొని గట్టిగా ఊపాడు. చెట్టుపైని వాళ్ళు ఏకొమ్మ వారా కొమ్మను బల్లుల్లాగా కరచుకున్నారు. భీముడు ఆగకుండా ఊపుతూనే ఉన్నాడు. చివరకు పట్టుదప్పి చెట్టుమీద వాళ్ళు జలజల క్రిందకుజారిపడ్డారు. అందరికీ నడుములు విరిగాయి. ఇది చూస్తున్న దుర్యోధనుడు భీముణ్ణి సమీపించి గద్దింప బోయాడు. భీమునికి కోపం వచ్చింది. ఇద్దరూ చేతులు చేసుకొనేవరకు వచ్చింది.

ధర్మరాజు మంచిదికాదని భావించి 'భీమసేనా!' అని పిలిచాడు. భీమసేనుడు పిల్లిలాగా అన్న దగ్గరకు తిరిగివచ్చాడు. అలా భీమ దుర్యోధనులమధ్య తొలి ఘర్షణ నివారింపబడింది.

పాడుమడుగులో... అప్పటి నుంచి దుర్యోధనుడికి అతని తమ్ముళ్లకి భీముడిపై మత్సరం పెరిగింది. అతనికి అపకారం చెయ్యడానికి పన్నాగాలు ప్రారంభించారు.

ఒకసారి భీమసేనుడు గంగానది ఇసుక తిన్నెలపై గాఢంగా ఒళ్లుమరచి నిద్రిస్తున్నాడు. అతడి వెంటే ఉన్న కురు కుమారులు మెల్లగా వచ్చి తాళ్లతో, తీగలతో బంధించి ఒక పాడుమడుగులో పడవేశారు. ఇంక భీముని పీడ వదలిందని సంతోషించి ఇంటిముఖం పట్టారు.

కొంతసేపటికి భీముడికి మెలకువ వచ్చింది. అటూ ఇటూ పెనుగులాడి కట్లు తెంపుకొని మడుగులోనుంచి పైకి ఉపాయంగా వచ్చాడు. తనకు అపాయం కలిగించిన వాళ్లను దూరంగా చూశాడు. బాణంలా ఒక్కదూకున వాళ్లను సమీపించి దొరికిన వాళ్లనల్లా చిత్తుచిత్తుగా మోది బుద్ధి చెప్పాడు.

కాటువేసిన పాములే చచ్చిపోయినాయి: మరొకసారి భీముడు రాజమందిరంలో తృప్తిగా భుజించి గుర్రుపెట్టి నిద్రపోతుంటే దుర్యోధనుడిచేత పంపబడిన ధూర్తుడొకడు కొన్ని కాలనాగులను, అతని శరీరం మీదికి వదిలాడు. అవి అతణ్ణి ఇష్టం వచ్చినట్లు కరిచి, అతని విషానికే విలవిల చుట్లు తిరిగి చచ్చాయి. దీనితో భీముని రక్తం పాముల విషానికంటే అపాయకరమైనదని తేలింది.

విషం జీర్ణమైపోయింది : ఇంకోసారి భీముణ్ణి నమ్మించి అనునయించి విషం కలిపిన ఫలాహారాలు పళ్లెంనిండా ఆరగించడానికి పంపించారు. ఈ రహస్యం తెలిసిన యుయుత్సుడు పరుగుతో వచ్చి భీముణ్ణి పదార్థాలు విషమిశ్రాలని చెప్పాడు. భీముడు చిన్నగా నవ్వి, విషం నాకు చాలా ఆరోగ్యకరం, అంటూ పళ్లెంలోని పదార్థాలన్నీ ఒక్కటి కూడా విడిచిపెట్టకుండా భుజించాడు. గట్టిగా ఒక్క త్రేన్పు త్రేన్చాడు. తిన్నవన్నీ క్షణంలో జీర్ణమయ్యాయి.

యుయుత్సుడు, ఈ విషయాలన్నీ ఎప్పటి కప్పుడు కుంతికి తెలియజేస్తూనే ఉన్నాడు. కుంతి భయపడి, ధర్మ రాజుని పిలిచి 'నాయనా! ఎందుకైనా మంచిది, ముందు జాగ్రత్త, మన భీమకుమారుని ఒంటరిగా ఉండవద్దను. అతణ్ణి కాస్త

కనిపెట్టుకొని ఉండు. పెద్దనాన్నగారి అబ్బాయిల పన్నాగాల్లో పడకుండా కాపాడుతూ ఉండు' అని చెప్పింది. అలాగే అమ్మా! అన్నాడు ధర్మరాజు.

తమ పథకాలు పారనందుకు కౌరవులకు బాధతోపాటు భీముడిపై ద్వేషం పెరుగుతోంది.

లక్క ఇల్లు బూడిదైంది : అంధరాజు, తమ్ముని కుమాళ్లను దగ్గరలో ఉంచడం శ్రేయస్కరం కాదని భావించాడు. కొంతదూరంలో ఉన్న వారణావతపురంలో వాళ్లకు ఒక చక్కని ఇల్లు కట్టించి తల్లితో సహా వాళ్ల నందులో నివసించడానికి పంపించాడు. దీనివెనక దుర్యోధనుని కుట్ర చాలా ఉంది. దుర్యోధనుడు పాండవుల రహస్యాలు తనకు ఎప్పటికప్పుడు చేరవేయవలసిందని పురోచనుడు అనేవాణ్ణి ఏర్పాటు చేశాడు. పాండవులకు పరిచర్యలు చేయడానికి ఒక అడవిజాతి స్త్రీని, ఆమె ఐదుగురు కొడుకులను, ఏర్పాటు చేశాడు. ఇందులోని మాయంతా దుర్యోధనుడికి ధృతరాష్ట్రుడికి తెలియాలి.

పాండవులు వారణావతం బయలుదేరి వెళ్లేటప్పుడు విదురుడు, భీమసేనుని ఒంటరిగా పిలిచి "బాబూ! మీరు చాలా జాగ్రత్తగా ఉండండి. మీకోసం నిర్మింపబడ్డది లక్కఇల్లు. పురోచనుడు చాల మోసగాడు. కనిపెట్టి చూస్తూ ఉండు. లక్కఇంటి నుండి అరణ్యానికి ఒక బిలం త్రవ్విస్తాను. అపాయసమయంలో మీరంతా దానిగుండా తప్పించుకోండి. నేనిక్కడ దుర్యోధనుని మాయోపాయాలు కనిపెట్టి ఎప్పటికప్పుడు మీకు తెలియజేస్తూ ఉంటాను. ధర్మం మీ పక్షాన ఉంది" అని చెప్పాడు. భీముడు పళ్లు పటపట కొరికాడు.

పాండవులు లక్కఇంట్లో నివాసం పెట్టి ఆరుమాసాలైంది. వచ్చే బహుళ చతుర్థినాడు దుర్యోధనుడు పురోచనుణ్ణి లక్క ఇంటికి అందరూ నిద్రపోతున్నప్పుడు నిప్పంటించవలసినదిగా ఏర్పాటు చేసిన సంగతి, విదురుడు భీమసేనుడికి కబురంపాడు. భీమసేనుడు తనవారి నందరినీ కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. విదురుడు అప్పటికే లక్క ఇంటి నుండి బిలం త్రవ్వించాడు.

అది కృష్ణచతుర్థి. అర్ధరాత్రి. అంతా నిద్రపోతున్నారు. పాపం అడవిజాతి స్త్రీ తన కొడుకులూ బైట అరుగులపై నిద్రపోతున్నారు. పురోచనుడు తన ప్రయత్నంలో తానున్నాడు. భీముడు కూడా తనవారి నందరినీ సురక్షితంగా భుజాలపై మోసుకొని బిలం గుండా పారిపోవడానికి సిద్ధంగా ఉన్నాడు.

పురోచనుడు ఎవరికీ తెలియకుండా లక్కఇంటికి నాల్గు మూలలా నిప్పంటించి పారిపోబోతున్నాడు. భీముడు చప్పున వాడి రెక్కలు పట్టుకొని ఆ నిప్పులో విసిరివేశాడు. వాడందులో కాలి చచ్చాడు. దాసీ స్త్రీ ఆమెపుత్రులూ కాలిపోయారు.

భీముడు నిద్రిస్తున్న తల్లినీ సోదరులనూ తన భుజాల మీద మోసుకొని అపాయంలేకుండా బిలంగుండా అరణ్యాన్ని చేరుకున్నాడు.

తెల్లవారేసరికి లక్కఇల్లు సమూలంగా తగలబడి పోయింది. అందులో కొన్ని కళేబరాలు కనిపించాయి. ప్రజలంతా పాండవులు అగ్నికి ఆహుతి అయిపోయారని దుఃఖించారు. దుర్యోధనాదులు లోలోపల సంతోషించారు. ధృతరాష్ట్రుడు తమ్ముడి కొడుకులకోసం మొసలి కన్నీరు కార్చాడు.

అసలు సంగతి విదురునికి తెలుసు. అతనిద్వారా భీష్మునికి తెలుసు. వారు పైకి ఏమీ అనకుండా మనసులో ఆనందించారు.

కాలమే తీరుస్తుంది : తెల్లవారగానే కుంతి, ఆమె నలుగురు పుత్రులూ నిద్ర నుండి లేచి తెల్లబోయి చూస్తున్నారు. అంతా వారికి అయోమయంగా ఉంది. అప్పుడు భీముడు జరిగిన సంగతి వారికి వివరించి చెప్పాడు. వారు ఆశ్చర్యపోయారు.

భీముడికి ఎందుకో చెప్పరాని కోపం వచ్చి కౌరవు లందరినీ త్రుటిలో నాశనం చేస్తానన్నాడు. కాని ధర్మరాజు "తమ్ముడూ, ఇలాంటి విషయాల్లో కొంచెం ఆలోచన, శాంతం అవసరం. ఉద్రేకపడి ఇప్పుడే పరిష్కరింపబూనడం పనికి రాదు. కాలమే అన్నిటినీ తీరుస్తుంది. కాబట్టి వేచియుందాం. అయినా ఇదీ మన మంచికే వచ్చింది. మనం కొంతకాలం దేశాటన చేద్దాం" అని చెప్పాడు. తరువాత అందరు బయలుదేరారు.

వారు కాలినడకన ప్రయాణం చేస్తున్నారు. నడవలేక బాధపడుతున్న తల్లిని, అన్నను తమ్ముళ్లను భుజాల పైన ఎక్కించుకొని భీముడు ముందుకు సాగుతున్నాడు. అలా నడిచి నడిచి ఒక పల్లె ప్రాంతానికి చేరుకున్నాడు.

భుజాలపై నున్నవారిని క్రిందికి దింపాడు. వారిని విశ్రాంతి తీసుకొమ్మని, భీముడు పల్లెకు ఆహారం తీసుకొనిరావడానికి వెళ్లాడు. కొంతసేపటికి ఆహారం తెచ్చి, అందరికీ పెట్టి, మిగిలింది తానూ తిన్నాడు. ఇన్ని కష్టాలపాలైన తనవారిని తలచుకొని భీముడు తనలోతాను ఎంతో కుమిలిపోతున్నాడు. అంతులేని ఆలోచనల్లో మునిగి తేలుతున్నాడు.

ఎవరు నీవు : ఎవరో తన వెనకగావచ్చి వీపుని మెల్లగా తట్టినట్టనిపించి, భీముడు చప్పున అటుతిరిగి చూశాడు. ఒక నల్లని ఛాయగల నవయౌవనవతి, నయగారం ఒలకబోస్తూ, నవ్వుతూ అతనికి కనబడింది. దగ్గరగా నిలబడింది.

“ఎవరు నీవు? ఎందుకిలా వచ్చావు?” అన్నాడు. "మోహనాకారా! వచ్చింది ఒకటి. జరిగింది వేరు” అన్నది. "అంటే అని తిరగి ప్రశ్నించాడు. అప్పుడామె ఇలా చెప్పడం మొదలు పెట్టింది "మా అన్న మహాశూరుడు. కానీ దుర్మార్గుడు. మిమ్మల్నందరినీ కట్టగట్టి తనకు ఆహారంగా తీసుకురమ్మని నన్ను పంపించాడు. కాని వచ్చి మిమ్మల్ని చూడడంతో వచ్చినపని మరిచిపోయాను. నన్ను అనుగ్రహించి గ్రహించండి” అంది. “అది సాధ్యంకాదు. ఉత్తమ స్త్రీ ధర్మాన్ని పాటించు. నీ కోరికను విసర్జించు. అసలు మేమిప్పుడు అనేక బాధల్లో ఉన్నాం" అన్నాడు భీముడు.

దానికి “మీ బాధలన్నీ నేతొలగిస్తాను. నా కామరూపంతో మీరు కోరినచోటుకు చేరుస్తాను. నా పేరు హిడింబి. నా అన్న పేరు హిడింబాసురుడు" అంటూండగా హిడింబాసురుడు రెక్కలున్న నల్లనికొండలా సెగలుగ్రక్కుకుంటూ రానే వచ్చాడు.

హోరాహోరి పోరాటం : హిడింబి భయపడి భీముడి చాటుకి చేరుకొంది. హిడింబాసురుడు “నరాధమా! నేనెవరనుకున్నావు? ఈ అరణ్యానికి అధిపతిని. మిమ్మల్నందరినీ ముక్కలు ముక్కలుగా చేసి ఒక్కసారిగా మ్రింగేయగలను. చెల్లెలివంక చూసి పాపీ! నీవిక్కడేమిచేస్తున్నావే? నిన్నెందుకు పంపించానో మరచిపోయి ఈ నీచునితో సరసాలాడుతున్నావా?" అని ఆమెను కొట్టబోగా భీముడాతని చేతిని కదలకుండా పట్టుకొని నిద్రిస్తున్న తనవారికి నిద్రాభంగం కలిగించకుండా కొంత దూరం లాక్కుపోయాడు.

అక్కడ ఇద్దరూ కలబడ్డారు. చెరొక చెట్టూ పెకలించి ఒకరిపై ఒకరు విసురుకుంటున్నారు. చెట్లన్నీ అయిపోగా మల్లయుద్ధానికి దిగారు. ఒకరి నొకరు ఒడిసిపట్టుకుంటూ, నేలపై విసిరి కొట్టుకుంటూ, తప్పుకుంటూ, తిరిగి కలబడుతూ రెండు గున్న ఏనుగుల లాగా రెండు చిన్న పర్వతాలలాగా ఎంతోసేపు హోరాహోరి పొరాడారు. హిడింబాసురుడు చచ్చిపోయాడు. ఆ సందడికి కుంతి ఆమె నలుగురు పుత్రులూ మేల్కొన్నారు. భీముడెవరితోనో పోరాడుతున్నట్లు గమనించారు. ధర్మరాజు తనదగ్గర నిలబడ్డ ఒక సుందరాంగిని చూచి ఆశ్చర్యపోయాడు. ఆమె వానికి నమస్కరించి వినయం ఉట్టిపడేలాగ తీయగా జరిగిన సంగతంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది.

అర్జునుడు ఆ పోరాటం జరిగేతావుకు పరుగుపెట్టాడు. భీమునితో "రాక్షసుని పని పట్టించు" అని ప్రోత్సహించాడు. అర్జునుణ్ణి చూడగానే భీమునిలో వెయ్యి ఏనుగులబలం పెరిగింది. హిడింబుని రెండు చేతులతో ఒడిసి పట్టుకొని నేలకేసి బలం కొద్దీ గట్టిగా విసిరికొట్టాడు. ముఖాన బలంగా గుద్దాడు. అంతటితో వాడు నోటితో ముక్కుతో రక్తంకక్కి వనమంతా మారుమోగేలా ఆర్తనాదం చేసి ప్రాణాలు విడిచాడు.

మాకు వదిన కావలసిందే : హిడింబాసురుని వధించి, అర్జునునితో కలిసి భీముడు తిరిగి వచ్చాడు. అక్కడే ఉన్న హిడింబినిచూసి "ఓసీ దుష్టరాక్షసీ! నిన్ను కూడా నీ అన్న దగ్గరకు పంపిస్తా"నంటూ కోపంతో కొట్టబోగా, కుంతీమాత జాలిగా “నాయనా! ఈ చిన్నది రాక్షసజాతిలో పుట్టినా లక్షణాలు మంచివి. మనసారా నిన్ను ప్రేమించింది. మన అందరికీ మంచినేకోరి ముందుగా రాబోయే విపత్తును తెలిపింది. మనందరినీ రక్షించాలను కొన్నది. ధర్మరాజుకు కూడా ఈమె తీరుతెన్నులు వచ్చాయి” అన్నది. తల్లి మాటలకు భీమసేనుడు తబ్బిబ్బు పడ్డాడు. అన్నవంక చూడగా “భీమసేనా! అమ్మమాట కాదనక విను" అన్నాడు. అంతలోనే అర్జున నకుల సహదేవులు ఏకకంఠంతో “అన్నా!” ఇలాంటి రూపవతి, గుణవతి, ఉపకారబుద్ధిగలది మాకు వదిన కావలసిందే” అన్నారు. ఇంతమంది మనసుని చూరగొని, సానుభూతి పొందిన హిడింబిని తాను సాదరంగా స్వీకరించడానికి ఒప్పుకున్నాడు. హిడింబి పులకించిపోయింది. అందరూ సంతోషించారు.

అసలు పేరు కమలపాలిక: హిడింబితో కలిసి వారందరూ అక్కడనుండి బయలుదేరి సాయంకాలానికి శాలిహోత్రమహర్షి ఆశ్రమానికి చేరుకున్నారు. ఆ మునీంద్రుడు వారికి ప్రేమతో అతిథ్యమిచ్చాడు. అప్పుడే వ్యాసమహర్షి వారికక్కడ దర్శనమిచ్చి, కుంతితో “అమ్మా! అంధరాజు పుత్రవ్యామోహంతో మీకు చేసిన అపచారాన్ని మరచిపొండి. నీ పుత్రులైదుగురూ మహాబల సంపన్నులు. వంశం పేరు నిలబెట్ట గలవారు. ఇలాగే మీరు కొంతకాలం ప్రచ్ఛన్నంగా ఉండండి. మీకు సర్వశుభాలు కలుగుతాయి. హిడింబి అసలు పేరు కమలపాలిక. ఈ శుభాంగి భీమునికి తగిన భార్య. ఈమె కడుపున అతి బలపరాక్రమశాలి అచిరకాలంలో పుడతాడు" అని చెప్పి అందరినీ దీవించి వెళ్లిపోయాడు. ఘటోత్కచుడు పుట్టాడు : భీమునికి కమలపాలికవల్ల ఒక మగ శిశువు జన్మించాడు. ఆ శిశువు తండ్రిని మించిన తేజంతో ఉన్నాడు. ధర్మరాజు ఆ బిడ్డను 'ఘటోత్కచుడు' అని నామకరణం చేశాడు. ఆ సమయాన భూతగణమంతా ఘటోత్కచుని సేవించడానికి సిద్ధమై వచ్చింది. ఘటోత్కచుడు నాయనమ్మకు, పెద్దనాయనకు, నాయనకు, చిన్ననాయనలకు నమస్కరించి, వారు

తలచినప్పుడు తప్పకుండ తన సర్వగణంతో సాయానికి రాగలనని వాగ్దానంచేసి, తల్లిని తన మూపుపై నెక్కించుకొని ఆకాశ మార్గంలో అంతర్ధానమయ్యాడు.

ఏకచక్రపురంలో బ్రాహ్మణవృత్తి : అక్కడ నుంచి భీముడు తల్లిని సహోదరులను భుజాలపై నెక్కించుకొని మోస్తూ పల్లెలూ, పట్నాలూ, నదులూ, నదాలూ, పర్వతాలూ, లోయలూ దాటి చివరకు ఏకచక్రపురమనే ఒక బ్రాహ్మణ అగ్రహారం చేరుకున్నాడు. అక్కడివారంతా బ్రాహ్మణులే అయినందువల్ల తామున్నూ బ్రాహ్మణవేషాలు ధరించి, ఒక సద్బ్రాహ్మణుని ఇంట్లో ఆశ్రయం సంపాదించారు. ఆ ఇంటి యజమాని, గ్రామస్థులు పాండవులను ఎంతో గౌరవంగా ప్రేమగా చూస్తున్నారు.

గొల్లుమని ఏడుపు : పాండవులు ప్రతిదినం గ్రామంలో భిక్షాటన చేసి, జీవయాత్ర సాగిస్తున్నారు. ఒకనాడు భీముడు ఎందుకో తల్లితో ఇంటిదగ్గరే ఉన్నాడు. మిగిలిన సోదరులు భిక్షకోసం బైటకువెళ్లారు. ఇంతలో తామున్న ఇంటిల్లిపాది ఒక్కసారి గొల్లుమని ఏడ్వడం మొదలుపెట్టారు. భీముడు కారణమేమిటో తల్లిని తెలుసుకురమ్మని పంపించాడు. తల్లి వెళ్లి సంగతి అడిగి తెలుసుకు వచ్చింది.

బకాసురుని పీడ : ఆ గ్రామానికి అల్లంత దూరంలో ఒక కొండమీద బకాసురుడు అనే రాక్షసుడు బసచేసి ఉంటున్నాడట. అతడు ఆ వూరుమీద పడి మనుషులను పశువులను విచ్చల విడిగా తింటూండేవాడట. అతనికి అంతులేని ఆకలట. కొండంత అన్నంరాసులు ఆరగిస్తాడట. ఎంతమంది మనుషులనైనా, ఎన్ని పశువులనైనా ఇట్టె నంజుకుంటాడట. గ్రామస్థులందరూ కలిసి ఆలోచించి, అతనికి రోజుకొక ఇంటివారు వంతున బండెడు అన్నం, రెండు దున్నపోతులు, ఒక మనిషిని ఆహారంగా పంపించడానికి ఏర్పాటుచేసుకున్నారట. ఈ రోజు పాండవులు బసచేస్తున్న బ్రాహ్మణయజమాని ఇంటివంతు వచ్చిందట. తనకున్న ఒక్కకుమారుని బకాసురునికాహారంగా పంపవలసిరావడంచేత వారు దుఃఖిస్తున్నారట. ఇదీ సంగతి.

బండితో బకాసురుని దగ్గరకు : భీముడు విన్నాడు ఉప్పొంగిపోయాడు. ఈ రోజు బండిని తాను తోలుకొని బకాసురునివద్దకు వెళతానని తల్లిని వెళ్ళి చెప్పి రమ్మన్నాడు. తన కుమారుని ధైర్యసాహసాలు, శక్తి సామర్థ్యాలు తెలిసిన కుంతి పోయి ఈ శుభవార్త యజమానికి అందించింది. అప్పుడు ఆ ఇంటివారు తల్లీకుమారుల త్యాగానికి వాళ్లను వేయివిధాల ప్రస్తుతించారు.

బండిని సిద్ధంచేశారు. బండినిండా అన్నం, పిండి వంటకాలు, నింపారు. దానికి బలిసిన రెండు దున్నలు కట్టి భీమసేనునికి ఒప్పగించారు.

భీమసేనుడు తల్లిదీవెనలు అందుకొని తన్ను అందరూ రెప్పవాల్చకుండా ఆశ్చర్యంతో చూస్తూ ఉండగా, బకాసురుడు బసచేసిన కొండవైపుకి బండిని తోలుకొని వెళ్లాడు.

నూకలు చెల్లిపోయినాయి : బండి తాపీగా తోలుతూ భీముడు దారిలో అన్నం, పిండివంటకాలూ తృప్తిగా ఆరగించడం ప్రారంభించాడు. బకాసురుడు ఆకలితో నకనక లాడుతూ మండిపోతున్నాడు. బండిరావడం ఆలస్యమైనందుకు అగ్గిమీద గుగ్గిలమవు తున్నాడు. భీముని రూపం తీరూ చూసి మరింత భగ్గుమన్నాడు. పైగా భీముడు బండిని కొండకు కొంతదూరాన ఆపి కుడిచేత్తోతింటూ, ఎడమచేత్తో బకాసురుణ్ణి తనదగ్గరకు రమ్మని సైగచేశాడు. అప్పుడువాడు కొండ పై నుండి క్రిందికి ఒక్కదుముకు దుమికి భీముణ్ణి సమీపిస్తూ, “ఓరి నరాధమా! నేనంటే భయంలేకుండా నాకోసం తెచ్చిన అన్నం ఆరగిస్తూ నిర్లక్ష్యం ప్రకటిస్తున్నావు. నిర్భయం ప్రకటిస్తున్నావు. కాచుకో నిన్నేమి చేస్తానో!”

"ఓరీ రాక్షసాధమా! నీకు ఈ రోజుతో భూమిమీద నూకలు చెల్లాయి. కాచుకో, నా ప్రతాపం చూసుకో" అన్నాడు భీమసేనుడు.

ఇద్దరూ కలియబడ్డారు. దగ్గరలో ఉన్నవృక్షాలు పెకలించి ఒకరిపై ఒకరు విసురుకొన్నారు. ఆ పిదప ముష్టి యుద్ధానికి దిగారు. గ్రుద్దుకున్నారు. తోసుకున్నారు. ఒకరిపై ఒకరుపడి పెనుగులాడారు. బకాసురునిబలం క్రమంగా తగ్గిపోసాగింది. భీముడిబలం క్రమంగా పెరగసాగింది. భీముడు బలమంతా ఉపయోగించి, ఆ రాక్షసుని వీపుమీద ఒక్కగ్రుద్దు గ్రుద్దగా గుక్కెడురక్తం గ్రక్కాడు. క్రిందకు కూలబడ్డాడు. కూలబడినవాణ్ణి కుడికాలుతో సాచితన్నాడు. బంతిలా గిరగిర తిరుగుతూ ఆవులించి వాడు ప్రాణం విడిచాడు.

పౌరుల ఆశ్చర్యం : ఖాళీ అయిన బండిపై బకాసురుడి శవం వేసుకొని, భీముడు ఏకచక్రపురానికి తీసుకువచ్చాడు. ఆ దృశ్యం గ్రామ ప్రజలంతా ఇళ్లనుంచి బిలబిల బైటకువచ్చి ఆశ్చర్యంతో ఆనందంతో తిలకించారు. ఈ లోపుగా ధర్మరాజాదులు భిక్షాటనం నుంచి తిరిగివచ్చారు. వారూ ఆనందించారు. ఆ రోజు ఏకచక్రపురమంతా ఎంతో వేడుక పండుగ. బకాసురుని బాధ వదలినందుకు బ్రాహ్మణ్యం అంతా భీమసేనుని కుంతీమాతనూ పొగిడారు. నాటినుంచి పాండవులను ఇలవేల్పులుగా కొలుచుకుంటూ, ఘనగౌరవంతో చూసుకుంటున్నారు.

ద్రౌపదీ స్వయంవరం : ఒకనాడు దేశదేశాలు తిరిగివచ్చిన బ్రాహ్మణుడు పాండవుల ఆతిథ్యానికి వచ్చాడు. అతడు వారితో మాటల ప్రస్తావనలో పాంచాలదేశపు

రాజధాని కాంపిల్యనగరంలో ద్రుపదరాజు కూతురు ద్రౌపది స్వయంవరం జరగబోతున్నట్లు చెప్పాడు. తానక్కడికి వెళుతున్నట్లు ఆసక్తి ఉంటే వారిని తమతో రమ్మని కోరాడు. బ్రాహ్మణ వేషధారులైన పాండవులు ఉత్సాహపడి వానితో కాంపిల్య పురానికి బయలుదేరారు.

ద్రుపద భూపతి కుమార్తె స్వయంవరం చాటించాడు. ఒక మత్స్యయంత్రాన్ని ఏర్పరచాడు. అది ఒక స్తంభంపైన గిరగిరతిరుగుతుంటే, క్రిందనీటిలో దాని నీడనుచూసి గురి తప్పకుండ కొట్టినవాణ్ణి తన కుమార్తె స్వయంగా వరించి వివాహమాడుతుంది.

స్వయంవర మంటపం నానారాజకుమారులతో కళకళలాడుతోంది. వారి వేష భూషణాలు వింత వింత వైఖరులతో చూడ ముచ్చటగా ఉన్నాయి. ఆ స్వయంవరానికి శ్రీకృష్ణ బలరాములు, దుర్యోధనాదులు, చేదిరాజపుత్రుడైన శిశు పాలుడు వచ్చారు. జరాసంధుడు వచ్చాడు. రాకుమారులంతా ప్రయత్నించారు. కాని ఒక్కడుకూడ మత్స్యయంత్రాన్ని కొట్టలేకపోయాడు.

ధర్మరాజు విలువిద్యా నిపుణుడైన తన తమ్ముడు అర్జునుణ్ణి ఆజ్ఞాపించాడు. అర్జునుడులేచి అన్నకు నమస్కరించి మంటపాన్ని సమీపించాడు. సభా సదులంతా ఆశ్చర్యచకితులై చూస్తుండగా అతడు అవలీలగా విల్లునెత్తి, నారి సారించి, బాణం తొడిగి మత్స్యయంత్రం, నీడచూసి ఒక్క వేటులో గురితప్పకుండా కొట్టాడు. ద్రౌపది అతనిమెడలో పూలమాల వేసింది. ద్రుపదరాజు సంతోషించాడు. క్షత్రియ కుమారులు అసూయ చెందారు.

ఎవరూ గుర్తించలేదు : అక్కడున్న వాళ్లలో శ్రీకృష్ణుడుతప్ప అర్జునుడ్ని ఎవరూ గుర్తించలేదు. మిగిలిన అందరు అతడొక బ్రాహ్మణయువకుడనుకున్నారు. శిశుపాలుడు, దుర్యోధనుడు ద్రుపదునివల్ల క్షత్రియులకు అవమానం కలిగినట్లు భావించి వారాతని శిక్షించబోగా అర్జునుడు భీమునిసాయంతో వాళ్లందర్ని ఎదిరించి, ఓడించి వారిగర్వం అణచాడు.

పాంచాలీ పరిణయం : పాండవులు కాలినడకతో ద్రౌపదిని తమ తల్లిదగ్గరికి పిలుచుకుపోయి, ఒక అపురూపఫలం సంపాదించి తెచ్చినట్లు ఆమెతో చెప్పారు. అప్పుడామె వాళ్లందర్ని ఆ ఫలాన్ని సమానంగా అనుభవించవలసిందిగా కోరింది. పక్షపాతం లేని మాతృభావం వెల్లడించింది. ఆ ధర్మసమస్యను శ్రీకృష్ణ సాత్యకుల ఎదుట పరిష్కరించింది. ద్రౌపదికి పాండవులు ఐదుగురు భర్తలవడంతో పంచభర్తృక అయింది.

పాండవులకు అర్ధరాజ్యం ఇదంతా జరిగిన కొన్నాళ్ళకు దుర్యోధనుడు మత్స్య యంత్రం కొట్టింది అర్జునుడనీ, అతనికి సహాయంగా నిలబడి స్వయంవరసభలో తమందరి కీళ్లూ సడలించింది భీముడనీ, తెలుసుకున్నాడు. పాండవులు లక్కఇంట్లో తగలబడకుండా తప్పించుకుపోయారని తెలుసుకున్నాడు.

తిరిగి దుర్యోధనడు తనబృందంతో మాయాలోచనలు చేసి తండ్రిని ఒప్పించి పాండవులను హస్తినాపురికి రప్పించాడు. భీష్మవిదురుల ద్వారా కబురందుకొని వచ్చిన కృష్ణ సాత్యకులు ధృతరాష్ట్రునితో చర్చించారు. ధృతరాష్ట్రుడు భీష్ముని సలహానను సరించి పాండవులకు అర్ధరాజ్యమిచ్చాడు.

ఖాండవప్రస్థం ఇంద్రప్రస్థమైంది : నూతనరాజ్యానికి ఇంద్రప్రస్థం రాజధాని. పాండవులు ప్రజానురంజకంగా పాలన సాగిస్తున్నారు. ధర్మరాజు మయుని సలహా సంపత్తితో నూతనరాజధానిని అత్యద్భుతంగా నిర్మించాడు. ఎత్తైన కోటగోడలు, చుట్టూ లోతైన అగడ్తలు, ఆకాశాన్ని అంటే మణిమయ సౌధాలమధ్య భూలోకస్వర్గంలా వెలిగే ఆ నగరానికి వ్యాసుడు ఖాండవప్రస్థం అనే పేరుమార్చి ఇంద్రప్రస్థం అనే పేరుపెట్టాడు.

మయసభామందిరం : నూతన రాజనగర ప్రవేశ మహోత్సవం చాల వైభవోపేతంగా జరిగింది. ధర్మరాజు పట్టాభిషేకమహోత్సవం కృష్ణుని సమక్షంలో జరిగింది. బంధుమిత్ర సామంతులు, ప్రజలు వెల్లువగా వచ్చారు. ఖాండవదహన సమయంలో అగ్ని దేవుని బారినుంచి తనను అర్జునుడు రక్షించినందుకు రాక్షస శిల్పాచార్యుడైన మయుడు, కృతజ్ఞతతో, ఈ అద్భుత శిల్ప నిర్మాణం (రాజసభాభవనం) కానుకగా ఇచ్చాడు. ఎనిమిది వేల వీరులచేత దాన్ని మోయించుకొని వచ్చాడు.

రారాజుకు భంగపాటు : ధర్మరాజు రాజసూయయాగం తలపెట్టి దాన్నిపూర్తి చేశాడు. ఆ యాగాన్ని చూడడానికి ఎందరెందరో వచ్చారు. దుర్యోధనుడు తమ్ములతో, కర్ణునితో, శకునితో కలిసివచ్చాడు. అర్జునుడు వాళ్ళందరికీ మయసభామందిర విశేషాలు చూపించాడు. వారు ఒళ్లంతా కళ్లుచేసుకొని ఆశ్చర్యపడి చూశారు. ఆ సుందర మందిరం. ఎత్తుగా కనబడే తావు లోతుగా కనబడే తావు అన్నీ నిజానికి సమతలాలే. నీరున్నట్లు భ్రమ గొల్పేచోట నీళ్లుండవు. లేనట్లుకనబడే తావులో నీళ్లుంటాయి. ఒకగోడకు ద్వారంలేకున్నా ఉన్నట్లు భ్రమగొల్పుతుంది. ఒక గోడకు ద్వారమున్నా ఉన్నట్లు కనబడదు. ఆ మందిరాన్ని చూస్తున్నప్పుడు దుర్యోధనుడు ఒకటి రెండుసార్లు భంగపడ్డాడు. ఒకద్వారం ఉన్నట్లు కనబడినప్పుడు దానిగుండా వెళ్ళడానికి ప్రయత్నించాడు. పాపం తలకు గోడ ఢీకొంది. మందిరం పై అంతస్తు నుంచి చూస్తున్న

ద్రౌపదికి బావగారి పరిస్థితికి నవ్వు వచ్చింది. ఆమె చెలికత్తెలు ఊరుకొనక "మహారాణీ! మీ పెద్దమామగారు కన్నులులేని అంధులైతే, వారి పెద్దకుమారులు కన్నులున్న అంధులు సుమండీ" అన్నారు. ఈ మాటలు దుర్యోధనుడు విన్నాడు. ఇంక కొంత దూరంవెళ్ళేసరికి ఒకచోట నీటికొలనులాంటిది కనబడింది. దుర్యోధనుడు తన కట్టుపంచె కుచ్చిళ్ళు పైకిఎత్తి నడువసాగాడు. కాని అక్కడ నీళ్ళులేవు. అదొకచిత్రమైన పచ్చలు, ఇంద్రనీల మణులు తాపటం చేసిన తటాకం, మరొకస్థలంలో అంతా సవ్యంగా ఉన్నట్లు భావించి నడుస్తుంటే తటాలున ఒక తటాకంలోపడి దుర్యోధనుడు దుస్తులన్నీ తడుపుకొన్నాడు. ఈ దృశ్యం చూసి పై నుంచి ద్రౌపది పగలబడి నవ్వింది. దుర్యోధనునికి సహింపరాని అవమానం జరిగింది. తలపై కెత్తి అతడు ద్రౌపదివంక తీవ్రంగా చూశాడు. 'ఊ!' అని తల పంకించాడు. ఎప్పటికైనా ద్రౌపదిమీద తగిన ప్రతీకారం తీసుకోవాలని దీక్ష వహించాడు. అవమానభారంతో ఆ సభా భవనంలో ఆగకుండా వెంటనే తన బసకు వెళ్లిపోయాడు. పాండవులెంత బతిమాలుతున్నా వినక తన పరివారంతో హస్తినాపురానికి మరునాడే తిరుగుప్రయాణం కట్టాడు.

దుర్యోధనుడు తన మేనమామ శకునితో దీర్ఘంగా తీవ్రంగా ఆలోచించాడు. పాండవులను ద్రౌపదిని తన మందిరంలో నౌకర్లుగా నియమించి ఊడిగం చేయించు కోవాలని కోరాడు. ముఖ్యంగా ద్రౌపదిమీద తగిన ప్రతీకారం తీసుకోవాలనుకొన్నాడు.

మాయజూదం : ధర్మరాజుకి జూదమంటే మహావ్యసనం. అది ఆసరాగా తీసుకొని దుర్యోధనుడు అతణ్ణి తనతో జూదమాడడానికి ఆహ్వానించాడు. మాయో పాయంతో అతన్ని ఓడించి తన ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. ధర్మరాజుని జూదమాడ వద్దని భీమార్జున నకుల సహదేవులు బ్రతిమాలారు. కాని లాభం లేకపోయింది. విదురుడు దుర్యోధనునికి జూదమాడవద్దని హితవు చెప్పినా ప్రయోజనం లేకపోయింది.

ధర్మరాజు దుర్యోధనునితో జూదమాడాడు. శకుని ఈ జూదంలో ప్రముఖమైన పాత్ర వహించాడు. మేనల్లుడికి మాయోపాయాలన్నీ బోధించాడు. ధర్మరాజును వంచించాడు. ఒకసారికి రెండుసార్లు ధర్మరాజు జూదంలో ఓడిపోవడానికి కారణమైనాడు. ఈ మాయజూదంలో ధర్మజుడు రాజ్యాన్ని సకలసంపదను, తమ్ముళ్లను, చివరకు ద్రౌపదిని ఓడిపోయాడు. అంతేకాదు పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేసేలా పందెం ఒడ్డి ఓడిపోయాడు. జూదం అనే వ్యసనం ఎంత చెడ్డదో ధర్మరాజు ఉదాహరణ లోకంలో ఒక గొప్ప పాఠంగా మిగిలిపోయింది.

ఈ మోసపు జూదానికి ఒళ్లుమండి భీముడు దుర్యోధనుని శకునిని తునాతునకలు చేయడానికి సిద్ధపడితే ధర్మరాజు ధర్మబద్ధుడై అదికూడదని వారించాడు. భీముడు తన ఆగ్రహాన్ని తానే మ్రింగుకొని ఊరుకున్నాడు.

ఈ దుష్టులను ముక్కలు చేస్తాను: పాండువుల కష్టాలు ప్రారంభమయ్యాయి. పగబట్టిన దుర్యోధనుడు ద్రౌపదిని రాజసభకు పిలుచుకుని రమ్మని రాకుంటే బలవంతంగా ఈడ్చుకు రమ్మని తమ్ముడైన దుశ్శాసనుణ్ణి ఆదేశించాడు. దుశ్శాసనుడు వెళ్లి ఏకవస్త్రయైన (వెలుపల ఉన్న) ద్రౌపదిని జుట్టు పట్టుకొని బలాత్కారంగా నిండుసభకు ఈడ్చుకు వచ్చాడు. అన్న ఆజ్ఞ ప్రకారం ఆమెను వివస్త్రను చేయడానికి సిద్ధమయ్యాడు. దుర్యోధనుడు అన్యాయంగా ద్రౌపది వంకచూచి ఆమెను తన తొడమీద వచ్చి కూర్చోమని సంజ్ఞచేశాడు. ఇంత జరుగుతున్నా సభలోని వాళ్లంతా ఏమీ మాట్లాడకుండా మౌనప్రతిమల్లాగ కూర్చున్నారు. కండ్లప్పగించి చూస్తున్నారు. భీముడు కాలరుద్రుడై పళ్లు పటపట కొరుకుతూ “అన్నా! ధర్మజా! నేనింక సహించను. రాజ్యాన్ని ఐశ్వర్యాన్ని అన్నదమ్ములను ఓడినా, చివరకు ద్రౌపదిని ఓడినా ఓర్పు వహించాను. ఇప్పుడు ఇంతమంది ఎదుట మన ధర్మపత్నిని ఇలా అవమాన పరుస్తుంటే చూస్తూ ఎలా ఊరుకోగలను? ఈ నీచులను, ఈ దుశ్శాసనాది దుష్టులను ముక్క ముక్కలుగా చేస్తాను. నాకు అనుమతినియ్యి" అన్నాడు. ధర్మరాజు ధర్మదేవతలా “తమ్ముడూ, ధర్మమే జయించి తీరుతుంది-ఓపికపట్టు" అన్నాడు శాంతంగా, ఇంక చేసేదేమీలేక భీముడు ఊరుకున్నాడు.

తన్నోడి నన్నోడెనా?

ఆ సభలో ద్రౌపది ఒక ధర్మసందేహం లేవనెత్తింది. “తన్నోడి నన్నోడాడా, నన్నోడి తన్నోడాడా ధర్మరాజు? చెప్పండి” అని, ఎవ్వరూ ఆమె సంశయం తీర్చలేదు. అప్పుడు విదురుడుమెల్లగా “ధర్మరాజు తన్నోడి నిన్నోడాడు అని సమాధానం చెప్పాడు. ద్రౌపది "ముందు తన్నోడిన ధర్మరాజుకి తరువాత నన్నోడే హక్కు ఎక్కడుంది? చెప్పండి ధర్మం తెలిసిన మీలో ఎవరైనా?” అని తిరిగి ప్రశ్నించింది. ఎవ్వరూ మాట్లాడలేదు. వికర్ణుడు పెద్దలందరివంక చూసి "ఆర్యులారా! ఆమెకు సమాధానం చెప్పడానికి మీలో ఎవరూ లేరా!” అని సవాలు చేశాడు. కర్ణుడు విధిలేక “నీ కెందుకు చిన్నవానికి పెద్దవిషయం సంగతి?” అని ఊరకుండబెట్టాడు.

ఆశ్చర్యంగా అక్షయవస్త్రాలు : దుశ్శాసనుడు అన్యాయంగా అమానుషంగా ద్రౌపదిని మానభంగంచేస్తుంటే ఆమె దిక్కులేని దీనయై రెండుచేతులూ పై కెత్తి శ్రీ

కృష్ణుని మ్రొక్కుకుంది. శ్రీ కృష్ణుడు ఆమెకు వస్త్రాలు అక్షయంగా ఇచ్చి ఆమెను రక్షించాడు. దుశ్శాసనుడు ఎన్నిసార్లు ద్రౌపదిచీరలు ఒలిచినా అవి తరుగకుండా పెరుగుతునే ఉన్నాయి. గుట్టలు గుట్టలుగా ప్రోగుబడుతునే ఉన్నాయి. అతడు చివరకు అలసి తన దుష్టచర్య విరమించుకున్నాడు. సిగ్గుతో తలవంచుకున్నాడు.

భీముని ప్రతిజ్ఞ : భీముడు సభలోని వారంతా వింటూండగా ఇలా ప్రతిజ్ఞ చేశాడు. "ఎప్పటికైనా ఈ దుశ్శాసనుని సంహరించి, అతని రక్తంత్రాగి, రక్తసిక్తమైన నాచేతులతో విడిపోయిన ద్రౌపది ముడిని సవరించి తీరుతాను. మదోన్మత్తుడైన ఈ దుర్యోధనుని తొడలు రెండూ నా గదాదండంతో విరుగగొట్టి, ఈతని శిరస్సు నా ఎడమకాలితో తన్ని తీరుతాను". ఈ ప్రతిజ్ఞ అందరూ విన్నారు.

కొండంత అండ : పాండవులు తమ అర్ధరాజ్యాన్ని, అన్ని సంపదలను విడిచిపెట్టి, ద్రౌపదితోకూడి అరణ్యవాసానికి ప్రయాణమయ్యారు. వృద్ధమాత కుంతి తన దగ్గరే ఉండే ఏర్పాటు చేశాడు విదురుడు.

విలువైన తమ ఆభరణాలు వస్త్రాలు విసర్జించి నార చీరలు ధరించి, అరణ్యాలకు బయలుదేరివెళ్లే ఆ పాండవులను చూసి ఆబాలవృద్ధులు కన్నీరు మున్నీరుగా విలపించారు. "అరణ్యాలలో అపాయం జరగకుండా కాచి రక్షించడానికి అందరికీ కొండంత అండ భీముడు" అని వారు కొంత సంతృప్తి పడ్డారు.

అక్షయపాత్ర : ధర్మరాజు ప్రార్ధించగా సూర్యుడు ప్రత్యక్షమై ఒక సువర్ణపాత్ర అతనికి ప్రసాదించాడు. భీముడప్పుడు ధర్మ రాజు ప్రక్కనే ఉన్నాడు. అది అక్షయపాత్ర. దానిని తాకి తలచుకొన్నంతలో ఎంతమందికైనా సరిపడే పంచభక్ష్య పరమాన్నాలు సిద్ధమౌతాయి. ఆ పాత్రసాయంతో ధర్మరాజు తనతో ఉన్నవారికి తనయొద్దకు వచ్చిన అతిథులకూ ఎప్పుడూ ఏ లోటూ లేకుండా ఆహారం పెట్టగలుగుతున్నాడు.

కిమ్మీరాసుర వధ!

ఆ రాత్రి భీముడుతప్ప, మిగిలినవారు నిద్రలోమునిగి ఉన్నారు. భీముడు వారికి రక్షకకవచంలా కాపలాకాస్తున్నాడు. ఆ సమయంలో ఎక్కడనుంచో ఒక భీషణారావం వినిపించింది. అది బకాసురుని తమ్ముడూ హిడింబాసురుని మిత్రుడూ అయిన కిమ్మీరాసురుని కంఠధ్వని. కిమ్మీరుడు ప్రళయ భయంకరుడు. అతడంటే జంతువులూ మనుషులూ మొదలైన అన్ని ప్రాణులూ భయపడతాయి. ఆ రాక్షసుడు తనమీదికి లంఘించగా, భీముడు తన గదతో ఎదుర్కొన్నాడు.

ఇంతలో ధర్మరాజు తక్కినవారు మేల్కొన్నారు. భీముడు కిమ్మీరుడు చిత్రచిత్రగతుల్లో యుద్ధం చేస్తున్నారు. కొంతసేపటికి కిమ్మీరుని గద ముక్కలైపోయింది. మరొక ఆయుధం చేతపట్టాడు. దాన్ని భీముడు ముక్కలుముక్కలు చేశాడు. కిమ్మీరుడింక రాక్షసమాయ ప్రయోగించాడు. వేనవేలు రాక్షసులు పుట్టుకువచ్చారు. వారిచేతుల్లో రకరకాల ఆయుధాలున్నాయి. వారంతా ఒక్కసారిగా భీముని చుట్టుముట్టారు. అర్జునుడు భీమునికి సైగచేశాడు. భీముడు గదాదండాన్ని మంత్రించాడు. వేనవేలు గదలు పుట్టుకువచ్చాయి. ఒక్కొక్క గద ఒక్కొక్క రాక్షసుని మట్టుబెట్టి మాయమైనాయి. భీముని ముందు కిమ్మీరుని మాయ ఎందుకూ పనికిరాకుండా పోయింది.

పిమ్మట కిమ్మీరుడు వృక్షాలు పెకలించి భీముని మీదికి యుద్ధానికి తలపడ్డాడు. వృక్షాలన్నీ నాశనమైనాయి. కిమ్మీరుని జవసత్వాలూ నాశనమైనాయి. గరుత్మంతుడు క్రూర సర్పాన్ని ఒడిసిపట్టినట్లు భీముడు కిమ్మీరుని ఒడిసిపట్టి తన గదాదండంతో అతని శిరస్సు చితకపొడిచాడు. ఆ దెబ్బతో కిమ్మీరుడు అంతరించాడు. భీముని యుద్ధ నైపుణ్యాన్ని ధర్మరాజు మెచ్చుకున్నాడు. ద్రౌపది, అర్జున, నకుల, సహదేవులూ శ్లాఘించారు.

ధర్మరాజు కామ్యవనంలో తమ్ముళ్లు నిర్మించిన పర్ణకుటీరంలో ద్రౌపదితో కొంతకాలం కులాసాగా గడిపాడు.

కానుకగా ఇస్తాను : ఒకనాడు భీమసేనుడూ ద్రౌపదీ కలిసి వనవిహారం వెళ్ళారు. అప్పుడు ఆకాశంలో ప్రయాణంచేస్తున్న ఒక యక్ష దంపతుల విమానం నుంచి అపూర్వకాంతీ, అద్భుత పరిమళం వెదజల్లే ఒక దివ్యపుష్పం క్రిందికి జారిపడింది. ద్రౌపది అది చూసి ఎంతో ముచ్చటపడింది. అలాంటి పుష్పం తనకు కావాలని కోరింది. ద్రౌపదిపై ఎక్కువ మక్కువగల భీముడు తప్పకుండా అలాంటి పుష్పం ఈ పధ్నాల్గు భువనాల్లో ఎక్కడున్నా వెదకి తీసుకువస్తానని, కాన్కగా ఇస్తానని వాగ్దానం చేశాడు. ద్రౌపది ఎంతో సంతోషించింది.

తోకను పక్కకునెట్టి వెళ్లిపో: భీమసేనుడు సౌగంధికపుష్పం కోసం బయలుదేరాడు. దారిలో గంధమాదనపర్వతం కనబడి కనువిందుచేసింది. ఆ ప్రశాంత వాతావరణంలో ఒక లోయలో నిర్మల పర్ణకుటీరం ఉంది. దానిముందు ఒక వృద్ధవా నరమూర్తి నిలబడి ఉన్నాడు. భీముడు అటుగా నడిచివస్తున్న సవ్వడి విన్నాడు. ఆ వానర దేవుని ముఖంలో ఏదో తెలియరాని ఆనందరేఖ విరిసింది.

అతడెవరో తెలుసా! అల త్రేతాయుగంలో రామునికి బంటుగా భక్తుడుగా మసలిన హనుమంతుడు, చిరంజీవియైన వాయునందనుడు, అంజనీతనయుడు.

ఆ భక్తవరుడు తన రూపం మరింత వృద్ధదశకు మార్చుకున్నాడు. రామ నామస్మరణ చేసుకుంటూ కొంచెం ముందుకు నడిచాడు. భీమసేనుడు వచ్చే మార్గమధ్యంలో అడ్డంగా తన పొడవైన తోకను సాచి నేలమీద పడుకొన్నాడు. భీముడు అతని దగ్గరకు చేరుకున్నాడు. పడుకొన్న వాణ్ణి చూచి ప్రార్థనా పూర్వకంగా "అయ్యా! వానర మహాశయా! కాస్త తప్పుకుంటావా" అన్నాడు.

"బాబూ! నాకు తప్పుకునే ఓపికలేదు'' అన్నాడు వానరుడు

''పోనీ నీ తోకను కాస్త దారికడ్డం తీయగలవా?'' అన్నాడు.

ఆ మాత్రం శక్తే ఉంటే ఇలా నేలమీద ఎందుకు పడుకుంటాను నాయనా! దయయుంచి చెప్పాననుకొనక నువ్వే ఆ తోకను కాస్త ప్రక్కకునెట్టి వెళ్లిపో బాబు అన్నాడు హనుమ.

మనమిద్దరం వాయుపుత్రులం: భీముడు తన ఎడమచేత్తో తోకను తేలికగా ఎత్తడానికి ప్రయత్నించాడు. కానీ కదలలేదు. రెండుచేతులూ ఉపయోగించి ఎత్తడానికి గట్టి ప్రయత్నం చేశాడు. ప్రయోజనంలేకపోవడంతో ఆశ్చర్యమేసింది. "తన జన్మకు ఇదే తొలి అనుభవం. ఎదురులేదన్న తనకు ఈనాడు ఏదో గొప్ప విశేషం ఎదురైంది. ఇతడెవరో! అలనాటి ఆంజనేయస్వామి కాదు కదా?" అని మనసులో అనుకున్నాడు.

వెంటనే ఆ వానరమూర్తి యౌవనోత్సాహం ఉట్టిపడ దిగ్గున లేచి గంతువేశాడు. భీముని ప్రేమతో కౌగిలించికొని "తమ్ముడూ! నీవు ఊహించింది సత్యం. నేను ఆంజనేయుణ్ణి. నీకు నేను అన్నను. మనమిద్దరం వాయునందనులం. వాయుదేవుని వరప్రసాదం వల్ల జన్మించాం. నీ శక్తిని, నీ భక్తినింకా నీ యుక్తిని తమాషాగా పరీక్షించదలచి యీపన్నాగం పన్నాను. నీవు నాకు అన్ని విధాలా తగిన తమ్ముడవని రూఢి అయింది. నాకెంతో ఆనందంగా ఉంది. నీవు వెళ్ళే పని నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ఆ సౌగంధికపుష్పం దొరికే చోటుకి నిన్ను క్షణంలో మోసుకుపోతా" నంటూ తన భుజాల మీద తమ్ముణ్ణి మోసుకువెళ్ళి కుబేరుని ఉపవనంలో సౌగంధికా సరోవరందగ్గర దింపాడు. అలనాడు రావణునితో యుద్ధంచేసేటప్పుడు రామలక్ష్మణుల నిద్దరినీ మోసిన తన భుజాలమీద ఈనాడు భీమసేనుణ్ణి మోయడం ఎంత చిత్రం! తల్లినీ,

సోదరులనూ తన భుజాలమీద ఎల్లవేళలా మోసిన భీమన్న ఈనాడు తన అన్నచేత మోయించుకోవడం ఎంత చిత్రం!

కుబేర స్నేహం : సౌగంధికా సరోవరాన్ని కాపలాకాస్తున్న యక్షభటులు భీముని పరాక్రమం తెలియక ఎదిరించి పరాజితులైనారు. భీముని శరణువేడారు. భీముడు వారిని ఉదారంగా క్షమించాడు. ఇంతలో ఘటోత్కచుడు ధర్మరాజు కోరగా ప్రత్యక్ష్యమై ఆయనతో భీముని వృత్తాంతం చెప్పి, వాళ్లని తన భుజాలమీద మోసికొని సరోవరం దగ్గరకు తీసుకువచ్చాడు. భీముణ్ణిచూసి వారూ పుత్రుజ్జీ, సోదరుల్నీ చూసి భీముడూ పరస్పరం సంతోషించారు. భీముడు వాళ్లందరితో వీరాంజనేయుని వృత్తాంతం వివరించి చెప్పగా వారా మహాభక్త శిఖామణికి వేయి నమస్కారాలు భక్తితో అర్పించుకున్నారు; సరిగా అదే సమయానికి యక్షరాజు కుబేరుడు అక్కడికివచ్చాడు. పాండవులను గుర్తించి వారిని పలుకానుకలతో సత్కరించాడు. వారి సానుభూతిని స్నేహాన్ని విశేషంగా కోరాడు.

కాగల కార్యం గంధర్వులు తీర్చారు: చిత్రసేనుడను గంధర్వపతి తన రాణులతో ఒక సరోవరంలో జలక్రీడలాడుతుంటే దుర్యోధనాదులు అతన్ని అవమానపరచారు. మాటా మాటా పెరిగి గంధర్వపతితో కయ్యానికి దిగారు. చిత్రసేనుడు తలచుకోగానే అప్పటి కప్పుడు అనేక వేలమంది గంధర్వ వీరులు ప్రత్యక్షమయ్యారు. దుర్యోధనుడు, కర్ణుడు, దుశ్శాసనుడు ఒకవంక, చిత్రసేనుడు, అతని గంధర్వవీరులు ఒక వంక అస్త్ర శస్త్రాలతో అద్భుతంగా కొంతసేపు యుద్ధం చేశారు. దుర్యోధన కర్ణ దుశ్శాసనులు విరథులై నేలపై మూర్ఛపోయారు. వాళ్లను బంధించి చిత్ర సేనుడు గంధర్వలోకానికి బందీలుగా తీసుకు పోతున్నాడు. ఈ వార్త దుర్యోధనుని భార్య భానుమతికి తెలిసింది. ఆమె దిక్కుతోచక భటుల ద్వారా ఆ సంగతి బావగారైన ధర్మరాజుకి అందించి అతని సహాయం అర్థించింది. ధర్మరాజు తమ్ములపై కర్ణునిపై జాలి తలిచి భీమాదులను గంధర్వులతో పోరాడడానికి పంపించాడు. భీమాదులు వెంటనే పోయి గంధర్వులను ఓడించి బంధింపబడిన కౌరవముఖ్యులను కర్ణుని ఎలా ఉన్నవారిని అలా ధర్మరాజు సన్నిధికి తీసికొని వచ్చారు. దేవనాథుడైన ఇంద్రుడుకూడా దుర్యోధనునికి బుద్ధి నేర్పడానికి చిత్రసేనుణ్ణి నియోగించాడు. దుర్యోధనునికి తగినశాస్త్రి జరిగింది. అందుకనే కాగల కార్యం గంధర్వులే తీర్చారు అన్న నానుడి ప్రచారంలోకి వచ్చింది.

సిగ్గుతో తలలు వంచుకొని నిలబడిన దుర్యోధన దుశ్శాసన కర్ణులను ధర్మరాజు జాలిదలచి బంధవిముక్తులను చేయించాడు. ఇంక ఎన్నడూ అలాంటి అనుచితకార్యం

చేయవద్దని వారికి హితవు చెప్పి పంపించివేశాడు. భీముడు మాత్రం లోలోపల బాగా సంతోషించాడు.

వాళ్లను హోమంచేయడానికి వస్తాం!

ఒకసారి హస్తినాపురం నుండి ద్వైతవనంలో ఉన్న ధర్మరాజుకి ఒక ఆహ్వానం వచ్చింది. దుర్యోధనుడు వైష్ణవ యాగం ఒకటి తలపెట్టాడట. ఆ యాగవైభవం చూడడానికి ధర్మరాజుని అతని బంధుమిత్రులతో సమస్త మునిపుంగవులతో రావలసిందని పిలుపు. ధర్మరాజు తనకు పంపిన ఆహ్వానానికి సమాధానం ఏమీ చెప్పలేదు. ప్రక్కనే ఉన్న భీముడు మండిపడి కబురు తెచ్చిన పెద్దమనిషితో కఠినంగా ఇలా సమాధానమిచ్చాడు. మా అరణ్యవాసదీక్షను దుర్యోధనుడు కపట బుద్ధితో భంగపుచ్చ యత్నిస్తే దాన్ని గ్రహించలేనంత పిచ్చి వాళ్లం కాదు. పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం నిర్విఘ్నంగా కొనసాగించుకొని, పద్నాల్గవ సంవత్సరం దుర్యోధనుణ్ణి అతని దుష్టబృందాన్ని యజ్ఞకుండంలో యజ్ఞపశువులుగా హోమం చేయడానికి సంతోషంగా వస్తామని చెప్పు". ఈ కటువైన సమాధానాన్ని విన్న ధర్మరాజు ఏమీ అనలేదు. ఒక వేళ భీముని సమాధానం సమయానికి సరిపడిందనీ, సమంజసంగా ఉన్నదనీ లోపల సంతోషించాడేమో!

సైంధవుడికి చక్కనిపాఠం

కామ్యవనంలో పాండవులు తృణబిందు మహర్షి ఆతిథ్యం పొందుతున్నారు. అక్కడివారి క్షేమ సమాచారాలు తెలుసుకోవడానికి వేదవ్యాసుడు వచ్చాడు. అప్పుడు మునులంతా ఆయనకు గౌరవ సత్కారాలందించారు. వ్యాసుడు ఆ మునులను తన మనుమళ్ల నూ ఆశీర్వదించి వెళ్లిపోయాడు.

క్షమాభిక్ష వేడుకో!

ఒకరోజున పాండవులు వేటకు వెళ్లారు. తృణబిందు మహర్షి అతనిశిష్యులు ఎక్కడో యజ్ఞం జరిపించడానికి వెళ్లారు. పర్ణశాలలో ద్రౌపది ఒక్కతే ఉంది. ఆ మార్గాన రథంమీద వెళుతూ దుర్యోధనుని చెల్లెలు దుస్సల భర్త సైంధవుడు పర్ణశాలలో ఏకాంతంగా ఉన్న ద్రౌపదిని చూశాడు. ఆమె సౌందర్యం అతణ్ణి వివశుణ్ణి చేసింది. కన్నుగానని అతడు ఆమె దగ్గరకు వచ్చి, మారుపేరు చెప్పి సరసాలు ప్రారంభించాడు. చప్పున ద్రౌపది "అన్నా! మీ బావలు వేటకు వెళ్లారు. ఇప్పుడే వస్తారు. నువ్వు అలిసినట్లున్నావు. మాట తబ్బిబ్బు పడుతున్నావు" అన్నది. అప్పుడతడు తెలివి దెచ్చుకొని

"నువ్వు ద్రౌపదివా? అయినా పరవాలేదు. ఎందుకు ఐదుగురు భర్తలకు ఊడిగంచేస్తూ అడవిలో కాపురముంటావు. చక్కగా నాతో రా! నా అంతఃపురంలో అన్ని సౌఖ్యాలూ అనుభవించవచ్చు" అని ద్రౌపదిని బలాత్కరించి తన రథంమీద తీసుకుబోతున్న సమయాన మెరుపుల్లా పాండవులు వేట నుండి తిరిగివచ్చారు. ఈ ఘోరాన్ని చూశారు. ద్రౌపది వారిని చూడగానే సైంధవుని బంధంనుండి విడిపించుకొని రథం నుండి ఒక్కదుముకు నేలకు దుమికింది. సైంధవుడు, పాండవులు బ్రతకనీయరని రథాన్ని తోలుకొని పారిపోతున్నాడు. భీముడు ఆ రథాన్ని అడ్డుకొని, అందులో నుండి సైంధవుణ్ణి జుట్టు పట్టి క్రిందికి లాగి ఈడ్చుకుంటూ వచ్చి ధర్మరాజు పాదాలమీద పడవేశాడు. గట్టిగా రెండు తన్నులు కూడా తన్ని "పాపీ! కామం కళ్లుగప్పి వావివరుసలు మర్చి పోయావా? మాకు చెల్లెలి భర్తవైపోయావు. లేకపోతే నీ ప్రాణాలు నిలువునా తీసి ఉండేవాణ్ణి. ధర్మరాజు క్షమాభిక్ష వేడుకో! ఎప్పుడూ ఇలాంటి ఘోరం చేయనని చెప్పుకో" అన్నాడు. విధిలేక సైంధవుడు సిగ్గుతో కుమిలిపోతూ మెల్లగా "బావా! క్షమించు" అన్నాడు. ధర్మరాజు క్షమించాడు. అతడు తిరిగిచూడకుండా రథాన్ని తోలుకొని అదే దారిని ఉడాయించాడు. భీముడు తలుచుకుంటే అతని నిండు ప్రాణాలు తీసి ఉండేవాడు.

అజ్ఞాతంలో వంటలవాడు : పాండవులు ఎన్నో కష్టాలకోర్చి, ఎన్నో విజయాలు సాధించి పన్నెండేళ్ల వనవాసం పూర్తి చేశారు. ఇంక ఒక్క సంవత్సరం అజ్ఞాతవాసం పూర్తి చేయదలచి, అందరూ మారు వేషాలు ధరించి విరటుని కొల్వులో కుదిరారు.

ధర్మరాజు కంకుభట్టు పేరుతో విరటునికి ఆంతరంగిక సలహా దారుడైనాడు.

భీముడు వలలుడు అనే పేరుతో వంటలవాడుగా సిద్ధమైనాడు. భీముని దర్పం ఠీవి చూసి విరాటరాజు అతనికి అంతకంటే గౌరవమైన ఉద్యోగమిస్తానన్నాడు. కాని తాను వంటలవాడుగా ఉండడానికే ఇష్టమని కుదిరాడు. అర్జునుడు బృహన్నల అనే పేరుతో విరటుని కుమార్తె ఉత్తరకు నాట్యాచార్యుడుగా, నకులుడు దామగ్రంధి అనే పేరుతో అశ్వశిక్షకుడుగా, సహదేవుడు తంత్రీపాలుడు అనే పేరుతో గోసంరక్షకుడుగా కుదిరారు.

ఇంక ద్రౌపది 'మాలిని' అనేపేరుతో విరాటరాజు భార్యయైన సుధేష్ణను సేవించడానికి సైరంధ్రిగా కుదిరింది.

అందరు అన్ని వృత్తులలో అతికినట్లుగా విరటుని కొల్వులో చేరారు.

మహామల్లుడు దాసోహమన్నాడు : విరటుని కొల్వులో పాండవులుంటున్నప్పుడు ఒక విశేషం జరిగింది. పేరుమోసిన మల్లవీరుడొకడు దేశ దేశాలలో తనకు తిరుగు లేదనిపించుకొని చివరకు విరటుని సభకు వచ్చాడు. తనతో మల్లయుద్ధం చేసి ఎవరైనా తనను జయిస్తే తానింతవరకు గడించుకొన్న కీర్తి బహుమానాలూ ధారపోస్తానంటూ బీరాలు పలికాడు. ఆ మహామల్లుని మాటలువిని, ఆకారంచూసి, ఎవరూ ఏమీ జవాబు చెప్పలేకపోయారు. విరాటరాజుకి ఏమీ తోచలేదు. అటూ ఇటూ ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఇదంతా గమనిస్తున్న కంకుభట్టు రాజుగారితో వలలుడు ఈ వచ్చిన మల్లునికి తగిన ఉజ్జీయని నమ్మకంగా చెప్పాడు. రాజు వెంటనే వలలునికోసం కబురు పెట్టాడు. వలలుడు వచ్చాడు. అతనితో విరాటరాజు ఏమయ్యా! ఈ మహామల్లుడు తనను ఓడించే వాడున్నాడా అంటున్నాడు. ఏమంటావు?" అన్నాడు. వలలుడు కంకుభట్టు వంక జూచి అతనికి నమస్కరించి రాజుగారితో "సిద్ధమే; మీ గౌరవం నిలబెడతాను" అని ధీమాగా చెప్పాడు.

భీముడు ఆ జగదేకమల్లుడు గోదాంలో కలియబడ్డారు. సభాసదులందరూ ఆసక్తితో తిలకిస్తున్నారు. భీముడు తన మల్లయుద్ధనైపుణ్యం ప్రదర్శించి ఆ మహామల్లుని చిత్తుచేశాడు. ప్రేక్షకుల కరతాళధ్వనులు మిన్ను ముట్టాయి. జగదేక మల్లుడు దాసోహమన్నాడు. తన ఆస్థానగౌరవాన్ని నిలబెట్టి నందుకు విరటుడు కంకుభట్టును వలలుణ్ణీ ఎంతగానో ప్రశంసించాడు.

నా భర్త జూదగాడు : నాకు మర్యాదలెలా తెలుస్తాయి : సుధేష్ణ తమ్ముడు కీచకుడు. అతని తమ్ములు ఉప కీచకులు. వారందరూ అక్కగారింటనే శాశ్వత బంధువులు. వారికి అడ్డూ ఆపూలేదు. మంచీ చెడూ తెలియదు.

కీచకుడు అతిక్రూరుడు, సింహబలుడు. స్త్రీలను బలాత్కరించడంలో సిగ్గూ ఎగ్గూ లేనివాడు. మాలినిని చూసిన క్షణంనుంచి అతనికి మతిపోయింది. ఆమెను ఎలాగైనా తనవశం చేసుకోవాలని ఆలోచన చేస్తున్నాడు. అక్కగారిని ఆమె వైనాలు గ్రుచ్చి గుచ్చి అడుగుతున్నాడు. తమ్ముని మనస్సు తెలిసిన సుధేష్ణ అతనితో అది కూడనిపని అని, ప్రమాదకరమని హెచ్చరిస్తూ వస్తున్నది. ఎందుకంటే, మాలిని తనకు ఐదుగురు గంధర్వులు అతిబలాఢ్యులు భర్తలున్నారని చెప్పింది.

కీచకుడు తన పట్టువిడవలేదు. కోర్కెను మార్చుకోలేదు. బావకు తెలియకుండా, అక్కను బతిమలాడి ఆమెను ఒప్పించి మాలినిని ఒకసారి మధుపాత్రతో తన మందిరానికి పంపించే ఏర్పాటు చేయించుకున్నాడు.

ఈ మోసం తెలియని మాలిని మధుపాత్రతో కీచకుని మందిరానికి వెళ్ళింది. కీచకుడు మదనావేశంతో ఆమెను బలాత్కరించబోగా, ఆమె తప్పించుకొని విరటుని సభకు పరుగెత్తింది. జరిగిన అన్యాయం రాజుకి వివరించింది. సిగ్గుమాలిన కీచకుడు ఆమె వెంటబడ్డాడు. విరటుడు అతని చేతులుపట్టుకొని బతిమాలి తిరిగి పంపించివేశాడు. సభలో ఉన్న కంకుభట్టు ఇదంతా చూస్తూనే ఉన్నాడు. పెదవి కదపలేదు.

మాలిని విరటుని సభలో కదలకుండా నిలబడే ఉంది. కంకుభట్టు "కులస్త్రీకి అలా సభలో నిలబడియుండడం మర్యాదకాదు" అన్నాడు. అప్పుడామెకు ఎక్కడలేని పౌరుషం వచ్చి" కంకుభట్టారకా! నా భర్త జూదగాడు. నాకు మర్యాద ఎలా తెలుస్తుంది?" అని దూసిన బాణంలాగా వెళ్లి పోయింది.

మాలిని కోసం...

ఆ రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత సైరంధ్రి చీకటిలో నల్లనిముసుగు దాల్చి, వలలుడు నిద్రపోతున్న స్థలానికి వెళ్లి మెల్లగా అతణ్ణి లేపింది. అతడు ఉలిక్కిపడిలేచి ఆమెను గుర్తించి కారణమడిగాడు. ఆమె జరిగింది చెప్పింది. కీచకుని బారినుంచి తనను రక్షించవలసిందని వేడుకొంది. వలలుడు బాగా ఆలోచించాడు. చక్కని ఉపాయం అతనికి తట్టింది. ఆమెకు చెప్పాడు. అది ఆమెకు నచ్చింది.

మరునాటి ఉదయం సైరంధ్రి మామూలుగానే ఉంది. తన విధులు తాను చేసుకుంటూంది. కీచకునికి మదన జ్వరం మామూలుగానే ఉంది. సైరంధ్రితో సరసాలాడడం సాగిస్తూనే ఉన్నాడు. సైరంధ్రి ఎవరూలేకుండా చూసి కీచకునితో "ఇతరులు చూసేలా నీవు ఇలా ప్రవర్తించకు. రాత్రి ప్రొద్దు పోయిన తర్వాత నేను నర్తనశాలకు వస్తాను. నన్ను అక్కడ కలుసుకో" అంది. ఆ మాటలు విన్న కీచకుడు ఆనందంపట్టలేక పోయాడు. తన రొట్టె విరిగి నేతిలో పడిందనుకున్నాడు. ఎప్పుడు చీకటిపడుతుందా, ఎప్పుడు మాలినిని తాను ఆలింగనం చేసుకొందునా అని కలలుగంటున్నాడు. కళ్లు మూసినా తెరిచినా అతడికి మాలినిరూపమే కనబడుతోంది.

కీచకుడిపీడ విరగడైంది : వలలుడు ఆడవేషం వేసుకొని, అర్ధరాత్రి చీకటిలో, నర్తనశాలలో, ఒకమూలకు ఒదిగి, కీచకునికోసం వేచివున్నాడు. సైరంధ్రికూడా ఆ వేళకు అక్కడికి వచ్చి నర్తనశాల వెనకదాగి, చూస్తున్నది. కీచకుడు అలంకరించుకొని, అత్తరూ గంధం అద్దుకొని ఆత్రంగా వచ్చాడు. అతడు నర్తనశాలలో అడుగుపెట్టగానే ఆడవేషంలో

ఉన్న వలలుడు హా! ప్రియా!! అంటూ మారుగొంతుతో, గబగబావచ్చి కీచకుని గట్టిగా కౌగిలించుకున్నాడు. కీచకునికి ఆ శరీరం గట్టిగా తగిలింది.

చేతికి గడ్డం గరుకుగా తగిలింది. అయినా ఇంకా అతడు భ్రమలోనే ఉన్నాడు. ఆ వ్యక్తి మాలినే అనుకుంటున్నాడు.

ఒక్కసారిగా గంభీరకంఠంతో వలలుడు "పందా! నీకు పరస్త్రీ తేరకు కావాలా! పరలోకానికి ప్రయాణం కట్టిస్తా నిన్ను కాచుకో. నేను మాలిని రెండవభర్తయిన గంధర్వుణ్ణి, నీ ప్రాణం తీయడానికి కాచుకొని ఉన్నాను" అని అతని గుండెపై ఒక్కగుద్దు గుద్దాడు. కీచకుడు ఇంక గతిలేక బాహాబాహి కచాకచి యుద్ధానికి సిద్ధపడ్డాడు.

ఇద్దరూ ఎంతోసేపు పెనుగులాడారు. క్రిందా మీదా పడ్డారు. భీముడు కీచకుని ఒక్కొక్కకీలు విరిచి అతని శరీరాన్ని మర్దించి మర్దించి మాంసం ముద్దగా చేశాడు. చివరికి అతని ప్రాణంతీశాడు. ఇదంతా చూస్తున్న ద్రౌపది భీమసేనుణ్ణి ఆనందంతో కౌగిలించుకొంది. కీచకుని కీడు తప్పినందుకు వేయిదేవుళ్లకు మ్రొక్కుకుంది.

మరునాడు ఉదయం కీచకుని మరణవార్త పురమంతా అగ్నిలా అంటుకు పోయింది. అందరినోటా అదేమాట "సాధ్విని చెరబట్టబోతే ఏంజరుగుతుంది? రాత్రి మాలిని భర్తలు గంధర్వులు వచ్చి కీచుకుని చంపారట. చంపరా మరి! తమ భార్యను అవమానిస్తే?"

ఉపకీచకులు ఒకళ్లు మిగల్లేదు : కీచకుని తమ్ములు ఉపకీచకులు తమ అన్నగారి మృతికి మాలినే కారణమని, ఆమెను బలవంతాన కీచకుని శవానికేసి కట్టి దహనం చేయడానికి శ్మశానానికి తీసుకుపోబోతుంటే, ఆ వార్త వలలుడు ఎవరివల్లో విన్నాడు. ఉన్న వాడు ఉన్నట్టుగా చేతికి దొరికిన గరిటో, కత్తిపీటో గండ్ర గొడ్డలో తీసుకొని ఉగ్రరూపంతో వచ్చి ఉపకీచకుల మీది కురికాడు. వాళ్లలో ఒక్కణ్ణి మిగల్చకుండా హతమార్చాడు. మాలినిని రక్షించాడు.

పదమూడురోజుల్లో : తమ్ముల మరణానికి సుధేష్ణ చాలా దుఃఖించింది. వారి మరణానికి సైరంధే కారణమని, ఆమెను కొలువునుండి విరమించుకొమ్మంది. దానికి సైరంధ్రి దీనంగా "అమ్మా! నాదోషమేమిటి? మీ సోదరుల ప్రవర్తన మీకు తెలియనిదా, నాకు అతిబలశాలులైన భర్తలైదుగురున్నారని ముందుగానే చెప్పాను కదా? ఇంక పదమూడు దినాల్లో మా వ్రతం ముగుస్తుంది.

అంతవరకు నన్ను మీ సేవలో ఉండనీయండి. ఆ పిమ్మట మీ రడగకుండానే మీ కొలువునుండి వెళ్లిపోతాను అంది. సుధేష్ణ చాల జాలిగుండె కలది. మాలిని ప్రార్థనకు మనసుకరిగి 'సరే'నన్నది.

పాడు పథకం : ఇంక ఒక్కరోజులో పాండవుల అజ్ఞాతవాస దీక్ష ముగుస్తుంది. దానిని భంగపరచడానికి దుర్యోధనుడు ఆలోచించాడు. పాండవులు మారువేషాలతో విరటుని కొలువులో ఉన్నట్లు కర్ణాకర్ణికగా విన్నాడు. తన సైన్యాన్ని మత్స్యపురానికి పంపించి, విరాటుని గోవులను ఉత్తర దక్షిణ దిశలుగా ముట్టడించడానికి పంపించాడు. గోవుల రక్షించడానికి పాండవులు ఎలాగూ వస్తారు, అప్పుడు వారిని గుర్తుపట్టి వారి అజ్ఞాతవాసదీక్ష పాడుచేయవచ్చునని పథకంవేశాడు.

చెరపకురా చెడేవు : దుర్యోధనుడు తన యావత్తు సైన్యాన్ని, సైన్యాధ్యక్షుల్ని గోగ్రహణార్థం పంపించాడు. వారు విరటుని బందీగాచేసి, గోవులన్నిటినీ తోలుకు వస్తున్నారు. ఇది గ్రహించిన కంకుభట్టు అజ్ఞాత వాసం పూర్తయిందని తెలిసి బృహన్నలను కౌరవులను ఓడించడానికి ఆజ్ఞాపించాడు. బృహన్నల అభమూ శుభమూ తెలియని ఉత్తరకుమారుని తనకు నామమాత్రపు సారథిగా చేసుకొని రథంమీద వెళ్లాడు. కురుయోధులను సైన్యాన్ని చిత్తుచిత్తుగా ఓడించి, విరటుని గోవులను విడిపించి విజయలక్ష్మితో తిరిగివచ్చాడు. అప్పటికి ముందు గానే లెక్కప్రకారం అజ్ఞాతవాసం ముగియడంచేత, తమను ఓడించినవాడు అర్జునుడని గుర్తించినా కౌరవులు ఏమీ చేయలేకపోయారు. వారికి శృంగభంగమే అయింది. చెరపకురా చెడేవు అన్నసామెత వారిపట్ల యథార్థమైంది.

కురుపాండవ యుద్ధం : పాండవులకు కౌరవులకుమధ్య రాయబారాలు సాగాయి. సంజయుడు, శ్రీకృష్ణుడు రాయబారం నడిపారు. ఫలితం లేకపోయింది. పాండవులకు అర్ధరాజ్యం కాకపోయినా, ఐదుగురికి ఐదూళ్లైనా ఈయడానికి, కౌరవులు ఒప్పుకోలేదు. దుర్యోధనుడు సూదిమొన మోపేస్థలాన్ని కూడా పాండవులకు ఈయడానికి ఒప్పుకోలేదు. ఇంక యుద్ధమే తప్పనిసరైంది.

కౌరవపక్షంలో యోధానుయోధులు సేనాధిపతులుగా ఉన్నారు. అనేక అక్షౌహిణీల సైన్యం వారికి ఉంది. పాండవ పక్షంలో వారైదుగురు, వారిపై అభిమానం గల బంధు సామంతులున్నారు. కొలదిపాటిసైన్యం ఉంది.

శ్రీకృష్ణుడు వారికి సారథిగా, సలహాదారుడుగా ఉన్నాడు. ధర్మం పాండవుల పక్షానుంది. యుద్ధం ప్రారంభమైంది. అది కొన్ని దినాలు సాగింది.

అటు ప్రక్కాఇటు ప్రక్కా దినానికొక్క సేనాధిపతి మారుతూ, సర్వసైన్యాలు పాల్గొంటూ సంకుల సమరం సాగింది. లక్షలాది మనుషులు చనిపోయారు. ఏనుగులు అశ్వాలు వేనవేలు నశించాయి. యుద్ధభూమి అంతా పీనుగుల కుప్పలతో నిండి వల్లకాడులా ఉంది.

భీముడు ఆకలిగొన్న సింహంలాగా భీకర గర్జనతో, అనేక ఆయుధాలతో కౌరవుల పాలిటి కాలయముడై ముందుకురికాడు. దుర్యోధనుని ప్రేరణతో దుశ్శాసనుడు అతని నెదుర్కొన్నాడు. ఎనిమిదిమంది తమ్ముళ్లు అతనికి తోడున్నారు. భీముడు ప్రయోగించిన బాణాలు, వారి రథాలను విరగగొట్టాయి. వారి కవచాలను చిల్లులు గొట్టాయి. వారి ఆయుధాలను ముక్కలు ముక్కలు చేశాయి. రక్తం ఓడుతున్న శరీరాలతో వారప్పుడు కాలికి బుద్ధిచెప్పి పారిపోయారు.

ఆ విధంగా తొలివిజయం సాధించిన భీమసేనుడు రెట్టించిన బలపరాక్రమంతో విజృంభించాడు. కురుసేనా వాహినులను సముద్రతరంగాలలాగా అల్లకల్లోలం చేశాడు.

ఒక ప్రతిజ్ఞ నెరవేరింది : భీమసేనుడు శల్యుని తనగదా దండానికి గురిచేశాడు. తట్టుకోలేక అతడు పారిపోయాడు. వెంటనే దుర్యోధనుడు వచ్చి భీమసేనుని ఎదుర్కొన్నాడు. భీమసేనుని ధాటికాగలేక అతడు భీష్ముని రథంచాటున దాక్కున్నాడు.

దుశ్శాసనుడు రథారూఢుడై వచ్చి భీముడితో తలపడ్డాడు. పన్నెండు బాణాలతో భీముని నొప్పించాడు. భీముడింక ప్రళయకాల ప్రభంజనుడై, రుద్రుడై అతనిగుర్రాలను సారథిని తన గదతో మోది చంపాడు. రథాన్ని తునా తునియలు చేశాడు. ఇరువురూ కలబడ్డారు. త్రోసుకున్నారు. తన్నుకున్నారు. కొట్టుకున్నారు. భీముని బలం పెరిగింది. బీముని ఆవేశం ఆగ్రహం పెరిగాయి. దుశ్శాసనుని గుండె చీల్చి రక్తం పుడిసెళ్లబట్టి అందరూ చూస్తుండగా భీమసేనుడు త్రాగాడు. అందరూ వింటూండగా - ఒక ప్రతిజ్ఞ నెరవేరింది. 'ఈ రక్తం తడిసిన చేతులతో విడివడియున్న మాద్రౌపది కొప్పు ముడివేస్తాను' అంటూ అక్కడ నుండి సరాసరి వెళ్లి ద్రౌపది కొప్పు ముడివేశాడు. ఆమెకు ఆనందం తృతృప్తి కలిగించాడు.

భీముడే తగిన ఉజ్జీ : తనవారందరూ యుద్ధంలో హతులై తన్నువిడిచిపోగా దుర్యోధనుడు దిక్కులేని ఏకాకి అయినాడు. గురు బంధు, మిత్రులను పోగొట్టుకున్న అతనికి యుద్ధమంటే భయంపట్టుకుంది. అందుచేత ద్వైపాయన సరస్సులో దాక్కున్నాడు. ఈ రహస్యం ఎవరో పాండవులకు తెలియజేశారు. శత్రుశేషం ఋణశేషం ఉంచగూడదన్న న్యాయం తెలిసిన పాండవులు దుర్యోధనుని కడముట్టించ దలచి, ఆ ద్వైపాయన సరస్సుదగ్గరకు వెళ్లారు. దుర్యోధనుని పిలిచారు. అతడు పలకలేదు. అప్పుడు ములకుల్లాంటి మాటలు ఉయోగించి ఆయభిమానధనుడు పలికేట్టు బైటకువచ్చేట్టు చేశారు. యుద్ధానికి అతణ్ణి ఆహ్వానించారు. పాండవులు ఐదుగురూ ఏకమై, తన్నొక్కణ్ణి చేసి యుద్ధానికి రమ్మంటున్నారేమోనని దుర్యోధనుడు అభిప్రాయపడ్డాడు. అలాంటి అధర్మానికి ఒడిగట్టే వారుకారు పాండవులు. తమలో ఏ ఒక్కడి నైనా తనతో యుద్ధానికి ఎంచుకోమన్నారు. భీమసేనుడు తనకు అన్నిటా తగిన ఉజ్జీయని ఎంచుకున్నాడు.

రెండవ ప్రతిజ్ఞ పూర్తయింది : ఇంక, దుర్యోధనునికి భీమసేనునికి కడపటి యుద్ధం జరిగింది. కన్నుల ముచ్చటగా ఉంది ఆ యుద్ధం చూడడానికి, ఇరువురూ గదాధరులై పోరాడుతున్నారు. ఒకరికొకరు తీసిపోకుండా ఉన్నారు. గంటలూ రోజులూ గడిచినా ఆ యుద్ధం ముగిసేలా కనబడలేదు. చివరకు శ్రీకృష్ణుడు తన చివరి సలహా అందించాలనుకొని భీమునికి తన తొడలు చూపిస్తూ సైగచేశాడు. దుర్యోధనునికి గొప్ప లోపమున్నది; శాపం లాంటిది. అతని శరీరంలో అతిదుర్బలం అతని తొడలు. వాటిని కొడితే అతడు కుప్పకూలి ఎందుకూ పనికిరాడు. భీమసేనుడు సరిగా ఆపనేచేశాడు. గురిచూసి అతడి రెండుతొడలూ తన గదాఘాతంతో విరుగగొట్టాడు. దుర్యోధనుడు నేలగూలాడు. అలా పడియున్న వానిని భీమసేనుడుతన ఎడమకాలితో ఏ సంకోచం లేకుండా గట్టిగా తన్నాడు. రత్నాలతో మణులతో పొదగబడ్డ రారాజు కిరీటం అల్లంత దూరంలో త్రుళ్లి పడింది. దుర్యోధనుని అంత్యదశ అతి దయనీయంగా ఉంది. ఆ దృశ్యం చూసి ధర్మరాజు కన్నీరు కార్చాడు. భీమసేనుడు మాత్రం తన ప్రతిజ్ఞ నెరవేరినందుకు, తన ప్రతీకారం తీరినందుకు సంతోష సాగరంలో మునిగిపోయాడు.

ధర్మపట్టాభిషేకం : ఇంతకు పూర్వమే ధర్మరాజు తమ తాతగారైన భీష్ముని దగ్గర సర్వధర్మ రహస్యాలు తెలుసుకున్నాడు.

ధర్మబద్ధంగా రాజ్యపాలన చేయడానికి శక్తిసంపన్నుడైనాడు.

మహాప్రస్థానం : ఒక శుభముహూర్తంలో మంగళతూర్యాలు మారు మ్రోగుతూంటే, వేదవిదులు ఋక్కులు గానంచేస్తుంటే పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రజలు పరవశులై నృత్యం చేస్తుంటే శ్రీకృష్ణభగవానుని ఆశీస్సుమాలవర్షంతో ధర్మరాజు ద్రౌపదీ సమేతంగా సింహాసనంపై ఆసీనుడై పట్టాభిషిక్తుడయ్యాడు. భీముడు యువ రాజుగా, విదురుడుమంత్రిగా సంజయుడు ఆర్థిక విషయ పరీక్షకుడుగా, అర్జునుడు శత్రుశాసకుడుగా, నకులుడు సేనాధిపతిగా, సహదేవుడు సర్వరక్షకుడుగా ధౌమ్యుడు పురోహిత దేవకార్య నిర్వాహకుడుగా నియమింపబడ్డారు. ధర్మరాజు కొంతకాలం రాజ్యాన్ని ప్రజామోదంగా పరిపాలించాడు. అతనికాలంలో ధర్మం కృతయుగంలో లాగా నాల్గుపాదాలతో నడిచింది.

పిమ్మట అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్తుని సింహాసన మెక్కించి పాండవులు ప్రజల అనుజ్ఞపొంది ద్రౌపదితో కూడి మహా ప్రస్థానం చేశారు.

భారత కథ జరిగి ఎన్ని వేల సంవత్సరాలు అయిందో! ఇప్పటికీ అందులోని విశేషాలు భారతీయుల హృదయ ఫలకాలమీద చెరగని ముద్రవేస్తున్నాయి. భారత వీరులందరిలో భీమసేనుడు అసమానుడు. అద్వితీయుడు. భీమసేనుడు లేని భారతాన్ని ఎవరు ఊహించగలరు?

గేయాలు



దిరిసిన పూలు

అన్నుల మిన్నలు శీర్షిక
చిన్నవి కన్నులు ఉన్నవి ఎన్నో
నిన్నే కనుచు నిన్నే కనుచు.

చిన్నవి చెవులూ ఉన్నవి ఎన్నో
నిన్నే వినుచు నిన్నే వినుచు

చిన్నవి కరములు ఉన్నవి ఎన్నో
నీవలె చేయుచు నీవలె చేయుచు

కన్నులు చెవులూ కరములు కలిగిన
అన్నుల మిన్నలు చిన్న బాలలు
నిన్నే తలచుచు నిన్నే కొలుచుచు
నీవలె తామూ కావలెననుకొను||

కన్నులలో కారుణ్యము నించు
మాటలలో మాధుర్యము పెంచు
చేతలు నీవి ప్రపూత మొనర్చు
ప్రీతి పాత్రమై భువిని రహించు.

జేజేలు

అమ్మకు జేజే నాన్నకు జేజే
కమ్మని భారత భూమికి జేజే
బుధులకు జేజే విధులకు జేజే
చదువులు నేర్పే గురువుకు జేజే.

మా బడి

మాబడి మాబడి మంచిది మా బడి

మమతా సమతా మానవతా మది

నెమ్మది నేర్పే అమ్మలాంటి బడి

మాబడి మాబడి మంచిది మాబడి

తెలుగు పిల్లలం

తెలుగు పిల్లలం వెలుగు పిల్లలం

తెలివితేటలెన్నో కలిగి మెలగు పిల్లలం.

ఇష్టం

ఆటలంటె మాకిష్టం

పాటలంటె మాకిష్టం

ఆడుకుంటు పాడుకుంటు

అలా వుండటం ఇష్టం

పాపా !

పాపా ! పాపా ! నాన్నొస్తారు
పళ్లూ బిళ్లలు కొనితెస్తారు
అల్లరి మానితె అన్నీ నీకే
అల్లరి చేస్తే అన్నీ నాకే.

పిట్టలు

చెట్టుపై చిన చిన్న
పిట్టలున్నాయి
పిట్టలన్నీ గోల
పెట్టుతున్నాయి.

తువ్వాయి

తువ్వాయి మెళ్లోన
మువ్వాయి ఉంది
మువ్వాయి ఎంతెంతొ
ముద్దవ్వుతోంది.

మామిడి చెట్టు

చిన్న కాలువ గట్టు
నున్న మామిడి చెట్టు
కాసింది కాయలను
కావిళ్ల మోయగను.

'వ్వ'లు

అవ్వ చేతిలో గువ్వ
గువ్వ కాలినొక మువ్వ
మువ్వ ఖరీదొక రువ్వ
రువ్వకు బియ్యము తవ్వ
తవ్వ బియ్యముతో బువ్వ

ముద్దు

అమ్మంటే ముద్దు
బొమ్మంటే ముద్దు
అమ్మా బొమ్మా అంటే
అందరికీ ముద్దు.

అందం

ఇన్ని పూలు ఈ మంటికి
అందం అందం
అన్ని చుక్కలా మింటికి
అందం అందం

గాలి పిల్ల

గాలిపిల్ల ఎచటికి?
పూలవాస నొద్దకు
పూలవాస నెందుకు?
బాలల కీడునందుకు

పిచుకలు

కిచకిచమన్నవి

పిచుకలు పిచుకలు
వందలు వందలు
పిచుకలు పిచుకలు
సందడి సందడి
పిచుకలు పిచుకలు
వందలు సందడి
పిచుకలు పిచుకలు

బొమ్మలు

అందము చెడి నేలమీద
చిందర వందర ఐనా
బొమ్మలంటె నాకదేమొ
బోలెడంత ఇష్టమమ్మ

పాపలం

చిన్న చిన్న పాపలం
నిన్న మొన్న పాపలం
కల్లబొల్లి మాటలు
అల్లిబిల్లి యాటలు
లేత లేత చూపులు
పూత మెరుగు రూపులు

వరద

వాన వచ్చి వరద హెచ్చి
పిల్లకాల్వ పారజొచ్చె
పడవగట్టి నేను నడప
పాట పాడె కప్పలన్ని

హస్తాలు

నీకు రెండు హస్తాలు
నాకు రెండు హస్తాలు
అరటి గెలకు చూస్తేను
అన్నీ హస్తాలే !

మంచి మేష్టారు

మంచి మేష్టారు మాకు వచ్చారు
కొత్త మేష్టారు కొట్టరు కోప్పడరు
పాటలూ కతలెన్నొ బాగ చెపుతారు
ఆటలూ నాటికలు ఆడించుతారు.

పగటి నేత్రం

రాత్రికి ఉన్నవి నేత్రాలెన్నో
పగటికి ఒకటే పసందు నేత్రం
చుక్కలకంటే సూర్యుడె ఎక్కువ
కాంతిని జగతికి కలిగించునుగా!

కుక్క గొడుగు

నీకున్నది నాకున్నది
నిక్కముగా గొడుగన్నది
కుక్కకుంది ఒక్క గొడుగు
చక్కనైన కుక్క గొడుగు

ఉన్నది - ఉన్నవి

అన్నకు పలక చిన్నకు గిలక

ఉన్నది ఉన్నది
పాపకు నవ్వులు వేపకు పువ్వులు
ఉన్నవి ఉన్నవి
ఆటకు పాట పాటకు ఆట
ఉన్నది ఉన్నది
జనులకు ఊళ్లు ఘనులకు నోళ్లు
ఉన్నవి ఉన్నవి

అంకెలు

ఒకటి ఒకటి - రెండు

రెండు రెండు - నాలుగు

మూడు మూడు - ఆరు

నాలుగు నాలుగు - ఎనిమిది

ఐదు ఐదు - పది

అన్ని కలిసి పది

పాల పండ్లు

పాల పండ్లు కొన్నావ

అంతాచూస్తే ఆలోచిస్తే
నాలుగుబారల నాలుగుమూరల
నాలుగు జేనల నాలుగు బెత్తల
కంటే దూరం కాదులె మాబడి

రంగయ మామయ రంగుల మేడకు
పక్కసందునే పైకటుపోతే

బడి గంట

చాల తీపి అన్నావ
ఒక్కసారి తింటే నే
వూరుకోవు కోరుతావు
చెట్టు కొంచె మెత్తు ఉండు
చుట్టు చాల చీమలుండు
పాల పండ్లు గొప్ప విందు
పాప ఏడ్పు మాన్పు మందు.

పిల్లీ !

పిల్లీ పిల్లీ పిల్లల తల్లీ

మెల్లగ రావే చల్లగ రావే

ఉట్టి మీద ఆచట్టిని దింపీ

చట్టిలోని ఆ పాలను ఒంపీ

చిట్టిబాబు చిరుపొట్టను నింపీ

నిద్రపుచ్చి బంగారుతండ్రి కతి

భద్రమిచ్చి మీ ఇంటికి పోవే

తల్లిలాంటి బడి

గ్రామకచేరీ కవతల చెరువూ
చెరువుగట్టునే చేరి ఉంది బడి

పిల్లలందరిని ప్రేమగ పిలిచీ
ఆదరమున తన అక్కున చేర్చి
ఆటా పాటా మాటా అన్నీ
చల్లగ నేర్పే తల్లిలాంటి బడి.

బడి గంట మ్రోగింది
పరుగెత్తి పోవాలి
తడవైతె మాపేరు
చెడిపోయి తీరు

సిరినాది చుక్క మా
చిన్న తమ్ముని దైతె
ఈ పూట మమ్మంద
రిదిగ చూస్తారు.

గాలి యోడ

గాలియోడ నెక్కి మేము
తేలితేలి పైకిపోయి
కొండదాటి, మబ్బుదాటి
కొసకువస్తి మమ్మకడకె.

నా కిష్టం

పచ్చన్ని చిలుకకు ఎఱ్ఱన్ని ముక్కు
ఎఱ్ఱన్ని ముక్కు నాకెంతో ఇష్టము.

అన్నంతైతే ఆటలు పాటలు
ఎన్నొ పొత్తములు మిన్నగ చదువు
పిల్లల దోస్తి అల్లరి జాస్తి,

అన్నదమ్ముల రీతి
అందరము మేముంటె
కన్న తండ్రిగ గురువు
కరుణించు మమ్ము.

పాఠాలు కథలెన్నొ
బహు శ్రద్ధ బోధించు
అయ్యవారికి భక్తి
వెయ్యి దండాలు.

చిక్కన్ని పాలల్లొ చక్కన్ని వెన్న
చక్కన్ని వెన్న నాకెక్కువ్వమక్కు
నల్లన్ని నీళ్లపై తెల్లన్ని నురుగు
తెల్లన్ని నురుగంటె ఉల్లముప్పొంగు.

హెచ్చరిక

సూరయ్య మామయ్య చూచిరావయ్య
దారిలో బురదసుమి జారగలవయ్య !
రంగాయి దొంగాయి రణరాలుగాయి
కనుపించినది ఇట్టె కాజేయునోయి !

ఐతే

నాన్నంతైతే నలుగురి స్నేహం
గొప్ప నౌకరి గొప్ప పలుకుబడి
సైకిలు కారూ రోజు షికారు

తాతంతైతే తలకొక పాగా
కళ్లకు జోడూ కాళ్లకు జోడూ

బుజ్జిబాబు

బజ్జున్నాడు బజ్జున్నాడు
బుజ్జిబాబు బజ్జున్నాడు.
ఆడీ ఆడీ అలసీ సొలసీ

పాలుతాగి బజ్జున్నాడు.
అల్లరిచేస్తే లేస్తాడమ్మా
ఆగండమ్మా అటుపొండమ్మా
బుజ్జిబాబు బజ్జున్నాడు
బుజ్జిబాబు బజ్జున్నాడు.

బుజ్జి మేక

బుజ్జిమేక బుజ్జిమేక ఏడకెళితివి ?
రాజుగారి దొడ్డిలోన మేతకెళితిని
రాజుగారి దొడ్డిలోన ఏమి చూస్తివి ?
రాణిగారి పూలచెట్ల సొగసు చూస్తిని
పూలచెట్లు చూసి నీవు ఊరుకొంటివ ?
ఊరుకొనక పూలచెట్లు మేసివస్తిని
మేసివస్తె భటులు నిన్ను ఏమిచేసిరి ?
భటులువచ్చి కర్రతీసి కొట్టవచ్చిరి.
చేత బెత్తమూ గ్రామ పెత్తనము.

కర్రదీసి కొట్టవస్తె ఏమి చేస్తివి ?
కర్రదీసి కొట్టవస్తె తుర్రుమంటిని.

బన్ని

'బన్ని' అంటే తెలుస?
బన్ని అంటే బొమ్మ
కొత్త కొత్త బొమ్మ
మెత్త మెత్త బొమ్మ
రంగు రంగు బొమ్మ
బుంగమూతి బొమ్మ

నీళ్ళుపోసి పాలుపోసి
పక్కమీద పండబెట్టి
జోలపాడి జోకొడితె
పండుకొంది బన్నిబొమ్మ
పిల్లలార అల్లరొద్దు
ఊరుకొండి ఉష్ ! ఉష్!

అమ్మడి ముద్దు

ఏమన్నారు ఏమన్నారు
అమ్మడి ముద్దును ఏమన్నారు ?
కమ్మని కమ్మని గారెన్నారు

దోరగ వేగిన బూరెన్నారు
తీయని తీయని అరిసెన్నారు
పాయస పరమాన్నము లన్నారు
అప్పుడు కాచిన నేయన్నారు
పప్పులొ వేసుక తినుటన్నారు.

తల్లులకు - పిల్లలకు

పిల్లలన్న బొమ్మలన్న తల్లులకిష్టం

తల్లులన్న బొమ్మలన్న పిల్లలకిష్టం

కారు

కారుమీద పిల్లినుంచి

జోరుగాను పోతూంటె

పిల్లిబెదిరి నేలకురికె

తల్లక్రిందులాయె కారు.

బొమ్మ

చింతచెట్టు తొర్రలోన
చిలక ఉన్నది
తాత బోడిబుర్ర మీద
పిలక ఉన్నది
చిలకముక్కు తాతముక్కు
తీరు నున్నది
చింతతొర్ర తాత బొర్ర
తీరు నున్నది
తాత కాళ్లనున్న జోడు
కిర్రు మన్నది
చింత తొర్రలోని చిలక

కదలిపోతు లేగబొమ్మ

గబగబ నడ చట్టె ఆగు

బొమ్మయితే మాత్రమేమి

టమ్మా భయముండ దేమి ?

వెన్నెల పాప

నవ్వుల పాప! పువ్వుల పాప
నవ్వుల పువ్వులు రువ్విన పాప.
ఆటల పాప! పాటల పాప
ఆటలు పాటలు ఆడిన పాప.
పలుకుల పాప! కిలకిల పాప
పలుకులు కిలకిల చిలికిన పాప.
ముద్దుల పాప! సుద్దుల పాప
ముద్దులు సుద్దులు అద్దిన పాప.
వన్నెల పాప! చిన్నెల పాప!
వన్నెల చిన్నెల వెన్నెల పాప !

చిలక పిలక

తుర్రుమన్నది

బంగారు మూట
సెలఏటి దరినొక్క
చెంగల్వ బాట !
బాట వెంటనె పోతె
పూవుల్లతోట!
తోటలో ఒక పెద్ద
దొరలుండు కోట!
కోటలో రతనాలు
కూరిచిన పీట!

పీటపై రాణుల్ల
ప్రీయమైన ఆట!
ఆటకే కోయిలల
అందాల పాట!
పాటయే పసమించు
బంగారు మూట!

నా దెబ్బ

అబ్బబ్బబ్బా చూడర దెబ్బా
అన్నిట్లోను అల్లరిలోను
ఫస్టే నేను పనికొస్తాను.

దోమలు గీమలు తోలేస్తాను
నల్లులు గిల్లులు నలిపేస్తాను
కుక్క పిల్లలను కొట్టేస్తాను
పసిపిల్లల పని పట్టిస్తాను
అబ్బబ్బబ్బా ! చూడర దెబ్బా !!

పళ్లూ బిళ్లలు భక్షిస్తాను
మిఠాయి హల్వా మింగేస్తాను
పాయసమిస్తే తాగేస్తాను
పక్కేస్తేనే బబ్బుంటాను
అబ్బబ్బబ్బా ! చూడర దెబ్బా !!

అరరె !

బంతినీటబడితే అరరె!
బావురుమని ఏడ్చుతావు!
అబ్బె తెలియదేమి నీకు
ఉందము, విందము
మంచి చోటుల నుందము, కడు
మంచి మాటలు విందము
మంచి చోటులు మంచి మాటలు
పెంచు మన సద్బుద్ధి వర్తన.

రబ్బరుదది మునగదనీ?

ఇంద్ర ధనుసు

ఏడు రంగుల ధనుసు !
ఎంత చక్కని ధనుసు!
చూడచూడగ మనుసు
ఆ ఇంద్ర ధనుసు !
వానకాలపు గుర్తు
వరుణదేవుని గుర్తు
గగనభూమిని నుదుట
గంధ కస్తురి గుర్తు !

తెలివాగుపై వంపు
తేజరిల్లే వంపు
ఆకాశ మంతటా
అలముకొన్నది సొంపు.

జాబు

జాబు వచ్చిందమ్మ జాబు వచ్చింది
బాబయ్యపేరనే జాబు వచ్చింది

అక్క పాపా తాను అందరూ క్షేమమే

అంటు రాశాడమ్మ అందులో బావ

అక్కయ్య పాపాయి ఆడుతున్నాడంట

చెప్పన్ని మాటల్లు చెప్పుతున్నాడంట

తాతయ్య అని ఎపుడు తలపోయునంట

అమ్మమ్మ అని వింటె ఆనందమంట

నాపేరు చెపితేను నవ్వుకుంటాడంట

ముద్దు పాపా ముందు పెద్దవాడైతేను

చదువులన్నీ నేర్చి జాబు నాకే రాయు

ఇచ్చు

చెట్టులన్ని కాయలిచ్చు

గుట్టలన్ని రాళ్లనిచ్చు.

ఆవులన్ని పాలనిచ్చు

ఆకులన్ని నీడనిచ్చు.

పక్షులన్ని గానమిచ్చు

పైడిభూమి పంటలిచ్చు.

మబ్బులన్ని వానలిచ్చు

మండుటెండ సూర్యుడిచ్చు.

పువ్వులన్ని వాసనిచ్చు

పుణ్యనదులు జలమునిచ్చు.

చందమామ చలువనిచ్చు

చల్లగాలి హాయినిచ్చు.

ఇంత సాయమంది నీవు

ఏమి యిత్తువోయి తిరిగి ?

జంటలు

కొండమీద రాళ్లు
కొండకింద బీళ్లు.
చెట్టుమీద గూళ్లు
చెట్టుకింద వేళ్లు.
పొయ్యిమీద నీళ్లు.
పొయ్యికింద పేళ్లు.
పీటమీద కాళ్లు
పీటకింద తేళ్లు.
చిన్నచిన్న వాళ్లు
చెంగునెగురు లేళ్లు.

జూలు గుఱ్ఱము
జూలు గుఱ్ఱమొకటి ఉంది
చాలు నాకికేమి వద్దు
జీను వేసి కళ్లెముంచి
నేను స్వారి జేతు దాని.

ఊహలు

అమ్మన్నా. బొమ్మన్నా

అంత ఇష్టమేమొ నాకు

అమ్మలాగె బొమ్మకూడ

అన్ని సైగలె నాతో

అమ్మలాగె మామిడమ్మ

కొమ్మ కొమ్మ బిడ్డలమ్మ

బిడ్డలున్న మామిడమ్మ

దొడ్డ తల్లి కాదటమ్మ

మొగ్గకేమొ సిగ్గటమ్మ

పువ్వదేమొ నవ్వేనమ్మ

సిగ్గుదాటి మొగ్గ నవ్వి

చెలగి పువ్వు కాదటమ్మ !

నడక

పాపకుంది ఉంగరం

బాబుకుంది బొంగరం

రాత్రియంత జాగరం

రౌద్రమూర్తి సాగరం.

విందు

ఆకు వేసిందమ్మ ఆకు వేసింది
అందాల అరటి మారాకు వేసింది
మొగ్గ తొడిగిందమ్మ మొగ్గ తొడిగింది
ముద్దైన లేమల్లె మొగ్గ తొడిగింది
పువ్వు పూసిందమ్మ పువ్వు పూసింది
పున్నాగ వృక్షమ్ము పువ్వు పూసింది
పిందె వేసిందమ్మ పిందె వేసింది
డెందమలరగ జామి పిందె వేసింది.
కాయ కాసిందమ్మ కాయ కాసింది
తీయ మామిడి పెద్ద కాయ కాసింది.
పండు పండిందమ్మ పండు పండింది.
పరిమళంబుల పనస పండు పండింది.
ఆనందమింపార ఆరగింపంగ
పెందలాడే రండు విందు మా ఇంట!

నవ్వులు X కోపాలు
నవ్వులన్నీ పువ్వులేకద!
పువ్వులన్నీ పుణికితినికద!
బుట్టలోపల పెట్టి వానిని
చిట్టి బాలల చేతికిచ్చెద
బాలలకు అవి పరమమిత్రులు

కోపాలసలు శాపాలుకద!
కోరి విడుచుట కూడదూకద
పట్టి వానిని పెట్టెనుంచీ
గట్టిగా తాళంబు వేసెద
బాలలకు అవి పరమ శత్రులు?

కొత్త బొమ్మలు

అత్త తెచ్చిన బొమ్మలన్నీ
కొత్తవీ మరి కొన్నవీ
మామ తెచ్చినవేను చీచీ
మాసినట్టివి మట్టివీ
కొత్త బొమ్మల తీరె వేరూ
కొత్త బొమ్మల రంగె వేరూ
తీరు తెన్నులు అత్త ఎరుగును

మామ అవి మరి ఏమి ఎరగడు

అత్త తెచ్చిన బొమ్మలన్నీ
కొత్తవీ మరి కొన్నవీ
చూడగలవూ ఆడగలవూ
చోద్యముగ అవి నవ్వగలవూ
ఆకలెరుగవు దప్పి నెరుగవు
అసలు నిద్రను మాట నెరుగవు.
అత్త తెచ్చిన బొమ్మలన్నీ
కొత్తవీ మరి కొన్నవీ.

అమ్మడు

ఆటలు ముద్దు పాటలు ముద్దు
ఆటల పాటల అమ్మడు ముద్దు.
అడుగులు ముద్దు అలరులు ముద్దు
అలరుల అడుగుల అమ్మడు ముద్దు.

చీమ

చీమ చచ్చింది చిలక ఏడ్చింది
కారు మబ్బులు కంట నీరు పెట్టాయి
ఏళ్ళన్ని తెగపొంగి ఊళ్లు ముంచాయి
ధరణిపై ప్రాణులే తల్లడిల్లాయి
నీలగోరింటాలు పూలు రాల్చాయి.

రామచిలక

చిలక చిలక రామచిలక
పలక వెందుకే?
అత్త కొన్న కొత్త చీర
కట్ట వెందుకే?
మామ కొన్న మంచి నగను
పెట్ట వెందుకే?
మగడు కొన్న మల్లిదండ
ముట్ట వెందుకే?
చెలియ చెలియ చిన్ని చెలియ
తెలియ చెప్పెద.
అన్న వచ్చి పండుగనీ
నన్ను పిలిచితే.
అత్తగారు అతనిపైన
ఆగ్రహించిరి.
మామగారు మండిపడుచు
మాటలాడిరి
భర్తగారు విననియట్లు
పలుకకుండిరి.

బడి గుడి

గుడిలో బొమ్మలు కులుకవు పలుకవు
బడిలో బొమ్మలు పలుకును కులుకును
గుడిలో బొమ్మలు కోరవు ఏమియు
బడిలో బొమ్మలు కోరును అన్నియు.
గుడిలో బొమ్మల కొరకు నివేదన
బడిలో బొమ్మల కొరకు సుబోధన.
గుడికై ధనమును గొప్పగ ఇత్తురు
బడికై ఎవ్వరు పైసా నియ్యరు యి యి
గుడిలో బొమ్మల కంటే ఘనమని
బడిలో బొమ్మల భావి తలంచరు.
గుడిపైనింగల గొప్పభిమానము

బడిపై చూపితె బాగుండునుకద!
గుడులను బడులుగ కోరిమార్చితే
బాలలె పరమాత్మలు అగుదురుకద!

ఏలికలం
బాలకలం బాలికలం
భావి జగతి కేలికలం.
పెంచిన తలిదండ్రుల హృది
నించు ప్రేమ మాలికలం.

ఆటల పాటల వెలుగుల
బాటల జను మిత్రులం
చీమకైన కీడెరుగని
చిని చిన్ని పవిత్రులం

పసిపాప

పసిపాప నవ్వులే

పైడి పువ్వుల్లు!

పసిపాప మాటలే

పైడి మువ్వల్లు!

పైడి పువ్వుల జల్లు

తువ్వాయి

తువ్వాయి మెళ్ళోన

మువ్వాయి ఉంది !

మువ్వాయి ఎంతెంతొ

అందము కను విందుజేయు
నందన మందారములం
తీయని కెందమ్మి విరుల
తేనె సోన పూరములం.
మిలమిల తలపులు మాక
న్నులలో తిలకించెదం.
కిలకిల నవ్వులు మా పెద
వులపై నొలికించెదం
అల్లరి మల్లెలు కొల్లగ
జల్లి గుబాళించెదం.
అల్లిబిల్లి పలుకులల్లి
ఉల్లము రంజించెదం.

పాలబడి పాటలు

పైడి మువ్వల ఘల్లు!

పరిమళం బీచోట

పలికించె నో పాట !

పరిమళంబగు పాట

పలికించె నీచోట !

ముద్దవ్వుతోంది !

'ట్ట' లు

గుట్టపై నొక చెట్టు

చెట్టుపై నొక పిట్ట

పిట్ట గూడును కట్ట

కట్టి గుడ్లను బెట్ట

పిల్లలై ఎగిరె నట!

గేయాలు, గేయనా.

....ర్రులు

తుర్రు మన్నది - పిట్ట
బుర్రు మన్నది - కారు
చర్రు మన్నది - దెబ్బ
చుర్రు మన్నది - నిప్పు
కర్రు మన్నది - కుక్క
కిర్రు మన్నది - చెప్పు
గర్రు మన్నది - తేన్పు
గుర్రు మన్నది - తాత
జర్రు మన్నది - పాము
జిర్రు మన్నది - గొర్రె.

జేజేలు

తాతకు జేజేలు

గాంధీ తాతకు జేజేలు

బాలల తాతకు జేజేలు

బంగరు తాతకు జేజేలు

భారత నేతకు జేజేలు

భాగ్య విధాతకు జేజేలు

చిలక పిలక

బంగారు గూటిలో
పచ్చన్ని చిలక !
ఉంగ్రాల తాతయ్య
కున్నాది పిలక !
చెల్లాయి కుంది
నల్లన్ని పలక!
పాపాయి కుంది
బంగారు గిలక !

పువ్వులు

బంతి పువ్వు - చేమంతి పువ్వు
కల్వ పువ్వు - చెంగల్వ పువ్వు
మల్లె పువ్వు - సిరిమల్లె పువ్వు
జాజి పువ్వు - విరజాజి పువ్వు
వంగ పువ్వు - సంపెంగ పువ్వు
బీర పువ్వు - కరవీర పువ్వు
నిమ్మ పువ్వు - దానిమ్మ పువ్వు

తొలి వెలుగులు

తెలతెల తూర్పున

కిలకిల పిట్టలు !

బిలబిల నీళ్ళలో

మిలమిల చేపలు

కలకల చెట్లను

జలజల పువ్వులు

చెమ్మచెక్క

అక్కతోను ఆడుకొంట

చక్కగాను చెమ్మచెక్క

అక్క 'వద్దు పోవె' అంటె

అమ్మతోను పోయి చెపుత

అమ్మవచ్చి అపుడు బాగ

అక్క నేమొ కొట్టుతుంది.

తమ్ము వచ్చి వాడు నాతొ

చెమ్మచెక్క 'ఆడుతాను

అంటే" "నువ్వు పోర తంబి

అయ్యో మగవాడవంట"

తంబిగాడు మాట్లాడక

తాను వెళ్ళిపోవు నింక !

బొంగరం

రింగు రింగు తిరుగు నాదు

రంగు రంగు బొంగరం...

ఇంగితంబు నెరుగకున్న

ఇంత చక్క నేల వ్రాయు

పొత్తమైన పట్టలేదు

పోవనైన లేదు బడికి

ఎపుడు నేర్చె నింత చదువు ?

ఎవరు నేర్పి రింత చదువు ? (చిన్ననాటి స్ఫురణ)

ఊహలు

అమ్మన్నా బొమ్మన్నా

అంత ఇష్టమేమొ నాకు

అమ్మలాగె బొమ్మ కూడ

అన్ని సైగలేను నాతొ !

అమ్మలాగె మామిడమ్మ

కొమ్మ కొమ్మ బిడ్డలమ్మ

బిడ్డలున్న మామిడమ్మ !

దొడ్డతల్లి కాదటమ్మ

మొగ్గకేమొ సిగ్గటమ్మ

పువ్వదేమొ నవ్వేనమ్మ

సిగ్గుదాటి మొగ్గ నవ్వి

చెలగి పువ్వు కాదటమ్మ ?

బంగారు మూట

సెలయేటి దరి నొక్క

చెంగల్వబాట

బాటవెంటనె పోతె

పూవుల్ల తోట

తోటలో ఒక పెద్ద

దొరలుండు కోట !

కోటలో రతనాలు

కూరిచిన పీట

పీటపై రాణుల్ల

ప్రియమైన ఆట

ఆటకే కోయిలల

అందాల పాట

పాటయే పసమించు

బంగారు మూట !!

పల్లెపాట

అవ్వాయి ఆవుకు

తువ్వాయి ఒకటి

తువ్వాయి మెడలోన

తుంగతో పలుపు

పలుపు పేనినవాడు

పసగల్ల కాపు

కాపు చెవులకు కలదు

కమలాలజోడు

జోడు ధగధగ మెరపు

చోద్యముగ చూడ

ఈడుగల బాలల్లు

ఇరగబడ్డారు!

జంటలు

జలజల పువ్వులు
కలకల నవ్వులు
గణగణ గంటలు
కణకణ మంటలు
తళతళ మెరుములు
ఫెళఫెళ ఉరుములు

తోటలో పూలన్ని
తొంగి చూస్తున్నాయి
ఆటలాడే నన్ను
గుసగుస మాటలు
మిసమిస తోటలు
బడబడ వానలు
దడదడ బానలు
కరకర కత్తులు
బిరబిర జిత్తులు
నకనక ఆకలి
చకచక రోకలి
ఘుమఘుమ ధూపము
ధుమధుమ కోపము

వచ్చాను!

నిన్ననె కద వచ్చాను
కన్నతల్లి కడుపు పండి ॥ నిన్ననే॥
పాలపుంత పసిమి మిసిమి
మేలుగ మెయి నద్దుకుంటు ॥నిన్ననె॥
చక్కని ఆ చుక్కలతో
మక్కువనే ఆటలాడి ॥ నిన్ననె॥
చందమామతోను ప్రేమ
విందులారగించి నేను ॥ నిన్ననె॥
మబ్బుల గుఱ్ఱాలపైన
దబ్బున నే స్వారిజేస్తు ॥ నిన్ననె॥
నిన్ననె కద వచ్చాను
కన్నతల్లి కడుపుపండి...

పూలు

అటు పిలుస్తున్నాయి.
రంగు దుస్తులు దాల్చి
పొంగుతున్నాయి

వాసనలు గలిగి పర
వశత నున్నాయి.
పువ్వులన్నీ బాగ
నవ్వుతున్నాయి
మొగ్గలన్నీ చాల
సిగ్గుపడుతున్నాయి.
సిగలలో మెడలలో
చెలగి ఆడుదుమంచు
పూజలకు మోజులకు
రోజు తమ పని అంచు
గరువ తనమును అవ్వి
కలిగి ఉన్నాయి.
పరసేవ కొరకవ్వి
బ్రతుకుతున్నాయి.

ఆట బొమ్మలు

అక్షరాలు దిద్దునాకు
ఆటబొమ్మ లెందుకింక?
అబ్బిగాడి కేమొ అన్ని
ఆడుకొనుట కిచ్చి వేస్త;
చందనంపు బొమ్మలన్ని
చాల పాతవే కానీ
తిరిగి కొనాలంటే ఇపుడు
దొరక వెక్కడైన కూడ;
గాజు బొమ్మలున్న వంటె
కాస్త పడేశాడు అంటె
పగిలి ముక్క ముక్కలగును
ప్రాణమంత ఉస్సురనును ;
రబ్బరు బొమ్మలు ఉన్నవి
అబ్బ నేను ఎప్పుడైన
బుద్ధిపుడితె ఆడుకుంట
పెద్దదాననై పోతిన !
గుడ్డ బొమ్మ లనునట్టివి
కూడ శ్రద్ధ చూపకుంటే
చివికి, చిరిగిపోయి మళ్ళీ
అవి ఎందుకు పనికిరావు
అయితే ఒక్క బొమ్మకూడ
అబ్బిగాడి కియను బాబు
ఆటబొమ్మలంటె ఇష్ట
మసలు నాకు చదువుకంటే !

అమ్మడు - నానీ

అమ్మకు సాయంచేసే ముద్దుల
అమ్మడు ఒకటుందీ
నాన్నకు సాయంచేసే ముద్దుల -
నానీ ఒకడున్నాడూ
వంటకు అమ్మకు
వడ్డించుటకూ
అవి ఇవి అమ్మడు
అందిస్తుందీ
చదువుకు నాన్నకు
చర చర వ్రాతకు
అవి ఇవి నానీ

అందిస్తాడూ

అమ్మకు అమ్మడు - నాన్నకు నానీ

సమ్మతిగా పనులన్నీ చేస్తూ

కమ్మని వన్నీ తింటారూ

పలుకె నేర్వనట్టి బాబి
తెలివితేట లెంత? ఎంత?
'కన్ను ముక్కు తీరు అంత
నాన్నగారిదేను' అంటె;
నాన్నగారివంక చూచి
నవ్వుతాడు, బాబిగాడు !
'అతడు పెద్దవాడు అయితె
అమ్మను పోషించు' నంటె
అమ్మవంక చూచి బాబి
అదోలాగ మురిసి నవ్వు.
'అల్లరిలో ఆటలలో
అన్నకు పైచెయ్యి' అంటె;
నన్ను చూచి బాబిగాడు
నవ్వుతాడు ముసిముసి అని
పలుకె నేర్వనట్టి బాబి
తెలివితేట లెంత ! ఎంత !

బొమ్మలు ఎన్నో కొంటారూ....

మా బాబి

ఎగరాలని వుంది !
ఎగిరే పిట్టల్లా
ఎగరాలని వుంది - పై
కెగరాలని వుంది...
ఆకాశంలో అంతట
ఆడాలని వుంది
కాడాలని వుంది....
మబ్బుతెరల వెనక వెనక
మసలాలని వుంది
మినుకు మినుకు చుక్కలవలె
మెరవాలని వుంది.
తెల్లని వెన్నెల తోటలో
తిరగాలని వుంది...
కాంతి శాంతి నిలిపి బ్రతుకు
గడపాలని వుంది !

వెన్నెలబడి

పసివాళ్ళు

నా కొలిచే దేవుళ్ళు, పసివాళ్ళు.
గుండెగుడిని నిండుగ కొలువుండిన దేవుళ్ళు పసివాళ్ళు
ఈ లోకం శోకం, ఈ మోసం దోసం
ఈ పాపం శాపం, సోకని తాకనివాళ్ళు, పసివాళ్ళు
పలుకుల్లో పారిజాత పరిమళాలు కురిపించే
కులుకుల్లో కోటి వెలుగు తారకలను మరిపించే

నిద్దపు మనసులవాళ్ళు, ముద్దు గుల్కు దేవుళ్ళు, పసివాళ్ళు.

అంతరంగ మందొకింత చింత చీకు చేరనీని,
పంతాలకు పోయి బ్రతుకు పాడు బీడొనర్చుకోని
చిద్విలాస చిదానంద చిన్మయ రూపులు వాళ్ళు, పసివాళ్ళు
వానవిల్లు వంతెనలా, వన్నెల వెన్నెల బంగరు
రంగుల రంగుల ఊహల, రహించు రస రేఖలా
మంటికి మింటికి అద్భుత మార్గము నిర్మించు వాళ్ళు పసివాళ్ళు.

చెల్లీ రావే

చెల్లీ రావే బళ్లోకి
చిన్న దేవుళ్లుండు గుళ్ళోకి
పలకా బలపం తెచ్చుకోవే
బరులన్ని చక్కగా దిద్దుకోవే
చదువులో సారమూ తెలుసుకోవే
పది మందిలో పేరు నిలుపుకోవే!!

జెండా

మనజాతి జెండా! మన ఖ్యాతి నిండా,

ఎగరాలి, ఎగరాలి, ఎగరాలి పైన

మువ్వన్నె జెండా! మురిపించుచుండా

ఎగరాలి, ఎగరాలి, ఎగరాలి పైన.

గాంధీ, నెహ్రు, ప్రసాద్, పటేల్

అజాద్, శాస్త్రి, జకీర్ హుసేన్,

దేశ నాయకులకు ఇదే, జోహారులు పదేపదే.

భోగరాజు, టంగుటూరి, పొట్టిశ్రీరాములు

దేశ నాయకులకు ఇదే, జోహారులు పదే పదే.

బొమ్మేస్తున్నా

చిన్నా! చిన్నా! బొమ్మేస్తున్నా.

పూలూ, పళ్లూ, చిన చిన ఇళ్లూ

నీకో పూవు. నాకో పూవు.

నీకో పండు. నాకో పండు

నీకో ఇల్లు. నాకో ఇల్లు.

పాడూ ఆడూ

పాడూ పాడూ పాడూ

పాడూ అక్కా పాడూ

పాడూ చెల్లీ పాడూ

పాడూ పాటా పాడూ

ఆడూ ఆడూ ఆడూ

ఆడూ అన్నా ఆడూ

అడూ తమ్ముా ఆడూ

ఆడూ ఆటా ఆడూ.

తెలుసు

పిల్లలకే అల్లరి తెలుసు

పిల్లలదే మల్లెల మనసు

అల్లరి మల్లెలు కొల్లగ జల్లీ

ఎల్లరినీ రంజించుట తెలుసు.

అదిగో

కిచకిచ మంటూ పిచుకమ్మదిగో

కాకా వంటూ కాకమ్మదిగో

లేపుతు ఉంటే లేవవె చిన్నా?

లేవవె చిట్టీ లేవవె చిలకా?

తెల్లవారినా కళ్ళు తెరవరే?

ఒళ్ళు బద్ధకం వదలద ఇంకా?

పిల్లనగ్రోవి

పిల్లనగ్రోవి వాయిస్తా

పిల్ల లందరిని మురిపిస్తా

ఏ వరసైనా వాయిస్తా

ఏ పాటైనా వాయిస్తా.

ఆవూ! ఆవూ!

ఆవూ! ఆవూ! పాలిస్తా?

అడిగిన మేతా దాణావేస్తా.

పాలన్నీ నే నీకే ఇస్తే,

బాబూ మరి నా లేగేడవదూ?

అలాగైతే లేగకు సగమూ

అడిగిన నాకో సగమూ ఇయ్యి.

దాణావేసిన నీకో సగమూ

తల్లిని గావున లేగకుసగమూ

పాలిస్తాను ప్రేమిస్తాను.

పోవే! పోవే !

వానా! వానా! పోవే! పోవే!

వస్తే రేపో మాపో రావే!

బంగరు ముద్దుల కల్పన ఆటను

బడ బడ వచ్చీ, చెడగొడతావే?

ఉష్

అల్లరి చేస్తే పిల్లిస్తుంది.

ముక్కూ చెవులూ రక్కేస్తుంది

అల్లరిమానీ పిల్లల్లారా!

చల్లగ మెల్లగ కూర్చోండర్రా.

ఏమవుతుంది?

కుక్కల నక్కల కూతలు కూస్తూ,

ఆవుల బర్రెల అరుపు లరుస్తూ,

అల్లరిగా మన మాడు కుంటూ,

పంతులుగారీ పాఠాలేవీ

వినకుంటే మరి ఏమవుతుంది?
వినకుంటే మరి ఏమవుతుందా?
విను చెపుతా నది వివరంగా -
పంతులుగారు పరుగున వచ్చీ
బెత్తం తోటి చిత్తు చిత్తుగా
వీపు విమానం మోగిస్తారు
పట్టిన దయ్యం వదిలిస్తారు.
అయితే అల్లరి ఆటలు వద్దు.
బుద్ధిగ ఉందాం. శ్రద్ధగ విందాం.

బడికి రా చిన్న!

బడికి రా రోరన్న

బడి యంటె విజ్ఞాన

భాండార మన్న ॥

చదువు నేర్వని వాడు

సరిగ ఓరన్న!

రెండు కాళ్లే యున్న

మొండి పశు వన్న ॥

ఈ చిన్న వయసులో

ఇపుడు నేర్చిన విద్య

పదనులోన పొలాన

పడిన మేల్విత్తనము॥

చదువులో గల విలువ

మది కెక్కదీ నాడు

కాని అది నిల్పునిను

గర్వాన ఒక నాడు ॥

మా శపథం !

ఇదె మా శపథం!
ఇదె ధర్మ పథం!
అక్కలు చెల్లెంద్రన్నదమ్ములం
ఒక్క రెమ్మ విరిసేటి పువ్వులం
చక్కని మక్కువ తోటి మెలగెదం
నిక్కముగా బడి పేరు నిల్పెదం ॥

చదువులు నేర్తుము సాములు నేర్తుము
ఆటలు పాటలు అన్నీ నేర్తుము
బాలలందరము భావి పౌరులము
భారత జననీ ప్రేమార్ద్రులము ॥

వాద భేదములు విస్మరించెదము
స్వాదు వర్తనము భువిని పెంచెదము
భేద మసలు లేకుండ చేసెదము
మోదముతో ముందడుగు వేసెదము ॥

మూడు రంగులు

మల్లె పువ్వు రంగు తెలుపు
మంచి వాని మనసు తెలుపు.
కంచు తెలుపు. మంచు తెలుపు
కనుల విరియు కరుణ తెలుపు.

కంటిపాప రంగు నలుపు
కలుష మున్న మనసు నలుపు.

మబ్బు నలుపు. మసక నలుపు.
మాయ మనిషి మనికి నలుపు.

చందమామ వదన మెఱుపు.
నందన మందార మెఱుపు.
దీప మెఱుపు. కోప మెఱుపు.
దినకరుడుదయాద్రి నెఱుపు.

రక్త మెఱుపు. రాగ మెఱుపు.
రమణి మెడను పగడ మెఱుపు.
కుముద మెఱుపు. కోర్కె ఎఱుపు.
కొమ్మ నుదుటి కుంకు మెఱుపు.

వసపిట్ట

వస పిట్ట నంటారు వట్టినే అందరు.

తీరికేదీ నాకు తెగ వాగడానికి?

గిట్టకేమో రాము మొట్ట మొదటన్నాడు.

పట్టుకొని ఆ మాటె పదిమంది అన్నారు.

మొన్న మా ఇంటికొక ముసలి తాతొచ్చాడు

గడ్డమొక గజముంది చెడ్డ చెముడూ ఉంది.

వేణు గోపీ నేను వెళ్లాము సర్కసుకి.

కోతి చేసిన పనులు గొప్పగా ఉన్నాయి.

తోటలో సరదాగ ఆట లాడుతు నున్న

తిమ్మయ్య రాముణ్ణి తెగ చావ గొట్టాడు

మాష్టారు నన్నొక్క మాటైన అనరసలు

ఎందుకంటే నేను అల్లరే చేయను.

లెక్కల్లో తెలుగులో ఒక్కటేమిటి నేను

అన్నిట్లో ఫస్టేను ఆమాట కొస్తేను

అన్నట్లు ఆమధ్య అమరావతికి మేము

పిల్లలంతా యాత్ర వెళ్ళి తిరిగొచ్చాము.

మాటల్లో పడి నేను మరచిపోయా నయ్యో

పొడుము కోసము నాన్న పోయిరమ్మన్నాడు.

ఆడేపిల్లలు

ఆడే పిల్లలు అలసట నెరుగరు
ఆడని వారానంద మెరుగరు
అలసట నెరుగని ఆనందమ్మే
అవసర మారోగ్యమ్మునకు.
మెలకువ తోనే మేను తేలికగ
కిల కిల మంటూ లేస్తారు.
నవ్వుల పువ్వులు నాల్గు వైపులా
రువ్వి మనల నలరిస్తారు
కరచరణాదులు కలిగిన పిల్లలు
కదలుతు మెదలుతు ఉంటారు
పరుగులు ఉరుకులు పెడుతూ ఎప్పుడు
పడుతూ లేస్తూ ఉంటారు.
తీరిక నెరుగని తీరున పిల్లలు
తిరిగి తిరిగి విహరిస్తారు
బాధలు బాధ్యత లెరుగని బ్రతుకున
బంగారమె పండిస్తారు.

సున్నితమగు ఆ చిన్ని ఎదలలో
ఎన్ని రహస్యాల్దాస్తారో!
అద్దము వంటి నిద్దపు మనసుల
నద్భుతములు చూపిస్తారో!

బడాయి బావ

బస్తీ వీధులు గస్తీ తిరిగీ
బడాయి బావ లడాయి తెచ్చె.
డాబూ దర్జా డబ్బును తింటే
గొప్పకు ఎన్నో అప్పులు చేసె.
చేతలు నాస్తి కోతలు జాస్తి
అవియే మిగిలిన అతని చరాస్తి.
చదువూ సంధ్యా సరిపడ లేదని
ఊళ్ళన్నీ తెగ ఊరక తిరిగె
సన్నని దుస్తులు అన్నీ పోగా
చివరకు చొక్కా చిరిగిన లాగు.
వచ్చే పొయ్యే నచ్చిన రైళ్ళలొ
టిక్కటు లేకనె ఎక్కుట తిరుగుట.
తగుదని సభలో తక్కు నెక్కితే
పట్టి నలుగురూ నెట్టేశారట.
కళ్ళను తలపై కాళ్లు రోడ్డుపై
పెట్టి నడిస్తే అట్టె బోర్ల బడె.
పేరుకు మాత్రం బురొకటున్నా
అందులో జ్ఞాన మసలుకు సున్న.

ఏమనుకుంటారు?

ఎవరన్నా విన్నారంటే
ఏమనుకుంటారు? మిమ్ముల
నేమనుకుంటారు ?
అల్లరి వాళ్లు. అందరు వీళ్ళు.
రక్కెస ముళ్లు. అనుకుంటారు.
రక్కెస ముళ్ళను కుంటారు.
బడి యంటే భయమెందుకు?
చదువంటే బెదురెందుకు?
ఊరకనే ఉంటా నంటూ
ఊరంతా తిరగడ మెందుకు?
నోళ్ళల్లో వేళ్లు మీరు.
నీళ్ళల్లో కాళ్ళు మీరు.
అమ్మను వేధించుకు తింటూ
అద్దూ పద్దూ లేకుంటూ.
ఏడుపులే మీకు నగలా?
ఎందుకు కొరగాని వగలా?
ముద్దైన మీ ముఖాలు
మురికి చేసి కోవడాలా?
తోటలలో దూరి పండ్లను
దొంగిలించు కొస్తారు.
వాటాలవి తెగకేమో ఇక
వాదాలకు దిగుతారు.
దారి బొయే వారిని వీరిని
ఊరకనే తిడతారు.
చెట్టు మీద పిట్టలనూ గురి
పెట్టి రాళ్ళతో కొడతారు.

కప్పలుగానీ తొండలుగానీ
కనబడితే ఇక లేస్తారు.
కుక్కపిల్లలను లేగ దూడలను
ఎక్కువగా హింసిస్తారు.

పెద్దలు చెప్పే మంచిమాటలను
కొద్దియైన పాలించరు.
బుద్ధిని పెంచే చక్కని చక్కని
సుద్దులెవీ ఆలించరు.

బాలల పండుగ

కలతలకు కాణాచిగా నున్న ఈ భువికి
దిగివచ్చి నామండి దివ్య సీమలనుండి
అన్ని దేశాలలో ఉన్న బాలల గొప్ప
పండుగిదె రండు. పరికించి పొండు.
దూరాలు మా మధ్య లేవు.
జాతివైరాలు మా కద్దురావు
పరిమళాలను ఒంపుతాము
జగమంత పరవశాలతొ నింపుతాం.
శోకాలు తొలగించుతాం.
ఈ భువిని నాకముగ మార్చివేస్తాము.
బడి బందిఖానా
బడికి పోను బాబు నేను
బంది ఖాన నిజం గాను
బడి పేరంటేనె చాలు
బండ బారు నా నరాలు
ఇంటి దగ్గరైతే నే
నిష్టమైన పనులెన్నో
మనసు దీర చేసి కొందు
మరి యానందముగ నుందు
ఇష్టమున్న పనులు చేస్తె
ఎవరికైన ఉల్లాసము.
ఇష్టములేకున్న పనులు
కష్టము, నష్టము, నరకము

కాగితాలు చింపి పెద్ద.
గాలి పడగలూ పడవలు
కట్టుకొందు ఆడుకొందు
కడు సంతోషముగ నుందు.
బుంగ మూతి బొమ్మలెన్నొ
రంగుల చిత్రించుకొందు.
బళ్లు గుళ్ళు ఇళ్ళూ సై
కిళ్ళు కార్లు కట్టు కొందు.
తెల్లవారితే సరి ఇం
టిల్లి పాది చుట్టు చేరి
నిద్ర నుండి లేపుతారు
నిలువున హింసించుతారు.
నాన్న ఒక్కడే ఇంట్లో
నన్ను జూచి జాలిపడును
చిన్ననాడు తనలాగా
ఉన్నతీరు నాలోగని.
సర్దాలేకున్న సరే
సాయంత్రమె ఆడాలట
సర్దా ఉన్నప్పుడెల్ల
చక్కగాడుకోరాదట.
మందలాగ మా పిల్లల
మందరమూ ఒక్కచోట
చేరి నేర్చుకోవాలట

నూరిపోయు ఆ చదువులు
అందరొక్కలాగె ఉంటు
అందరొక్కలాగె వింటు
అందరొకటె చదివి వ్రాస్తె
అంద మేమి టందులోన ?
మనసున కుత్సాహ మియని
మరి యా చదు వెందుకయా?
కట్టి కొట్టి బలవంతం
పెట్టే చదు వెందుకయా?
అక్షరాలు నేర్చి తేనె
ఔతుందా చదువంటే?

బొమ్మలు ఈ విచిత్రాలు
అమ్మ! చదువు కాదేమి?
బడి రోజులలో ఎందుకొ
బద్ధకమూ నిద్ర వచ్చు
బడికి సెలవు లిస్తె చూడు
బహు కులాస చురుకు హెచ్చు
పరుగెత్తే నా ఊహలు
పాఠశాలకూ త్రోవలు
కాన లేక మాన లేక
కడకు కూల బడును. చెడును.

గాలి బుడగలు

రంగు రంగుల గాలి బుడగలు
రంగుల రబ్బరు బుడగలు!
రండి రండి కొనండి చాల చౌ
కండి పిల్లలకు నచ్చేవండి.
పాల బుగ్గల బాలల కివి
పంచదార చిలకల కివి
మల్లెపూల మనసులు కివి
మంచి కాన్కలని ఎంచి తెచ్చితిని.
బాలల తీయని ఊహల వలె
తేలి యాడుటివి పైన చూడ వలె
'బుడగల బ్రతుకులు క్షణికమె' కానీ
బుడుతల కేమో పరమానందం.
పెద్దలు పెద్దలు తెలివి మాలి పో
ట్లెద్దుల మాదిరి కుమ్ము కొన కండి
పిల్లల దారికి అడ్డు రా కండి
పేలి పోవునీ గాలి బుడగలు.

నా నీడ

అన్ని వేళ నాతో నుం
డన్నిట నను పోలి యుండు
నాదు నీడ నాకు జోడు.
నే నడచిన తా నడచును
నే నిలిచిన తా నిలుచును
ఆట లాడు ఆట లాడు
కూరుచుండ కూరు చుండు.
అన్ని పనులు నా వలెనే
ఆచరించు గాని ఒక్క
చిన్న మాట కూడ పలుక
కున్నదయ్యొ మూగ నీడ,

ఉదయ సంధ్య లందు నీడ
ఉండి ఉండి చిత్రముగా
అంతోనే తరుగు చుండ
అంతోనే పెరుగు చుండు.

దీప కాంతి కెదురు పోవ
కోప మొచ్చి వెనుక కరుగు
దీపకాంతి వీడి చనగ,
నాకు ముందె తాను జరుగు.

ఉత్తరాల రత్తయ్య

ఉత్తరాల రత్తయ్యకు
ఊరందరు తెలుసు
అతడంటే అందరికీ
అంత మంచి మనసు.
కోటూ లాగూ టోపీ
కోర మీస మున్న వాడు
నల్లని చిరునవ్వు ముఖము
నామాలు గలవాడు.
ప్రతిరోజూ ఉత్తరాలు
పట్టుకు వస్తాడు
గడియారంలా టైముకు
గట్టిగ వస్తాడు.
సంచి నిండ బంగీలు
మంచి మంచి ఉత్తరాలు
పుస్తకాలు డబ్బు తెచ్చి
ఇస్తాడత దందరికి.
పైన పేరు చదువు కొని
వైన మడిగి తెలుసుకొని

ఎవరి కీయ వలసిన వత
డిచ్చి చక్క వెళతాడు.
ఉత్తరాలు చదువు కొని
ఊరందరు మురుస్తుంటె
వారి జూచి రత్తయ్యా
ఊరకనే మురుస్తాడు.
ఎన్నెన్నో ఊళ్లలోని
ఎందరెందరో రాసిన
ఉత్తరాలు మోసి తెచ్చి
ఊళ్లో అందిస్తాడు.
అతని మంచి తనం చూచి
అంత మంది నమ్మి డబ్బు
ఉత్తరాలు బంగీలు
రత్తయ్యకు ఇస్తారు.
ఒక్క ఉత్తరం కూడ
ఉంచు కోడు తనకై.
ఒక్క చిన్న పైస కూడ
ఉంచు కోడు తనకై.

యక్ష ప్రశ్నలు

చిట్టి ప్రశ్నలు గట్టి ప్రశ్నలు
చిన్ని ప్రశ్నలు ఎన్న తగినవి
చిట్టి చిన్నీ కలిసి తాతను
పట్టుకొని పలు ప్రశ్న లడిగిరి
లక్ష ప్రశ్నలు! యక్ష ప్రశ్నలు !!
పిట్ట లెందుకు మాట లాడవు?
చెట్టు లెందుకు మసల నేరవు?

నీటి లోపల తిరుగు చేపలు
నేలపై తిరుగాడ వెందుకు?
సూర్యు డెందుకు వేడి నిచ్చును?
చంద్రు డెందుకు చలువ నిచ్చును ?
అగ్ని నార్పెడు నీరమే తా
నగ్ని చే హరియింప బడు నెటు ?
కారు చీకటి కాన బడనిది
కాంతి వెలుగున కన బడు నెటు ?
కలలు కలుగుట కేమి హేతువు ?
కనుల నశ్రుల కేమి హేతువు ?
పూల కెందుకు రంగు లుండును?
గాలి ఎందుకు వీచు చుండును?
రెక్కలుండుట పిట్ట లెగురును
రెక్కలుండియు పిల్ల లెగరరె?
ఎందు కుందురు కొంద రెరుపుగ
కొంద రేమో నలుపు గాను ?
ఎందు చేతను వాడుచుందురు
అందరూ కుడి చేతి నెక్కువ ?
అద్దమున ముఖ మెందు కగపడు?
సద్దు ఎందుకు మనకు వినబడు ;
చుక్క లెక్కడ దాగు పగలు ?
సూర్యుడెక్కడ కేగు రేలు?
ఆక లందరి కుందు నెందుకు?
అన్న మందరి కుండ దెందుకు ?

ఏటేటా

ఎప్పటిదో ఈ కృష్ణా
ఇప్పటికీ ఏటేటా
కొత్త నీరు తెస్తుంది
కొత్త పైర్ల కిస్తుంది.

ఎప్పటిదో ఈ వృక్షం
ఇప్పటికీ ఏటేటా
కొత్త పూలు పూస్తుంది
కొత్త కాయ లిస్తుంది.

ఎప్పటిదో ఈ ఉగాది
ఇప్పటికీ ఏటేటా
కొత్త శోభ తెస్తుంది
చిత్తము రగిలిస్తుంది.

ఎప్పటిదో నా పుట్టుక
ఇప్పటికే ఏటేటా
కొత్త పండుగిస్తుంది
కోరిక లందిస్తుంది.

చిన్నారిలోక

చిన్నారి లోకం
వారి లోకమూ లోకము... చిన్నారి
ఊసు లెన్నొ మోసు లెత్తు
బాస తీరు ప్రాసతీరు
మంజుల గానంబు రీతి
మై మరపును కలిగించే....
అల్లరి అందాలలోన

కొల్లగ నార్జించి పేరు
ఎల్లరి హృదయాల లోన
మల్లెలు విరియించు తీరు....
ఏ దృశ్యమొ ఏ శబ్దమొ
ఎదొ కంటికి చెవికి సోక
కలుగుల్లో ఎలుకల్లా
బిల బిల మని తొంగి చూచు....
తమలో తా మెల్ల వేళ
తగ మురియుచు మురిపించుచు
తాత కథలు పాత కథలు
ప్రీతి చెప్పు కొనుచు నుండు....
గిలిగింతలు లేకె కులుకు
కీరము లటు చక్క బలుకు
ఏదొ ఆట ఏదొ పాట

ఎంతొ హాయి హాయి బాట...
విలువ గట్ట నలవిగాని
పలురకాల వినోదాల
మనసు హృదయముంచి వేడ్క
మసలు కొనుచునుండు నట్టి...
లేత మనసులలొ ఊహలు
పూతపూచి పరిమళించి
ప్రీతి సర్వ కార్యాలకు
ప్రేరేపణ చేయునట్టి...
అలసటన్న మాట నెపుడు
అట నెవ్వరు విని యెరుగరు
తలపులలో మాటలలో
తళుకు పనులు చేయుటలో....

పైన

అందమైన మామ

చందమామ

తగని పెద్దవీథి

గగన వీథి

తేలిపోవు పుంత

పాలపుంత

ఇంపు గొలుపు ధనుసు

ఇంద్రధనుసు

మింటిపైని అక్క

మినుకు చుక్క

కడలి నీటి మబ్బు

కారుమబ్బు

తల్లి - బిడ్డ

బిడ్డ
పిట్ట ఒకటి చెట్టుపైన
కట్టుకొన్నదీ గూడు
కట్టుకొన్నదీ...
కట్టుకొన్న గూటిలోన

పెట్టుకొన్నదీ గ్రుడ్లు
పెట్టుకొన్నదీ....
పెట్టుకొన్న గ్రుడ్లు పొదిగి
పిల్లలెన్నొ చేసి పెంచి
అంతులేని ఆకసమున

ఎంతొ పైకి ఎగురజేసె
రెక్కలున్న పిట్టలట్లు
చక్కగ పై కెగురుచుండ
రెక్కలుండి నేను మాత్ర
మెక్కడకూ ఎగరలేను
రెక్కలున్న పిట్టలట్లు
చక్కగ పై కెగురుచుండ
చక్కనైన ఊహచేత
ఎక్కువ పైకెగర గలవు!
ఊహలేని రెక్కలేలరా, నీవు
ఊరికె భ్రమ జెందె దేలరా?
ఊహ లేనివాడు చూడ
ఊరు విడిచి పోవలెరా!

మబ్బుల మందలు

మందలు మందలు మబ్బుల మందలు
వందలు వందలు వడి వడి దాహము
తీర్చుకొనుటకై ఆర్పుతు ఆర్చుతు
సంద్రము వైపుకు సరసర పోతూ
ఉంటే చూడగ ఉల్లాసమగును
తెల్లవి నల్లవి తెరలు తెరలుగా
పిల్లవి పెద్దవి బిల బిల త్రోసుక
పొగలు పొరలుగా పోతూవుంటే
చూడగనెంతో చోద్యము గొల్పును
కాళ్లూ లేవూ కాని నడచునూ
నోళ్ళూ లేవూ కాని అరచునూ
దాహము తీరిన పిదప మబ్బులూ
అరపుల మెరపుల అల్లరిచేస్తూ
కొండల పచ్చిక కోరిమేయగను
మరలేటప్పుడు - మనసున కెంతో
హాయిని మరి - ఆనందము గూర్చును

అమ్మా బొమ్మా

అమ్మంటే నాకిష్టం బొమ్మంటే నాకిష్టం
అమ్మా బొమ్మా అంటే అన్నిటికంటే ఇష్టం.
అమ్మ నన్ను ప్రేమించును
బొమ్మను నే ప్రేమింతును
అమ్మ నన్ను ఆడించును
బొమ్మను నేనాడింతును...
అమ్మ నాకు ఇచ్చునన్ని
బొమ్మకేను ఇత్తునన్ని
అమ్మ నాకు నేర్పునన్ని
బొమ్మకేను నేర్పుదన్ని...
అమ్మ నన్ను కసరితిట్టు
నప్పుడపుడు విసుగువచ్చి
బొమ్మను నే కసరి తిట్టు
దప్పుడపుడు విసుగువచ్చి....
అమ్మ నాకు అమ్మ యగును,
బొమ్మకేను అమ్మనగుదు
అమ్మ ఇచ్చినట్టి దంత
బొమ్మకునే ఇచ్చుచుందు.

ఉయ్యాల

ఊగవే ఊగవే తూగు టుయ్యాల
ఊగితే నీవొళ్లు ఉల్లసించేను
పాడవే పాడవే ఫణితిగల పాట
పాడితే నీ మనసు పరిమళించేను.
ఉయ్యాల నూగుతూ తియ్యంగ పాడుతూ
భువినుండి దివికెగిరి రవినంటి రాగదే!
పసుపు పచ్చని బయలు పళ్లెరంబుగ కదల
నీలంపు టద్దమై నింగి వ్రేలాడంగ
ఉయ్యాల నూగుతూ తియ్యంగ పాడుతూ
భువినుండి దివికెగిరి రవినంటి రాగదే.
ఊగవే ఊగవే
తూగు టుయ్యాల !
గేయాలు, గే

నడకలు

నూరు ఇళ్లు గలిగిన కా
నూరు గ్రామముందిరా!
లాసా నగరంబులో కు
లాసా జీవితమురా!
అమ్మ తనదు గొలుసును సీ
తమ్మ కిచ్చివేసెరా !
వాన రాగ అడవిలో ద
వానలంబు ఆరెరా!
బడికి పోయి చదివితె రా
బడికి మార్గమబ్బురా !
సారమైన చదువును మన
సార చదువుకొనుమురా....

తిరిపెమెత్తే బాల !
ఊరేది? ఇల్లేది?
ఊరంత బొచ్చెతో
తిరిగేటి ఓ బాల !
తిరిపెమెత్తే బాల !
తిరిగేది నా వూరు
తీరికగ కూర్చున్న
చెట్టు నీడే ఇల్లు
చెప్పేందుకే ముంది?
ఎండల్లొ వానల్లొ
ఎండుతూ నానుతూ
చలివస్తె ముడుచుకొని
చాప చుట్టగ నుందు !
ఆకలేమో హెచ్చి
అటు ఇటూ తెగగ్రుచ్చి
ఊరూరు త్రిప్పుతూ
ఉంటుంది నన్నెపుడు
ఆవులూ గొర్రెలూ
ఆ మర్రి నీడలో
నిలిచి యున్నంతైన
నిల్కడను నేనెరగ!
ఉడతలూ పిట్టలూ
ఊడల్ల మర్రిపై
ఉండి మసలేటంత
ఊరటను నేనెరగ !

ఉన్న బంది

తోటలోపల తిరిగినప్పుడు

మాట లెరగని చిలకరా

కోటలోపల పెరిగినప్పుడు

మాట లెరిగిన చిలకరా

తోటలోపల కొన్ని పండ్లను

నోట గరచుక ఎగిరెరా

కోట లోపల అన్ని పండ్లను

లోటు లేకను మరిగెరా

మాటరానీ చిలక కప్పుడు

తోటలో బహు స్వేచ్ఛరా

తినుట కన్నియు దొరకకున్నను

మనుట కెంతయొ స్వేచ్ఛరా

మాటలాడుట ఎరిగి స్వేచ్ఛను

కోటలో కోల్పోయెరా

తినుటకన్నియు కలిగియున్నను

మనుటలో ఒక బందిరా

గడ్డిపూలు

నాలాంటి వేను నక్కి చూస్తున్నాయి

గడ్డిపరకలు చాటుగా చేసుకొని పూలు

అంతలో విరిసేను

అంతలో మెరిసేను

వింతరంగుల తోటి

పంతాన మురిసేను...

ఆకాశమున రాత్రి

అందాల చుక్కలే

పగటివేళను భూమి

పై పూవులై పూచు...

చల్లగాలి వీస్తె

మెల్లగా వానొస్తె

పులకించి నిలువెల్ల

అలలు ఉప్పొంగేను

లాలించి ప్రేమిస్తె లావణ్య మొలికించు

కాస్త తాకితెచాలు కందిపోవును పూలు

జాలిబాల

అమ్మా! నేనొక్క చిన్న

అందమైన కుక్కపిల్ల

నై నీకడ కరుగుదెంచి

అన్నమంటె పెడతావా?

'ఛీఛీ పోపో'

అని మరి,

చీదరించు

తావా?

చీదరిస్తె కోపమొచ్చి

చెప్పకుండ తలుపు ప్రక్క

దాగి, ఎన్నిమార్లు నన్ను

‘తండ్రిరార’ అని పిలిచిన
తిరిగిరాను
నీ యొద్దకు
తిండి నడుగ
నెప్పుడింక
అమ్మా! నే నొక్క చిన్న
అందమైన చిలకపిల్ల
నై నీకడ కరుగుదెంచి
‘అక్క’ అంటే వింటావా?
పట్టి
పంజరాన ఉంచి
బంది
చేసుతావా?
బంది చేయదలచితేని
పంజరంబు నుండి నేను
తుర్రుమంటు ఎగిరి అడవి
దూరి స్వేచ్ఛగాను ఉందు
తిరిగిరాను
నీ యొద్దకు
తీయమాట
చెప్పనింక...
గేయా.

పిల్లలంటే

పిల్లలంటే మల్లి మొగ్గలు
తల్లి మనసే విరిసివెన్నెల
లల్లుకొను జాబిల్లి నిగ్గులు
ఊసులెన్నో మోసులెత్తే
బాసకర్థము ప్రాసబద్ధము
కదిపితే ఘలు ఘల్లు మ్రోగే
కంచుమువ్వలు మించునవ్వులు
డెందమున ఆనందమెంతో
విందుగూర్చే కందుకమ్ములు
ఉల్లమున చిరు ఊహలెన్నో
పల్లవించే పసిడితీగెలు
జోలపాట
జో జో కన్నా
జో కొడుతున్నా
కళ్లు మూసుకో
కమ్మగ పడుకో
దూరతీరముల
కరిగిన నాన్నా
తిరిగి వచ్చులే
తీరును వెతలే !....
నింగిని వెలిగే
నీలిదీపములు
రంగగు కాంతులు
రంగరించులే!....
అత్తా మామా
కొత్త బొమ్మలను

కొని తెచ్చిరిలే

కోరియాడుదులె....

బుజ్జి లేగలూ

బజ్జున్న విలే

గూటిలో పిల్లలు

కునుకుతున్నవిలె!....

జోజో కన్నా

జో కొడుతున్నా

కళ్లు మూసుకో

కమ్మగ పడుకో!.....

అల్లరి

పిల్లలు మాత్రమె కారు

అల్లరి చేసేవారు

పెద్దలనేవారె అసలు

హద్దుమీరి చేస్తారు

అల్లరి పిల్లలు చేస్తే

అందంగా ఉంటుంది.

అదే పెద్దవారు చేస్తె

అనర్థాల నిస్తుంది

అల్లరి చేయుట అనునది

పిల్లలలో సహజగుణం

పెద్దలలో మాత్రం, అది

పెడబుద్ధికి నిదర్శనం

కాకుంటే ఈ యుగాన

కాటకాలు మారణాలు

కల్పించే అల్లరంత

కనగ పెద్దవారిదే కద;

చిన్నవాడు

చిన్నవాడు నిన్న వాడు

ఎన్నొ వెలుగులున్న వాడు

పున్నమి రేవెన్నెల సరి

కన్నుల సిరులున్న వాడు

మొగ్గల నును సిగ్గుకు లే

బుగ్గల తా వొగ్గువాడు

ఎల్లరికిని అల్లరిలే -

మల్లియ వెదజల్లువాడు

చిలుకల పలుకుల కిలకిల

చిలికి అందమొలుకు వాడు

బుడి బిడి వడి వడి అడుగుల

తడబడు చిరునడలవాడు

అందము ఆనందము కను

విందుగ వెలుగొందువాడు

వద్దు !

హాని చేయవద్దు
పూని వినుము సుద్దు
నీ వలెనే ప్రాణులన్ని
నిలిచి బ్రతుక నెంచును కద ;
పాకే పురుగులకైనా
పాడే పులుగులకైనా
మేసే లేగలకైనా
మెరిసే మిణుగురులకైన....
తిండిలేక ఎండిపోయి
తిరుగు కుక్క పిల్లకైన
గొంతు పగుల అరపులలో
గోండ్రుపెట్టు కప్పకైన
నీకు హాని చేయనట్టి
నెమ్మదిగా బ్రతుకునట్టి
జీవకోటి కెప్పుడైన
చేయుమింత సాయమంతె !

చాలు !

వంశమేది యని అడగను

వంగడంబు నసలు అడగ

హృదయమందు ఉత్తేజము

ఉంటె అతనికంతె చాలు !

తన పదవేమని యడగను

ఘనసంపద వివర మడగ

మనసున ఒక మంచి తలపు

మలచుకుంటే అతడు చాలు !

మేడలెన్ని యని అడగను

ఓడలెన్ని యని అడగను

ఈడులేని ప్రేమమార్గ

మెరిగి నడచుకుంటే చాలు !

అమ్మ ఒడి

అమ్మ ఒడి
అమ్మ ఒడి చదువుల బడి మా
యమ్మ ఒడి నా కొక గుడి ॥
అమ్మ చూపును ఒరవడి, దై
వమ్ము కంటెను త్వరపడి ॥
అమ్మ చెప్పిన సుద్దులు, అని
శమ్ము ఒప్పిన బుద్ధులు ||
అమ్మ పెదవుల హాసము. ని
త్యమ్ము మాకు వికాసము ॥
అమ్మ మంజుల భాషణం, శ్రా
వ్యమ్ము వీనుల భూషణం ॥
అమ్మ హృది అనురాగము, ది
వ్యమ్ము భవ్యము యోగము ॥
అమ్మ చల్లని కరములు దా
నమ్మునకు ఆకరములు ||
అమ్మ చరణ తలమ్ములు క్షే
మమ్ము పండు పొలమ్ములు ॥
అమ్మ కన్నుల కాంతులు లో

కమ్మనకు సుఖ శాంతులు ॥
అమ్మయే నా సర్వము ధై
ర్యమ్ము బలమూ గర్వము ॥

రంగుల బొమ్మ

బొమ్మకు రంగులు వేస్తున్నాడు.
తమ్ముడు రండీ చూడండి
ఉన్నవి రంగులు కొన్నే గాని
కన్నుల కందం కట్టినట్లుగా
కంటికి నలుపూ ఒంటికి పసుపూ
జుట్టుకు నలుపూ బొట్టుక ఎరుపూ.
నోటికి ఎరుపూ బూటుకు నలుపూ.
చొక్కా మాత్రం చిక్కని నీలం.
పేకా పడుగూ పేనినట్లుగా
రంగుల జీరలు లాగూ చారలు.
రంగుల రాగం రాజా భోగం
తెల్లని హాసం పిల్లడి వేషం.
బొమ్మకు ప్రాణం పోస్తున్నాడు.
తమ్ముడు రండీ చూడండి.

బుద్ధిమంతులు

పెద్దల కంటే బుద్ధి మంతులు
పిల్లలు పిల్లలు పిల్లలు
పెద్దలలో వాదాలు పెద్దలలో భేదాలు
పెరుగుచున్న కొలదివారు పెరుగుచున్న కొలది
కొట్టు కొన్నను తిట్టు కొన్నను
ఇట్టె మరచిపోయి పిల్లలు
గట్టి చెలిమినోయి కూర్చుక
పట్టలేని హాయి పొందుచు
పిట్టలట్లు విహరించుచుందురు
పువ్వులు నవ్వులు కాయలు పండ్లు
పప్పు బెల్లములు తోటలు దొడ్లు
ఆటలు పాటలు చెట్టులు గుట్టలు
అన్నీ వారికె తీరిక నెరుగరు
కల్లా కపటం ఎరుగరు
కుళ్లూ కుచ్చిత మెరుగరు
మాయా మర్మం ఎరుగరు
అబద్ధమన్నది ఆడు టెరుగరు
అల్లరి మాత్రం పిల్లల నైజం
ఎల్ల వేళలా ఆనందంతో
చిల్లో బొల్లో మంటు ఉందురు

మా పాప

అమ్మ కాబోతుంది
అమ్మ కాబోతుంది
అందాల మా పాప
అమ్మ కాబోతుంది:

పాపాయి పాపకూ పాల నిస్తుంది
కోపాన పాపనూ కొట్టబోతుంది
అంతలో హృదయాన హత్తుకుంటుంది
కన్నీటి నీలాల కరిగి పోతుంది
అద్దాల చెక్కిళ్ళు ముద్దాడుతుంది.
పూల ఉయ్యాలలో జోలకొడుతుంది.
ఉయ్యాల నూపుతూ జోలలు పాడుతూ
ముని వోలె తనలోన మురుసుకుంటుంది
ముక్కోటి దేవతలు ముగ్ధులైపోవ.

చిన్న పెన్సలు

చిన్న పెన్సలు నేను

చెప్పుకో దలచేను

వింటార నా బాధ

వింతైన ఓ గాధ

దినమంత నా పాటు

తీరికెరుగని పాటు

అందరికి నే నుందు

అందుబాటులో ముందు

బొమ్మలకు అంకెలకు

కమ్మన్ని రచనలకు

అన్నిటికి నేనేను

అవసరం బయ్యేను.

ముక్కుపోతే నాదు

ముక్కు నొక చాకుతో

చెక్కేరు ఒక వంక

దిక్కేరు నా కింక?

పెరిగేటి నా వయసు

తరిగేటి నా రూపు

కరిగేటి నా గుండె

కరుణెరుగ లేకుండె

మరువకు

మరువకు మరువకు ఎన్నడు

మరువకు మన తల్లిని.

మరువకు మన తండ్రిని.

మరువకు మన గురువుని.

రెక్కలు చుక్కలు

రెక్కలు కలిగిన చుక్కలురా

అక్కడ ఇక్కడ ఎగురునురా

చీకటి వెలుగులు చిమ్మునురా

ఆకుల సందున అలరునురా

చల్లని కాంతిని బరపునురా

ఉల్లము శాంతిని గొలుపునురా

మింటిని గల ఆ చుక్కల కంటే

మంటిని గల ఈ చుక్కలె అందము!

నువ్వే నవ్వు

నువ్వే నవ్వు నవ్వే నువ్వు.

పువ్వు లందం పుణికి పుచ్చుకున్నావు.

కంటిలో నీలాలు కదలాడితే చాలు

వింటి నుండీ పూలు విసిరీన చందాలు.

ఉంగ్రాల ముంగురులు ఒయ్యారముగ కదలు

ఝుంకారములు లేక చలియించు తుమ్మెదలు.

అడుగు లంటిన చోట అందాల పూదోట

ఆట లాడిన చోట తేట వెన్నెల బాట.

మధుర మంజులము నీ మర్మ మెరుగని భాష

వింత వింతగ సాగు వినువారి హృది లాగు.

పగడాలు ముత్యాలు పది వేల వరహాలు

బంగారు రంగారు పాప నీ తరహాలు!

మాలోకం మామయ్య

మాలోకం మామయ్యకు
ఈ లోకంలో ఎవ్వరు
సాటి రారు పోటీ లేరు
చాయలు నిలబడ లేరు.
తలకు నూనె రాసుకోడు
క్షౌరం చేయించుకోడు
బట్టలైన మార్చుకోడు
ఒట్టు స్నానమే చేయడు.
ఎంత ఎండ వాననైన
ఎండుతాడు తడుస్తాడు

చేతి లోని గొడుగు తెరచి
చెరుపుకోడు గొప్పగోడు.
పాద రక్షలంటే తనకు
బహు గౌరవ మంటు మామ
మూట గట్టి నెత్తి బెట్టి
మోస్తాడు మురుస్తాడు.
రైళ్ళు కార్లు తనకు పడక
కాళ్ల సవారే మేలని
తనువు నెంత దూరమైన
తాపీగా మోస్తాడు.
చదువు పడక దాన్ని మామ

వదలి పారవేశాడట.
దాని వాసనంటె చాలు
తల నొప్పిగ ఉంటుందట
సంతకు మామయ వెళితే
సంబర పడతారు జనము
వింత జంతు జూచినట్లు

విడ్డూరంగా జూస్తూ -
మామయ మా ఇంటికొస్తె
మా నాన్నకు మాకు సరద
ఏడిపిస్తె మేము, అమ్మ
కెంతో లోలోన బాధ.

మన మందరం

మతమూ వర్ణం ఏదై తేనే?

దేశం జాతీ వేరైతేనే?

మన మందరమూ మానవులం.

ఈ భూమికి కామందులం.

మన మందరమూ సోదరులం.

ఒకే వృక్షమ్ము చివురులం.

రండి రండి కలపండి చేయి చెయి

దండి బలం చూపండి ముందు నడ

వండి అంద రొకటండి అంటు చా

టండి శాంతి నిలపండి లోకమున.

బలేబలే అబ్బాయి

చుక్కల చుక్కల చొక్కారా

చక్కని చారల నిక్కరురా

బలే బలే అబ్బాయిరా

బళ్లోకివచ్చాదూరా!

ఆరతి

రంగుల రంగుల ముగ్గుల

రంగ వల్లులను పెట్టీ

బంతి పూల దండ ద్వార

బంధాలకు కట్టీ

అతి భక్తిని తెలుగమ్మకు

ఆరతి పట్టండి జయ

హారతి పట్టండి

నాయనమ్మ

నాన్నంటే నేనంటే
నాయనమ్మ కిష్టమంది:
నన్ను జూచి నవ్వి ఆమె
నాన్న తోను ఇట్టు లంది.
అల్లరిలో ఆటలలో

తల్లిని హింసించుటలో
ముమ్మూర్తుల నీ పోలికె
సుమ్మా మన చిన్న బాబు
అల్లరి చేస్తేనే నీ
వద్భుతముగ మారినావు

బడికి దొంగవైతేనే
గడియిస్తివి విద్యలన్ని.
నీలాగే మారి చిన్ని
నీలాగే చదువు లన్ని
నేర్చి తుదకు పెద్ద పదవి
నిర్వహిస్తె సంతోషము
నిన్ను చూచి నే నిప్పుడు
కన్న వాడ గర్వింతును.
చిన్ని జూచి రేపు వాని
కన్న తల్లి గర్వించును.
అదోజాతి పిల్లలం
అమ్మ నాన్న పేరెరుగని
అదో జాతి పిల్లలం
అందరి వలె మేము కూడ
అసలు భారతీయులం.

పల్లెటూళ్ళ డబ్బు దోచి
బ్రతుకును పట్నాలు
పట్టణాల జేబులన్ని
వెదుకును మా చేతులు.
మసైనా పసైనా
మా కెప్పుడు ఒకటే
బ్రతుకైనా చావైనా
బాబు మాకు ఒకటే

పాడు దుమ్ము తారు రోడ్లు
బస్తీలో మా శయ్యలు
కనబడితే కసరుతారు.
గస్తీ పోలీసయ్యలు.

ఒకటంటూ మాకు లేదు.
ఒకరంటే భయం లేదు
ధూళి బుట్టి ధూళి బెరిగి
ధూళి గానె మారతాము.

మామిడమ్మ
అమ్మలాగ అగుపిస్తుం
దా మామిడి చెట్టు నాకు
కొమ్మ కొమ్మ కందముగా
కోటి చిన్న బిడ్డలతో

అటు కదలదు ఇటు కదలదు
ఆయాసం బస లెరుగదు
ప్రక్కల కెంతో దూరము
పరచుకొనీ నిలుచుండీ.

కన్న బిడ్డ లందరినీ
గారాబముతో పెంచీ
జగతి జనుల కర్పించీ
వగవక తా నొకతెనిలుచు.

ఎండ బడిన వారందరి
నెంతో ప్రేమార బిలిచి
నీడ నొసగి సేద దీర్చు
నిర్మల సంతోష వదన

కన్న బిడ్డ లంద రెదిగి
మిన్ను నంటు వృక్షములుగ

తర తరాల నిలిచి సేవ
తప్పక చేయాలనుకొను.

కనికర మెరుగని లోకము
కట్టెలకై బొగ్గులకై
పట్టి తనను బాధిస్తే
పాపం ఏమనుకోదు.

బ్రతుకంతా బాగుగ కొరకె
బాగుగ నర్పించు తల్లి
మృతి నందియు సేవ కొరకె
మేనొసగెడి కల్పవల్లి

త్యాగము ఓరిమి ప్రేమయు
బాగుగ నెరిగిన తల్లీ
అంచితముగ పేరు గన్న
మంచి యమ్మ మామిడమ్మ.

బొమ్మల అమ్మ

ఆ చంక నో బొమ్మ
ఈ చంక నో బొమ్మ
ఆ బొమ్మ ఈ బొమ్మ
నీ పోలికమ్మ.
ఆ కొమ్మ నో పువ్వు
ఈ కొమ్మనో పువ్వు
ఆ పువ్వు ఈ పువ్వు
నిను జూచి నవ్వు.
ఆ చెట్టు నో పండు
ఈ చెట్టునో పండు
ఆ పండు ఈ పండు
నీ నోరు నిండు
ఆ గూట నో చిలుక
ఈ గూట నో చిలుక
ఆ చిలుక ఈ చిలుక
నీ తోటి పలుక
ఆ ఇంట నోబాల
ఈ ఇంట నోబాల
ఆ బాల ఈ బాల
నిను దలచు చాల.

అమ్మ చదువు

అమ్మ చదువు కుంటోంది
అమ్మ చదువు కుంటోంది
నా వలే ఉద్యోగం
తానూ చేయాలనుకొని
వంట మాని తిండి మాని
కంటి కేమొ నిద్ర మాని
పిల్లల వలె పాఠాలను
వల్లె వేస్తు శ్రద్ధ గాను.
చదువుతుంది చదువుతుంది
వదలకన్ని చదువుతుంది
ఒప్పగించుకుంటే మళ్ళీ
తప్పు లెన్నొ చెప్పుతుంది.
ఒక్క తప్పుకైతె నన్ను
ఊరుకొనని నాన్న, తప్పు
లన్ని పడితె అమ్మను తా
ననడు చిన్న మాట కూడ.

పనులన్నీ చేసి ఇంట
బాగుగ మము సాకునట్టి
అమ్మ కిప్పు డందరమూ
అన్ని చేసి పెట్టాలిక !

అద్దంలో బొమ్మ

అద్దంలో బొమ్మా చూడు
అమ్మా నాలాగే ఉంది
నా రూపే నా చూపే
నా నడకే నా నవ్వే.

చిన్నప్పుడు నా అంతే ఉంది
ఇప్పుడు నాలాగే పెరిగింది
నాలాగే తను చేస్తుందన్నీ
నాతోనే తన సైగలన్నీ
నీళ్ళల్లోనూ కళ్ళల్లోనూ
నీడలు చూచుకొనే వారట ముసు
అద్దాలున్నవి గనుక ఇప్పుడు
అందా లందరు చూచు కొందురు.

అద్దాలంటూ ఉంటేనే కద
అసలు మనిషి సంగతి తెలిసేది.
మంచీ చెడుగూ తెలిస్తేనె కద
మనిషి తనను తా దిద్దుకొనేది.

బీదకుఱ్ఱ

పాపం ఒక బీద కుఱ్ర పట్టలేని ఆసక్తితొ
అట్టలున్న బొమ్మలున్న అందమైన పుస్తకాలు
షాపులోని పుస్తకాలు షావుకారు పుస్తకాలు
చూసి చదవదొడగె తాను తీసి ఒకటి చరచరమని

అంతలోనె షావుకారు అన్నాడత దదరి పడగ
కుఱ్రవాడ పుస్తకాలు కొనకుండా చదవరాదు
ముట్టరాదు పుస్తకాలు ముందు డబ్బు నీయకుండ.

చేత కాసు లేని కుఱ్ర చేయున దపుడేమి లేక
అనుకొనె నిటు ఒక్కమాట అక్షర లక్షల మూట
చదువ నేర్వకుంటే నాకు సరదాయే లేకపోను

ఎట్టు లున్న దంటె ఇదీ –
పట్టుపరుపు చూచి బీదబాలు డొక్కడనుకొనెనిటు
పండ నేర్వ కుంటె నాకు పరుపు సరద వుండదుగా,

ఎట్టులున్న దంటె ఇదీ –
కొట్టు మీద మిఠాయిలు కొనను చేత కాసు లేక
అనుకొనె నొక బీద బాలుడయ్యో ఒక జాలి మాట
తినుట నేర్వకుంటే నాకు తీరు గదా ఈ బాధ

మూగకొండ

మూగ కొండ కడుపు నొక్క
వాగు కన్నె పుట్టెను
వాగు కన్నె హొయలు మించి
సాగి పారుచుండెను వేగ పారుచుండెను.

కదలి రాజు పిలుపు వినగ
ఎడద ప్రేమ గడలు కొనగ
వాగు కన్నె హొయలు మించి
సాగి పారుచుండెను వేగ పారుచుండెను.

కదల లేని మూగ కొండ
వదలి పారు వాగు గాంచి
కనుల నీరు గురియ నదియు
కాల్వ లౌచు వాగు జేరె కదలి రాజు కడకు జేరె.

ఆడు బిడ్డ నెంత ప్రేమ
నాదరించి పెంచు కొన్న
కడకు పరుని పాల జేర్చి
కన్న తల్లి కుంద వలెగ కనుల నీరు చింద వలెగ

కన్నతల్లి కంటి నీరు
కన్నె వాగు తోడ జేరి
కదలి మధుర జలము గలియ
కడకు నదియు మయ్యె కంటినీరు క్షారమయ్యె.

బాల్యం

బాధలు బాధ్యత లెరుగని
బాల్య బంగారు దశ
బ్రతుకంతా ఒక ఆటని
భావించు కొనే ఆశ.
అటు పిమ్మట వయసు ముదిరి
చటుకున యౌవ్వనము వచ్చు
పూచీ పాచీలన్నీ
పూను కొనీ వంద వచ్చు.

పను లందే సతమతమై
అనుభవము గడింప కుంటె
అంతలోనె ముసురు కొనుచు
అయ్యో పై బడును ముదిమి.

కంటి చూపు తరిగిపోయి
కాలి నడక సడలి పోయి
మాట తొట్రు మతి భ్రమణ
మనిషి కపుడు దాపురించు.

మూడు దశలలోన చాల
ముద్దైనది బాల్యం
అభము శుభము ఎరుగని దా
నందముగా గడచునదీ.

తప్పట్లు తాళాలు
తప్పట్లోయ్ తాళాలోయ్
దేవుని గుళ్లో బాజాలోయ్
చప్పట్లోయ్ సరదాలోయ్
పిల్లలె బళ్లో రాజాలోయ్

పళ్లూ పూలూ దేవునికోయ్
పలకా బలపం పిల్లలకోయ్
బడికీ గుడికీ తేడా లేదోయ్
భక్తీ శ్రద్ధా ఒకటేనోయ్.

గుళ్లో పూజలు చేసే వారికి
గొప్పగ భక్తీ ముక్తీ కలుగును
బళ్లో చదువులు నేర్చే వారికి
బాగుగ శక్తీ భుక్తీ కలుగును.

మేటి చదువులూ మెదడుకు బలమోయ్
ఆటలు పాటలు ఒంటికి బలమోయ్
రెండూ ఉంటే దండి మనుషులోయ్
నిండు తనం మన జన్మ భూమికోయ్.

మనకే గొప్పలు మెప్పులు వద్దోయ్
మంచివాళ్ళ మైతే అది చాలోయ్
మనుషులు మనసులు ఒకటై చక్కగ
మంచిని పెంచితె మన కది చాలోయ్.

కరుణామయి

అమ్మ చెప్పినట్లు వినీ
నెమ్మది గల వాడ వనీ
పేరు తెచ్చుకుంటే చాలు
పెంచిన ఫల మది వేలు,

తను తిన్నా తినకున్నా
తనయుడ వని నీకు పెట్టి
కంటికి రెప్పవలె సదా
కాచి నిన్ను రక్షించే-
ఇంత జలుబు చేస్తే నీకు
అంతు లేని బెంగ తనకు
ప్రాణమైన పణము బెట్టి
బాగు పరచుకోదలచే,

గతము లోని బాధలు ఆ
గతము లోన నీవు పెరిగి
తీర్తు వనీ దిన మంతా
తీయని కలగాంచు నట్టి.
నీ సుఖమే తన సుఖముగ
నీ బాధే తన బాధగ
నీవే తానుగ నిత్యము
భావించే కరుణామయి

ప్రియదర్శి
ప్రియదర్శి
(గేయనాటిక)

(నేపథ్యము నుండి)
జయము జయము జయ మశోక !
జయము జయము మౌర్యతిలక !
జయము జయము సుగుణధామ !
జయము నీకు సార్వభౌమ !

అదె అశోక చక్రవర్తి
అధిక సైన్య బలముతో

ఉత్తర భారతము నంత
ఓడించిన వాడూ
దక్షిణాన కళింగపై
దాడి వెడలినాడు.
(కళింగదేశము-ఒకపూరి
ఇల్లు ముసలితల్లి-కుమారుడు)
కుమారుడు

అమ్మా! నాకింక సెలవు
నిమ్మా! సమయమ్మొ వచ్చె
దేశ సేవ సల్పగ, ఆ
దేశమిదే నాకువచ్చె.
తల్లి
దేశసేవ ఏమో, ఆ
దేశమేమొ వివరంగా
తెలుపగదన్నా నా సం
దేహము తీర్పగదన్నా.
కుమారుడు
మనరాజ్యముపై అశోక
మహరాజిదె యెత్తివచ్చె
మన కళింగ విభుడాతని
మార్కొనంగ ఆనతిచ్చె
తల్లి
అక్కట నే ముసలిదాన
ఒక్కడవే దిక్కునాకు
నన్ను విడిచి రణభూమికి
కన్నతండ్రి చనియెదవే ?
కుమారుడు
మాతృసేవ యొకట, దేశ
మాతృసేవ వేరొకటా ?
చల్లని దీవెన లొసంగి
సమరావని కనుపు తల్లి.
తల్లి
నిను పెంచిన ఈ విశాల
నిర్మల ధాత్రీమతల్లి
ఋణము దీర్చుకో శక్తిని
పణము వెట్టి రణస్థలిని.
(నేపథ్యము నుండి)
ఆ కళింగ దేశంబున
అందరు ఆవేశంబున
జన్మభూమి రక్షణకై
చనినారలు అనిపోరగ.

మౌర్యసేనలూ కళింగ సేనలు
మహోద్ధృతిగ ఢీకొనియెన్ :
పారెను చిక్కని ఎర్రని రక్తం
ఏరులగుచు రణరంగమునన్.
(పూరిగుడిసెలో ముసలితల్లి)
(నేపథ్యము నుండి)

గుడిసెలో ముసలమ్మ
కునుకు దీపమ్ముకడ
క్షణములను లెక్కించు
కొనుచున్నదయొ తాను.
చీమ చిటుకన్న తన
చిన్నారి కొమరుడని
భావించి 'ఎవరం'చు?
ప్రశ్నించి, విలపించు.
అశోకుడు (ప్రవేశించి)

అమ్మా! దాహం ! దాహం ! దాహం !
తల్లి
అయ్యో! పుత్రా ! పుత్రా ! పుత్రా !
అశోకుడు
పుత్రుడగానూ పొరుగూరమ్మా;
దాహం, దాహం, తల్లీ ! దాహం.
తల్లి
ఏమంటున్నావయ్యా, నీవూ?
ఎవరైతేనే! జలమిదెత్రాగూ.
(పాత్ర నందించును)
అశోకుడు (పాత్రలోని జలము త్రాగును)
తల్లీ! ప్రాణం నిల్పితివమ్మా !
దయగల మాతవు నీవు గదమ్మా!
పుత్రుండనుచున్నావూ -
పుత్రుండెట చన్నాడు ?
తల్లి
తెలియదేమి పరదేశీ
దేశము రక్షింపబూని
అరిగినాడు నా పుత్రుడు
అల శత్రులతో పోరగ.
అతని కొరకు ఈ బొందిలొ
అట్టె ఉంచితిని ప్రాణము
విజయలక్ష్మి చేపట్టియె
వేంచేయును నాపట్టియు.
అశోకుడు
అదియా కథ!
అయ్యో వ్యధ !
శౌర్యధైర్యమున్న నేమి
మౌర్య సైనికులధాటికి
నిలువబడిన కాళింగుడు
నిక్కము రణభూమి లేడు.
తల్లి
ఏమంటివి నా తనయుడు
ఎన్నటికిని తిరిగిరాడ
ఎవరు గెలిచినారొ సుంత
ఎరుగజెప్పు బాటసారి?
(నేపథ్యము నుండి)
కళింగులంతా కదనభూమిలో
కన్ను మూసినారూ -
వీర స్వర్గ సౌధ ప్రాంగణముల
చేరుకొనిరి వారూ.
తల్లి (దుఃఖంతో)
హా! కుమారా! వీరస్వర్గము
నందితే రణభూమిలో
మాతృదేశము కొరకు ప్రాణము
మాయురే అర్పించితివ!
దిక్కులేనీ దీనురాలను

అక్కటా బ్రతుకంగ జాలను
తీరుదప్పిన కునుకు దీపం
బారిపోవును ఏక్షణానొ.
అశోకుడు
పుత్రశోకము పొందు నీకిదె
పుత్రుడను నే నౌదునమ్మా
నన్ను చేకొని నీ విచారము
నపనయించు కొనంగదమ్మా.
తల్లి
చాలు చాలును పాంథుడా వా
చాలమింకను చాలునూ-
పుత్రుస్థానము నా హృదిని ఇల
పొందజాలరు ఎవ్వరూ.

ఎంత నిర్దయు డా యశోకుడు
ఇంతమందిని యుద్ధభూమిని
బలిగగొని తన ప్రతిభనల్గడ
వెలగబెట్టుటకై తలంచునె ?

ఎందుకతనికి రాజ్యతృష్ణయు ?
ఎందుకతనికి రక్తతృష్ణయు?
బుద్ధదేవుడు జన్మ మొందిన
పుణ్యభూమిని పుట్టియుండియు.
(నేపథ్యమునుండి)
యశోవిరాజితుడా !
అశోక భూవిభుడా !
వేచియుంటిమిచటా
వేగరాగదయ్యా
దాహ శాంతిపొందీ
తరలిరాగదయ్యా !
తల్లి (విని, గ్రహించి)

ఏమది! మీరా
స్వామి అశోకుడు !
కడుపుశోకమున మిమ్ముల
కఠినముగా నంటినయా
మనసున వేరెంచక ఇదె
నను దయ క్షమియింపుమయా
అశోకుడు
తల్లీ! నేనె అశోకుడ
తథ్యం, కడు నిర్భాగ్యుడ
ఏ తీరున నీ శోకము
నే తీర్చగలనమ్మా ?
తల్లి
నిన్ను నే కోరెదొక
చిన్న తుదికోరికను
నాబోటి ముదుసలుల
నందరిని కడతేర్చి,
కడుపు చిచ్చులనార్పి
కట్టుకో పుణ్యమును.
అశోకుడు
నీవె నా కీనాడు
నిజముగా జ్ఞానంబు
కలిగించినావమ్మ
కరుణించినావమ్మ.
యుద్ధాలు త్యజియించి
బుద్ధి జ్ఞానము బెంచి,

హింస విడి నేనిక, అ
హింస వ్రతముగ నెంతు
ధర్మపాలన కొరకు
ధర్మచక్రము నుంతు.
(నేపథ్యము నుండి)
తథాగతుడు ఈ దారినె
తరలివచ్చెనమ్మ !
అభయముద్ర నందరికీ

అందిచ్చెగదమ్మ,
తరలివచ్చి, అభయమిచ్చి
వరములిచ్చెనమ్మ.
అశోకుడు (కత్తి నేలబారవైచి)
ఆగుమాగు మోస్వామి !
ఆగుము నిష్కామి !
బుద్ధ దేవు మార్గము, స
ద్బుద్ధి ననుసరింతు.

(నిష్క్రమించును)

(రాజవీధి)

బౌద్ధ భిక్షుకుడు

నిర్వాణ ఘనపథం, నిఖిల జనసాధ్యం.

బుద్ధం శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

సంఘం శరణం గచ్ఛామి.

అశోకుడు (ప్రవేశించి)

వెలుగు కొరకు ఇన్నాళ్లుగ

వీక్షించితి నేను -

శతవిధాల శాంతి కొరకు

సతమతమైనాను.

హింసజూచి కడకు నేన

హింస బూనినాను.

బౌద్ధ భిక్షుకుడు

నీ కోరిక నీ కృషియును

నిజముగ ఫలియించుగాక !

అశోకుడు

అందరికిని శోకము గూర్చిన నే

నశోకుడని పిలువంగ ననర్హుడ

అందరికిని ప్రియమొనగూర్చుటకై

అవిరళకృషి భువి సాగించువాడ.

బౌద్ధ భిక్షుకుడు

అందరియెడ ప్రియదర్శకుడగు ని

న్నా పేరున ప్రజలింక పిలిచెదరు !
ప్రియదర్శీ! ప్రియదర్శీ ! జగాన
ప్రియమునె అన్నిట దర్శనచేయుము.

అశోకుడు

స్వామి నన్నిక భిక్షువునిగా
నియమ మొసగి సమాదరింపుడు
ప్రేమ మార్గము, శాంతి మార్గము
ప్రియముగా నే ననుసరింతును.

బౌద్ధ భిక్షుకుడు
అటులనే ప్రియదర్శి అందుకో మా దీక్ష
రాణన్ ప్రజా హృదయ రాజ్య పాలన వీక్ష,
ధర్మ పాలనకు నై
ధర్మ చక్రముదాల్చి,
శాంత్యహింసల వెల్గు సత్పథమ్మున నిల్చి,
యుగయుగాలు తరించి,
జగజగాలు వరించి,
నీ మూర్తి నీ కీర్తి నీ
నిలుపుకో శాశ్వతము !!!
(నేపథ్యము నుండి)
బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి.

(తెరపడును)

ఒక సంగతి

కలలో ఒక సంగతి నా కళ్ళకు కనుపించింది
ఇలలో మాత్రం ఎప్పుడు, ఎక్కడ, నేచూడంది:
పిల్లలంద రన్ని పనులు పిలిచి చేసి పెడుతుంటే,
బుద్ధిగలిగి పెద్దలంద
రొద్దికగా కూర్చోడం ॥
విద్యార్థులు పాఠాలను
వేడుక బోధిస్తుంటే,
పంతులయ్య, ఎంతో శ్రద్ధ
ప్రతిది నేర్చుకోవడం ||

తల్లిదండ్రు లెవరైనా
పిల్లలు కావలసియుంటె
పిల్లలనే ఇష్టమడిగి
పిదప బిడ్డలుగ కనడం ॥
కులమని మతమని తేడా
కలికానికి కానరాని,
ఉన్నవారు లేనివార
టన్న భేదమేమి లేని ॥

ఎందుకు?

కాని లేని పేదకు సంతాన మెందుకు ?

జ్ఞాన శూన్యునకు ఘన సన్మాన మెందుకు ?

మోసకారి మనిషితో సావాస మెందుకు ?

ఆసలేని మతములొ విశ్వాస మెందుకు ?

శాంతిలేని వానికి సంక్రాంతి ఎందుకు ?

శ్రాంతిలేని పనిలో విశ్రాంతి ఎందుకు ?

పరము గోరు వానికి తర వరము లెందుకు?

ఖరము బోలువానికి అంతరము లెందుకు?

నీతిలేని బ్రతుకుకు ఒక రీతి ఎందుకు ?

ప్రాత రోత నీతులపై ప్రీతి ఎందుకు ?

చదువు

చదువు వల్ల నీ కన్నీ
సమకూడాలా లేదా ?
లేకపోతె చదువు వట్టి
లోక వంచనమ్మెకాదా ?
సహనము సమరస భావము
చదువు నీకు నేర్పకుంటె,
బ్రతుకుబాట నెటు తెలివితొ
పయనము సాగింతువోయి ?

కాలంతో పాటు నీవు
కదలుట అది ఎరుగకుంటె
అందరికంటే వెనుకనె
అట్టె నిలిచి పోదువు సుమీ !

ఎంతొ తెలుసు నన్నది, నీ
కే గొప్పయు కాదు నమ్ము;
ఆ తెలిసిన దాన్నొకింత
ఆచరిస్తె చాలు సుమ్ము.

చెప్ప గలుగుటే గొప్పని
చేయుట అది మరచిపోకు
చేతలలో చూపని నీ
చెప్పుట లవి నిష్ఫలమ్ము.

అన్ని పనులలో నీమము
అందరిపై కడు ప్రేమము
కలిగి నీవు నడచు కుంటె
కావలసిన దేమున్నది ?

వాదములకు భేదములకు
కాదు చదువు ఉపయోగము !
వాద భేదముల కతీత
స్వాదువర్తనము ముఖ్యము.

ఓ రైతా !

బండి తోలేటి ఓ రైతా ! రైత !
దండిగా పంట పండించు ఓ రైత !

ఎండలో వానలో
ఎల్ల వేళల నీవు
కండలను కరిగించి
కనకాలు పండించు ॥

ఈడు లేనీ జోడు
కోడెల్లురా నీవి :
కొమ్ములతో కరవు
క్రుమ్మి పారద్రోలురా ॥

బండి నడిచే వరకు

బలిమి కలిమీ నిలుచు ;
బండి నాపితె మాదు
గుండెలే ఆగురా ॥

పెద్దలు మీరు !
పిల్లల నైతే అంటారా !
పెద్దలు మీ రిట్లుంటారా ?
అభమూ శుభమూ ఎరగని వారిని
'అట్లని ఇట్లని' శాసిస్తారా,
అన్నీ తెలిసిన ఒకరి నొకరు మీ
రదే పనిగ ద్వేషిస్తారా ? ॥
మాటా పలుకూ రాని పిల్లలకు
మన్నన కడు బోధిస్తారా,
మానవతను పాటించక మీరూ
మాటలతో సాధిస్తారా ? ॥
మంచీ చెడ్డా నేర్వని వారికి
మించిన నీతుల నందిస్తారా,
మంచీ చెడ్డా నేర్చి ఇతరులను
మరి గోతులలో తోస్తారా ? ॥
పాపం పుణ్యం తెలియని వారికి
పరమార్థం వివరిస్తారా,
పాపం పుణ్యం తెలిసిన మీరో
పరహింస నాచరిస్తారా ? ॥

మంచి చెడులు

కదలని పట్టాలపైన కదిలె రైలు బండి
కదిలే కాలంతో తా కదలడు మరి మొండి ॥
మాట తెలియకున్న తెలివి తేట మసలు నెద్దు

మాట తెలిసి తెలివిలేక మసలు నయ్యొమొద్దు.

మాయని కడు గొప్ప పనులు చేయునెన్నొ నరుడు

చేసిన ఆ పనులనన్ని చెరుపును వానరుడు.

ఉన్నవారు చేతురు పన్నీటితో స్నానంబు

లేనివారు చేతురు కన్నీటితొ పానంబు,

మంచి చెడుగు లరసి నడచు మనుజులలో జ్ఞాని

మంచి చెడుల భేదంబునె ఎంచడు అజ్ఞాని.

ఆంధ్రప్రదేశావతరణము

(1-11-1956)

ఆంధ్రప్రదేశాని కవతరణ శుభదినము

ఆంధ్రులకు ఇది నేడు ఆనంద మతిభరము ॥

ముక్కోటి ఆంధ్రులిక - ఒక్కటిగ రూపిల్లి

మంచినే ఇక తాము - పెంచుకో గలరన్న ॥

తెలుగు మాగాణ మిక - దీప్తితో వెలిగేను

వెలుగులో సౌఖ్యాలు - వేవేలు కలిగేను॥

తెలుగన్న ఇకనన్న - తెలివితో నడువన్న

నడిచి నీ గౌరవము - నల్గడల నిలుపన్న॥

ఆంధ్రుడంటే వట్టి - ఆరంభ శూరుడను

పేరు తొలగగ కార్య - శూరుడవు కారన్న ॥

గతమంత మరచి ఆగతమునే మది దలచి

తెలుగు భూమికి తీరు తెన్నులను కూర్చన్న ॥

శ్రీరాము బలిదాన చితిపైన నేడాంధ్రి

చెదరిపోయిన సుతుల జేర్చుకొన్నది చూడు !

బడుగు పంతులు

బల్ల కట్టూ, బండి గుర్రం

బడుగు పంతుల జీవితం, అ

ట్టడుగు పంతుల జీవితం॥

ఎంత సాగిన అంతె దూరం

ఎంత లాగిన ఎంతొ భారం ॥

ఎంగిలాకుగ ఎంచి అందరు
ఎంతొ చుల్కన వాని జూతురు
పొంగు అను మాటసలెరుంగని
భంగి, మరిగే బ్రతుకు అతనిది ॥
గ్రామ పెద్దకు సేవ జేస్తే,
నియమ మది పాటించి నట్లే ;
పైని అధికారులకు
జోహా ర్పలికితే బ్రతు కెరిగినట్లే ॥
అతడొకనాడు రారాజట
అతని మాటకు తిరుగులేదట
నేడొ అతడొక బికారీ
నిలిచి బ్రతుకుట కనధికారీ
నిజము పలుకుట కనధికారీ ॥

అతని జీతం గొర్రెతోక
అతడు ఉన్నది పూరి పాక
అతని కడుపున కలిగె మూక
అతని భార్యకు చిరుగు కోక
తీరుతెన్నూ లేని అప్పుల
ఏరుపై తన బ్రతుకు నౌక ॥
మాటలు చేతలు
మాటలు కావోయ్ మనిషికి కొలత
చేత లవేనోయ్ చెప్పును ఘనత ॥

మాటలు చేతలు మరి వేరైతే,
మంచి యన్నదిక పెంచుట కల్లోయ్;
చేయని వెన్నడు చెప్పుట తగదోయ్
చేసిన పనులవె చెప్ప గలుగునోయ్ ॥
నీతులు దెల్పెడి ఖ్యాతి గలట్టివి
గ్రంథాలెన్నో కలవీ భువినోయ్ ;
అయితే పనులను ఆచరించుటకు
ఎందుకు మనుషులు ముందుకు రారోయ్?

మాటలు పనులకు మార్గము చూపిన,
చేతలు విలువను చేర్చు మాటలకు,
కాన పూనికతొ కట్టి నడుము నివు
చేసి చూపి పని, వాసి గాంచుమోయ్.

ఇల్లరికము

అత్తమామల పూజ - బక్తితో చేస్తాడు
ఇల్లరికము వచ్చిన - అల్లుడయ్య.
చింకిపాతిచ్చినా - చీదరించక కట్టు
ఇల్లరికము వచ్చిన - అల్లుడయ్య.

మాడు చెక్కల కూడు - మారు పలుకక తినును
ఇల్లరికము వచ్చిన - అల్లుడయ్య.

కసవూడ్చి పనిజేసి - మసిపాత్రలను తోము
ఇల్లరికము వచ్చిన - అల్లుడయ్య.

పెండ్లాము ఆజ్ఞలను - ప్రీతితో పాలించు
ఇల్లరికము వచ్చిన - అల్లుడయ్య.

పిల్ల పాపల శ్రద్ధ - నెల్లవేళల సాకు
ఇల్లరికము వచ్చిన - అల్లుడయ్య.
పల్లేరు పరుపుపై - పవ్వళించును తాను
ఇల్లరికము వచ్చిన - అల్లుడయ్య.

నిన్న, నేడు, రేపు
నిన్న లేక నేడు లేదు
నేడు లేక రేపు రాదు.
నిన్న నేడు లేక రేపు
నిజముగాను రాదు రాదు.

నిన్న నేర్చి నట్టి దంత
నేడు పనికి వచ్చు నెంతొ ;
నేడు నేర్చినట్టిదియును
నిలిచి రేపు పనికి వచ్చు ॥

నిన్న లాగె నేడు మాత్ర
మున్నదనుట పొరపాటగు
నేడులాగె రేపు కూడ
నిలిచియుండు ననుట తగదు ;

కాలమెంతొ శీఘ్ర గతిని
కదలి మార్పు చెందు చుండు ;
మార్పు అనున దెపుడుకూడ
మంచిగుర్తె కాలమునకు ॥

కదలి మార్పు వృద్ధి చెందు
కాలగతిని మానవుండు
అనుసరించి అభ్యుదయము
అందుకొనుట శ్రేయమగును.

ప్రాతదనుట క్రొత్తదనుట
పనికిరాని వాదనయగు
ప్రాత క్రొత్త మేలుకూర్పు
పనికివచ్చు ఫలితమిచ్చు.

మంచి యనునదంత మనము
ఎంచి తీసుకొనుట మేలు
బుద్ధి కది నిదర్శనమగు
వృద్ధికిన్ సుమార్గమెయగు.

గుడిలోని బొమ్మ

గుడిలోని బొమ్మకూ కోటి నైవేద్యాలు
మడి దున్ని పండించు మనిసి కన్నము సున్న
గుడిలోని బొమ్మకూ - కోటి దువ్వలువలు

మడిదున్ని పండించు - మనిసి కసలే లేవు.

గుడిలోని బొమ్మకూ - గొప్ప శ్రీ నిలయమ్ము

మడిదున్ని పండించు మనిసి కిల్లే లేదు!

తిండి, వస్త్రము, ఇల్లు నిండుకుంటే భువిని

కొండపై గుడికట్టి - కొలుపులా బొమ్మకు

ఎంతమోసము చేతువోయీ నరుడ ఇసు

మంత సిగ్గిల రాదటోయీ !

సుంక మందరి నుండి సులువుగా గుంజుకొని,

విరివిగా దేవునికి వేడుకలు చేస్తావు !

ఈ జగము మరపించి పై జగము బులిపించి

ఎల్లవారిని నీవు కొల్ల గొడుతున్నావు !

ఖరవిలాపము

ఇంతకూ నా దేమి పాపం

అంత నవ్వాయె నా రూపం

వింత పోకడ గల జగతి కా

సింత కనికరమైన జూపదె !

శిరము భారము !

స్వరము ఘోరము

నడక, రూపము,

కదు వికారము !

ఆకతాయిల, అల్లరికి నా

తోక కొక తాటాకు గట్టీ,

ఏక సంతోషించు పిల్లల

మూక కే కీడు నే చేసితి ?

బండ చాకిరి కొరకు, బట్టల

బరువు మూటలు మోయు కొరకును

నన్ను ఉపయోగించి అయొ నా

కున్న సహనము పరీక్షింతురు !

నీచపరచుటకు మరి నిందకు

నేనె కావలెను ఈ నరులకు ;

మూర్ఖ జనులను నాకు పోల్తురు

మూఢులను నా బిడ్డ లందురు !

కథలలో ననుగూర్చి మాత్రం

కవులు కాస్తెదొ వ్రాసినట్టిది

స్వార్థమునకే గుర్తు గాని, ప

రార్థమున కది గుర్తు కాదులె !

నన్ను ఇట్టుల బాధపెట్టే	కాని, నా హృది రేగు ఊహల
నరుని నైజము నే నెరుంగుదు;	లోని బాధను అతడెరుంగడు !

జగతిలో

ఏది చాల గొప్ప విషయ
మెరుగజెప్పు జగతిలోన?
మాఘ మందు విరియు మల్లె?
మలయ మారుతమా? లేక
మంచివాని చెలిమి ?
కాక, మరపురాని గొప్ప తలపు ?
తీయనైన కలయ ?
పోని, హాయిగూర్చు తేనెపాట ?
గర్వ మెరుగనట్టి కలిమి?
కనికరమును పొందు లేమి?
కడు సహజపు లావణ్యము ?
కనుల చెదరనీని కాంతి ?
స్వేచ్ఛ నెరుగునట్టి క్రమత ?
స్వచ్ఛమైన మధురవాక్కు ?
మాతృభక్తి?దేశభక్తి?
మంచినడత ? ధైర్యగుణము ?
శాంతి? ప్రేమ? త్యాగనిరతి ?
సమతభావ మందరియెడ ?
మొగము మొత్తనట్టి తృప్తి ?
మోస మెరుగనట్టి స్వార్ధ ?
మెరుగజెప్పు ఏది ఘనము,
ఎంచి చూడ జగతిలోన ?
ఒక్కటైతె కాదు ఇందు
ఒప్పుమీర ఘనమైనది
అన్ని కలిపి యున్న జగము
అందము, ఆనందమయము.

ద్వేషం

అతని పేరెత్తితే కోపం
అతనిపై నాకసలు కోపం
అతని జాడా, అతని నీడా
అంత కనబడితే సహించను.
చేరవచ్చీ, నోరువిప్పీ
మాట్లాడితె మండిపడతా ;

ఒక్కనాడత డెందుకో నా
పక్కగా రావడము జరిగెను.

కళ్లు నిప్పులు చేసి చూసీ,
పళ్లు పటపట మంటు నూరీ,
ముక్కు పుటలను పెద్ద చేసీ
ఒక్కసారిగ హుంకరించా.

చిత్రమాతడు నవ్వుతూ తన
చేతితో నా భుజము తట్టుతు
''ఏరబాబూ! ఇంత కోపం
ఎందుకో చెప్పు నీకు పుణ్యం

కాస్త ఆలోచించు నీకే
వాస్తవమ్మది తెలిసిపోవును;
మనం మనమూ ఇదే రీతిగ
మసలుతూ ద్వేషించుకుంటాం
పళ్లు పటపట కొరుక్కుంటాం

కళ్ళు ఎఱ్ఱగ జేసుకుంటాం
ఒళ్లు మరచీ కొట్టుకుంటాం
అన్ని జరిగిన పిదప ఇక మరి
అలసి ఇద్దర మూరుకుంటాం

పెద్దవాళ్లము అయిన పిమ్మట
కొద్దిగా ఇది జ్ఞప్తికొస్తే,
నవ్వురాదూ, నీకు నాకూ?
నువ్వె చెప్పర, సిగ్గుపడమూ?"
అంటు ఆతడు మనసు ఇచ్చీ
కంటిలో కన్నుంచి చూస్తే,
భయము సిగ్గూ కలిగి నే నిల
బడితె ఒట్టు ఇక పారిపోతిని
ఉంటినా నేనతని పాదా
లంటు స్థితి వచ్చేది అప్పుడు

పూలబాలలు

పూల బాలలు

తూరుపు గాలీ తూతూ మంటూ

వెదురు పొదలలో రొదలు చేయగా

మబ్బులు క్రమ్మీ దబ్బున వానలు

కుండ పోతగా కురిసిన వెంటనే

అందము చిందే వందలు వందలు

చిన్నవి పెద్దవి ఎన్నో రంగులవి

బిలబిల మంటూ కలకల మంటూ

పూల బాలలూ నవ్వుతు వచ్చెను

అంతవరకు అవి అడుగున ఎక్కడొ

బడిలో చదువుతు బైటికి రావా?

వానలు వస్తే వాటికి - అమ్మా

ఆట విడుపటే? ఔనా! చెప్పవు?

వానలు వస్తే వద్దు బైటకని

ఇంటిలొ కూర్చో అంటావే నను?

వానలొ పువ్వులు నానుతు వుంటే

వద్దని అనదే వాళ్ళ అమ్మ మరి?

ఆటలు ఆడీ అలిసిన పిమ్మట

పూల బాలలూ పోతవి ఇంటికి

ఆకస వీధిలొ అమ్మా వాటికి

కలదొక ఇల్లూ తెలుసా నీ కది?

చీకటి వేళలో ఆకస వీధిని

అమ్మకు చుట్టూ అవిచేరీ, అట
పక్కలు పరచుక పవ్వళించితే,
మినుకు మినుకు మని మెరసి పోవునే.

తప్పటడుగుల పాప
తప్ప టడుగుల పాప
విప్పినా తెరచాప
ఊగుతూ తూగుతూ
ఒయ్యార మొలుకుతూ
సాగిపోయే తీరు వేగమే కనరండు...
కరములే చిరుతెడ్లు
కలకలలె తరగల్లు
చిరుతెడ్లు సాచుతూ
చిరుమాట లాడుతూ
ఆగకే పయనించు వేగమే కనరండు...
అమ్మా, నాన్నా, ప్రేమ
నందులో నింపిరి
అమ్ముటకు ఆ సరుకు
ఆనంద తీరాన
జాగుసేయక రండు వేగమే కొనిపొండు.

బాలవర్ధనుడు

కోయిల ఒక్కటి 'కో' యని పాడగ
కొమ్మను విరిసెను కోటిసుమాలు
సుమముల తేనెను జుర్రుకొనుచు తా
కమ్మని గానము తుమ్మెద సలిపెను.
గానము వింటూ గలగల మంటూ
పరుగు పరుగునా పారెను ఒకనది
పారే నదిపై పైడి నావపై
అందము లొలికే చందురు డట్టుల
కిలకిల నవ్వులు ఒలికించుచు తా
బాలవర్ధనుడు పయనించాడు !

అద్దములో పాప
నీలియాకాశమే
నిలువుటద్దమ్మ!
నిలువు టద్దమ్ములో
నీడ మా పాప!
అందాల నెమ్మోమె ఆ పాలపుంత
కంటిలో తళతళలె మింటి నీలాలు

చిన్నారి హృదయంబె మిన్నేటి తరగ
తరితీపి లేనవ్వె తరగపై కలువ
రంగారు లీలయే చెంగల్వడోల
డోలలో ఊగేటి బాల చందురుడు

అద్దములొ అలరారు
అందాల పాప
ముద్దుగొన రారండి
సద్దు సేయకను !

ఉన్నవారి బిడ్డ - లేనివారి బిడ్డ

ఉన్నవారి బిడ్డ కనక
ఊరకల్ల రెంతొ చేయు
మూడు వేళ స్నానమాడి
మురికి మురికిగానె యుండు
దుస్తు లెన్నొ కలిగి యుంట
తుక్కు తుక్కు చేయుచుండు
మాట మంతి చేతకాదు
కోటి బూతులాడు చుండు
చదువురాదు గాని సరిగ
ఎదురు పలుకుచుండు నెంతొ
చక్కగాను తిండి తినక
ప్రక్క నెంతొ వదలుచుండు
అదుపు ఆజ్ఞలేక ఊర
నంత తిరుగుచుండు నెపుడు
లేనివారి బిడ్డ కనక
కాని పనుల కడకు పోడు
స్నాన మొక్కమారె చేసి
చక్కగాను ఉండు దినము
ఉన్నదుస్తు లొకటొ రెండొ
ఉంచుకొనును చిరగకుండ
మాట మంతి నేర్చి మసలు
నోట బూతులాడ డెపుడు
చదువు సంధ్య లెంతొనేర్చి
చక్కనైన పేరు పొందు
క్రింద నొక్క మెతుకు రాల్చ

కందముగా తిండి తినును
పెద్దలన్న గౌరవంబు
పేదలన్న జాలిమెండు
మాట అనదు ఒకరి నెపుడు
మాట పడదు ఒకరిచేత !

సుందరి

ఇల్లెగిరేలా - అల్లరి, ఏడుపు
ఎవరమ్మా ! అది ఎవరమ్మా?
ఉప్పెనగాలీ, తెప్పున దెచ్చిన
దెవరమ్మా? అది ఎవరమ్మా?
కంటికి కడవెడు కన్నీ రెట్టే
దెవరమ్మా? అది ఎవరమ్మా?
గ్రుడ్ల నీటితో - గుడ్డలు తడిపే
దెవరమ్మా? అది ఎవరమ్మా?
ఏడేళ్ళున్నా ఏడుపు మానని
దెవరమ్మా? అది ఎవరమ్మా?
కూచోమంటే - కూచోనంటూ
ఆడుకొమ్మంటె - ఆడుకోనంటు
ఏది చెప్పితే అది చెయనంటూ
కాళ్ళూ చేతులు కడు విదిలిస్తూ
అంతూ పంతూ లేని అల్లరిని
పంతాన్నే సాగించే పిల్లట
ఎవరమ్మా? అది ఎవరమ్మా?
చుట్టుపట్ల నున్నట్టి వారలూ
చోద్యముగా చూడొచ్చిరటమ్మా
వచ్చినవారిని చూస్తే ఏడుపు
వహ్వారే! కడు హెచ్చెనటమ్మా?
ఎవరమ్మా? అది ఎవరమ్మా?
కన్నీరయ్యో కాల్వలు గట్టే !
కన్నీరయ్యో మున్నీరయ్యె !!
చక్కని సుందరి
ముక్కుమీద యిక
నాని నాని మరి
నాచు మొలచులే !

చందమామ

అందమైన చందమామ
ఆటలాడ దిగి రా!
జంటలేక ఒంటిగానె

మింటి మేడ నుంటివే

కొంటెగాను మింటినుంట

తంటలేదు తరలి రా !

మక్కువలర చుక్కలతో

అక్కడనే ఉందువా?

చక్కగ మాతో నాడగ

ఇక్కడ కే తెంతువా?

అందమైన చందమామ

ఆటలాడ దిగి రా !

ఆకాశవీధిలో

ఎగిరి ఎగిరీ ఎంతొ - ఎంతో పై పైకి

మొయిలు బాలల నెల్ల - ముద్దుగొన్నాను.

తిరిగి తిరిగీ పైన - దివినెల్ల తిరిగి

విరజాజి చుక్కలతో విహరించినాను

ఆడిపాడీ తుదకు - ఆనంద మలర

చందమామతొ ప్రేమ - విందుగుడిచాను

ఆకాశ వీధిలో అందాల పొన్న

పొన్నచెట్టూ నీడ - ఉన్నదొక అవ్వ

రాట్నంబు త్రిప్పుచూ - రాగంబు పాడు

పాడేటి ఆ యవ్వ - పాటకే కరిగి

చదలేటి నీలాలు - కదలి నాట్యంబు

పరవశంబున చేయు - సరిగ రాత్రులలో

అన్నీ వచ్చు

మాటలు ఎన్నో

మల్లుకు వచ్చు

మాటల తీరును

మధురిమ మిచ్చు

పాటలు ఎన్నో బాబుకు వచ్చు

పాడితె పిట్టలు బాగుగ మెచ్చు

ఆటలు ఎన్నో అబ్బుకు వచ్చు

ఆడితె నెమళులు అందుకు మెచ్చు

అల్లరి యెంతో అతనికి వచ్చు

అందుకు సైఁయన అబ్బురమిచ్చు

చేతలు ఎన్నో చిన్నకు వచ్చు

చేసిన గొప్పలు చెప్పగవచ్చు

ఆగ్రహం - సత్యాగ్రహం

ఎందుకులేవే అమ్మా

పెందలకడె పడుకుంటా

మాట మంతి లేక మీరు

మౌనంగా వున్నారు !

తాతా అవ్వా ఉదయం

తలో రెండు అనుకొనిరి

నాన్నా నీవూ ఇప్పుడు

నాలుగేసి అనుకొనిరి

అనుకొనిరీ, అనుకొనిరీ

అంతా మీరనుకొనిరి.

పంతాన్నే అనుకొనిరీ

పలుకకుండ కూర్చొనిరి.

అవ్వ వంట చేయనంటె

అందుకు తాతయ్య అలిగె

వండి నీవు ఊరుకుంటె

మండిపడుతు నాన్న అలిగె

అవ్వ అలిగె తాత అలిగె

అమ్మ నీవు, నాన్న, అలిగె

అలిగినారు మీరంతా

అలిగినారు ఇల్లంతా

అందరమును భోజనాలు

పెందలకడనే చేసి

పక్కలన్ని వరుసగాను

పరచి నిద్రపోక ముందు

తాత, అవ్వ, నాన్న, నీవు

తలో కథను చెప్పి నన్ను

నిద్ర బుచ్చుచుంటిరి కద!

నేడు ఇట్లు ఉంటిరికద !!

సీతాకోక చిలుక

సీతాకోక చిలుకా
చే తాకితే అలుకా
పూవులందు పూవువోలె
ఆకులందు ఆకువోలె
రంగు రంగు చీరగట్టి
రయమున తిరిగేటి ఓహో...
బాల్యమందు అందముగా
ప్రాణులన్ని ఉండుగాని
ఎందువలనొ నీవుమాత్ర
ముందు వపుడు చీదరగా...
పూలనున్న తేనెకొరకు
చాల దవ్వులకు పోదువు
అంతెగాని ఎవరికేని
సుంతకీడు తలపవీవు...
ముట్టుకొనగ నీదురంగు
అట్టెమాసి పోవుగాని
చూచుచుండ అంతలోనె
చోద్యముగా తిరిగివచ్చు....
పల్లెటూరి పిల్లలు
పల్లెటూరి పిల్లలండి మేమూ మా
వల్లగాదటంచు చెప్పబోమూ
చెట్టు లెక్కగలము పెద్ద
గుట్ట లెక్కగలము మేము
పట్టుదలకు వస్తె ఎంతో
పెట్టినదీ పేరు మేము...
చెరువులందు కాల్వలందు
చెలగి పెద్ద నదులయందు
ఈదగలము ఓర్పుతోను
ఎంతొ ఎంతొ నేర్పుతోను
ఆటల పోటీల యందు
అందె వేసినట్టి చేతు
లండి మావి ఎవ్వరైన
రండి మాతొ ఆడిపొండి
పాటలంటే భజనలంటె
వాటమైన కోపులంటే
మేటి మగలమయ్య మేము
మెప్పుకూడ పొందినాము
పండుగలకు పబ్బాలకు
వండిన వంటకములకూ
దండుగ లేకుండ మేము
తగిన జవాబీయ గలము
మోసములకు దోసములకు
దాసుల మేమసలు కాము
రోసమంటె మాదె సొమ్ము
కాసుకు పై గురుతు సుమ్ము.
అందరానిది అడగరానిది
అమ్మ కడుపున ముగ్గురు
అందగాళ్ళు కుమాళ్లు
అందు అమ్మకు ఎవనిపై

అందరానిది అడగరానిది
అమ్మ కడుపున ముగ్గురు
అంగాళ్ళు కుమాళ్లు
అందు అమ్మకు ఎవనిపై
ఆదరంబది ఎక్కువ
అన్న విషయము తెలుసుకో

నందరానిది అడగరానిది
ఒకడు రాతిరి నిద్రపో
తున్న వేళనె మనసులో
'అమ్మకన్నిట సాయమే
అవసరంబ'ని తలచెనూ
తిరిగి నిద్దుర లేచువేళకు
అరిగె నెటకో వాని యోచన !
ఒకడు అమ్మతొ మాటగా
ఒప్పు మీరగ ఇట్టులనెనూ
"అమ్మ నే నీ కన్ని పనులూ
ఆచరింతును పుత్రుడనుగా."

అన్న మాటలు పిదప మరచీ
ఆటలాడగ పోయె నతడూ
ఒకడు మాత్రము అమ్మకన్నిట
సకల సాయము చేసె నిజముగ
మనసు చేతను మాట చేతను
పనుల చేతను తనయు లట్టుల
సేవ జేసిరి అమ్మ కందరు
చెప్పు మెవడో అధికు డందున
అందు అమ్మకు ఎవనిపై
ఆదరంబది ఎక్కువన్నది
అడగరానిది అందరానిది

చిన్నారి బాల

చిన్నారి పొన్నారి చిలుకవే నీవు
అందాలు చిందేదీ ఆణిముత్తెమవే
తొలిరేయి కలువలో తొంగిచూచే ఈవి
తెలిమల్లె యుల్లమున తీయతియ్యని తావి
చిరుగులాబీ బుగ్గ చిందులాడే సిగ్గు
దొండ పండెరుపులో నిండు నవ్వుల నిగ్గు
కలకంఠ గానాన విలసిల్లు ఓబాల!
కలహంస యానాన మురిపిల్లు ఓ బాల!
బుడి బుడి నడకలు నడచితివో
చిటి చిటి మాటలు చిలికితివో
కిలకిల నవ్వులు విరిసితివో
మిలమిల కన్నుల మెరసితివో
అల్లరి కొల్లగ జేసితివో
అందరికందము గూర్చితివో

బాలతీరు

ఆకాశ పథాల కెగురు
నట్టి శక్తి గల్గి బాల
అమ్మ హృదయ తల్పముపై
నట్టె నిదుర దోగు చాల ;
మధువు గురియునట్టి మంచి
మాట లెరిగి జ్ఞానబాల
తల్లి నోటి మాటలె విని
తనివి జెందు తాను చాల
కలుము లెన్నొ పుట్టుకతో

కలిగియుండి పైడి బాల

అన్నపూర్ణ తల్లి భిక్ష

నడిగి బ్రతుకుచుండు చాల

అడ్డులేని స్వేచ్ఛ నెంతొ

అద్భుతముగ కలిగి బాల

అయ్యొ తల్లి కౌగిలిలో

అణగి యుండునట్టె చాల

ఆటలతో పాటలతో

ఆనందము నొందు బాల

అమ్మ ప్రేమ జాలిబడయ

నశ్రువులను రాల్చు చాల!

జగమంతా తెలివెన్నెల

జడుల నింపు చలువబాల

తల్లికంటి కొన మెత్తని

తళుకులలో కులుకు చాల !

అమ్మ

కన్ను తెరచిననాడె కన్నాను ఆ ముఖము

కమనీయ మైనట్టి కరుణార్ధమైనట్టి.. ఆ ముఖము

అంద మానందంబు

అపురూప మార్దవము

అందు వెలుగొందేను

విందుగా విరివిగా...

చీకట్ల తారాడు

చీకాకు బ్రతుకులకు

కాంతి మార్గము చూపు

శాంతి సుఖముల నింపు...

ఏ తీరమేగినా

ఏ త్రోవ సాగినా

ఏ గద్దె నెక్కినా ఎంత ఘనతెక్కినా

మరతునన్నా కనుల మరపురానీ ముఖము

ఆ ముఖము ఎవరిదని అడుగుదే? అమ్మదే.

బడిపాటలు

భావిజగతికి ఏలికలు -

బాలకులం బాలికలం

భావిజగతి కేలికలం

పెంచిన తల్లిదండ్రులహృది

నించు ప్రేమ మాలికలం||

ఆటల పాటల వెలుగుల

బాటల జను మిత్రులం

చీమకైన కీడెరుగని

చిని చిన్ని పవిత్రులం||

అందము కనువిందు జేయు

నందన మందారములం
తీయని కెందమ్మివిరుల
తేనెసోనపూరములం||
మిలమిల తలపులు మా క
న్నులలో తిలకించెదం
కిలకిల నవ్వులు మాపెద
వులపై నొలికించెదం॥
అల్లరి మల్లెలు కొల్లగ
జల్లి గుబాళించెదం
అల్ల బిల్లి పలుకులల్లి
ఉల్లము రంజించెదం॥

కదలిరమ్ము

కాలము మారెనుర ఇంక
కదలి రావదేమి శంక?
కులమత భేదముల ద్రుంచు
ఇలనందర సమతనెంచు||

పరిపాలన లోన నీవు
పలు ఇడుమలు పొందినావు.
కాని స్వేచ్ఛవచ్చె చూడు
కనులు తెరచి, ముందునడు||

వేదమంటు శాస్త్రమంటు
వాదమేలనోయి? మాను.
నీదు ధర్మమేమొ తెలిసి
పాదుకొల్పు శాంతి సుఖము॥
శిథిలమైన వేవొ ప్రాత
సిద్ధాంతము లవల త్రోసి,
మారు చున్న జగతి, ప్రగతి
మార్గమెంచు, అనుసరించు||
"మతం నమ్మకానికి అందమైన బురఖా.
నాస్తికత్వం నమ్మకానికి నాంది".

ప్రయాణాలు

కాలినడక పోవువాడు
కాని డబ్బు లేనివాడు
ఎద్దుబండి నెక్కువాడు
పెద్దల కాలపువాడు
జట్కాలో పోవునొకడు

పడవ ప్రయాణంబువాడు
తడవైనను లెక్కగొనడు.
ఓడ ప్రయాణంబువాడు

ఉదధులన్ని దాటువాడు.
సైకి లెక్కి తిరుగువాడు
చర చర పనులున్న వాడు;
ప్లెజరు కారు నెక్కువారు
పెద్దమనిషి శ్రీ మంతుడు
బస్సు ప్రయాణంబు చూడ
బహు జనులకు సులువునేడు.

1 "ధానధర్మాలను గురించి ధనవంతులు మాట్లాడతారు శ్రమలో ఉన్న గొప్పతనాన్ని గురించి సోమరిపోతులు వుపన్యాసాలిస్తారు."

రైలు ప్రయాణంబు వారు
రమ్యదేశ యాత్రవారు.
గాలి యోడ నెక్కువాడు
ఘనుడు మంత్రి గవర్నరగును.
రిక్షాపై నెక్కువారు
లక్షలలో ఉన్నారూ.
ఒంటి మీద పయనాలవి
ఓడయని ఎడారులలో,
చారల గాడిదల నెక్కి
చాలమంది వ్యాపారులు,
జడల బర్రెలెక్కి కూడ
చలి తీరపు కొండలపై
చేయు చంద్రు ప్రయాణాలు
చిత్ర చిత్రముగ వారలు.

1. ''అన్ని విషయాలు సమగ్రంగా తెలిసిన వాళ్లు. అసలు ఏమీ తెలియని వాళ్లు మనల్ని ఆకర్షిస్తారు.

2. "అంతరాత్మ, భయం రెండూ ఒకటే, భయం అనే కంపెనీకి అంతరాత్మ ఒక వ్యాపార నామం".

కొత్తల్లుడు

అత్తవారింటి కట - కొత్తల్లుడొస్తే,

కొత్తసున్నము దెచ్చి - మెత్తండి బాగ.

కొత్తసున్నము పూత - కోపంబు దెస్తే,

నల్లేరు తెప్పించి నలపండి పైన.

నల్లేరు నలపంగ నసనసా లాడితే,

దూలగుండాకుతో దులపండి మీద.

దూలగుండాకుకే దుఃఖంబువస్తే,

బర్రె పలుపులతోటి బాదండి బాగ.

బర్రె పలుపుల చేత - బాధ హెచ్చైతే,

కర్రలే తెప్పించి కటిక మోదండి.

అబ్బబ్బ అత్తింట ఆటలేనంటే,

తాను వచ్చిన తోవ దయచేయు మనుడి.

1. "నవ్వుతో స్నేహం ప్రారంభం కావడం మంచిదే. స్నేహం అంతమయ్యే సమయములో కూడ నవ్వు మరీమంచిదే."

2. "ఎంత సామాన్య విషయమైనా దాచినప్పుడు దానికి అందం ఎక్కువ."

3. "ఆరాధింపబడడం కంటె, ఆరాధించడం మంచిది,"

ఆవూ హరిశ్చంద్ర

ఆవూ హరిశ్చంద్ర	పిన్నలయ్యు జ్ఞాన మందు
అనురాగపురం బడిలో	మిన్న లనగ చెల్లు చాల !
అందరు పిల్లలు వయసున	పంతులు గారొక రోజున

పాఠాంతము నందు జెప్పె:
'ఆడి తప్పరాద'నుచును
'ఆవూ పులి కథ' ఒక్కటి
'ఆడి తప్పరా ద'నుచును
'హరిశ్చంద్రు కథ' ఒక్కటి
కథలు రెండు పూర్తిచేసి
కడకు ఒక్క ప్రశ్న నతడు :
"ఏ కథ మీ మనసు నకును
ఎక్కువ మక్కువ గూర్చెను?"
అని యడిగిన తక్షణంబు
అందరు ఒక మాట గాగ
'ఆవూ పులి కథయే మా
కందరికీ ఇష్టమనిరి.
అనగానే చకితుడైన
అయ్యవారు తిరిగి ప్రశ్న
'ఎందుచేత ఆ కథ మీ
కందరికీ ఇష్టమయ్యె?'
జంకు గొంకు లేక అపుడు
చక్కగ యోచన జేసిన
బుద్ధి మంతు డొకడు లేచి
ముద్దుగ యిటు వివరించెను.
"హరిశ్చంద్ర చక్రవర్తి
ఆడి తప్పనట్లు మాకు
ఎంతసేపు యోచించిన
సుంత తెలియరాదు కథను !
మాలలన్న చిన్నచూపు
మహరాజగు వాని కెంతొ
ఎడ్డె మనిషి వోలె కన్న
బిడ్డనమ్మి, భార్య నమ్మి
కరుణ లేని వాడటన్న
ఘనత కూర్చు కొనెను చాల.
ఆవుతల్లి యట్లు గాక
ఆడి తప్ప లేదు పైగ
కన్న లేగ కయ్యె పాలు
కడుపు నింద యిచ్చి తిరిగి
క్రూర జంతు బలికి తాను
ధైర్యముగా నడచి వచ్చె.
ప్రేమ యందు సత్యమందు
పెద్ద లెరుగరేమొ గాని
ఆవుకున్న గొప్ప జూడ
హరిశ్చంద్రు కెక్కడుంది?"
ఆ మాటలు విన్న పంతు
లాశ్చర్యము చెంది వేగ
'ఔరా పిడుగా!' యనుచును
అతని మెచ్చుకొనియె నెంతొ !

ప్రహ్లాదుడు

పంతులయ్య ఒక్కనాడు
ప్రహ్లాదుని భక్తి కథను
బాలకులకు చదివి చెప్పి
భక్తవరుల జేయ దలచె
బాలకులును కడు శ్రద్ధగ
భాగవత పురాణ కథను
ఆలకిస్తు ప్రశ్నలెన్నొ
అద్భుతముగ అడిగినారు
తల్లి కడుపు నున్న నాడె
తాను వినెను జ్ఞాన బోధ
లనగ లేచి బాలుడొకడు
అడిగె నీ విధాన ప్రశ్న.
''అమ్మ కడుపు నున్న నాడె
ఆ కాలంలో పిల్లలు శ్రద్ధగాను బుద్ధిగాను
చదువులన్ని వినెడి వార?"
పంచవర్ష ప్రాయ మందె
ప్రహ్లాదుడు గొప్ప తెలివి
తేట గలిగి పెద్దలకే
తెలియ జెప్పె బోధలనగ
"ఆ యుగమున గల పెద్దలు
అయితే జ్ఞాన సంపద గల
చిన్న వాండ్ర నుండి కూడ
ఎన్నో నేర్చు కొనెడి వార?"
అన్యకాంత లెదురొచ్చిన
మాన్యుడైన ప్రహ్లాదుడు
మాతృభావ మెంతొ తనదు
మదిని యెంచి మసలె ననగ
అమ్మ యనుచు తలచె నేమొ
అనుచు పలికె నొక్క కుర్ర !
కాని గురువుగారు దాని
కాదటంచు తిరిగి తాను
చెప్ప నలవి గాని చాల
గొప్ప భావ మతని దనెను.
అంత గొప్ప భావ మైతె
అందుకోను మాకు శక్తి
లేదు బాబు అంటు బెంచి
మీద కూరుచుండె కుర్ర !
పెద్దలందు గౌరవంబు
పేర్మి గురువులందు భక్తి
కుదురు కున్న వాడు చాల
గొప్ప గుణుడు ప్రహ్లాదుడు
తన యందునను నిఖిల భూ

తము లందున నొక్క భంగి
సమహిత తత్వంబు తాను
చక్కగాను నెరపై ననగ
అది మాత్రము సత్యము కా
దని నే చెప్పెద గురువర !
జన్మనిచ్చి నట్టి పితను
జ్ఞాన మిచ్చినట్టి గురుని
తప్పులెంచి చూపినాడు
తగున యిద్ది గుణన కెందు?
ఆ మాటలకెంతొ గురువు
ఆశ్చర్యము జెంది కడకు
అన్నిటిలో పరమాత్ముని
అతడు చూచెననుచు పలుక
తెలివి గలిగి నట్టి ఒక్క
తేకువ గల కుర్ర లేచి

అన్నిటిలో చూచినట్టి
ఆ పరమాత్ముని నైతే
తండ్రిలోన చూడలేదె?
తప్పుకాద గురుదేవా?
అన్న పలుకు విన్న గురువు
అగ్గిమీద గుగ్గిలమై
ఎవరి చెడ్డ బోధలు విని
ఈ తీరున తయారైరి
చవటలార! సిగ్గులేదె?
చాలు నోరు మూయుడింక
ఆ మాటకు పిల్లలంత
మోమోటము లేక అనిరి
పరుల బోధ విని చెడుటకు
ప్రహ్లాదుల మేము కాము

ఏకలవ్యుడు

ద్రోణాచార్యుం డస్త్రవిద్యలో
దొడ్డ నేర్పు గడియించాడు
కురుపాండవులకు హస్తిపురంబున
గురువుగా నియమితుడైనాడు.
అతడు బ్రాహ్మణుండై జీవికకై

అస్త్రవిద్య చేపట్టాడు
ప్రతీకారమును ద్రుపదునిపై పగ
బట్టి తీర్చుకో దలచాడు
అర్జును డాతని కోర్కె తీర్చుటచె
అందరిలో కడు ఎంచాడు

అస్త్ర విద్యలో మెలకువ లన్నీ
అతని కెక్కు వందించాడు
ఏకలవ్యు డొక ఎరుకరాజు కొడు
కెంతో భక్తిశ్రద్ధ గలాడు
అస్త్రవిద్య ద్రోణాచార్యుని కడ
అభ్యసింప దలకొన్నాడు.
అనుభవమ్ము మును కలవాడగుటను
అతని దండ్రి వారించాడు
కాని పట్టుదల గట్టి నమ్మికను
కలిగి వాడు అది వినలేదు
మాయా మర్మం బెరుగని వట్టి అ
మాయకుండు అతి ఉత్సుకతన్
ఏకలవ్యు డొకనాడు ద్రోణుకడ
కేగి యిట్లు ప్రార్థించాడు.
"విల్లుపూని గురిపెట్ట విద్య మీ
వల్ల నేర్వగా వచ్చాను
అది నేర్పితె మీకెంతో ఋణపడి
ఆజన్మము పడి ఉంటాను."
అన్న ప్రార్థనము విన్న ద్రోణుడపు
డన్నా డతనితొ నిర్దయగా
పెద్దవారితో విద్దె నేర్చుటది
కొద్దివానికిన్ కూడదని
అధికులైన రారాజ పుత్రులతొ
అధము జేర్చుటది కూడదట
అందుకే కర్ణుని విద్యనేర్పనని
అతడు తిరిగి పంపించెనట.
ఉన్న ఘడియలలొ ఏకలవ్యుడట
కొన్ని సంగతులు చూశాడు
చూసి వాని నతడట్టె సర్వమును
సూక్ష్మబుద్ధి గ్రహియించాడు
ఆ మాత్రపు టవకాశం బిచ్చిన
యందులకే కడు కృతజ్ఞుడై
గురువుగ ద్రోణుని ఏకలవ్యు డిక
గురుతుగ లో భావించాడు.
ద్రోణు ప్రతిమ నొకదాని మట్టితో
రాణ మీరగా చేశాడు.
భక్తి నిలిపి శరవిద్య నేర్చి బహు
పారంగతు డతడైనాడు.
కొన్ని దినంబులు గడచిన పిమ్మట
కురు పాండు సుతులు వేటకునై
వెడలి చవిచూచి రేకలవ్యు విలు
విద్యా ఘన నైపుణ్యమును.
అంత అసూయాహతుడగు అర్జును

డాచార్యుని కడకేగి
'తనను తన గురుని తలదన్నిన యొక
ఘనుని విలుకాని గంటి' ననె !
అదివిని ద్రోణుం డాశ్చర్య మొంది
అర్జుని దోడ్కొని వేవేగ.
ఏకలవ్యు కడకేగి వాని కృషి
సాకల్యంబుగ జూశాడు
గురుదేవుల ఆ యాగమనంబును
గొప్ప వరంబుగ భావించి
ఏకలవ్యు 'డిది యంత మీ దయయె
మీకె యర్పితంబ'ని పలికె.
అంతట ద్రోణుం డాలోచనతో
అప్పార్థునె తన మదినెంచీ
ఎరుక కుమారుని దక్షిణాంగుళిని
గురుదక్షిణగా నిమ్మనెను.
అంత యదృష్టం బబ్బినందులకు
స్వాంత మందు నుప్పొంగీ
తక్షణంబు తన బొటనవ్రేలు
గురు దక్షిణగా నత దర్పించే !
అంతలోనె అట కెరుకరాజు కడు

ఆత్రముతో నరుదెంచాడు
గురువు తన ముద్దుకొమరు
కొనర్చిన ఘోరంబును తిలకించాడు.
'గురువుగ నుంటకు ఒప్పుకొనని నువు
గురుదక్షిణ నిటు కోరావ?
రాక్షసివై ఈ ఘోరాన్యాయం
పక్షపాతమున జేశావ?
రాజ్యకాంక్ష రణఖేలోత్సుకతను
రాలేదు విద్యకై సుతుడు
పశుగణ రక్షణ కొరకు శరవిద్య
బడయ నతడు వచ్చాడు

అధికుల మనుకొను మీరేగా మరి
అన్యాయాలకు పాల్పడుట
అన్యాయాలను అతినేర్పుతొ మీ
రాదర్శాలుగ పేర్కొనుట!
తండ్రి మాటలవి తనకు ములుకుల
ట్లుండ సుతుడు వ్యథ చెందాడు
గురువు స్థాణువై గొప్పలజ్జతో
ఎరుకరాజు క్షమ వేడాడు.

జాబాలిబిడ్డ

ఎంతోకాలం క్రిందట
ఈ విషయం జరిగిందీ
అయినా నేటికి కూడా
అటులే ఇది పడివుందీ.
గౌతమ మున్యాశ్రమ మది
గౌరవ సచ్ఛాత్రుల కది
బ్రహ్మవిద్య నేర్చుకొరకు
ప్రాంగణమై వెలసిందీ!
ఒక దినమున గౌతమఋషి
సకలార్థ విభూతి గలది
బ్రహ్మవిద్య శిష్యులకై
ప్రారంభము చేయబోవ –
పరతెంచెను అచటి కపుడు
పండ్లుపూలు చేత దాల్చి
కడు చిక్కిన బాలుడొకడు
కన్నుల కాంతి గలవాడు
బాలకుణ్ణి చూచి, శిష్య
పరమాణువు లంత తమలో
గేయాలు, గేయ.
గుసగుసలెవొ పోయినారు
గురుతుగొన్న కారణాన.

భక్తి మెరయ గురుదేవుల
పాదాలకు మ్రొక్కి వాడు
పండ్లు పూలు నిచ్చి పలికె
నిండు కోర్కె వ్యక్తపడగ -
"అయ్యా! నే బీదవాడ
ఆశతోడ వచ్చినాడ
వేదవిద్య నేర్పి నాకు
మీ దయను ప్రసాదింపుడు"
ఆ మాటలు విన్న మౌని
అన్ని దిశల చూచి వాని
ఎందులకో కొన్ని ప్రశ్న
లీ విధముగ అడిగినారు.
"బాలక! నీ కులమదేమి?
బాలక ! నీ గోత్రమేమి ?
తల్లిదండ్రు లెవరు? చెప్పు
తగుదో లేదో విద్యకు !
ఆ ప్రశ్నలకుత్తరంబు
ఆ బాలకు డెరుగడయ్యె
అదిగని శిష్యులు పెద్దగ
అల్లరిగా నవ్విరయ్యె !

జాబాలి కుమారుడంచు
జాతి జన్మ లేదటంచు
ఎరిగియుంట శిష్యులంత
ఎంతొ గోలజేసి రంత !
చురచురమని గౌతమ ముని
చూచినంత వా రాగిరి
చరచర మని తల్లి నడుగ
చనినా డా బాలకుండు
అమ్మజేరి ఆత్రముతో
అడిగినాడు వాడిట్టుల
''అమ్మా! నా కులమదేమి?
అమ్మా! నా గోత్రమేమి?
తండ్రి ఎవరు? చెప్పు, గురువు
తబిసీ లది యడిగినారు
ఆ మాటలు విన్న తల్లి
అంతట యోచన జేసెను
సూటిగ ఒక యుత్తరంబు
సుతున కపుడు అందించెను
"కులగోత్రము నాకు లేదు
కొలిచితి నే కులీనులను నే
పెండ్లిలేదు నాకు నిన్ను
పిన్నవాడ! కన్నదాన!

నాకు లేని కులగోత్రా
లే కరణిని నీ కుందును!
నాకు పెండ్లి కాని కతన
నీకు తండ్రి ఎవరందును?
ఉన్న సత్య మింతె యనుము
ఒజ్జకు సమ్మతమొ; కాదొ ?
కన్నవాడ తేల్చు మనుము
కలదొ లేదొ విద్యార్థత ?"
ఆ జవాబు తల్లి నుండి
అందు కొనిన బాలకుండు.
దూసిన బాణము వోలే
ఆశ్రమమున కరిగినాడు
గురుని ఎదుట నిలిచినాడు
వెరపు లేక పలికి నాడు
''అయ్యా! మా తల్లి చెప్పి
నట్టి మాట లిదె వినుడని
అమ్మ మాట అక్ష రక్ష
రమ్ము లతడు తప్పకుండ ;"
ఈ మాటలు విన్న శిష్య
లిక యిక మని పకపక మని
కోతిమూక వోలె పెద్ద
గొడవ చేయ సాగినారు

గురువు వారి నదలించియు
గొప్పగాను నిట్టూర్చియు ;
“ఆగడంబు చాలింపుడు
అసలు సత్య మాలింపుడు
బ్రహ్మ విద్య బడయునట్టి
భక్తి శక్తి అతని కుంది
కుల గోత్రము జెప్పుకొనుచు
గొప్ప జెందు మీకులేదు
సత్యమందు ఆ శక్తియు
చదువున ఆసక్తి యుంట
సత్యకాము దన్న పేరు
చక్కగ సరిపడు నితనికి !
పెద్దవారె కారణంబు
ఇద్దర జాతికి జన్మకు
పిన్నల నా కారణమున
చిన్న బుచ్చుచుంట తగదు !"

అని గౌతము డా బాలుని
తన కౌగిలిలో చే కొని
మూర్ధము మూర్కొన, శిష్యులు
మూగబొమ్మలై చూచిరి !
ఎంతో కాలం క్రిందట
ఈ విషయం జరిగిందీ !
అయినా నేటికి కూడా
అటులే ఇది పడివుందీ!

నా గీతం

మబ్బు గుర్రా లెక్కి
మరలేటి జాబిల్లి
ఊదేటి నా వేణు
వూరకే విని, అట్టె
ఆగి, నా దరిజేరి
అన్నాడు ప్రియమార -
"ఊదవోయ్ రాగమ్ము
ఉత్సాహముగ నొకటి
మనసార వింటాను
మై మరచి ఉంటాను.”
అతనే వేణువును
అద్భుతమ్ముగ మంచి
రమ్యంపు ఫణితిలో
రాగమ్ము పలికిస్తి
గానమ్ము వినగ, తన
కనులపుడు చెమ్మగిల
అన్నాడు జాబిల్లి
అప్పుడీ విధముగా
“వేణుగానము నాపి
వీనులకు విందుగా
గొంతెత్తి ఒక గీతి

గొప్పగా పాడవోయ్
భావాలు వింటాను
పరవశత నుంటాను"
అంత నే గొంతెత్తి
హాయిగా ఒకపాట
పాడంగ విని, తాను
పరవశంబున పలికె
"పాడేటి నీ గీతి
భావించి కవితగా
ముందు తరముల బాల
లందరూ పాడుకొన
వెలలేని కీర్తితో
కలకాల మిల నిలువ
వ్రాయవోయ్ శ్రమయనక
తీయన్ని భాషలో"
అంత నే గీతమ్ము
నపురూపముగ కూర్చి
వ్రాసితిని కవితగా
రాగరంజిత ఫణితి :
ఆనాటి నా గీత
మేనాటికీ నిలుచు,
లోకాన గల బాల
లేకమై పాడుకొన.
చైతన్య గీతాలు
చైతన్య గీతాలు
చిన్ని గీతాలు
మనసు గల వారి కివి
మమత సంకేతాలు

మా కృష్ణ చైతన్య

మా కృష్ణ చైతన్య
మంచి వాడమ్మ
అక్కయ్య కల్పనకు
అతి ముద్దు సుమ్మ

ఆనందము నిచ్చు
చిన్ని కృష్ణ చైతన్య
కెన్ని పాటలైన వచ్చు
ఆ పాటలు బడిపిల్లల
కానందము నిచ్చు.

చిన్నపాప
చిన్న పాపా చిన్న పాపా
చెప్పు బళ్ళోకొస్తా?
రాను ఇప్పుడు రాను ఇప్పుడు
నేను ఎప్పుడొ వస్తా

పిచ్చి కుర్రవాళ్లు
నోళ్లల్లో వేళ్లు
నీళ్లల్లో కాళ్లు
పెట్టుకునే వాళ్ళు
పిచ్చి కుర్రవాళ్ళు
పిచ్చి కుర్రవాళ్లు

అప్పుడు ఇప్పుడు
అప్పుడు నా చిన్నప్పుడు
బడికెళ్లక ఆడుకొంటి
ఇప్పుడు బడి వయసప్పుడు
బడికి వెళ్లి చదువుకొంటి

ఎందుకవీ?
అమ్మ కళ్ళు నావట

పాలు

పచ్చగడ్డి మేసి ఆవు
తెల్లపాలు ఇస్తుంది
తెల్ల గడ్డి మేసి ఆవు
పచ్చపాలు ఇస్తుంద?

ఒకటి రెండు ఐదు

నాన్న ముక్కు నాదట
ఎందుకవీ నాకవీ
నాకు కళ్ళు ముక్కు ఉంటే?

బాలురు - బాలికల
బాలురు ఎలాగ పుట్టారు?
బాతులు కోతులు కాకుల నుంచి
బాలికలెలాగు పుట్టారు?
బంతులు గంతులు పువ్వుల నుంచి

ఆగు చూడు విను
ఆగు చూడు విను ఎప్పుడు
అలా రోడ్డు దాటేప్పుడు
కళ్ళు చెవులు నియోగించు
కాళ్లనపుడు నడిపించు

ఒకటి ముక్కు, ఒకటి నోరు.
రెండు కళ్ళు. రెండు కాళ్ళు.
రెండు చెవులు, రెండు చేతులు.
ఐదు చేతివేళ్లు. ఐదు కాలివేళ్ళు.

ఎందుకు?
కళ్లెందుకు? చూచేందుకు.

కాళ్లెందుకు? నడిచేందుకు,
చెవులెందుకు? వినేందుకు,
నోరెందుకు? తినేందుకు.
ముక్కు? గాలి పీల్చేందుకు.
చేతులు? పనిచేసేందుకు,
బుర్రాలోచించేందుకు,

పిల్లి పిల్లలు

పిల్లి పిల్లలు మూడు
చల్లగా వచ్చి ఆ
చట్టిలో పాలన్ని
గుట్టుగా తాగాయి.

కంగారు

కంగా రెప్పుడు కంగారే !
రంగా కూడా కంగారే !
మంగా కూడా కంగారే !
రంగా మంగా కంగారొకటే,
(కంగారు ఒక జంతువు)

తమ్ముడు

అదుగో అదుగో తమ్ముడు!
ఆ ఊయలలో ఉన్నాడు.
మాటలు రావు ఊఁ అంటాడు.
పాటలు రావు నవ్వుతుంటాడు.

రవీంద్ర బాబు

రవీంద్ర బాబు నా జతగాడు.
రంగుల దుస్తులు వేశాడు.
చదువే రాదు చదువుతాడు.
మరి సైగలతో మాట్లాడుతాడు.

ఎత్తు లోతు

ఎంత ఎత్తో ఆకసం!
ఎంత లోతో సముద్రం!
అంత ఎత్తుకి ఎగర గలము.
అంత లోతుకి మునగ గలము.

దొంగా!

మంచం కింద దాక్కున్నాను
మా అమ్మకు నే కనబడకుండా,
ఇల్లంతా వెతికిందీ చివరకు
"ఇక్కడే ఉన్నావ్ దొంగా!" అంది.

బొమ్మలు

బాలల్లారా రండీ రండీ
బలే బొమ్మ లివి కొనండీ
నవ్వే బొమ్మలు నడిచే బొమ్మలు !

రివ్వు రివ్వునా తిరిగే బొమ్మలు !

జలజ

బడిలో చేరిన తొలి నాడే ఒక
బాలిక తన పేరేమని యడుగగ
ముందుకు వెనుకకు త్రిప్ప ఒకటే యని
అంది 'జలజ' యని అందరు మెచ్చగ.

అందం అందం
అన్ని చుక్కలా మింటికి
అందం అందం.
ఇన్ని పువ్వులీ మంటికి
అందం అందం.

గరం

పాప కుంది ఉంగరం.
బాబు కుండి బొంగరం.
ఎందు కింక జాగరం
అడిగా బూంది గరం గరం.

పాప

చెప్పు చైతన్య మీ చెల్లి పేరేమిటి?
ఎప్పుడూ మాట్లాడదండి. చూస్తుందండి.
అడిగితే ఊరికే నవ్వుతుందండి.
అందుకే పాప అని అంటాములెండి.

మాటలు చేష్టలు

చైతన్య మాటలవి
చిత్రముగ ఉంటాయి
వినిన వారానందమును పొందుతారు.
చైతన్య చేష్టలవి చిలిపిగా ఉంటాయి.

రండీ

రండీ రండీ రండీ బడికి
గబగబ గబగబ గబగబ రండీ
నడవండీ నడవండీ వరుసలో
చకచక చకచక నడవండీ
దిద్దండీ దిద్దండీ బరులూ
అంకెలు శ్రద్ధగ దిద్దండీ
నేర్వండీ నేర్వండీ మాటలు
పాటలు ఆటలు నేర్వండీ
బుద్ధులు సుద్దులు నేర్చి ఒద్దికగ
పెద్ద పేరు గడియించండీ.

సెలవులు

ఎందుకేడుస్తావు చైతన్య నీవు?

అక్కకూ సెలవులు, అవి నాకు లేవు.

సెలవు లెందుకు లేవు చైతన్య నీకు?

బళ్లోన నే చేరలేదుగా ఇంక.

పిట్టలు

చెట్టుపై చినచిన్న పిట్టలున్నాయి.

పిట్టలన్నీ గోల పెట్టుతున్నాయి.

గుర్రం బొమ్మ

బొమ్మొకటేసీ అమ్మకు చూపితె

అమ్మడిగింది దాని పేరు నను.

గుర్రం బొమ్మే తెలియదు అమ్మకు

గొప్పగ వేస్తే జూలూ తోకా!

చెట్టు

మొక్క నాటితే చెట్టవుతుంది.

ఒక్క పిట్ట కది తావవుతుంది.

ప్రేమతో నా కది నీడిస్తుంది.

పిట్టకు అది ఒక గూడిస్తుంది.

జంతువు

మానవు డొక జంతువనీ

మా గురువులు చెప్పారు.

రెండు కాళ్లె ఉన్న వాడు

నిండు జంతువైన కాడు!

మందు

మా ముద్దు ముచ్చట్లు, మా తొక్కు పలుకులూ

ఆటలూ అల్లరీ అందరికి విందు!

కన్నులకు విందు. వీనులకు విందు.

కష్టాలు మరపించు ఘనమైన మందు.

పని

ఎప్పటి పని నీ వప్పుడు చెయ్యి

రేపటి వరకింకేమి మిగల్చక.

అయితే లడ్డూలన్ని తినేస్తా

రేపటి వరకింకేమి మిగల్చక.

వినండి

అల్లరి మానీ పడుకొండి.

పిల్లలు నా మాట వినండి.

పడుకుంటే మేం నిద్రే పోతాం.

నిద్రే పోతే, ఎలాగ వింటాం?

నాల్క

నాల్క చూపు నాయన నీ

జబ్బేమిటొ తెలుసుకుంట.

నాల్క ఏమి చెప్పదండి

నా జబ్బేమిటొ డాక్టర్.

ప్రశ్న

ఎందుకు రాదు చదువుట వ్రాయుట

మీ నాన్నేమో పంతులు గారట?

ఎందుకు జబ్బుగ నీవున్నావట

మీ నాన్నేమో డాక్టరు గారట.?

ఆట

అమ్మ అమ్మా అమ్మ ఆడుకుందామా

ఆ జంతుశాలలో జంతువుల ఆట?

నేనేమి చెయ్యాలి చెప్పు నా బుజ్జి?

నీవు చెరకులు ఇయ్యి, నేను ఏనుగును.

మామయ్య గుండు

మామయ్య గుండు మా మంచి గుండు

తిరుపతి క్షౌరమై తిరిగి వచ్చిన గుండు.

గుండుకు నూనె కర్చుసలుండదు.

గుండును దువ్వే పనియే ఉండదు.

గుండును కప్పే మంకీ టోపీ

గొప్పగదాల్చి, చెప్పులు విడిచి,

బస్తీ అంతా గస్తీ మామయ.

చలి

చలిగా ఉన్నది ఎందుకు ఇప్పుడు?

చలికాలం గద చలిగా ఉన్నది.

చలికాలంలో ఎందుకు మరి చలి?

ఇలాంటి ప్రశ్నలు ఏమో బాబూ

అడగలేదు మా నాన్నను ఎప్పుడు.

అందుకె నీకూ తెలియదు నాన్న.

అడగాలీ అడగాలీ ప్రశ్నలు

అడిగితె గానీ తెలియదు నాన్న.

విందు

గొర్రెపై తోడేలు గొప్ప ప్రేమ నటిస్తు

విందుకై రాత్రి రమ్మంది తన ఇంటికి.

కడుపులో ఇల్లున్న కలవారి విందన్న

తనకు భయమని గొర్రె తప్పుకొనే తెలివిగా.

బాధ ఆనందము

పెద్ద వాడు అయినందుకు ఎందుకు

పిచ్చి తాతయ్య కా బాధ?

చిన్న వాడ నై నందుకు నాకు

చెప్పలేని ఆనందము తెలుసా.

నిల్కడ

"పూలచెట్టు నేల తీగ పోట్లాడు కున్నవిట్లు

పాకలేవు నా లాగ పరుగు తీయలేవు నీవు."

అని చెట్టును తీగ చాల అవహేళన చేసింది.

"నిజమే నీలాగ నేను నిల్కడెరగకుండ పరుగు

తీయలేను నిలుచుందును. స్థిరముగ భువి"

నని చెట్టు.

కన్నారా విన్నారా

పువ్వులు కన్నారా, వాటి

నవ్వులు విన్నారా?

పిల్లల గన్నారా? వారి

అల్లరి విన్నారా?

అల్లరి పిల్లల నవ్వుల పువ్వుల

ఆనందముగా కన్నారా? విన్నారా?

అర్థం

అర్థం కానే కావంటారు

అమ్మా నా మాటలు మా పంతులు

అన్నీ తెలిసిన వారికి నా అతి

చిన్న మాటలే అర్థం కావా.

మేము

బాలకులం బాలికలం

భావి జగతి కేలికలం.

పెంచిన తలిదండ్రుల హృది

నించు ప్రేమ మాలికలం.

దొంగలం

వచ్చాం వచ్చాం వచ్చాం

వచ్చాం దొంగల మొచ్చాం.

పెద్ద దొంగలం వచ్చాం

సద్దు చేస్తే పట్టేస్తాం

బుట్ట లోన పెట్టేస్తాం

పట్టుకు చక్కా పోతాం.

అల్లరి చేసే పిల్లలందరిని

చల్లగ తీసుకు పోతాం

మెల్లగ తీసుకు పోతాం

చదువు సాములు నేర్పిస్తాం

చక్కని పౌరులుగా జేస్తాం.

ఆశీస్సులు

అన్నల్లారా చిన్నల్లారా

అందాలద్దిన మిన్నల్లారా

అనురాగముతో వచ్చాను.

అక్షరాలతో కూర్చిన మేలిమి

ఆశీస్సులు కొని తెచ్చాను.

కల్లా కపటం తెలియని వి నాకు

కుళ్లూ కుచ్చిత మెరగని మీకు

కళ్లల్లో వెలుగున్న జాతి

కామిత శ్రీమూర్తులు మీకు

అక్షరాల స్వర్ణాక్షరాల

ఆశీస్సులు ఆశీస్సులు ఆశీస్సులు.

మాన్యశ్రీలు

బాపు

అన్నాడు అన్నాడు బాపు

అందరు ఒకటన్నాడు :

అందరు మానవు లన్నాడు

అందరు సోదరు లన్నాడు.

మనిషిని మనిషిగ చూడకుంట అది

మహానేరమన్నాడు

మనిషిని మనిషే చంపుకొంట అది

మహా ఘోరమన్నాడు.

మతమూ కులమూ తేడాలు అవి

మనలో వలదన్నాడు.

మానవులంతా కలిసి బ్రతికితే

మంచియె కలదన్నాడు.

సేవకు అంకితమైతే మనిషికి

చెరుపే లేదన్నాడు.

పదవీ వ్యామోహంలో పడితే

పంకిలమౌ నన్నాడు

పవిత్ర మానవ ప్రతి హృదయమ్మొక

పాఠశాల యన్నాడు

సత్యాహింసలు చక్కగ నేర్చి

శాంతి బడయు డన్నాడు.

చాచా నెహ్రూ

'గులాబి మొగ్గలు

గులాబి బుగ్గలు'

గురుతుగ నిలిచెను నెహ్రూ మన

గుణములు మలిచెను నెహ్రూ

పరాభవమ్ము

జరాభయమ్ము

పట్టి నెట్టె మననెహ్రూ, జగ

జెట్టి యతడు మన నెహ్రూ.

జగాన శాంతి

మొగాన కాంతి

నించెను పండిత నెహ్రూ, విరి

యించెను పండిత నెహ్రూ.

తగవులు పగలూ

దారుణాగ్నులూ

తీర్చెను ప్రియతమ నెహ్రూ, చ

ల్లార్చెను ప్రియతమ నెహ్రూ.

మమతా సమతా

మంచి మానవత

పెంచెను చాచా నెహ్రూ, కళగా

నెంచెను చాచానెహ్రూ.

పొట్టి శ్రీరాములు

ఆంధ్ర ప్రదేశమ్ము
అవతరించిన దినము
పట్టండి జోహార్లు
పొట్టి శ్రీరాములుకు.
అణువణువు తన మేను
అంతలంతలు వ్రేల్చి
అగ్నిలో సమిధగా, ఆత్మాహుతి యొనర్చె.
ఆత్మ బలిపీఠాన
ఆంధ్ర మాతను నిల్పి
అమరుడైనాడు, మన
కారాధ్యుడైనాడు.
అతని త్యాగము గన్న
ఆ శిబియు తలవంచు.
శిలువపై ఆ క్రీస్తు
చిన్నవోయి చలించు.
ఆ యఖండ జ్యోతి
ఆ యనంత విభూతి
ఆంధ్ర జన హృత్సీమ
అక్షయంబై వెలుగు.

గురజాడ

(చిరంజీవి, బి.వి.)
తెలుగు నేల చాల పొడవు
తెలుగు జాతి చాల పాత
క్రొత్త వెలుగు ఒకటెరా
క్రొత్త మనిషి ఒకడెరా
'దేశమంటే మట్టికాదు
దేశ మంటె మనుషుల'నెడి
తెలుగు మాట ఒకటెరా
తెలియ జెప్పె నొకడెరా.
ముత్తెమంత పలుకులోన
సత్తెములను మెరుగుదిద్దు
శిల్పితనము ఒకటెరా
చేత మలిచె నొకడెరా.

మంచు జడుల మసకవిడిన
మధురవాణి మరుగుటెడద
కనుల నిలిచె నొకటెరా
కనులు కలము ఒకడెరా.
పుత్తడి పూర్ణమ్మ బొమ్మ
చిత్తము నెరియించు కొమ్మ

బొమ్మ బ్రతుకు ఒకటెరా
బొమ్మ వ్రాసె నొకడెరా.
కంటి ఎరుపు మింట నలమి
మంటి గరచె రాచరికము
తెలుగు కన్నె ఒకతెరా

తెలుగు తండ్రి ఒకడెరా.
ఆ ఒక్కటె తెలుగు కవిత
ఆ ఒక్కడె తెలుగువాడు
తెలుగు నేల కొక్క జాడ
తెలుగువారి గురజాడ||

శ్రీమతి భాగవతుల సుందరి

అమ్మా! జానకిని గన్న అమ్మా! సోదరి, సుందరి
అందుకొమ్ము ఈ దామము అక్షర సుమదామము
అంతర్జాతీయ బాల లందరికిది ముఖ్యమైన
వత్సరమని మదిని ఎంచి, వ్రాసినావు ఈ కావ్యము.
రంగులు రాగాలుగా రాగాలే రంగులుగా
రూపాంతరమగుననీ, నిరూపించితివమ్మా!
కల్లా కపటం తెలియని కుళ్లూ కుచ్చిత మెరగని
పసిపాపల మనసు నీది పసిపాపల పలుకు నీది.
అర్థము కానట్టిదేది ఆచరించి ఎరుగవమ్మ
ఆచరించి నట్టిదేది ఆక్షేపణ కానిదమ్మ.
అభిమానము ధనము నీకు అనుపమ సేవయు ధర్మము
ఎవరినైన ఎందుకైన ఎన్నడు నొప్పించవమ్మ.
పెద్దలలో పిన్నవమ్మ పిన్నలలో పెద్దవమ్మ
తల్లీ బిడ్డను నీలో దర్శన మిచ్చితివమ్మ ॥

తాపీ ధర్మారావు

కావ్య కళా పయ స్సింధు

కమ్మని మా కవి బంధూ

అందుకోవయా బాబయ

అక్షర కుసుమాంజలి దయ.

గిడుగు పిడుగు గురజాడా

కట్టమంచి, కవిరాజూ

మెట్టిన శిఖరాల ఎత్తు

మేరు పర్వతము నీవు.

చేమకూర వెంకటకవి

చేసికొన్న పుణ్యఫలము

విజయ విలాసమునకు నీ

వివరించిన వ్యాఖ్యానము.

సాహితీ రణమ్మున నీ

సారించిన కొత్తపాళి

వెలారించు కుంచె నేడు

వెండి తెరకునై రంగులు.

నీవే ఒక మహోద్యమం

నీ కెవరూ లేరు సమం

కావ్య కళా పయస్సింధు

కమ్మని మా కవి బంధూ!

బడేటి

(శ్రీ బడేటి వెంకట్రామయ్య)

తెలుగు తల్లి బిడ్డలలో మేటి!

తిరుగు లేని ధీశాలి బడేటి!!

నీవలె నిముసము బతికినచాలు

నీ కివె మా భక్తి ప్రణామాలు

జాతికి జీవము పోసినవాడా

నీతికి నివాళులెత్తిన రేడా

లేరు లేరు నిను పోలగలారు

లేరు తెలుగు మాగాణము నెవరు.

కాసులేని ఒక పేదకు పుట్టి

ఘన గౌరవ పదవుల చేపట్టి

నీతీ న్యాయం భువి నిలబెట్టి

ఖ్యాతి బడసితివి ఓ జగజెట్టి!!

నిన్ను గన్న తలిదండ్రులకన్నా

మిన్న లెవరు ధన్యత నోయన్నా

పుట్టిన తావును మెట్టిన తావును

పునీత మొనర్చినావు నీవు||

పట్టుదలకు నీవు పెట్టిన పేరట

గట్టి పనులు చేపట్టి విడువవట

కన్నులలో కెంజాయ తొణకదట

కారుణ్యము నీ సహజ గుణమ్మట.

అల్ల నల్ల మెట్లెక్కి పైపైకి
అందుకొన్న గౌరవము బిరుదులూ
సాటిలేని నీ మేటి ప్రతిభకు
సమ్యగృష్టికి నిదర్శనమ్మట.

స్వయం శక్తిచే పైకివచ్చుటయు
మాట ఇచ్చి మరి తప్పకుండుటయు
ఓటమి నెన్నడు ఎరుగ కుండుటయు
హేలాపురి నీపాలనమ్మునూ
గౌతమీ మండలాధిపత్యమును
శాసన మండలి సభ్యత్వమ్మును
సర్వజనత్వము సమయజ్ఞత్వము
పెంకె తనమ్మును, మహోదారతయు
ప్రేమమందు ఘన త్యాగశీలతయు
గురువును మించిన గొప్ప గుణమ్ములు.
చదువూ చనవూ! మాటా మనికీ
నీతీ నియతీ! ఓర్పూ తీర్పూ
మమతా సమతా! శ్రద్ధా బుద్ధీ
అందరికీ నీవన్ని నేర్పితివి
నీ వెలిగించిన జ్యోతులు భువిపై
నిలిచి కాంతి విరజిమ్మును మాపై!

కొత్త రాజబాబయ్య

చిత్తశుద్ధి గల పంతులయ్య శ్రీ
కొత్త రాజ బాబయ్య!
ఉత్తమాదర్శ ఉపాధ్యాయుడుగ
ఉన్నత గౌరవ సత్కారము గొనె...
మనిషి వైఖరి మెత్తన పైకి
మనసు నిర్ణయము గట్టి లోపల
అందుచేతనే అతని సత్కృషికి
అజరామరమగు ఖ్యాతి ఘటిల్లె
విద్యా ప్రాంగణ మందు నెలకొల్ప
విశిష్ట వినూత్న సంప్రదాయములు
గురు పారంపర్యమనే దొక్కటి
గురుతుగ నిల్పె నుపాధ్యాయులలో
అతని ఖ్యాతి గౌరవము అందరిది
దీక్షా దక్షత తిరుగు లేనిది
శిక్ష నిడక క్రమశిక్ష గరపుటది
అతనికి అతడే సరి యనదగినది
అతని జన్మ చరితార్థ కారణము
అతని సతియు సంతతియు ప్రేరణము
నిక్కముగా ఆ వ్యక్తి ప్రభావము
నిలుచును ప్రతి గుండె లోను దండిగ!!

చలసాని లక్ష్మీనారాయణ వర్మ

కర్షక కవి శ్రీ చలసాని
లక్ష్మీనారాయణ వర్మ
కనకమునే పండించుకొన్న
కన్న కడుపు తన సుకర్మ
ప్రశాంత సుఖమయ జీవితము
పండిత జన సుస్నేహము
ఎంచుకొన్న మంచి మనిషి
ఎన్నదగిన మహా ఋషి
ఆతని అల్లుడు కూతురు ఇద్దరు
అకలంకమైన వైద్యసేవకు
అంకితమై ప్రఖ్యాతి గాంచిరి
అందరినీ దయ నాదరించిరి
కాసరనేని సదాశివరావు
ఘన యశస్కుడు అల్లుడు
జయప్రదాంబ కూతురు మా
ప్రియ సోదరి దయామతి!!

డాక్టరు పాటిబండ్ల దక్షిణామూర్తి

పాటిబండ్ల శ్రీ దక్షిణామూర్తి
పరమ శాంత కరుణా ప్రకీర్తి
దేవుడైన ఒక దివ్య మానవుడు
తీరిక నెరుగని వైద్య సేవకుడు
మాట ముందుగా మమత విందుగా
సాటి లేని ప్రతిభ రోగులను
సర్వవేళ సేవించుటది నేత్ర
పర్వముగా నా కగుపించు
వైద్యవృత్తి చేపట్టిన వ్యక్తి
వందన్నొక పనులం దనురక్తి
ప్రదర్శించి స్వధర్మ నిర్వహణ
పాటించుట యది ఘనమగు శక్తి
కవులన్నా కళలన్నా జనహిత
కార్యములన్నా అభిమానించు
సన్మానములూ సంస్కృతి క్రియలు
సన్మతిని సదా నిర్వహించు ॥
మాట మెత్తనిది మనసు మెత్తనిది
మల్లెకన్న తెల్లనిది హృది
రోగ నిదాన నివారణ మందు
అందె వేసినట్టి చేయి తనది ॥

గుర్రం జాషువ తుమ్మల సీతారామమూర్తి

కవితా
పారము నందిన ఘనులు అ
పార శేముషీధనులు

సార సంస్కార భావోదారులు
సకల సౌజన్య సన్మానార్హులు ॥
భావోన్నతి భవ్య వినీతి
సంఘ సమాదృతి సారధృతి
కందళితము మీ కవితా మంజరి
కాల దేశముల కతీతాకృతి ||
ఒకరు పోతన్న ఒకరు తిక్కన్న
సకలశబ్ద పరిపుష్టికి, శుద్ధికి
భావ లాలిత్య కవిత వేదనకు
భావ గాంభీర్య ధర్మబోధనకు ॥
మాతృ భాగముగ పితృ భాగముగ
మాకు మీ తత్త్వము కవిత్వము
అర్ధనారీశ్వ రాకృతిని బొల్చు
అఖిల మంగళ శ్రీ్మ నందించు !!

గొర్రెపాటి వెంకట సుబ్బయ్య

అందుకొమ్ము అభివాదము
అక్షరాభివాదము
బాబయ శ్రీ సుబ్బయార్య
ప్రవిమల గుణధుర్య !

ఉల్లము ఉడుపులు తెల్లన
మాటా మనుగడ మెల్లన
అందరికీ విడిది యైన
నీ హృదయము చల్లన ||
ఆచితూచి మాటలాడు
అందమైన తీరు నీది
మమతా మానవతా గల
మధుర జీవనము నీది
మహా మహుల జీవితాలు
మా కన్నుల గట్టినావు
ఆచరణా శిల్పములో
అందె వేసి నట్టి నీవు.
బంధు ప్రీతి నందరితో
బాంధవ్యము గల బాబు
దర్జా ఠీవీ దర్పం
ధరియించిన నవాబు !!

కవిరాజ ప్రశంస

తెలుగు నేల పెద్దది
తెలుగు జాతి దొడ్డది
తెలుగు వారి కొక రాజు
ధీరుడు మన కవిరాజు.
దేశమున విదేశమున
వాసిగ తన ప్రత్యేకత
నిలుపుకొన్న ఘను డుదాత్త

నిర్మల చరితుడు విజ్ఞుడు.

మన మాతని వారసులం

అను మాటకు నిదర్శనం

అతని బాధ అతని బోధ

అణువణువున గ్రహింతము.

కులమతాల ముసుగు చాటు

కుహనా వేదాంతు లనెడి

మాయా జాలరుల బట్టి

మటుమాయ మొనర్చె దిట్ట.

దేవుని పేరిట మోసము

దివ్యముగా సాగు నేడు

దీనికి విరుగుడు కవితా

ధీ శక్తిని చూపినాడు.

తెలుగునాట కవిరాజుకు

వెలుగుబాట నడచు కర్మ

వీరులు ధీరులు శిష్యులు

ఊరూరా కలరు వేలు.

కమ్మని తెలుగున ఉత్తమ

కావ్యాలను రచించి

జాతిని మేల్కొల్పి దివ్య

ఖ్యాతి నిల గడించినాడు !!

జయంతి సత్యనారాయణమూర్తి

మనశ్శాస్త్ర మహా పాథోనిధి

మామక గురు మహా దయాంబుధి

జయంతి సత్యనారాయణమూర్తి

జగద్విదిత బోధనా ప్రకీర్తి

నాయెడ నా నాట్యకళ యెడ

ఆతని కేర్పడిన అభిమానము

అనూన మపార మద్భుతము

జీవితాంతము గురుదేవుని నే

భావింతును ఎద భక్తి ప్రపత్తిని.

గార్లంక వీర వేంకట సత్యనారాయణ

మనసున మాటను మనికిని మహదాశయ సంపన్నులు

అందరి మన్నవ గౌరవ మందుకొన్న ప్రసన్నులు ||

అనుష్ఠాన వేదాంతులు ఆత్మగౌరవోన్నతులు

బుద్ధిలోను బోధలోను బృహస్పతియు గౌతముడును.

అమ్మను విశ్వమ్ములోని అణువణువున దర్శించిన

అనుపమ సత్యాన్వేషులు అతి దయార్ద్ర మృదు భాషులు

గురు పరంపరొక దానికి గురువు గుర్తు

రామకృష్ణ పరమ హంస వలె తాను :

అరయ సుబ్బరాయు డాదర్శ శిష్యుడు వివేకానందు డట

మమతా మాన్యతలను ప్రతి మనిషిలోను పాదుకొల్పి

మంగళ కార్యాచరణ సమాయత్తుల జేసినారు

శిష్యతతికి అమృత పద విశేష మార్గ మందించిరి

అవిరళముగ అనంత ప్రస్థానమ్మును సాగించిరి

ఉన్నత ఉన్నత పథాన తిన్నని తిన్నని విధాన

జీవితమును మలచుకొన్న జీవన శిల్పులనల్పులు

ఉదారాశయ శీలమును సదాచార వర్తనమును

కలిగిన పరతత్త్వ మార్గ గాములు ప్రణుతస్వాములు

వెలిగించిరి జ్ఞానజ్యోతి వెలుగై తా వ్యాపించిరి

నాటికి ఈ నాటికి ఏనాటికి కడు దీపించిరి.

కాళోజీ

అన్నా! కాళన్నా! నీ షష్టిపూర్తి యని విన్నా
మాటల పాటగ నీ కీ మాల గట్టి ఇస్తున్నా.
పోతన్నా సూరన్నా పోలరు నీతో అన్నా
వేమన్నే దీటు నీకు వేయి ముఖము లున్న బాకు.
రామోజీ లక్ష్మోజీ సౌదర్యం కన్న అన్న
రామోజీ కాళోజీ సౌదర్యం మిన్న.
ముత్తె మంత పలుకుల్లో సత్తెము ప్రవచించినావు
కత్తి కలంతో ధూర్తుల కుత్తుకలను త్రుంచినావు.
'నా గొడవ' ని నీ వనేది నరనారీ జనానిది
దానిని తీర్చే బాధ్యత ధర్మం నీ యది.
పీడిత తాడిత జనాల గోడు నీకు ఆవేదన
అందు కొఱకు చేయుచుందు వనారతము రచన.
జిబ్రాన్ నీ కభిమానం చలం నాకు అభిమానం
జిబ్రా న్నీ విస్తివి నే చలా న్నీ కిస్తిని.
భాషలలో దిట్టవు బహు భావాలకు పుట్టవు
చౌక బారు స్తుతులు నీకు ససేమిరా గిట్టవు.
పంతాలూ పగలూ నీ చెంత జేర వెన్నడు.
దేవుణ్ణయినా సరె ఛీ 'దేహీ' యన వెన్నడు.
ధీరునిగా వీరునిగా దివ్యమైన ప్రజాకవిగ
నిలిచిన నీ కిదె గౌరవ నీరాజన మిస్తున్నా!

వేగేశ్న సత్యనారాయణరాజు

మీ చిరునవ్వే వెన్నెల
మెరిపించెను మా కన్నుల
రసమురల్చు తేనె పెరా
వసివాడని రాచదొరా ॥
ఐదు పదులు లెక్క చూస్తె
అష్టక మా పైనవేస్తె
అందుకొన్న వసంతాలు
అర్ధనూట పదహారులు
అడగనిదే లోపము మి
మ్మడగని వారిది పాపము
అంతులేని మీ ఈవికి
అదే కదా ఒక రూపము
అనురాగం మారుపేరు

అక్షరాల మీదు తీరు
అంతులేని అమృత సరసు
ఔను మీ ప్రసన్న మనసు
మంచి మంచి ముత్యాలు
పంచిన మీ గౌరవాలు
అందరిలో వెలుగు మేలు
అదే మాకు ఆనవాలు.

డాక్టర్ ఆర్. ఏ. జాకబ్

వంద ప్రాణముల ప్రేమ
పంచి యిచ్చు మంచి మనిషి
రూబియమ్మ డాక్టరమ్మ
రుణము దీర్ఘ తరమ్మ!
వయసులోన భేదము ర
వంత యైన కానరాదు
మనసులోన భేద మిసు
మంత యైననూ లేదు !
ఆటలన్న పాటలన్న
అందమైన కళలన్నా
వినోదములు వేడుకలూ
విందులన్న విసుగు సున్న !

కన్న కడుపు కాదు నిజము
కనికర మామెకు నైజము !
దిక్కు లేని దీన జనము
దేవుడిడిన సంతానము !
ఎప్పుడైన ఎక్కడైన
ఈమె కీర్తి నిలిచే నన
అందరిలో వెలుగు మేలు
అదే మనకు ఆనవాలు!

శ్రీమతి చావలి బంగారమ్మ

అమ్మ బంగారమ్మ ఆ కొండ మాకమ్మ
చల్లన్ని దయ మము సతము సాకిందమ్మ
చుక్కలను చక్కనివి మక్కువతొ దండగా
గ్రుచ్చి నాధుని మెడను గోముగా వేసినది.
కాకి కోవెల తీరు గణుతించి మా కొక్క
నెయ్యమున మెలగేటి నీతి నేర్పినది.
వేదనకు గురియై నివేదనకు గుర్తునై
రాధగా ప్రేమ కారాధనగ వెలిగినది.
అమ్మలో బాల్యమ్ము అణు వణువు స్పందింప
బొమ్మలకు పెళ్లి కప్పమ్మలకు చేసినది.
మందార నీటిలో అందాలు చూచెనట !
చుక్కలకు మాయూర రెక్కలున్నాయంట !
చెందురుడు జారి పడి చిందులాడెను నీట !
మనసల్లె ఆకసము మబ్బు గమ్మిందంట !
పాట లెరిగిన మనకు మాట లెందుకు అంట!
పూజితంబని యంటే పుంతలో రాయిదట !
ఈ తీరుగా ఇంక ఎన్నెన్నొ ఊహల్లు
అమ్మ తన కవితల్లొ అందించె, అలరించె !!

చలం

మట్టి కళ్లతో చూచి నిన్నపుడు
మసక బొమ్మ అనుకున్నాం
కంటి పొరలు చించి చూచిపుడు
మింటి తారకనుకుంటున్నాం ॥
నిప్పులాంటి నిజాన్ని చెపితే,
'తప్పు తప్పు' అనుకున్నాం
ఇప్పటి కది నిజమని తెలిసీ
తప్పు దిద్దు కుంటున్నాం ॥
గాఢ మూఢ నిద్రలో గన్న
కలలు కల్ల లనుకున్నాం
కలలన్నీ నిజమొనర్చిన నిన్ను
గారడి యను కుంటున్నాం॥
గులక రాయిగా నెంచి నీ లోని
గొప్పనే విస్మరించాం
మేలి రత్న మని గ్రహించి నేడిక
చాల దుర పిస్తున్నాం !!
దగ్గరలో నీ వున్నప్పుడు నీ
దరి జేరగ వెరచాం
దవ్వు చాల నీ వేగితివనిపుడు
తపించి పోతున్నాం !!
బిరుదుల బంగారు రాజు

తన వలె అందరిని ఎంచి
దయ కరుణా ప్రేమ పంచి
గురు కులమై వరలు తేజు
బిరుదుల బంగారు రాజు
'నాకు గురువు నా సచివుడు
నా బంధువు నా పితరుడు'
అని భక్తిని నన్నుతింతు
అతని పదము లనుసరింతు,
అతని మతము లోక హితము
బుద్ధ క్రీస్తు గాంధి పథము
సత్యం వద ధర్మం చర
నిత్య సూక్తి నిల్చును ధర.
నీతికి నిర్వచన మతడు
నియమావళి ప్రభువతండు
బోధనమ్ము అతని సొమ్ము
బుద్ధికిన్ ప్రచోదితమ్ము.
మోసమన్న దోసమన్న
మోమోట మనేది సున్న
దాని బట్టి చీల్చి తుదకు
ధర్మము స్థాపించు వరకు.

మంచి యనిన మైత్రి నెరపు	ఆశ్రిత జన పక్షపాతి
చెడుగు చేరదతని వైపు	ఆశ్రమ ఋషి పరమోన్నతి.

చెరుకువాడ వేంకట సుబ్బారావు

అందుకొమ్ము జేజేలు	తేజరిల్లు తున్న నీవ!
నందన మందారాలు	
సుబ్బరాయ సుబ్బరాయ !	స్నేహమన్న ప్రేమమన్న
సురు చిర భావాల గేయ !	చెప్పగలమ నీకు మిన్న
అందరి హృదయావరణల	అందు కొరకె కాబోలును
నల్లు కొన్న మల్లె తీవ	అవతరించినావు ఇలను.
తెల్లని నవ్వుల పువ్వుల	

కోరాడ నరసింహారావు

కోరాడ నీ కీర్తి	ఖండాంతరాల నీ
కోరకము విరిసెరా	కాలి గజ్జెల మోత
కూర్మి నిండిన ఆంధ్ర	వినిపించెరా ద్యుతులు
కోటి మది మురిసెరా.	వెలిగించెరా దిశల.
ఏడు కడలులు దాటి	అక్షరమ్మగు ప్రేమ
ఎత్తితివి బావుటా	నాశిషము నందింతు
నేడు ధన్యము కూచి	శిక్షణమ్మగు ఆట
పూడి నీ వల్ల నిట (ఆట).	చెలువు గణుతింతు!

ముత్యాల సుబ్బారాయుడు

బాలల హృదయాలు వేలు
పరిమళాల సుగంధాలు
అందుకొనిన మీకు
నా పసందు కావ్యప్రదానం.
ముత్యాల కులాబ్ది సోమ
సత్యా హింసల సుధామ!
సచ్ఛీలం సమభావం
పాడుగొల్పు పరమశాంత
సాదుగుల ప్రపూత చరిత.
మీ జాడలు వేసి నరసితి
మీ గురు పారంపర్యం
మీ దయ నాశించితి.
బుద్ధం సంఘం ధర్మం
శ్రద్ధగ నవలోదనం
చేసికొన్న ప్రియదర్శీ
చేకొను నా 'ప్రియదర్శి'
సాధన మనిషికి సత్యం
సత్యా చరణం సంఘం
సంఘ శ్రేయం ధర్మం!!

తటవర్తి కృష్ణమూర్తి

పాడనా కొని యాడనా
యమునా తటవర్తి కృష్ణమూర్తి!
అంచ రెక్కల మించు మేల్ తెలి
మంచు దుప్పటి కప్పుకొని, హవ
ణించు సాగర సామి మది తల
పించు నీ కమ నీయ రూపము.
అందమగు క్రొక్కారు మబ్బుల
కుందనపు జలతారు తీవె ప

సందు చిందుల దోచు నీ మధు

మందహాస విలాస రేఖల.
నీల జలనిధు లీది మును వే
దాల జగతికి పంచి ఇచ్చిన
లీల రూపము దాల్చె మది నా
బాల వేదోద్ధరణ శీలము.
అన్నా రన్నా రెందరొ
విన్నా నిజ మని కన్నా.
ఒడలి రంగొకటే నలుపు
ఎడద విరియు గుణము తెలుపు!
మూడు తరాలొక్క ఇంట
కూడి మీరలుంటిరని,
జాతీయోద్యమమున ని
జాయితి గల వ్యక్తివని,
ప్రతి సంస్థకు నీవె మొదట
ప్రతినిధిగా నిలిచితివని,
సిరి గల వైశ్యుల కుండే
చిన్ని వ్యసనములు లేవని,
ఉచిత వైద్య సేవ ప్రజకు
ఓర్పు మీర చేసితివని,
ప్రేమ చిందు పిలుపు సొంపు
నీమముతో నెరపుదువని,
అన్నా రన్నా రెందరొ
విన్నా నిజమని కన్నా.

డాక్టర్ స్వామి వీరభద్రరావు

ఓ స్వామి మా స్వామి ఉన్నత పథగామి
అందు కొనుము కైవారము అక్షర మణిహారము.
చల్లనిదీ నీ హృది ఎల్లరి కది విడిది
మల్లెలు విరిసే నచట మమతలు కురిసే నచట.
నీతో మాకున్న చెలిమి నిజముగ అది ఒక కలిమి
నీ మతమూ జీవితమూ నిఖిల లోక హితము.
ఎన్నడు మూయని తలుపు మన్నన ఎఱిగిన నిలుపు.

మానవతా వాదివి అసమానతల విరోధివి

నవ్య భావముల ప్రోదివి భవ్యజీవనాహ్లాదివి.

అమృత కల్పమౌ హస్తము ఆమయ వారణ శస్త్రము

శస్త్రము నీ హస్తమందు సాధించు సమస్తము.

డాక్టర్ పి.వి. కేశవరావు

కేశవ నామాంకితు డా
వేశ రహితు డున్నతుడు
కనులు తావలము కరుణకు
తలిరుటె దయకును.
సంగీత ప్రియుడు హితుడు
సరస వచస్వి యశస్వి
అలసట యనునది ఎరుగని
అనుపమ సేవా తపస్వి.
కవులూ గాయకులూ ఇక
కళా శిల్పు లెందరో
వచ్చి పోవుచుందురూ
వరుస విడక వారింటికి.
మందస్మిత వదనంతో
మధువు చిందు హృదయంతో
లోక జనుల కందరి కా
లోకనమును ప్రసాదించు.
పనుల యందు తన శక్తిని
ప్రస్ఫుట మొనరించు కొనెను
కనుల యందు కరుణార్ద్రము
కామిత మొనరించు కొనెను.

ఆవుల గోపాల కృష్ణమూర్తి

కాట్రగడ్డ రాజగోపాలరావు
(అమెరికా రష్యా పర్యటనలు చేసి
తిరిగి వచ్చిన సందర్భాన)
కన్నులు రెండున్న నాడు
కాంచ గలము లోతులు
కన్ను ఒక్కటున్ననాడు
కాంచలేము లోతులు.
కావలసిన వీరిరువురు
కనులు మనకు చూచు కొరకు
కుడి నౌకరూ ఎడమ నౌకరు
కుదురుకున్న లోచనాలు.
తీర తీరములను వీరు

తిరిగి చూచి వచ్చినారు
అచటి మంచి విశేషాలు
అన్నిటి నందించుతారు.
కవిరాజును వెల్వరించు
వివిధాశయ విజ్ఞులైన
వీరికి మా స్వాగతమ్ము
హార్దికాభివాదమ్ము !

త్రిపురనేని వెంకటేశ్వరరావు

కవిరాజు వారసుడ ఘన వైద్యశేఖరుడ
సాహిత్య సమ్రాట్ సరస బిరుదాంకితుడ
షష్ట్యబ్ది ఉత్సవము జరిపించు ఈనాడు
నీ కిడుదు గౌరవాక్షర గేయ విరిదండ
భావ విప్లవ జ్యోతి ప్రతిభతో వెలిగించి
యువతలో చైతన్య నవత రగిలించితివి.
విలువైన విషయాలు వివరించు కావ్యాలు
చక్కగా కూర్చితివి లెక్కలో ఎక్కువగ.
శాస్త్రీయ దృక్పథము చాటి వివరించుటకు
అంధ విశ్వాసాలు అడుగంట జేయుటకు
పట్టుదల గట్టి కృషి వహియించినాడవు.
మమతలో సమతలో మనుషులందరు ఒకటె
అందుచే భేదాలు అసలు కూడదటంచు
సహపంక్తి భోజనాల్ చర్చలూ జరిపితివి.
తొలి జీవితాధ్యాయ తోరమ్ము మించి
మలి జీవితాధ్యాయ మహిత కీర్తిని గాంచు
త్రిపురనేనీ వంశ శ్రీ వెంకటేశ.

కైకాల సత్యనారాయణ

నీకు జరిపించిరిట స్వర్ణాభిషేకం
నేను జరిపింతు స్వర్ణాక్షరాభిషేకం.
కైకాల నీ పేర ఈ కళా మందిరం
నెనరు కిరవైనట్టి నీ సుహృన్మందిరం.
ఓ యన్న నీకున్న ఇంత అభిమానం
ఒరులెవరు ప్రకటించుటది మేము కానం.
ఠీవితో దనరు నీ తీయన్ని రూపం
తీర్చిదిద్దిన వెండి తెరకు ప్రదీపం.
నీవు నేనూ పుట్టినాము ఒక యూర
అందు కొరకీ కాన్క అందుకో ముదమార.
నీవు నేనూ కళను చేపట్టినాము
చేపట్టి భక్తిమై సేవించినాము.
కలకాల మిల నిలుచు నీ యశస్సు
ఫలియించె నిదె నీ కళాతపస్సు.

యు.ఎస్. బావాజీ

నీవన్న నాకున్న
నెనరు కిది గుర్తు
సత్త్వ గుణశీల నీ
సరి నెవరి నెంతు.
నీవు పలికే తీరు
నీ విలువలే వేరు
నినుపోలగలవారు
మన వృత్తిలో లేరు.
బాల సాహితి లోని
పాల మీగడలు
తెచ్చితిని గైకొమ్ము
దీవెనల నిమ్ము.
వయసు పండిన వాక్కు
దయవారు నీ దృక్కు
ఈ చిన్ని కాన్కతో
ఎటు గొల్తు ఎటు విల్తు ?
వెల లేని నీ జాడ
విలువ గల నీడ
చిన్ని నా ఈ కృతికి
శ్రీరామ రక్ష !

జంపాల శ్యామ సుందర ప్రసాదు

జంపాల కులాబ్ధి చంద్రు డను
కంపామృత కీర్తి సాంద్రుడు
శ్యామ సుందర ప్రసాదు నా
ప్రేమ గౌరవాభిమాన సేంద్రుడు ॥
అతి ప్రశాంత మాతని రూపము
అతి మృదుల మాతని భాషణము

ఆలోచనా సరళి అతి గంభీరము
అమృత నిష్యంది ఉల్లము తెల్లము ||
ఆ ఇంటికి అతడొక్కడె పుత్రుడు
ఆతనికి లేక లేక ఒక పుత్రుడు
తండ్రి చల్లని రూపు మెల్లని చూపు
తనయునిలొ నవి పట్టి చూపు
నేడు ఆ విశాల ప్రాంగణములో కాన
రాడు మరొక వ్యక్తి బాబు తప్ప
ఒకనా డా గేహము సుకవి పండిత
సకల కళా కోవిదులకు ఆశ్రయము
ఎందుకో నా మది పరితపించు
సుందర సురుచిర హాసంతో పిల్లలు
కందర్ప బాణాలటు నవమల్లెలు వెలు
గొందె ఘడియకై శుభ ఘడియకై ||

పసల సూర్య చంద్రరావు

రమణీయ కళాకృతి రసికజన చక్రవర్తి !
ఉదాత్తానుదాత్త స్వరితోజ్జ్వల స్ఫూర్తి!
పసలాన్వయ సూర్య చంద్ర ప్రాభవ గుణసాంద్ర
సూరిజన సన్నుత హిత సువిచార నాట్య కళాపార!
నీ మందిరము రసరాణ్మణీ సుహృ
న్మందిరము నవ్య భవ్య నందనము
అల పాదుషాయీ ప్రణయ ప్రతిభ
స్వాదు కవితా రసధునీ ధనము ||
వక్రోక్తి చతురోక్తి వరలు భాషణము
వ్యంగ్యమునకూ ధ్వనికి విభూషణము
ఆరోహణావరోహణల గాన లహరి
అవధరించును రస నవకమునకు దరి
నవ నాట్య శ్రీరుచుల ననలు దేరిన సరళి
నవ నవోన్మేషము నీ పేరోలము రవళి ||

మాన్య మహాశ్రీ మామక స్నేహశ్రీ
మాధుర్యో ధుర్య లలితశ్రీ మంజుశ్రీ
అక్షయము యౌవనము అద్దిన వర్చస్వి
అది నీ జన్మ సుకృతము అరుదైన వచస్వి
పసలాన్వయ సూర్యచంద్ర ప్రాభవ గుణసాంద్ర
సూరి జన సన్నుత సువిచార నాట్య కళాపార !!

వేగుంట కనక రామ బ్రహ్మము
ఆతడొక్క సువ్యవస్థ అతడు మహా సంస్థ
అవిరళ సేవా తత్పరతాతని ఆస్థ.
అమృతమూర్తి అమలకీర్తి అతడజాత శత్రుడు
అన్ని తరాల ప్రజలకు అతి దగ్గర మిత్రుడు.
మధుర మంజులం మార్దవ మతని నోటి మాట
మానవ కల్యాణ కాంక్ష మలచు కొన్న బాట.
కవుల కనులలో తారగ గళముల సుమ హారముగ
గణుతికెక్కి వారి కృతి స్వీకృతి నందెను ఘనముగు
లెక్కకు మిక్కిలి సంస్థలు అవి తన ప్రియ సంతతి
చిక్కులు తీర్చే తీర్పరితన మాతని ప్రకృతి.
అతిథుల నే వేళ ప్రేమ నాదరించు కల్పవల్లి
అమృతవల్లి ఈశ్వరమ్మ అతని సతీమతల్లి.
అతడు వేగుంట శ్రీ కనక రామ బ్రహ్మము
ఆత్మీయుండగుట నాకు ప్రాణమునకు ప్రాణము,

రావూరి అర్జునరావు, మనోరమలు

(ఆదర్శ దంపతులు గుడివాడ) -
మనోరమా శ్రీ అర్జునరావులు
మాన్యశ్రీలాదర్శ దంపతులు
ఆమె, తొలి బిడ్డ శ్రీ గోరాకు
ఆతడంకితుడు, గాంధీ సేవకు ॥
దాంపత్యమ్మన వారిదె కన
దర్శనీయ మానంద నందనము
సేవా నీమము సేవా ధర్మము
పావన జీవన పరమార్ధమ్మన ॥
స్వాతంత్ర్యోద్యమ శుభ్ర వర్తనులు
స్వచ్ఛంద సేవా నిరతులు హితులు
సంస్కరణోద్యమ రథ సారథులు
సదాచార సంపన్ను లుత్తములు ॥
భార్య యన్న ఆయమను భార్యగా
భర్త యన్న ఆయనను భర్తగా
అనుపమాన సంతతిగ వారి
ఐదుగురు బిడ్డల బేర్కొనాలి ॥
వ్యాకులము లేని కులము వారిది
హితము సర్వ సమ్మతము మతము
చల్లని మెల్లని వారిరువురి హృది
సకల జనుల కాశ్రయము విడిది !!

పసి హృదయం

అమ్మడు కూర్చుంది పటము కెదురుగ ఎదురుగ

గుమ్మడి పువ్వల్లె చాల కుదురుగ కుదురుగ

కన్నులు మూసింది రెండు కరములు మోడ్చింది భక్తి

భావము రూపొందిన ఒక భవ్య దివ్య ప్రతిమ వోలె.

తమ్ముడు తన కీ ప్రక్కా చెల్లెలు తన కా ప్రక్కా

కిమ్మనకుండా ఇద్దరు బొమ్మల్లాగమరినారు.

అమ్మడి పసిహృదయం అది అవ్యాజం నైజం

ఆరాధన ఆవేదన కది నిలయం వలయం.

చక్కగ చదువూ మార్కులు ఎక్కువగా రావాలని

నలుగురు నను మెచ్చాలని నన్ను నీవు దీవించు

మమ్మీని డాడీనీ మరి గ్రాండ్మమ్మీడాడీ

లందరినీ దీవించు ఆరోగ్యంగా ఉంచు

అందరి కంటే ముందుగ ఎందుకైన నిన్ను నీవు

దీవించుకొనీ పైనా దీవించెందరినైనా

నీకేమైనా జరిగితె నిను రక్షించేదెవరు ?

నీకె రక్షణ లేకుంటె ఇంక మము రక్షించేదెవరు?

నే చేసిన బొమ్మలు కారు

నీ చేసిన బొమ్మలు కారు

నీ కడుపున కలిగిన వారు

మాటాడక కూర్చుండుటకు

మరి కదలక పడియుండుటకు.
ఒక మార్గం మాత్రము నీవు
ఒక గమ్యం వారికి కావు.
ఊహలు ఉన్నవి వారికి
ఉన్నతిని చేరడానికి.
కోరకు నీ వలె వారిని
కూర్చి తీర్చి ఉంచాలని
కోరి యత్నించు వారిని
గొప్ప ననుకరించాలని
వంగిన విలు నీ తీరు
వదలిన బాణాల్ వారు
జీవిత మటులే నిరతం
భావి వైపు జను త్వరితం.
వారి తనువులవి వసించుకొరకై
వసతు లెన్నొ సమకూర్చగలవు
వారి తలపులవి వాసించుటకై
వసతులేమి సమకూర్చ లేవు.

నా కొలిచే దేవుళ్లు
నా కొలిచే దేవుళ్లు పసివాళ్లు
గుండె గుడిని నిండుగ కొలు
వుండిన దేవుళ్లు పసివాళ్లు

ఈ లోకం శోకం ఈ మోసం దోసం

ఈ పాపం శాపం సోకని వాళ్లు తాకని వాళ్లు
పలుకుల్లో పారిజాత పరిమళాలు కురిపించే
కులుకుల్లో కోటి వెలుగు తారకలను మరిపించే
నిద్దపు మనసుల వాళ్లు ముద్దుగుల్కు దేవుళ్లు
అంతరంగ మందొకింత చింత చీకు చేరనీని
పంతాలకు పోయి బ్రతుకు పాడు బీడొనర్చుకోని
చిద్విలాస చిదానంద చిన్మయ రూపులు వాళ్లు
వాన విల్లు వంతెనలా వన్నెల వెన్నెల బంగరు
రంగుల రంగుల ఊహల రహించు రస రేఖలా
మంటికి మింటికి అద్భుత మార్గము నిర్మించువాళ్లు

అమ్మా నాన్నా

అమ్మా నాన్నా అతి సామాన్యులు
ఆదరణ ప్రేమ నసామాన్యులు
చదువు రాదు సారస్య హృదయులు
ఎదలో భేదము నెరుగని సదయులు||
కల్లా కపటం తెలియని దమ్మ
కష్టజీవి సజ్జనుడు మా నాన్న
జన్మనిచ్చిరి జగతిని జూపిరి
నన్ను జూచి తామెంతో మురిసిరి ||
పెద సుబ్బమ్మ పెద సుబ్బయ్య
పేరులు మా తలిదండ్రులవి
వారి ఋణము నే దీర్చుకొందును
వారి మార్గమును అనుసరింతును!

మైత్రేయ గీతాలు

1. మైత్రేయ గీతాలు
మంచి ముత్యాలు
చదువుకొను వారలకు
సర్వ సత్యాలు

2. మైత్రేయ పేరులో
మంచి అర్థము ఉంది
మైత్రేయ తీరులో
మంచి అందము ఉంది.

3. మైత్రేయా!
తెల్లని మల్లియ ఉల్లము నీది
నిద్దపు అద్దపు మనస్సు నీది
వెన్నెల వెలుగులు నవ్వులు నీవి
తేటుల పాటల మాటలు నీవి.

4. అమ్మ చదువు ఇష్టం
నాన్న చదువు అస్పష్టం
బడి చదువు బహు కష్టం
డబ్బా కాలం కదు నష్టం.

5. చిన్నది నా గడియారం
చిత్రమైన గడియారం
కీయిస్తే తిరుగుతుంది
గిర్రున కాలం చూపిస్తుంది.

6. చిన్నవి పెద్దవి సున్నలు వేసి
సున్నలన్నిటిని బొమ్మలు చేసి
బొమ్మలకెన్నో రంగులు పూసి
పొంగి పోతు ఉంటాడు మైత్రేయ.

7. ఆహా! అనిపించే ఊహాకల్పనలు
కలిగినవాడు కవితాహృదయుడు
ప్రశ్నలడగడంలో గొప్ప
ప్రజ్ఞ గడించాడు మైత్రేయ.

8. ఇప్పటి వఱకు పిల్లలకు
పెద్దలె నేర్పించారు చదువు
ఇప్పటి నుండి పెద్దలకు
పిల్లలె నేర్పించాలి చదువు
కక్షలు కలహాలు మాని
కలిసి మెలిసి ఉండండని,

మతాలు కులాలు మరచి
మమతతో మెలగండని.

9. మాటలు రాకముందే
పాటలు నేర్చాడు మైత్రేయ.
అక్షరాలు రాకముందే అతడు
అందమైన బొమ్మలు నేర్చాడు.

10. బండి బరువు చదువు
పనికి రాదు మాకు
రెండు బళ్ళ హోమువర్కు
దండుగండి మాకు.
పనికివచ్చు ఫలితమిచ్చు
బాలల కానందమిచ్చు
చదువు మాకు కావాలి
చక్కగ యోచించండి.

11. గీస్తున్న గీతలే గీస్తున్నా,
వేస్తున్న బొమ్మలే వేస్తున్నా,
పూస్తున్న రంగులే పూస్తున్నా,
కాస్తకూడ విసుగు లేదు మైత్రేయకు

12. తన పళ్లు తాను తినదు తరువు
తన నీళ్లు తాను తాగదు చెరువు
తరువైనా చెరువైనా రెండూ
మనకే ఇస్తాయి అన్నీ. మంచివి.

13. రంగుల దుస్తులు వేస్తే నేను
రాజఠీవితో ఉంటాను
పప్పూ నెయ్యి కలిపి తినిపిస్తే,
బలే ఇష్టంగ తింటాను.

14. చెట్టుల భాష పిట్ట లెఱుగును
పిట్టల భాష చెట్టు లెఱుగును
అందుకే పిట్టలు చెట్టులు ఎక్కి
ఆనందముగా కూయుచుండును.

15. అల్లరి చెయ్యకు మైత్రేయా
అడిగినదిస్తా మైత్రేయా,
అల్లరి ఇష్టం నాకమ్మా
ఆనతి ఇస్తే చాలమ్మా.

16. కన్నులున్నవి రెండు
కనవోయి చక్కగా వీనులున్నవి రెండు

వినవోయి శ్రద్ధగా

నోరొక్కటే ఉంది

తీరుగా మాట్లాడు

బురొక్కటే ఉంది

బుద్ధిగా యోచించు.

17. ఆకాశంలో గోళాలు,

ఆడుకునే గోళీలు,

ఒకలాగే ఉంటాయి గుండ్రంగా

గోళాలంటే పెద్ద గోళీలు.

గోళీలంటే చిన్న గోళాలు.

గోళీలు త్రిప్పితే తిరుగుతాయి.

గోళాలు తమకుతాము తిరుగుతాయి.

18. అమ్మ నాకు ఆటబొమ్మ

అమ్మతోనె ఆడుకుంట

అమ్మలాగ ఏ బొమ్మా

ఆడదు నన్నాడించదు

నవ్వదు నను నవ్వించదు

పలకదు నను పలికించదు.

19. చెట్టు లెగరలేవు

పిట్ట లెగరగలవు

గట్టి గాలి వీస్తె చెట్లు

మట్టి తల్లి వేళ్ళతోను

పట్టుకొనీ నిలబడును.

చెట్టు లెగరలేవు.

20. పువ్వుల్లా నేనెప్పుడు

నవ్వాలని ఉంటుంది.

నవ్వని పువ్వులు అంటు

నా కళ్ళకు కనబడవు.

రంగుల రాగాలలో

రకరకాల పువ్వులు

సువాసనలు వెదజల్లుతు

శోభిల్లుతు ఉంటాయి.

21. గట్టుల పైన చెట్టులు ఉన్నవి.

చెట్టుల పైన పిట్టలు ఉన్నవి

గట్టుల పైని చెట్టులు ఎక్కి

పిట్టలన్నిటిని పట్టుకు వస్తా.

22. బండ చదువు కంటే

పాటల చదువే ఇష్టం

ఆటల చదువే ఇష్టం

కమ్మని కథలు చదువే ఇష్టం

23. అల్లరి పిల్లడు వస్తున్నాడు.

తెల్లని మల్లెలు తెస్తున్నాడు.

తెల్లని మల్లెలు ఎల్లరికిచ్చీ

అల్లరి కందం వేస్తున్నాడు.

24. గాలికి కోపం వచ్చిందంటే

గమ్మత్తులు చేస్తుంది.

ఆ దిశ ఈ దిశ అనకుండా,

అన్ని దిశల వీస్తుంది.

చెట్లను పడగొడుతుంది

చేలు పాడు చేస్తుంది.

అలలు రేపి సముద్రంలో

అలజడి సృష్టిస్తుంది.

25. పాల వయసుదాటింది

పాలు తాగనింక నేను.

పెద్దవాడ నవుతున్నాను

పెద్దపనులు చెయ్యనా!

26. నన్ను చూచి నా ఆటలు చూచి

నవ్వుతాయి ఆ పువ్వులు

నవ్వుతాయి ఆ చుక్కలు

చుక్కలు పువ్వులు చక్కని నేస్తాలు.

ముగ్గురమ్మలు నన్ను ముద్దుచేయ.

27. అమ్మ అమ్మమ్మ నాయనమ్మ

ముగ్గురమ్మలు నన్ను ముద్దుచేయ.

నాన్న నాన్న నాన్న అమ్మనాన్న

ఉన్నారు నన్ను ఉన్నతుని చేయ

28. సుదూర ఆకాశంలో తిరిగే

సూర్యుడు చూడు బంతంత

మొగాన నిప్పులు గ్రక్కుకుంటూ

జగాని కిస్తున్నాడు వెలుగు

ప్రాణ కోటి రక్షిస్తున్నాడు.

బలే తమాషా శక్తిమంతుడు.

29. పచ్చని రెక్కల చెట్టు

ఎర్రని ముక్కుల పువ్వులు

ఏమిటో చెప్పు తాతయ్యా ?

చెప్పన : అది చిలకలు వాలిన చెట్టు.

30. గాలికి చేతులు లేవు, అది
గట్టిగా నెట్టేస్తుంది.
గాలికి కాళ్లు లేవు, అది
గబగబ నడిచేస్తుంది.

31. ఆవు రంగు నల్లన
ఆవు పాలు తెల్లన
పచ్చ గడ్డి మేయును
పాలు చాల ఇచ్చును.

32. మనుషుల కంటే జంతువులు
మంచివి ఎందుకో తెలుసా?
మాటలు రావు వాటికి; అవి
మాటలతో పోట్లాడుకోవు

33. మంచు కరుగుతుంది.
మనసు కరుగుతుంది
మంచి మనిషి మంచిమనసు కరుగుతుంది.
నావ నడుస్తుంది
నది నడుస్తుంది
నది మీద నావ నడుస్తుంది.
మొయిలు నడుస్తుంది.
రైలు నడుస్తుంది
మొయిలు కింద రైలు నడుస్తుంది.

34. పగటి కన్ను సూర్యుడు
రాత్రి కన్ను చంద్రుడు.
పగలు రాత్రి కలిసి మనకు
ఒక దిన మగును.

35. మాటలకు ముందే నేర్చాడు
మైత్రేయ గీతాలు
ఆ ఆ లకు ముందే నేర్చాడు
అందమైన చిత్రాలు.

36. నన్ను నేను ఎవరితోను పోల్చుకోను
నన్ను నాతోనే పోల్చుకుంటాను.
నేను నేను గానే ఉంటాను
నా ప్రత్యేకత నిలుపుకుంటాను.

37. కొట్టినా కోసినా
కోపగించుకోదు చెట్టు
అందుకే చెట్టు తన
ఆదర్శమన్నాడు ఒక కవి.

38. కొమ్మ వంచి కాయలన్ని

కోసుకుంటే ఏమి అనదు
ఎంత మంచిదమ్మ చెట్టు
ఎంత దయమ్మా దానికి !

39. బలపం పట్టి ఎంత రాసినా
పలకకు రాదు చదువు
కలం పట్టి నీవెంత రాసినా
కాగితానికి రాదు చదువు
మనస్సు పెట్టి ఇంత రాస్తే
మనిషికి వస్తుంది చదువు.

40. నా చదువు నే చదువుకుంట
నాకు నేనే చదువుకుంట
నింగి నేలా నీరు
నిప్పు గాలీ చూచి
చెట్లనూ గట్లనూ చేలనూ చూచి
చెరువులను వాగులను నదులనూ చూచి
సూర్య చంద్రులజూచి చుక్కలను చూచి
పక్షులను చూచి, పశువులను చూచి
ప్రకృతిలో ఉన్నట్టి ప్రతి
అణువునూ చూచి.

41. ఆకులన్ని ముక్కులంట
వేళ్లన్ని నోళ్లంట
ఎందు కన్ని చెట్టుకు
వందలు వందలు వేలు ?
అదా నీ సందేహం ?
అయితే విను చెపుతా
చిన్నది నీ పరిమాణం నీ
కున్న చాలు ఒక్క ముక్కు
ఉన్న చాలు ఒక్క నోరు.
పెద్దది పరిమాణం, చెట్టు
కుండాలి ముక్కులన్ని
ఉండాలి నోళ్లన్ని
ముక్కులతో గాలి పీల్చి
గేయాలు, గేయనాటికి.
మురికి గాలి శుద్ధిజేయు.
వేళ్లతో ఆహారం తిని
నీళ్లు తాగి పెరుగును.
పెరిగిన ఆ చెట్టు మనకు
పెన్నిధిలాంటిది బాబు
సతతము ఆ చెట్టు మనకు
శత విధాల సాయపడును.

42. అన్నీ తెలుసట దేవుడికి
అందరికన్నీ చెపుతాడట
అగపడితే ఆ దేవుడు నాకు
అడగాలని వుంది ఎన్నో
కలలో రాతిరి కనిపించాడు
గబ గబ ఇట్లా అడిగేశాను.
దేవుడుగారూ, దేవుడుగారూ!
పుట్టడమెందుకు చెప్పండి ?
పుట్టావు కదా తెలుస్తుంది.
పెరగడమెందుకు చెప్పండి ?
పెరుగుతువుండు తెలుస్తుంది.
జబ్బుపడడమెందుకు స్వామి?
జబ్బు పడూ తెలుస్తుంది.
ముసలితనం ఎందుకు?
ముసలివాడవవు తెలుస్తుంది.
చచ్చిపోవడం ఎందుకు చివరికి?
చచ్చి పోవడం అని తెలుస్తుంది.
అన్నీ నాకే తెలిస్తే, నీ
వున్నది ఎందుకు దండగ ?
ఆ తెలియడమే నేను.
అది తెలియకనే ఈ తికమక!!

43. నీళ్లు పోసి ఎరువు వేసి
నీవు పెంచు మొక్కలు
పెరిగి పెద్దవైన పిదప
తరుగని ఫలములు ఇచ్చును.
ఆ తీరుగనే పిల్లల
నాదరించి పెంచితే
పెద్దవాళ్లు అయిన పిదప
పెద్ద సేవ నందింతురు.

44. అమ్మ తిట్టిన తిట్టులూ
అమ్మకొట్టిన దెబ్బలూ
అర్థమవలేదప్పుడు, చిన్నప్పుడు
అర్థమైనాయిప్పుడు, పెద్దప్పుడు.
తిట్టదా తనను విసిగిస్తే ?
కొట్టదా మరి కోపమొస్తే ?
తిట్టినా కొట్టినా దయ చూ
పెట్టినా అమ్మ అమ్మే
అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ.

45. కాళ్లు లేని చందమామ
కదలుతాడు ఆకసాన
చల్లని కిరణాలు బరపి

ఎల్లరి నలరించుతాడు.

46. పిల్లిచెల్లికి పిచ్చితల్లికి
చల్లగా మెల్లగా చదువు
చెప్పదలచీ కూర్చున్నా
చిన్న పంతులునై.
వట్టినే బెత్తాన్ని చేత్తో
పట్టుకున్నా కొట్టనమ్మా.
కొట్టితిన నా చిట్టితల్లి
గోల పెడుతుంది.
చదువు కోసం బడికి ఆ
లస్యముగ వస్తుంది.
అసలు దానికి చదువు మీద
ధ్యాస లేదేమో.
ఆడుకుంటుందస్తమానం
అక్షరాలూ దిద్దకుండా.
మ్యావు మ్యావంటుంది కాని,
మాట వినదమ్మా.
తొంగి తొంగి చూస్తుంది
దొంగలాగ ఇంటిలోకి
పారిపోయీ చట్టిలోని
పాలు తాగాలని
కొద్దిసేపూ మొద్దులాగా
కూరుచుంటుంది,
పైకి చదవవె అంటినా
బావుంటుంది.
చదువువేళల చదువుకో
పిదప సెలవుల కాడుకో
అంటె నా మాట వింటుందా
కంట బడకుండా పోతుంది.
తిరుగుతుందీ తిరుగుతుందీ
దేశదిమ్మరిలాగ పగలు
తిరిగి తిరిగీ రాత్రికి ఇక
తిరిగి వస్తుంది.
ఒక్క వారం సెలవు ఇస్తే
చక్కబడుతుందేమొ చూస్తా.
అప్పటికి అది మారకుంటే
అంతే, దానిని వదలివేస్తా.
(టాగూరు మూలం)

47. బెత్తానిదె మా బళ్లో పెత్తనమంతా

అదే చదువుచెపుతుందదమా ఇస్తుంది.

పంతులుగారంటే చింతబరిక గుర్తు

అది లేకుంటే వారికి అసలు తోచదేమి.

48. నీ చేతిలో పువ్వు
నిను చూచి నవ్వు.
పువ్వులా నీవు కూడ
నవ్వు నవ్వూ నవ్వు.
నీ కొత్త మనసుకి
నింగి నేలా ఒకటే.
నీ మత్తు కళ్లకి
నిద్ర మెలకువ ఒకటే.

49. సూర్యుడు లేకుంటే నీవు
చూడలేవు తామర పువు.
చంద్రుడు లేకుంటే నీకు

అందదయ్య కలువ జాడ.

50. అగ్నిదాహం అందరికుంది
అన్నిటికంది అవనికి ఉంది
మనిషికి ఉంది మానుకు ఉంది.
మంటికి మింటికి గాలికి పూలకు

51. కొండవాగు పరుగు చూడు
కోడెత్రాచు పరుగు చూడు.
మండుతున్న గుండెలోని
మానని ఆ బాధ చూడు.

52. తమ్ముడు పుట్టాడని మైత్రేయ
తనువు మరచి నర్తించాడు.
పేరు 'శాయి వంశీభూషణ్' అని
పెట్టినందుకూ మురిశాడు.

అన్నాదమ్ములు ఇద్దరు ఇంక
అందరి కన్నుల వెన్నెల వెలుగులు
అందరి యెదలనురాగపు పొంగులు
నింపుదరింపుగ నిండుగ మెండుగ.

53. బాలబంధు తాతయ్యగారు
బలేగ రాశారు నా గీతాలు
పాడి నన్ను పాడించారు
ఆడి నన్ను ఆడించారు.
ఆ తాత గారికి నేను
అందింతును వందనాలు
అతి భక్తితోను.

అమ్మ పాటలు

గుండెలో కన్ను
కన్నులో కన్ను కాదురా గుర్తు
గుండెలో కన్ను గుర్తురా నీకు.
దండిగా ప్రేమ దయ చూపు కొరకు
ప్రేమనే ప్రేమగా ప్రేమించు కొరకు
ఒక్కతె
ఒక్కతె మన కమ్మ అందరి
నక్కున చేర్చుక మక్కువతోను
చిక్కని ప్రేమను చిలికిన అమ్మ.

చిందర వందర కాకండని మన
లందర నొక మందార మాలగా
అందముగా తా కూర్చిన అమ్మ.
అమ్మపాటలు
అమ్మ పాటలు కొన్ని
అల్లుదామని నేను
కూర్చుంటి కుదురుగా
కూని రాగాలతో
గుండె సవరించుకొని,
గొంతు సవరించుకొని,

గుండె గొంతుకలోన
కొట్లాడుతుండగా
కూర్చుంటి నేను గొంతు సవరించుకొని.
పాటలు
అమ్మ పాటలని వ్రాసినవి
కమ్మని ఉక్తుల కూడికలు
ఉక్తులు దీటుగ తాళగతులలో
శక్తిని రక్తిని ప్రదర్శించును.
పాటలు మాటల కూడికలు
ప్రకృతి చలన ప్రవాహికలు
మాటలు లేని పాటలుండవు
మౌనముద్ర ఆలోచనలుండును.
మాటల కర్ణాలుంటాయి
మాటలు పాటల కుంటాయి
మాటలలో లయగతులుంటాయి
మాటలు పాటలలో ఉంటాయి.
మాటలు మనసును అలరించును
పాటలు పరవశత కలిగించును
మాటల కంటే పాటలు నిజముగ
మనసును మరిమరి మురిపించును.
మాటలు నేర్చిన నేను
పాటలు నేర్చిన నేను
ఆటలు నేర్చిన నేను
మాటల పాటల ఆటలతో
మనసులు కలిగిన మనుషులను
మరి మరి మరి రంజించుటకై
మంచి మార్గమిది, ఎంచుకొంటిని.

ఆకాంక్ష

మానవ కల్యాణ కాంక్ష
మాతృశ్రీ ఆకాంక్ష!
'అందరొక్కటే ప్రేమ
బంధమొక్కటే' అను –
'వద్దు వేదనాభారం మోయ
వద్దు వద్దు' అని హెచ్చరించు
ఆత్మకు అర్థం వివరించు,
అనంత విశ్వాత్మను ప్రదర్శించు.
అనంత తేజోవలయం
అనంత తేజోవలయం

ఆకాశోన్నత దేవాలయం అమ్మ.

తేజ:పుంజ ప్రభంజనం

దివ్యోదయ భువిరంజనం - అమ్మ.

అంతం లేనిది అమ్మ ప్రేమ, అ

నంత వ్యాప్తి గలది అమ్మ ప్రేమ.

అందుతుంది అందరికీ

చెందుతుంది సమానంగా.

చీకటి X వెలుతురు

కప్పితే చీకటి, విప్పితే వెలుతురు

చీకటి వెలుతురును కప్పితే, చీకటి,

వెలుతురు చీకటిని విప్పితే వెలుతురు.

వెలుతురు జ్ఞానం, చీకటి అజ్ఞానం

జ్ఞానాన్ని అజ్ఞానంతో కప్పకు

అజ్ఞానాన్ని జ్ఞానంతో విప్పు.

ఉంది

పాముల్లో స్వాముల్లో

సాధుత్వముంది క్రూరత్వముంది.

పాపల్లో చేపల్లో

చంచలత్వముంది స్థిరత్వముంది.

అక్షరం అక్షయం

అమ్మ చదువు చదువు

'అం' అని, 'అమ'ని చదువు

అచ్చుల ఆద్యంతాలు కలిపి

అర్థంతో చదువు -

ఇహం పరం ఒక్కటే యను

ఈప్సితాన్ని తీర్చు చదువు.

అహం పరిహరించునట్టి

అఖండ సుజ్ఞానమయం.
అమ్మ ముందు అర్థమైతే
అన్నీ అర్థమైనట్లే
'అక్షరం' అమ్మ చదువు
'అక్షయం' అమ్మ చదువు.
ఒకే కులం
ఒకే కులం ఒకే జాతి
మానవులందరిదీ,
మమతానుబంధంతో
మనుట వారి విధి.
ఎల్లలు లేని ఏక కులం
పిల్లలు అందరిదీ.
ఆ చక్కని ఆదర్శం
అనుసరింప దగినది.

అమ్మ దేవుడు

కన్నుల్లో కన్నులు ఉంచి
కలుములు పండించడానికి
నవ్వుల్లో నవ్వులు నించి
నాకము సృష్టించడానికి,
మాటల్లో మాటలు పెంచి
మనసును మరపించడానికి,
మానవతకు ముందుగానే
మాతృమూర్తిగా భూమికి
దిగివచ్చిన దేవుడుగా
అగుపిస్తుందమ్మ నాకు.

మమత

మమత కవితా రూపు

మా యమ్మ కనుచూపు.

కవిత కలకండ

కనుచూపు సిరి నిండ.

“మనసున మబ్బులు చొరనీకు

మాటలు దబ్బం కానీకు

మమతలు గాలికి వదలకు

మనుగడ మలినము చేయకు.”

ఒక్కటే

అమ్మకందరు ఒక్కటే

ఐనవారని కానివారని

మంచివారని చెడ్డవారని

మాట వరసకు ఉండదామెకు

అందరూ తన బిడ్డలే, వా

రందరూ బహు దొడ్డలే.

సేవ చేయును వారికి తా

సేవలందదు వారి చేత.

అలంకారం

అలంకారం అమ్మ

అమ్మే అలంకారం!

ఆ బొట్టూ ఆ కట్టూ

నగలూ నగకట్టు.

పెద్ద అంచు చీరలు

శుద్ధ జరీ చీరలు

పురాణకాలం బొట్టు

పుణ్యస్త్రీ కన్పట్టు.

పరిపూర్ణాలంకారం

పవిత్ర రూపాలంకారం

సురుచిర సువర్ణ ప్రతిమ

శుభకరుణార్ద్ర హృదయ రమ.

పసిపాప

అమ్మ పసిపాప అందాల పూప

అందరిని పిలుచు "నాన్నా!" యనుచు

అభము శుభము ఎరుగనిది

అహము అసలెరుగనిది.

ప్రేమించు ప్రేమగా

ప్రేమమై ప్రేమగా.

లేనివాడు

కోపం తాపం లేని వాడు
గొప్ప తత్వజ్ఞుడు.
చీకూ చింతా లేనివాడు
చిదానందుడు.
పాపం పుణ్యం తెలియని వాడు
పసిపాప సముడు.

సరస సంభాషణ

సరస సంభాషణా చాతుర్యమందు

అందె వేసిన చేయి అనదగినదమ్మ!

కోపిపై కోపాన్ని చూపుటే కోపమట

దేవులాడినకూడ దేవుండు దొరకడట.

దేహికెప్పుడు సందేహములు మెండట

పరమ మూర్ఖుండెపుడు పరమ విశ్వాసియట

వ్యవధాన రహితునికి అవధానముండదట.

ఆట బొమ్మలం

అమ్మకు మనమందరం
బొమ్మలం ఆట బొమ్మలం
మాటరాని వట్టి మట్టి బొమ్మలం
ఆ బొమ్మల నన్నింటిని
అందముగా తీర్చి దిద్ది
మాట నేర్పి మనుట నేర్పి
దీటుగ వర్తింపజేయు.
వాదాలు వద్దు
వాదాలు భేదాలు
వద్దు మనకవి నాన్న.
బ్రదుకు సాదాగా
భాష సాదాగా
భావాలు సాదాగా
ఉంటే చాలును నాన్న.
ఎందు కంటే లోక
మందు పలు మంది
కోటాను కోట్లు
పాటు బడు వారె,
కారు భాషా విదులు
కారు పండితులు
తిండి కే కరవైన వారు
తీరుబడికే నోచుకోరు.

సందేశము

సందేహనివృత్తి చేయునది
సందేశమ్మన దగినది.
వందారువు గురు ముఖమున
పొందునదెన్నడును కాదు.
అంధ భక్తునకు బంధము
అంతులేని విశ్వాసము,
ఆ బంధము తెంచుకుంటె
అందుకొనును మోక్షమతడు.
ముడుల జిక్కి మూఢ జనులు
మోక్షమునకు అలమటింత్రు
ముడులూ ముసుగులు తొలగిన
మోక్షము ముంగిటి ముత్యము.

ఉన్నారు

చేయకుండా ఎపుడు చెప్పేటివారు
విన్నదప్పుడె మరచి పొయ్యేటివారు
ఉన్నారు ఈ భువిని ఎన్నదగు సంఖ్యలో
ఆత్మవంచనకు గురియవుతు వారు.

అతిలోక భాష

తాత్త్విక పారిభాషికాలు
తలక్రిందుల చదివినా
సార్వకాలీన సార్వజనీన
సకలార్థములు కాస్పదమట.
ఎవరు సృష్టించారో
ఈ వింత భాష
అర్థానికావలి
అతిలోక భాష
ఊక నూకనుకొని
ఊరకే బొక్కకు
శ్రవణమే ముక్తియని
భ్రమలోన చిక్కకు.
వేదాలు చెప్పినది -
'ఎరుక' అవసరమని.
పురాణాలు చెప్పినది
'పూర్ణజ్ఞానం శివం' అని.

అంతరంగం

అంతరంగమందు
అమృత భాండముంది, నీ
అంతరంగ మందు
ఆరని వెలుగుంది.
పరుగెత్తకు ప్రతి గుడికీ
కరమెత్తకు ప్రతి బొమ్మకు.
ఆత్మజ్ఞానం పెంచుకో
అమృతం వెలుగూ నించుకో.

పరమాత్మ

ఆత్మ పరమాత్మ కావడమంటే
అనంతమైన విశాలత్వం
ఎల్లలు లేని ఏకత్వం
అన్నీ తాను తానన్నీ కావడం.
ఆ దశకు మానవుడు చేరడం
అది దివ్యమానవ తత్త్వం
విమోచనానంద తత్త్వం
విమల శాంతి స్థిరత్వం.

మూలతత్త్వం

మూలతత్త్వ చింతనకు మౌనమొక
ముఖ్యమైన మార్గం
లోల గతిని చలియించు మనస్సును
లీలగ నాపుట తగు మార్గం.
బాలల పరిమళ భావ సంపదను
పదిలపర్చు కొనుట పవర్గం
నిర్మల శాంతిని దాంతిని కాంతిని
నీలో నిలుపుట నిజముగ స్వర్గం.

ఏకాత్మతా భావ రూపం

ఏకాత్మతాభావ శ్రీకారమునకమ్మ
సాదృశ్యరూపమ్ము, సారరూపమ్ము
ప్రాకారములు కృతక బలనిరోధకములని
సాకల్యముగ వాని సర్వశక్తిని గూల్చె.

దయావరణ

తీయని గానం వింటే నీ
మాయని మమతలు స్ఫురణకు రావా ?
అగరూ గంధం ఆఘ్రాణిస్తే
కారణ జన్మది గుర్తుకు రాదా ?
దయా స్వరూపం దర్శిస్తే హృ
దయావరణ అది విస్తృతి కాదా ?
ప్రీతి పాత్రముగ చేయబూనితే
చేతలు నీవి ప్రపూతము కావా ?

గొప్ప మహిమ

ఎవరన్నారయ్యా నీతో
ఏదో మహిమ నాలో కలదని ?
మహిమంటే అర్థం తెలియని అ
మాయకులన్న మాట అది.
అమ్మని నన్నందరు
ఆదరించడం మహిమ.
అమ్మ మాటలతి శ్రద్ధగ
ఆలకించడం మహిమ.
అందరిలో ఉన్న మహిమ
అమ్మదనుకోడం మహిమ.
మానవతతో మనుషులు
మనుగడ సాగించడం మహిమ.
మనిషి మనిషి కావడం
మహా గొప్ప మహిమ.

ఎందుకు ?

యాగాలు యజ్ఞాలు ఎందుకు ? ప్ర
యాగకు పయనాలెందుకు ?
మంత్రాలు తంత్రాలు ఎందుకు ?
మహిమల మాటసలెందుకు ?
అన్నీ నీవే ఆలోచిస్తే,
అంతరంగమును వీక్షిస్తే !

శ్రేయం ప్రేయం

ఎవరో వచ్చి నిను లేపుదురని
ఎద్దు మొద్దు నిద్దుర పోవద్దు.
నిద్దురలో లేదు నీకు సుగతి,

మెలకువలోనే కలదు ప్రగతి.

నిద్దుర కలలకు ఆకరం

మెలకువ చేతల నికరం.

కలలను నీవు నిజమొనర్చితే

కలుగును నీకు శ్రేయం ప్రేయం.

లేద ? రాద ?

ఇంత తెలిసిన నీకు తెలివైన లేద ?

ఇంత చదివిన నీకు జ్ఞానమే రాద ?

ఇంత తిరిగిన నీకు నిల్కడే లేద ?

ఇన్ని బొమ్మల నీ బొమ్మ కనరాద ?

ఇంత హాయిని నీకు ఆనందమే లేద ?

ఇంత రాసిన నీకు మార్గమే దొరకద?

ఏమి మనిషివి నీవు ? వింత మనిషివి !

నిమ్మతొనలు

నిమ్మతొనలు ఇష్టం

1. పిచ్చుకమ్మ ఎందుకే

వచ్చితివి మా ఇంటికి ?

ముఖము చూపే అద్దమును, నా

ముక్కుతో పొడిచేందుకు.

2. ఉడతా ఉడతా నాతోను

అమ్మ నాకు ఇష్టం

నిమ్మతొనలు కొనిపెట్టిన

అమ్మ నాకు ఇష్టం.

నిమ్మతొనలు నీ కెందుకు ఇష్టం ?

కమ్మగ పుల్లగ వుంటవి గనక.

ఆటలు పాటలు ఎందుకు ఇష్టం ?

అవి లేకుంటే తోచదు గనక.

ఆటలు పాటలు మా కిష్టం

అల్లరి కూడా మా కిష్టం

అల్లరి చేసే పిల్లలము

చల్లని తొలకరి జల్లులము.

చెడు అనకు చెడు అనకు చెడు అనకు

చెడు వినకు చెడు వినకు చెడు వినకు

చెడు కనకు చెడు కనకు చెడు కనకు

చెడు అనకు చెడు వినకు చెడు కనకు

ఊరికి పోదాం వస్తావా ?

రానూ రానూ రాజర్షి

రాములవారీ పని వుంది.

3. కుక్కపిల్లా నాతొ

స్కూలు కొస్తావా

ముద్దుగా 'అ ఆ'లు
దిద్దు కుందాము?

4. నాన్నా నాకొక చిన్న సైకిలు
కొన్నా వంటే అది ఎక్కీ
అక్కను బావను వాళ్ళ బాబునీ
చక్కగ వెళ్లే చూసొస్తా.

5. చెంగున ఎగిరే ఆ లేగ
చెప్పవె ఎవ్వరి పాప ?
ఆడీ ఆడీ అలసీ పాలకు
అమ్మ దగ్గరకు వెళుతుందా ?

6. అమ్మా ఎందుకె ఆ కోతి
అట్లా గంతులు వేస్తుంది ?
అందుకె నేను గంతులు వేస్తే
అంటావు అవి కోతి గంతులని.

7. అక్కా అక్కా సినిమాకు
కుక్క పిల్లనూ మనతోటి
తీసుకు వెళదాం అది కూడా
చూసి సంతోషిస్తుంది.

8. అమ్మా నాకు అన్నం పెట్టు
ఆకలి వేస్తోంది.
అన్నం తిన్నాకా, చక్కగ
ఆడుకుంటాను.

9. అన్నా అన్నా చూడు
అరటి చెట్టు చూడు.
అరటి చెట్టు గెలనిండా
ఆ పళ్లను చూడు.

10. కోడిపిల్లా రా
కుక్కుకుంటూ రా
అన్నం మెతుకులు వేస్తా
జొన్నగింజలూ వేస్తా.

11. ఆ లేగ నా లాగె
ఆడుకుంటోంది
అమ్మ చెప్పవె దాని
అమ్మెవరొ నాకు.

12. కార్తిక్ రాజర్షి

కలిసే వచ్చారు.
కమ్మ కమ్మని నిమ్మతొనలు
కావాలన్నారు.

13. వేడి బువ్వ పెట్టి
వెచ్చని పాలోసి
పంచదార వేస్తే
బలేగ తింటా.

14. పిల్లెమ్మ ఇంట్లోకి మెల్లగా వస్తే
ఎలుకమ్మ గబగబా కలుగు దూరింది
పిల్లెమ్మ బైటికి వెళ్లిపోగానె
ఎలుకమ్మ వచ్చింది కలుగు వెలుపలికి.

15. అల్లరి చెయ్యకు బాబు
అమ్మడు లేస్తుంది.
అమ్మడు మాత్రం లేచి
అల్లరి చేయదా అమ్మ ?

16. మల్లి పందిరి నిండ
తెల్ల తెల్లని పూలు
చల్లినట్లున్నాయి
సందు లేకుండ.

17. మా పెరటిలో వుంది
మంచి నేరేడు.
కాస్తుంది పళ్లెన్నొ
గంపల్ల కొలది.

18. ఆకు పచ్చని ఒళ్లు
అంత ఎర్రని ముక్కు
ఎటల వచ్చెనె చిలుక
కెవరు ఇచ్చిరొ చెప్పు.

19. పొద్దున్నె ఆ కోడిపుంజు గొంతెత్తి
కొక్కొరోకోయంటు కూస్తుంది రోజు
కోడి ముందుగలేచి కూయకుంటేను ?
తెల్లవారద ఏమి పల్లెలో అమ్మ?

20. తకధిమి ధిమి నడకలతో
తళుకు బెళుకు నటనలతో
ఆడే సామ్రాజ్యలక్ష్మి
అబ్బురమే గొల్పు సుమి!

21. ముసిముసి నవ్వుల బొమ్మా
ముద్దుల గుల్కే గుమ్మా
ఆడగదమ్మా పాడగదమ్మా
అందరికి ఆనందమునిమ్మా.

22. కాకీ కాకీ మా బావ
కలకత్తాలో ఉన్నాడు.
గబగబ వెళ్లి కబురందిస్తే
కాదనకుండా వస్తాడు.

23. సినిమా రిక్షావాడు
చిన్ని జూచి నవ్వినాడు
పేపరిస్తే చిన్ని వాని
వేపు జూచి నవ్వింది.

24. గుర్రం బొమ్మెక్కాడు కార్తిక్
గొప్పగ స్వారి చెయ్యాలనుకొని
ముందుకు వెనుకకు ఊగుతుందది
మొద్దు ఒక్క అడుగైన వెయ్యదు.

25. వాకిట్లో బాజాలు వాయిస్తె చాలు
అదియేమొ రాజర్షి ఆడతాడమ్మ
ఆ లయలు ఆ హొయలు ఎట్లొచ్చెను
అంత చక్కగ ఎవరు నేర్పినారమ్మ.

26. అద్దంలో బాబు చూడు
ముద్దుగ ఉన్నాడు.
నాలాగే తాను కూడ
నవ్వుతు ఉన్నాడు.

27. ఏడు రంగులు కలిగినట్టిది ఏమిటి?
ఇంద్రధనుసు ఇంద్రధనుసు
ఏడు రంగులు ఏకమైనది ఏమిటి ?
చూడు అది నీ మల్లెమనుసు.

28. కళ్లు రెండు చెవులు రెండు
కాని నోరు ఒకటె నాకు.
ఎక్కువగా చూస్తా ఎక్కువగా వింటా
తక్కువ మాట్లాడతా.

29. నా చిన్న గొడుగు
నా కున్న నేస్తం
ఎండగాస్తే నాకు నీడనిస్తుంది
వాన వస్తే తడవకుండ చేస్తుంది.

30. ఆటలు పాటలు పాపకు ఇష్టం
అల్లరి కూడా పాపకు ఇష్టం
నిమ్మతొనలు అవి మరిమరి ఇష్టం
అమ్మంటే తన కతి ఇష్టం.

31. అమ్మ ఒళ్లో పాప ఆడుకుంటుంది
అమ్మ ముఖమును
చూచి నవ్వుతుంటుంది.
కోరి పెట్టుకున్న కుంకుమ్మ బొట్టు
చిన్ని చేతులతోను చెరిపి వేస్తుంది.

32. సాయంకాలం చంద్రకాంత
చక్కగ పూస్తుంది.
ఎరుపూ తెలుపూ రంగుల పూలు
ఎన్నో పూస్తుంది.

33. తూర్పున ఉదయించే సూర్యుడు
పశ్చిమాన ఉదయించ డెందుకు ?
పశ్చిమాన అస్తమించు సూర్యుడు
తూర్పున అస్తమించడెందుకు ?

34. పొద్దున్న మా బాబు
నిద్దరే లేవడు.
రాతిరంతా చదివి
రాశాడొ ఏమొ.

35. నిమ్మతొనలు కొనిపెడితే గాని
నీలిమ బళ్లో కెళ్ళదు
బళ్లోకెళినా అఆ లు
బాగా తాను దిద్దదు.

36. దిద్దబెడితే అక్షరాలు
దిద్దరెప్పుడు పిల్లలు
ముద్దుగా నువు బల్లమీద
ముందు వ్రాసి వ్రాయమను.

37. కొడితే మొడితే భయ
పెడితే చదవరు పిల్లలు
బుజ్జగించి లాలించీ చక్కగ
బోధిస్తేనే చదువుతారు.

38. రైలుబండి వచ్చింది రైరైమంటూ
రైలుబండి పోయింది రంకెవేసుకుంటూ

ఎర్రజెండ చూపిస్తె ఆగుతుందది
పచ్చజెండ చూపిస్తె పరుగిడుతుంది.

39. అమ్మ కూడ ఒకనాడు అమ్మడట
నాన్న కూడ ఒకనాడు నానియట
అందుకే అక్కను నన్నూ వారు
ఆ పేరులతో పిలుస్తారు.

40. ఆకాశమున ఉన్న
రాకాసి మబ్బు
ఉరుములతొ మెరుములతొ
కురిసింది వాన.

41. నెలవంక నేనట
కలువ మా చెల్లెలట
అందుకే మా మధ్య
అంత స్నేహము ప్రేమ.

42. అక్కా అక్కా నాకు
చక్కెర తౌనలూ కొనిపెట్టు
చక్కెర తౌనలూ కొనిపెడితే
చక్కగ బళ్లోకెళతా.

43. అత్తయ కొనితెచ్చినవి
కొత్త కొత్త బొమ్మలు.
మామయ కొనితెచ్చినవి
మాసిపోయినట్టివి.

44. ఇసుకతో చిని చిన్ని
పిచుక గూళ్లను కట్టు
బాలలే మనకంటె
చాల మేలనిపించు.

45. ఏమైనా మీరనుకోండి
ఎరుగున్నా మైత్రేయను,
అల్లరిచేస్తే నేమమ్మా
అన్నిటిలోనూ ఫస్టమ్మా.

46. గాజులు చేతికి తొడిగుకొని
గజ్జెలు కాళ్లకు కట్టుకొని
రంగుల దుస్తులు వేసుకొని
రమణీయంగా ఆడెను అమ్మడు.

47. పిల్లల క్షేమం కోరని
తల్లీ తండ్రీ ఎందుకు?

ఓర్పుగ నేర్పుగ విద్యను
గరపని గురువెందుకు?
తల్లీ తండ్రీ గురువూ పిల్లల సంరక్షకులు
ఆ ధర్మం నెరపకుంటె అధోగతే లోకం

48. అల్లరి చేసే పిల్లలను
ఏమనుకుంటారు ?
అల్లరి వాళ్లు అందరు
వీళ్లు ముళ్లనుకుంటారు.
అల్లరి మాని పిల్లల్లారా
చల్లగ మెల్లగ ఉండండి.

49. బొమ్మ గీస్తున్నాడు తమ్ముడు బాబు
బొమ్మ గీస్తున్నాడు తమ్ముడు
ముక్కు చెవులూ కళ్లు ముమ్మూర్తులా తనవె
తనరూపె తనచూపె తననవ్వె అచ్చంగ.

50. రాజా సంజీవదేవ్
రైలుబండి పరుగు
ఆపనలవిగాని వేగ మందుకున్న తెరగు
అతని తెలివి తేటలన్ని
అమ్మ ఒకతె ఎరుగు
నాన్న హృదయమందు అతడు నానాటికి
పెరుగు.

51. బొమ్మలు వేద్దామా రంగుల
బొమ్మలు వేద్దామా ?
అమ్మానాన్నా బొమ్మలు వేసి
అతి భక్తిని పూజిద్దామా ?

52. అడుగుతాను ప్రశ్నలు
వడిగ చెప్పు జవాబులు.
కళ్లు ఎన్నినీకు ? రెండు
ఎందుకు ? చూచేందుకు
కాళ్లు ఎన్ని నీకు ? రెండు
ఎందుకు ? నడిచేందుకు.
చెవులు ఎన్ని నీకు ? రెండు
ఎందుకు ? వినేందుకు.
చేతులెన్ని నీకు ? రెండు
ఎందుకు ? పని చేసేందుకు.
ముక్కులెన్ని నీకు ? ఒకటి
ఎందుకు ? గాలి పీల్చేందుకు.
నోళ్లెన్ని నీకు ? ఒకటి
ఎందుకు ? తినేందుకు.
బుర్రలెన్నినీకు ? ఒకటి

ఎందుకు ? ఆలోచించేందుకు.
బాగా చెప్పావు ఇవిగో
బహుమానం నిమ్మతొనలు.

53. అమ్మ కొట్టిన దెబ్బలు
అమ్మ తిట్టిన తిట్టులు
ఒంటి కంటవు మనసు కంటవు
కంట నీరొచ్చినా సరే.

54. గురువు ప్రేమతో మందలించినది
గుర్తుపెట్టుకో అది నీ మంచికె.
చేసిన తప్పును చెయ్యకు తిరిగి
చెప్పిన దెన్నడు మరిచిపోకుము.

చెప్పేదంతా బుద్ధిగ విను
వ్రాసేదంతా శ్రద్ధగ కను
తెలియకుంటే నను తిరిగి అడుగు
మాటతీరు మరి వ్రాత తీరును
మనిషికి విలువను కలిగించును.

55. ఇదె మా శపథం ఇదె ధర్మపథం –
అక్కలు చెల్లండ్రన్నదమ్ములం
ఒక్క రెమ్మ విరిసేటి పువ్వులం
నిక్కముగా బడి పేరు నిల్పెదం.

56. తీయని పుల్లని పిల్లల్ని
తెలుసుకో నిమ్మతొనలని
మంచితనం అల్లరి, వారి
మనసుల్లో ఉంటుందని.

57. చిన్న వాణ్ణి చేసి నాన్నా
నన్ను కొట్టడం కాదు.
అమ్మను కొట్టూ చూద్దాం
అపుడేమవుతుందో ?
అరే భడవా అమ్మను కొడితే
అన్నం సున్నా. మన పని సున్నా.
నిన్ను కొట్టింది నీ మేలుకే
నీ తప్పును సవరించుటకే.
(తప్పు దిద్దుటకు దండన ఒకటే
తగిన మార్గమని తలచుట తగదు)

58. పెంచగలిగిననాడె పిల్లలను, ప్రే
మించ గలిగిననాడె పిల్లలను కను.
కాని యాంత్రికముగా కనకు

దయమాలి గాలికి వదలకు.

59. తిట్టి కొట్టి భయపెట్టి ఎన్నడూ
తీరుగ విద్యా నేర్పజాలవు.
సానుభూతి సహకారము ప్రేమ
చక్కగ జూపి, నేర్పుము విద్య.

60. ప్రేమగలవారె పిల్లల బెంచగలరు.
పెంచి వారిని చక్కగా ఉంచగలరు
వారిలో చెడు నివారించగలరు
కాన పెద్దలు దీని గ్రహించగలరు.

61. తాతలనుండి తండ్రుల
తండ్రులనుండి మనల
మార్పును ఎరిగినచో తప్పక
మన్నింతుము బిడ్డలను.

62. పాత విలువలను పాటించు వారు
కొత్త విలువలను కోరి పాటిస్తే
కొంపలే కూలునని గొడవ చేయరుగా
క్రూరముగ పిల్లలను కోపగించరుగా.

63. కాలం మార్పును గమనిస్తే
ఘర్షణ కాస్కారం ఉండదు.
కాలం మార్పును గమనించకుంటె
ఘర్షణ అశాంతి కలుగును బాధ.

64. ఏకపక్ష నిర్ణయము కూడదు
ఎన్నడు పెద్దల పిన్నల మధ్య
ఇద్దరికీ అనుకూల పద్ధతి
ఏర్పడాలి అది ఎంతో మంచిది.

65. తల్లిదండ్రులూ గురువులు
పిల్లల కాదర్శులు
చేసినవే చెప్పాలి చెప్పినవే చెయ్యాలి
లేకుంటే పిల్లలు చెడిపోతారు.
తల్లిదండ్రులను బట్టే కాదు
పిల్లలు తయారయ్యేది
తమ చుట్టూ గల వాతావరణం
తప్పక వారిని మార్చేది.
మంచిగ ఉండే వాతావరణం
మరవక వారికి కల్పించు
వాతావరణ ప్రభావంలో
వారి వృద్ధి గమనించు.

66. దానం కంటే గొప్పది వాగ్దానం
దానిని నిలబెట్టుకొనుట పెద్దల ధర్మం
దానం నిలబెట్టుకొనని వారంటే
గౌరవ మేమాత్రం కలగదు పిల్లలకు.

67. చెప్పినదే కాదు చిన్న పిల్లలు
చెప్పనిదీ చూచి నేర్చుకుంటారు
అందువల్ల పెద్దలూ గురువులు
ఆదమరచి ఉండరాదు ఎన్నడు.

68. ఇల్లును మరిపించు బడి బడి
తల్లిలాంటి బడి
తల్లిని మరిపించు గురువు
ధన్యుడు మాన్యుడు ఘనుడు.

69. గాడిదంటున్నాడు అమ్మా
చూడు మామయ్యా నన్ను –
గాడిదంటే నీవు ఊరుకున్నావా?
గాడిద మామయ్యా అన్నా నేను
గాడిదలే మీ రిద్దరూ నిజంగా.

70. చెప్పినవన్నీ పెద్దలు
తప్పక నెరవేర్చాలి
మాటలకంటే చేతలు
మరి మరి ముఖ్యం పిల్లలకు.

71. పిల్లల వ్యక్తిత్వ రూపకల్పనకు
పెద్దలు శ్రద్ధ వహించాలి చాల.
స్వేచ్ఛా స్వాతంత్ర్యాల నిచ్చి
స్వీయాభివృద్ధికి తోడ్పడాలి.

72. అసంకల్పితంగానైనా
అసంగతాలు బోధించకు
చిన్ననాడు అవి బుర్రకెక్కితే
చెరగవు ఎన్నడు చెరుపు చేస్తవి.

73. నిద్దపు మనసుల ముద్దుల బాలల
నిజముగ ప్రేమించాలి
కన్నుల వెన్నెల వెలుగుల బాలల
కడు ప్రేమించాలి.

74. సేవింతురు పూజింతురు
దేవుళ్లను పెద్దలు
సేవించరు భావించరు

చిరుబాలలు దేవుళ్లు

కనబడనీ దేవుళ్లను సేవించుట కన్న

కనబడు దేవుళ్లు బాలలని

సేవించుట మిన్న.

బాలలోకం

'కథ చెప్పవు తాతా! ఒక
కథ చెప్పవు ? కథ చెప్పవు?'
'ఏ కథ ?' - 'అది నీ ఇష్టం.'
'ఎంతో చక్కని' - 'అదె అదె'
'బాలలోక మొకటి' 'ఉంది'
'చాల పేరు మోసి' 'ఉంది' -
'ఘటికుడవే చిన్న నీవు
కథకు వంత గలుపుతావు!'
'అడ్డు రాను నీ కథ కిక
ఆపకుండ చెప్పు తాత.
ఏడు సాగరాల మధ్య
ఎంతొ గొప్ప దీవి వుంది
దీవి నిండ బాల జగతి
దివ్యముగా వెలసి ఉంది.
రాజు అంటు వేరె లేడు
రాజెవడికి వాడె! చూడు.
పనులన్నీ చకచక మని
పరుగులతో జరుగుచుండు
పాడుకుంటు ఆడుకుంటు
పరవశాన బాలలంత
తీరికెరగకుండ దినము
తీరమంత తిరుగుచుంద్రు.
వంగిన ఆకాశం తన
ఒడిలో బాలలను ఊపు.
నింగి వెలుగు నీలాలును

రంగు కాంతి రంగరించు.
పువ్వులతో, పులుగులతో
నవ్వుతు కేరింతలిడుతు,
కాలమంత తీయగాను
గడుపుచుంద్రు బాలలచట.
పిట్టనైన లోకువెంచి
కొట్టబోరు అటనెవ్వరు
పువ్వునైన నవ్వుతాల
పుణకబోరు అటనెవ్వరు.
భయము, బెంగ, కలత, వెలితి
బాలలచట ఎరుగ రెవరు.
అందరికిని అన్ని ఉండు
అందరొకటిగానె ఉండు.
గాలి ఊయలందు ఊగి
నీలి జలదమందు తూగి
చుక్కలతో, చంద్రునితో
మక్కువ నాటాడుచుంద్రు.
చెట్టులన్ని పండ్లనిచ్చు
చెలగి నీడ నాకులిచ్చు
పువ్వులన్ని వాసనిచ్చు
పులుగులన్ని గానమిచ్చు.
అందరి మనసులు ఒకటే!
అందరిదీ మనికి ఒకటే!
వాదాలకు భేదాలకు

లేదా తావున స్థానము.
''తాత! నే నా లోకం
పోతా దారేదొ చెప్పు."

''ఆ లోకం వేరెలేదు
అయ్యా నీ లోనె ఉంది.

పిల్లికూనలు

ముసురు వాన రాతిరీ
ముసలి యవ్వ గుడిసెలో
రొట్టెముక్క పంపకమ్ము
గుట్టుగాను చేసుకొనక
పిల్లికూన లంట రెండు
పెద్ద కీచులాడె నంట.
కోపమొచ్చి అవ్వ అంత
చీపురొకటి చేతబూని,
వీపుపెట్ల చావమోది,
పాపమనక బైటికంపె.
తెల్లవార్లు వానదడిసి
పిల్లులయ్యొ వగచి, డస్సి -
బుద్ధిలేక తగవులాడ
ఇద్దరికిని శాస్త్రి జరిగె.
ఇంక ముందు ఎన్నడిట్టి
ఇంగితంబు లేని పనిని
బ్రతికినంత కాలమందు
బాబు చేయ' మనుకొన్నవి.
తెల్లవారి అవ్వ తలుపు
తెరచునంత కిక్కురనక
పిల్లికూన లేమొ మెల్ల
మెల్లగాను గుడిసెదూరె.
కాన బాలులార మీరు
కయ్య మెపుడు ఆడవలదు
నెయ్యముతో అన్ని పనులు
నేర్పుగాను సాధింతురు.

పట్టు - వల

పట్టు దారముల పసందు మేడ
కట్టుకొన్నదొక సాలీడు.
అట్టు ఇట్టు తిరిగేటి ఈగలను
మట్టువెట్టుటకు మాయబుద్ధితో.
బిలబిల ఎగిరే ఈగలు వచ్చీ
మిలమిల మెరిసే మేటి కూర్పుగని
పైన క్రింద నలుప్రక్కల చూచీ
తెలిసికొన్నవీ తృటిలో మోసం....
సాలీ డప్పుడు సరగునవచ్చీ
ప్రేమ నటనగా పిలువగజొచ్చె;
'రండమ్మా! రండమ్మా! ఈగలు
రాణుల్లాగ ఉందురు పోదురు;
అందమైన నా నివాస మిదిగో
అందరికీ ఇది లభ్యంకాదూ
వచ్చినవారూ రానేవస్తిరి
నచ్చిన సోఫాపై దయచేసి
ముచ్చటగా మరి మూడు ఘడియలెదొ
పిచ్చీ పాటీ చెప్పి పోదురూ.
పెద్దదాననూ, వద్ద లేరెవరు
బుద్ధిమాంద్యమూ, కొద్దిచూపునూ,
పిల్లలంటె కడు ప్రీతి నాకు మరి

వల్లకాదనక వచ్చిపోదురూ!'

అంటూ పలికే మాయమాటలను

వింటూ ఈగలు తుర్రున పోయెను;
తీయనివన్నీ మాయమాటలని
తెలిసికొన్నవిలె తెలివితొ ఈగలు.

కొండ ఎలుక

పెద్ద కొండ గర్వముతో
పిన్న ఎలుక జూచి, నవ్వి,
'నాదు ప్రక్క నీదు రూపు
నలుసు సమము నిజముగాను."
అన్నమాట విన్న ఎలుక
అలుక కులుక కంది తిరిగి -
'ఎందుకంత గర్వమయ్య
ఎవరి గొప్ప వారి కుంది
నీకుపెద్ద రూప ముంది
నిజమెగాని నాకువోలె
చిన్నరూప మున్నదేమొ
చెప్పు చూత మెందుకింక?
కోటి రాళ్లు కూడి నీవు
కొండగా నిలిచినావు.
రాళ్ల నన్ని పెల్లగిస్తె
రాలిపోవు నీదు రూపు;
అన్ని చెట్లు మోయు నీవు
ఆవగింజ కొరుక గలవె?
ఎందుకంత గర్వమయ్య
ఎవరి గొప్ప వారి కుంది.'
తెలివిమాలి అన్నతప్పు
తెలిసి ఊరుకుంది కొండ.
కాన బాలులార మీకు
గర్వమెపుడు కూడదర్ర.

పిలక బావ
చిలకముక్కు పిలకబావ
కులుకు కుంటు తిరుగుతుంటె
చిలిపి కుర్ర కుంక లంత
కిలకిలమని నవ్వులంట.
కుర్ర కుంక లంత అపుడు
గుడుగుడు మని సంప్రదించి
చక్కనైన యుక్తి ఒకటి గ్రక్కున
చేశారంట.
"పిలకబావ! పిలకబావ!
పిలక వెనక వ్రేలు తుంటె
ముందు మొగము వెల్లబోయె
అందమేమి లేక పోయె.
మాట వినక నీదు పిలక
మాటునుంటె చేతగాక
ఊరుకుంటె వీలులేదు.
ఊపి ముందు త్రిప్పుదాని"
అన్నమాట లర్థ మతడు
అందుకోను తెలివి లేక
ముందు కుంటె పిలక ఎంతొ
మోజు గూర్చునని నమ్మెను.
వెనక వ్రేలు పిలక తాను
వెర్రిగాను తిరిగి త్రిప్పి

ముందు కొచ్చునట్లు చేయు
టందరికిని మోదమయ్యె.
ఇది చూచిన కోణంగులు
ఇక ఇకమని పక పక మని
పొట్టలుబ్బ పొరలి పొరలి
పట్టలేని నవ్వులంట.
ఎంత త్రిప్పినాను పిలక
సుంత ముందు కేనిరాదు.
పిలకబావ కెంతొ బాధ
చిలిపి కుర్రలకు సరదా.

రంగడు

తుంటరి రంగడు నిత్యము
ఇంటిలొ అల్లరిచేయును;
పెద్దల చిన్నల నందర
ఒద్దిక నెరుగక తిట్టును.
అమ్మ చేసి దాచినట్టి
కమ్మని తినుబండారం
రాసులంత కావలెనని
రాగతనము అల్లరులట.
ఒక్కనాడు అమ్మచేసి
ఉంచినట్టి లడ్డులన్ని
దొంగిలించి పారిపోయి,
తోటప్రక్క తినుచునుండ
కొమ్మమీది కోతి చూచి,
నెమ్మదిగా చేరవచ్చి,
లడ్డు లన్ని కాజేసుక
రయమున చెట్టెక్కెనంట.
ఇంట గోల చేయువాడు
బైట భంగ పడుటచేత
బుద్ధివచ్చి తలపోసెను
సద్దులేక లోలోనిటు.
'ఆకతాయి అల్లరినే
నసలు చేయ నెప్పుడింక.
అమ్మ నాన్న అన్నలకూ
సమ్మతిగా నడచుకొందు;
పెట్టినంత వరకు తినుచు,
గుట్టు మట్టు కలిగియుందు.'

పిట్ట - తుట్ట

చెట్టుపైన పిట్ట గూడు
కట్టుకొన్నదీ;
కట్టుకొన్న గూట గ్రుడ్లు
పెట్టుకొన్నదీ.
చెట్టు క్రింద పుట్టలోన
తుట్ట ఉన్నదీ;
చెట్టు ప్రాకి గ్రుడ్లు పొట్ట
బెట్టుకొన్నదీ.
గ్రుడ్లు పోయి పిట్ట చాల
గోడుమన్నదీ;
చూడవచ్చి నక్కదాని
గోడు విన్నదీ.
గోడు విన్న నక్క ఒక్క
గొప్ప యుక్తినీ,
పిట్టకపుడు చెప్పెనెంతొ
ప్రేమమీరగా,

రాజు కూతు మెడను దాల్చు
రత్నహారమూ,
తెచ్చి పుట్ట కలుగు నుంచ
తీరునంతయూ.'
నక్క చెప్పినట్లే పిట్ట
గ్రక్కునప్పుడూ,
ఆచరించి చెట్టునెక్కి
చూచుచుండెనూ.

రాజభటులు నగను వెదక
రయమున వచ్చీ
కలుగునందు మెరయు నగను
కనుల జూచిరీ.
పుట్ట త్రవ్వి లోన ఉన్న
తుట్ట జంపిరీ;
పరుల కెగ్గు జేసినట్టి
పాము జంపిరీ.

నల్ల మేకపిల్ల

నల్ల మేకపిల్ల జూచి
నవ్వ దొడగె తెల్లవన్ని
తమకు ఉన్న దేహకాంతి
దాని కేమొ లేదటంచు.
నల్ల మేకపిల్ల వాటి
అభము శుభము ఎరుగనట్టి
ఆడుకొనుచు నున్నయట్టి
నల్ల మేకపిల్ల వాటి
నవ్వు నసలు సరకుగొనదు.
కాలమిట్టె గడచిపోవ
కడకు మేక పిల్లలన్ని
తల్లులయ్యె తలకు ఒక్క
పిల్లకూన పుట్టుటచే.
నల్లమేక తల్లికొక్క
తెల్లనైన పిల్లపుట్టె.
తెల్లమేక తల్లులకును
నల్లపిల్ల లయ్యె పుట్టె.
నల్లమేక పిల్లరంగు
నల్లమేక పాలరంగు

తెల్లగాను ఉంటచూచి
తెల్లమేక లన్ని అపుడు
తెల్ల మొగము వేసెనింక.
నల్లరంగు వారి జూచి
నవ్వరాదు ఎపుడు మీరు.
తెల్లనైన వారి గొప్ప
తెలిసె లోకమున కిప్పుడు.
మనిషిదే బాధ్యత
మంచికైనా, చెడుగుకైనా
మనిషిదేగా బాధ్యతంతా.
మంచికొంచెము మదిని తలచీ
మసలుకుంటే, శాంతి సౌఖ్యము!
చెడుగునే అతగాడు తలచితె
చెప్పలేని అశాంతి, నాశము.
కమ్మ రొక్కడు కుమ్మ రొక్కడు
కలిసి సంతకు వెళ్లుచుండగ
దారిలో పంతాన వారలు
తగవులాడిరి 'ఎవరుగొప్ప?ని'
కుండలను తయ్యారుచేసే

కుమ్మరీ పనివాని కంటెను,
కత్తి బల్లెము ఈటె చేసే
కమ్మరే కడు గొప్పవాడని -
తగవులాడిరి తమలొ తాము.
కత్తి బల్లెము ఈటె చేసీ
కుత్తుకలు తెగటార్చు కంటెను
మట్టి పాత్రలె చేసి నరులను
ఎట్టొ సేవించుటయెమేలని -
తగవులాడిరి తమలొ తాము.
కాలమిట్టే గడిచి చనగా
కలహ మొక్కటి పుట్టి మనుషులు
కత్తి బల్లెము ఈటె తీసుక
కుత్తుకలు తెగ నరుకుకొనిరట.
కమ్మరైనను కుమ్మరైనను
నెమ్మనమ్మున తలచలేదుగ
తాము చేసిన వస్తువులు, అవి
ధరణి 'ప్రజలకు హానికరమని.
మంచికైనా, చెడుగుకైనా
మనిషిదేగా బాధ్యతంతా;
ఆయుధంబులు తమకు తామై
హానిచేయవు ఎవరికెన్నడు.

కుక్క పిల్ల

రాంబాబు రంగబాబు
రమణమూర్తి మల్లిబాబు
ఎక్కడెక్కడొ వెతికి ఒక్క
కుక్కపిల్ల దెచ్చినారు.

నలుగురున్ను పాలుపోసి
నాల్గుసార్లు దాన్ని చూసి
ఎంత పెరిగెనో పరిశీ
లింతురు కడు విసిగింతురు
ప్రాలు త్రాగి నలుగురితో
పరుగులిడుతు ఆడుకుంటు
కుక్కపిల్ల చనువు గలిగి
కులాసాగ పెరుగుతోంది.
కొత్త కుక్కలను చూస్తే
కొంత హడావిడిని చేస్తు.
కొత్త మనుషులను చూస్తే,
గొడవజేస్తు మొరుగుతోంది.
బడికి పిల్లలంత తనను
విడచి పోతె కుక్కపిల్ల
ఒంటరిగా నుండి పాప
మొకటే తీరున ఏడ్చును.
బడికేగిన పిల్లలునూ
కడు బెంగను చెందుతారు;
ఎపుడు పోయి నేస్తుని తా
మెల్లరమును చూతుమంచు.
గంట పిదప పిల్లలంత
గంతులిడుతు తిరిగిరాగ
కుక్కపిల్ల ఎగిరి ఎగిరి
గోలజేయు నెంతొ వేడ్క

రాధ కుట్టు

కూరుచున్న - నిలిచి ఉన్న
కునుకుచున్న - పలుకుచున్న
కుట్టంటే రాధకెంతొ
ఇష్టమమ్మ ; విసుగులేదు.
పగలు లేదు, రాత్రిలేదు
పడకమీదకూడ కుట్టు
కుట్టుకుంటు కూరుచుండు
ఎట్టి పిల్లొ రాధ ! చూడు.
తిండికైన తీరికెరగ
కుండగ మరి కుట్టుపనిలొ
మునిగియుండు నమ్మ రాధ.
మూర్ఖమో మరేమిటొ అది.
బడికి వస్తు తనవెంటను
బండెడు గుడ్డలు, సూదీ
దారాలను మోసుకొచ్చి
భారీగా కుట్టుచుండు.

కుట్టు నంతసేపు సూది
పట్టు కొనును చేతితోను;
కుట్టనపుడు సూది తీసి
పెట్టుకొనును జుట్టులోన.
రంగు రంగు దారాలతొ
రమ్యముగా పూలుకుట్టు;
రంగు గుడ్డ పీలికలతొ
రమ్యమైన సంచికుట్టు.
బొమ్మలనూ బంతులనూ
బోలెడన్ని బొంతలనూ
తలగడకు గలేబులను
తగినట్లుగ కుట్టు రాధ.
కుట్టు కొరకె తాను అసలు ;
పుట్టి నట్లు రాధ తలచు;
పట్టుదలకు ఓర్పునకూ
పెట్టినదీ పేరు రాధ.

పిల్లి పేరు

అనగనగా ఒక ఊళ్లో
అవ్వా, తాతా కలరు.
వారికుంది ఒక్క చిన్న
తీరైనది నల్లపిల్లి.
తెల్లమూతి నల్లపిల్లి
తెల్ల చెవులు నల్లతోక
తెల్లగోళ్లు నల్లకాళ్లు
తీరైనది నల్లపిల్లి.

అవ్వ అంది తాత బిలిచి
'అయ్యొ మనము పిల్లి నెంతొ
ప్రేమగాను పాలుబోసి
పెంచుకొనుచు ఉంటిమాయె.
మంచిపేరు ఒకటి ఎంచి
ఉంచమైతిమే దానికి.
అని వాపోయిన అవ్వతొ
అన్నాడపు డిట్లు తాత.
''ఆకాశం మీద గొప్ప

ఆర్భాటం చేయునట్టి
మేఘమంచు పిల్లి బిలువ
మేలుగాను ఉండునుకద".
''మేలు మేలు గాలి విసర
మేఘ మిట్టె బెదరి పారు;
వద్దు పిల్లికా పేరిడ
వద్దులెండి" అంది అవ్వ.
చాల బాగ ఉండునేమొ."
"గాలిపేరె పిల్లికిడిన
అన్న తాత మాట కవ్వ
అడ్డుతగిలి అంది తిరిగి –
"గాలివీచి చెట్లనైతె
కదలించును విదలించును
కాని గోడ నేమి చేయ
లేనిదద్ది, వద్దు పేరు."
''గోడ పేరె పిల్లికిడిన
గొప్పగాను ఉండునేమొ."
అని చెప్పగ తాతమాట
లాలకించి అవ్వ బదులు -
"గోడనైతె ఎలుక ఇట్టె
వాడిపళ్ల త్రవ్వగలదు.
వద్దు బాబు గోడపేరు
వద్దు పిల్లి'' కంది తాను.
"అయితె ఇంక ఎలుక పేరె
అందముగా నుండు పిల్లి"
కనిన అవ్వ నిట్టూర్పుతో
అంది కడకు ఈ విధముగ -
"ఎలుక అసలు పిల్లి ముందు
ఎందుకు కొరగాని జీవి
పిల్లి కెందు కెలుకపేరు
పిల్లి అంటేనే చాలును."
ఆ మాత్రపు టాలోచన
అవ్వకైన తాతకైన
మొదట తట్టలేదు పోని
తుదకైనను తట్టెనహహా!

కొండమీద ఇల్లు

అనగనగా ఒక అడవి
అడవిలో ఒక కొండ
కొండమీద ఒక ఇల్లు
కుదురుకుంది గొప్పగాను.
ఒక కప్పవచ్చి, దాని తలుపుతట్టి
బిరబిర తలుపూ
తెరచుకొ తెరచుకొ
బెకబెక బెకబెక
కప్పను వస్తిని - అంది.

తలుపు తెరచుకుంది. కప్ప ఇంట్లో ప్రవేశించింది. అన్నివైపులా పరిశీలించింది. కమ్మని వంటలు, రకరకాల వంటలు సిద్ధంచేసి వున్నాయి. "చాల బాగుంది. తలుపు వేసి వస్తా. దీపం వెలిగిస్తా. తృప్తిగా భోజనం చేసి, విశ్రాంతి తీసుకుంటా."

కప్ప తలుపు వేసివచ్చి దీపం వెలిగించిందో లేదో, ఒక చుంచు వచ్చి తలుపు తట్టి,

ఎవరిల్లమ్మా, ఎవరిల్లూ?

కొండమీదనే కుదిరిన ఇల్లు!

ఎవరూ రానే రారేమమ్మా

ఇంట్లో ఎవరూ లేరా? అమ్మా! అంది.

కప్ప అంది -

బెకబెక బెకబెక కప్పను నేను

ఎవరా పిలిచేవారూ నన్నూ?

చుంచు అంది -

కిచకిచ కిచకిచ చుంచును నేను

పదును పళ్లుగల చుంచునునేను.

నీవూ నేనూ నేస్తం కడదాం

ఆడుతు పాడుతు హాయిగనుందాం.

కప్ప అంది -

"సరే రా. ఒక్కరికంటే ఇద్దరు నయంకదా!"

తలుపు తీయగానే చుంచు లోపలికి వచ్చింది. ఇద్దరు కలిసి మెలిసి ఉంటున్నారు. ఇంత వండుకొని తింటున్నారు.

ఒకరోజున ఒక కోడిపుంజు ఆ దారిన వెళుతూ కొండమీద ఇల్లు చూచింది. వచ్చి తలుపు తట్టింది. ఎవరిల్లమ్మా ఎవరిల్లూ?

కొండమీదనే కుదిరిన ఇల్లు

ఎవరూ రానే రారేమమ్మా,

ఇంట్లో ఎవరూ లేరా? అమ్మా!

కప్ప అంది - బెకబెక బెకబెక కప్పను నేను,

చుంచు అంది - కిచకిచ కిచకిచ చుంచును నేను.

ఇద్దరు అన్నారు - ఎవరా పిలిచేవారూ మమ్మ?

కోడిపుంజు అంది -

కొక్కొరొ కోకో కోడిపుంజును

దిక్కులు మ్రోగగ ఒక్క కూతతో

అందరినీ తెలివొందగ లేపెద.

కొక్కొరొ కోకో కోడిపుంజును.

మీరూ నేనూ నేస్తం కడదాం

ఆడుతు పాడుతు హాయిగనుందాం.

కప్ప, చుంచు అన్నారు -

"రా! అన్నా. ఇద్దరి కంటే ముగ్గురు నయంకదా!

కోడిపుంజు లోపలికి వచ్చింది. కప్ప, చుంచు, కోడిపుంజు కలిసి ఉంటున్నారు. కలిసి తింటున్నారు.

ఒకరోజున ఒక ముళ్ళపంది ఆ దారిన వెళుతూ కొండ మీద ఇల్లు చూచింది. వచ్చి తలుపు తట్టింది.

ఎవరిల్లామ్మా! ఎవరిల్లూ?

కొండమీదనే కుదిరిన ఇల్లు !

ఎవరూ రానే రారే మమ్మా,

ఇంట్లో ఎవరూ లేరా? అమ్మా!

కప్ప అంది - బెకబెక బెకబెక కప్పను నేను

చుంచు అంది - కిచకిచ కిచకిచ చుంచును నేను

కోడిపుంజు అంది - కొక్కొరో కోకొ కోడిపుంజును

ముగ్గురు అన్నారు - ఎవరా పిలిచేవారూ మమ్మూ?

ముళ్ళపంది అంది -

గురుగురు గురుగురు ముళ్ళపందినీ

ఒళ్లంతా ముళ్లున్న పందినీ

గడపగనిస్తే మీయింట్లో నను

గడపదగ్గరే కావలి ఉంటా

మీరూ నేనూ నేస్తంకడదాం

ఆడుతు పాడుతు హాయిగనుందాం.

కప్ప, చుంచు, కోడిపుంజు అన్నారు -

''రావయ్యా! రా. ముగ్గురికంటే నలుగురు నయం కదా!

ముళ్ళపంది లోపలికి వచ్చింది. నలుగురు ఇంట్లో ఉంటున్నారు. నాలుగు పనులు చకచక చేసుకుంటున్నారు. కప్ప నిప్పు రాజేస్తుంది. చుంచు వంట చేస్తుంది. కోడిపుంజు ఇల్లెక్కి 'కొక్కొరోకో' అని కూస్తుంది. ముళ్ళపంది గుమ్మం దగ్గర కాపలా కాస్తుంది.

ఇలా ఉండగా ఒకరోజున ఒక తుంటరి తోడేలు వచ్చి దబదబ తలుపు గెంటింది.

ఎవరూ ఇంట్లో ? ఎవరూ ఇంట్లో ?

ఏం మాట్లాడరే ? ఏం మాట్లాడరే ?

తలుపు తెరవరేం? తన్ని విరుస్తా!

కమ్మని వాసన ! కమ్మని వాసన !!

ఇంట్లోవున్న నలుగురు విన్నారు. ఇలా అన్నారు —

ఎవరమ్మా! తలుపు

ఎందుకలా గెంటుతారు ?

తోడేలు అంది -

వాడిపళ్లుగల వేడి చూపుగల

జడుపు గిడుపు లేనడవి తోడేలు

కప్పలు గిప్పలు దొప్పలు చేస్తా

చుంచులు గించులు చించేస్తా

పుంజులు గింజులు నంజేస్తా.

నలుగురు ధైర్యంగా అన్నారు -

పో! దుర్మార్గుడా! నీకు తలుపు తియ్యం. పో!"

తోడేలు ఆలోచించింది. నక్క ఒక్కటే చక్కని ఉపాయం

చెప్పగలదనుకొంది. నక్క దగ్గరకు వెళ్ళి అడిగింది.

"ఉపాయం చెపితే నాకేమిస్తావు?'' అంది నక్క

"నంజుకోడానికి కోడిపుంజునిస్తా" నంది తోడేలు.

బక్కచిక్కిన టక్కరినక్క "బలేబలే" అనుకొంది.

''ఎలుగు సాయం దొరికితే ఎంతపనైనా సాధించవచ్చు'' అని సలహా చెప్పింది.

ఇద్దరూ ఎలుగు కోసం బయలుదేరదా మనుకుంటుండగా అదే ఎదురయింది. ''ద్రాక్షలు లేవు తేనెలు లేవు" అనుకుంటూ, ఊగిసలాడుతూ.

సంగతంతా చెప్పారు ఇద్దరు. సాయం కావాలన్నారు. ఎలాగో ఎలుగుతో వాళ్ళు సరే ననిపించారు.

ముగ్గురూ మూడు నిముషాల్లో కొండమీద ఇల్లు చేరుకున్నారు. చేరుకున్నదే తడవు ఎలుగు తలుపు గట్టిగా బాదింది. లోపలున్న కప్ప బెకబెక మని, చుంచు కిచకిచ మని, కోడిపుంజు కొక్కొరోకో అని, ముళ్ళపంది గురుగురు మని కోపం ప్రకటించారు. 'తలుపు తియ్యం' అన్నారు.

ఎలుగు తలుపుని, తోడేలు ఎలుగుని, నక్క తోడేలుని పట్టి గట్టిగా గెంటాయి బలంకొద్దీ. తలుపు తెరుచుకోలేదు. ఎలుగు తలుపు మధ్యపడి నలిగింది. లోపలినుంచి నిప్పు పెట్టగా దాని బొచ్చు అంటుకుంది. "అమ్మో! బాబో!" అంటు గట్టిగా అరిచింది. ప్రాణాలతో బయటపడి పారిపోయింది. తోడేలు అది చూచి తోక జాడించింది. నక్క మాత్రం కొండ ప్రక్క నక్కి చూస్తోంది.

బాధ తప్పిందికదా అని కప్ప, చుంచు, కోడిపుంజు, ముళ్ళపంది చాలా సంతోషించాయి. కోడిపుంజు ప్రక్కనున్న చెట్టెక్కి

కొక్కొరోకో, కొక్కొరోకో

ముక్కు కాల్చీ, మూతికోసీ

చక్కగా వాతలను పెడితే

పరుగుతీశాయ్ ఎలుగు తోడేళ్ళు,

అని పాడింది.

నక్క మెల్లగా తక్కుతూ తారుతు చెట్టుకిందికి వచ్చి,

రంగురంగుల బొంగరమండీ

బంగరు రెక్కల పుంజు సుమండీ

కిరీటమున్నా మొనగాడండీ

కీరితి గలిగిన వీరుడునుండీ.

అని కోడిపుంజును పొగడడం ప్రారంభించింది.

కోడిపుంజు విని, "ఎవరా చెట్టుకింద?" అని అడిగింది.

''పుంజన్నా! నేను నక్కను. నీకొక్క మంచి రహస్యం చెప్పవచ్చాను. ఒకసారి కిందికిరా" అంది. కోడిపుంజు ఆ మాటలునమ్మి చప్పున కింది కురికింది. ఉరుకుతూనే నక్క చంకలో ఇరికింది. ఇరికిందే తడవు నక్క పరుగు దీసింది -

పాపం కోడిపుంజు

గురుగురు గురుగురు పందన్నా

కిచకిచ కిచకిచ చుంచన్నా
బెకబెక బెకబెక కప్పన్నా
పాడునక్క నను పట్టిందన్నా
ప్రాణం తీసేస్తోందన్నా
రారన్నా రారన్నా వచ్చీ
రక్షించరన్న కొక్కొక్కో –
అని గోలగా ఏడ్చింది.

ముగ్గురు నేస్తాలు ఇది విన్నారు. కోడిపుంజును రక్షించాలనుకున్నారు. ముళ్ళపంది దొర్లుకుంటూ నక్కవెళ్ళే దోవకడ్డంగా గడ్డిలో నక్కింది. చూడకుండా నక్క పందిమీద బోర్లపడేసరికి ఒళ్ళంతా ముళ్ళు గుచ్చుకున్నాయి. 'కుయ్యో మొర్రో' అంటు అది కోడిపుంజును వదిలిపెట్టింది. చుంచు వచ్చి నక్కతోక కటుక్కున కొరికింది. బ్రతుకుజీవుడా అంటు నక్క పారిపోయింది. ఇంతలో కప్పవచ్చి మిత్రులను కలుసుకొంది. కోడిపుంజు బ్రతికి బైటపడినందుకు అంతా ఎంతో సంతోషించారు.

కప్ప, చుంచు, కోడిపుంజు, ముళ్ళపంది నలుగురు కొండమీద ఇంట్లో కులాసాగా ఉంటున్నారు. శత్రుభయం లేకుండా చల్లగా బ్రతుకుతున్నారు.

మిత్రులం పవిత్రులం
శత్రుభయ విముక్తులం
కప్ప, చుంచు, కోడిపుంజు
గొప్పముళ్లపంది - మేము

మిత్రులం పవిత్రులం
శత్రుభయ విముక్తులం.
అని పాడుతున్నారు హాయిగా.

చిరంజీవి సకల
సకల నీ కన్నులలొ - చల్లన్ని వెలుగుల్లు
సకల నీ పెదవిపై - చక్కన్ని చిరునవ్వు
సకల నీ యొడలిపై - సరిమించు లేమిసిమి
ఎవరు విరిసిరి తల్లి –
ఎరుగజెప్పవె నాకు

అమ్మమనసే విరిసి –
అందగించెనె నీకు ?
వెన్నెలల బంతివే - వెలలేని శాంతివే
మొగమెల్ల నవ్వువే - సిగమల్లె పువ్వువే
చక్కన్ని చుక్కవే - సంజదీపమ్ముకే
కంటిలో కరుణవే - మింటిపై అరుణవే
అందాలు కలబోసి -నట్టి ముద్దుల పాప.
మొగ్గలకు నునుసిగ్గు-
మురిపెముతొ ఇస్తివని
బంతిపూలకు పసిమి -పంచి ఇచ్చితివనీ
గాలిపిల్లకు హొయలు -కలిగించితీవనీ
బొమ్మలకు నెమ్మదీ -పొలుపార ఇస్తివనీ
మురిసిపోవునె అమ్మ –
ముచ్చటగ పలుమారు.

అమ్మ నిను ఎత్తుకొని –
అందరికి అల్లారు
ముద్దుగా చూపిస్తు –
మురిపించి మురియునే
అమ్మ కడుపున నీవు –
అందాల తొలిపంట
వయ్యావు నూరేండ్లు -అయ్యారెవర్ధిల్లు.

నిద్ర దొంగ

ఎవడే చెపుదొంగ? ఎటుపోయెను ధైర్యంగ?
కండ్లు మూసుకొని
బిడ్డడు కమ్మగ నిద్రిస్తుంటే
మెల్లగ తనువచ్చి నిద్ర
నెల్ల దోచుకొని పోయెను !
వేసవి మధ్యాహ్న వేళ
రాసుగ తామరతూళ్ల
చెరువులోన బాతులన్ని
చేరి నిద్ర బోవుచుండె.
నీటిప్రక్క తోటదరిని
నిలిచి కొంగ విశ్రమించె;
మర్రినీడ గోపాలుడు
మంచినిద్ర మునిగియుండె;
చేతబిందె గొంచు నేను
చెరువు నీళ్ల కేగినాను;
ఇంతలోనె ఎవడొదొంగ
ఇట్టెవచ్చి చిన్నిబాబు
తీయనిద్ర దొంగిలించి-మాయమయ్యె చిత్రముగా.

మట్టి తల్లి

మట్టితల్లి - మమతలల్లి
అందరికిడె నాశ్రయంబు;
కొమ్మలపై గూళ్లు కట్టు
కొని పక్షులు సుఖముండె;

ఊడలపై కిచకిచమని
ఉడుతలెన్నొ ఆడుచుండె;

నీట నీదుకొనుచు మరి
నీలినీడ బాతులుండె;
మ్రానిచుట్టు చేరి పెద్ద
మనుషులు చర్చించుచుండె;

ఎదుటి ఇంటి కిటికిగుండ
ఎంతొ వేడ్క తిలకించుచు
బాలుడొకడు తనలో తను
చాలగ నూహించె నిట్లు
"కొమ్మలపై పిట్టలట్లు
గూళ్లలోన హాయినుందు
ఊడలపై చకచకమని
ఉడుతలట్లు ఆడుకొందు;

నీలినీడబాతులట్లు
నీటదేలి ఈదుచుందు;
మ్రానిచుట్టు చేరియున్న
మనుషులట్లు చర్చనుందు.''

బాలరసాలు
బాల్యం!

బాల్యానికి మించిన దశ
భావింపగ లేదు మరీ
బాధ్యత లెరుగని వయసూ
బాధల నెరుగని వయసూ

దినమంతా ఆటలతో
దినమంతా పాటలతో
దిగులు లేక గడచిపోవు
తీయగ హాయిగ కాలము...

అటు పిమ్మట వయసు ముదిరి
చటుకున యవ్వన మొచ్చును
పూచీ పాచీ లన్నీ

పూసుక వందలు వచ్చును....

పనులలోనే సతమతమై
అనుభవమే శూన్యమైతె
అంతలోనె ముసురుకొనుచు
అయ్యో, పై బడును ముదిమి...

కంటి చూపు తరిగిపోయి
కాలినడక సడలిపోయి
మాట తొ్ట్రు మతిభ్రమణ
మనిషి కపుడు దాపురించు
కూర్చి దాచి యుంచుకొన్న
కోటి ముచ్చటలు తీరక
ముదిమిలోనె లేబ్రాయము
వదలక లోలోన కలచు

మూడు దశలలోన చాల
ముద్దయినది బాల్యదశయె
అభము శుభము ఎరుగనట్టి
అందముగా గడచునట్టి

బ్రతికినంత కాలమందు
బాల ప్రాయ మమరియుంటె
తీరు కదా మన బాధలు
తీరును బాధ్యత లన్నియు

బాల్యానికి మించిన దశ
భావింపగ లేదు మరీ...

బంగారు పంట
ఎవరి పాపవు నీవు
ఎవరి పాపవు చిట్టి?
ప్రకృతి సుందరి కడుపు
బంగారు పంటవో ?
ఉర్వి యంతా నీకు
ఊయలై తూగునే
పూల గాలుల పాట
జోలలై సాగునే!

మింటి తారకగాను
మెరసినావే కంట?
పన్నీటి దీపమ్ము
పట్టినావే ఎడద?

పగడాల సిరిముగ్గు
పరచినా వే జాడ ?
రాగ మలరించితే
మూగ వీణియపైన ?

ఎవరి పాపవు నీవు ?
ఎవరి పాపపు చిట్టి ?

లోకోక్తులు !
ఈడూ జోడూ ఉంటేగా
ఇంపూ సొంపూ తెలిసేది !
చదువూ సంధ్యాలుంటేగా
సరసం విరసం తెలిసేది !

అమగీ ఉంటేగా
అందం చందం తెలిసేది !
పెట్టూ పోతా ఉంటేగా
చుట్టం పక్కం వచ్చేది!
పిల్లా జెల్లా ఉంటేగా
పేరూ పెంపూ లుండేది !

రాళ్లూ రప్పా లుంటేగా
ఇళ్లూ గుళ్లూ కట్టేది !
పాడీ పంటా లుంటేగా
పరువూ మురువూ నిలిచేది!

బిడ్డా పాపా లుంటేగా
అడ్డం దిడ్డం తిరిగేది !

గుట్టూ మట్టూ ఉంటేగా
చెలిమీ కలిమీ నిలిచేది.

పిలుపు

ఏటి లోపల ఈతలాడే
బుడుత బాలలు రారండోయ్ !
ఏటి దరినీ మేత మేసే
బుడుత లేగలు రా రండోయ్!

గూటిలోపల కూత కూసే
బుడుత పిట్టలు రా రండోయ్ !
మాట ఒక్కటి మీకు నేర్పి
మంచి బాలల మిమ్ము జేసెద.
ఆట ఒక్కటి మీకు నేర్పి
మేటి గల మిమ్ము జేసెద.

పాట ఒక్కటి మీకు నేర్పి
పైడి పిట్టల మిమ్ము జేసెద.
బుడుత బాలలు !
బుడుత లేగలు !
బుడుత పిట్టలు !
రా రండోయ్.

ఆ సముద్ర తటాన...!
ఎక్క డెక్కడివారొ
అక్కడే చేరారు
అక్కడే చేరి వా
రాడు కుంటున్నారు
ఆ సముద్ర తటాన
ఆడు కుంటున్నారు..
అవధి దొరకని నీలి
ఆకాశమటు తేలి
పై నొక్క కప్పుగా
పరచుకొని యున్నదీ...
ప్రక్కనే సంద్రమ్ము
పరవళ్లు త్రొక్కుతూ
కోటి చేతులు చాచి
కొట్టుకొంటున్నదీ...

పిచుక గూళ్లన్నెన్నొ
పిల్ల లక్కడ జేరి
ఇసుకతో గవ్వలతో
ఇంపుగా నిర్మిస్తు..

ఆకులతొ పుల్లలతో
అందాల పడవల్లు
కట్టుకొని వేవేగ
కడలిపై తేలిస్తు...
కడలి గర్భములోన
కమనీయ ముత్యాలు
పగడాలు వేవేలు
పండునని తెలియకనె...

కడలి గర్భము నుండి
కల్లోలములు రేగి
ముంచెత్తు లోకాల
నుంచు తా మెరుగకనె
ఎక్క డెక్కడివారొ
అక్కడే చేరారు...

ఎంతో ఇష్టం
ఎంతో ఇష్టం - నా
కెంతో ఇష్టం !
బూరల్లు ఊదుతూ
బుడగల్లు తేల్చుతూ

పచ్చని చేలన్ని
పడతిరుగుతుండడం
ఎంతో ఇష్టం నా కెంతో ఇష్టం !
పూసే పువ్వుల గంటు
కూసే పులుగులు వింటు
చెట్లన్ని గుట్లన్ని
చెడతిరుగుతుండడం
ఎంతో ఇష్టం నా కెంతో ఇష్టం!
మెరిసే మెరుపుల్లోన
కురిసే వానల్లోన
తోటల్లొ బాటల్లొ
త్వరత్వరగ తిరగడం
ఎంతో ఇష్టం నా కెంతో ఇష్టం!

హరివిల్లు అందాలు
కరిమబ్బు చందాలు
ఊహల్లొ ఊహిస్తు
ఊరక తిరగడం
ఎంతో ఇష్టం నా కెంతో ఇష్టం !

నీడల్లో వెలుగుల్లొ
నిండైన లోయల్లొ
వేడ్కలర పాడుతూ
వేవేగ తిరగడం
ఎంతో ఇష్టం నా కెంతో ఇష్టం !

చిన్న రసాలు
"పయనించిన పావురమా
పలుకొక్కటి చెప్పవ్ ?
తియ తీయని కథ ఒక్కటి
తీరికగా చెప్పవ్ ?"
అని అడిగిన పిల్లలతో
అంది పావురమ్మ ఇట్లు :

1

బడిపంతులు ఒక ఊళ్ళో
పాఠాలే చెప్పక తా
గడియారం తెగత్రిప్పీ
గణగణ గంటలు కొట్టీ

ఇంటికి పోతోవుంటే
కొంటె పిల్లలంత వెనక :
"గడియారం పంతులురా
గంటల పంతూలురా !"
అంటూ పకపకమంటూ
అరుపులు సాగించారట !
- ఇది విని పిల్లలు మురిసిరి
ఇకఇకమను నవ్వులతో!

2

అనగనగా ఒక పట్నం
అందు గలదు ముసలి యవ్వ
దిక్కు మొక్కు లేని దాని
కొక్క చిన్న మనుమరాలు!
పండ్ల నమ్మి పాల నమ్మి
పసికందును తాను ఎటులొ
చేయుచుండె జీవయాత్ర
సాయ మేరు లేని కతన :

అంతలోనె మాయ మిత్తి
పంతమూనినట్లు వచ్చి
పండువంటి ముసలిదాన్ని
పడదన్నుక పోయిందట!
చిన్నిపాప ఎవరు తన్ను
చేరదీయువారు లేక
గోడు గోడుమని ఏడ్చుచు
వాడ వీడి పోయె నెటకొ?
-ఇది విని పిల్లలు కుందిరి
ఎంతొ జాలినొంది లోన!

3

సిరిపురమను గ్రామంలో
శ్రీమంతుండగు రైతుకు
గాదెలన్ని ధాన్యమంట
బీదలన్న తెగమంట!

పనులన్నీ వారిచేత
పడచేయించుక రైతు
గంజియేని వారి కింత
కడుపునింద పోయడంట!

చీకటి బేరా లందున
చెప్పనంత ధనము గుంజి

అధికార్లనుతృప్తి పరచి
హాయిగ కాలము గడుపును

-ఇంగితజ్ఞులైన పిల్ల
లిదివిని కోపము జెందిరి!

4

అమ్మవారి జాతరంట
అద్భుతముగ జేసిరంట !

ఊళ్ళ ఊళ్ళ జనమంతా
ఉర్వి యీనినట్లు జేరి,

ముడుపులు నైవేద్యాలను
మోజుగ చెల్లించినారు !

కోళ్లు మేక లెన్నెన్నో
జోళ్ళ జోళ్ళ నరికినారు !
క్రుళ్లి చెడిన పండ్లు, మిఠాయ్
కోరినంతవరకు తినుచు !

మురికి నీరు త్రావి కలర
మ్ముమ్మరముగ తెచ్చుకొనిరి

చూచుకొండి అప్పుడింక
చోద్య మలర వేన వేలు
పీన్లు పెంట లగుచు నేల
పేర్చినట్టు కూలినారు !

ముసలి ముతక జనమెకాదు
ముద్దుపాప లెంతొ మంది
కలరమ్మకు కాన్కలగుచు
కనులు మూసినారంట!!
-ఇది విని పిల్లలు చాలా
యీసడింపు చెందినవారు !

జాలివాడా !
పంటచేలో పసుల గాచే
పిల్లవాడా ! బీదవాడా!

అల్లరంటే తెలియునా ?
ఆటలంటే తెలియునా ?

ఏదిరా నీ కన్న ఊరూ ?
ఎవరురా నీ కన్నవారూ ?

ఎండ వానల నొంటిగానే
ఉండిపోదువె పసుల గాయుచు!

కడుపునిండా తిండి కలదా ?
కట్టుకొనుటకు బట్ట కలదా?
ఉండుటకు ఒక పూరియిల్లే
నున్నదా మీ యూరిలో ?

నిన్ను జూడగ నిజముగా మది
నెన్నొ రీతుల యూహ కలుగును.
పలక పొత్తము బట్టి చదువను
బడికి పోతివె ఎన్నడైనా?
అన్నె మెరుగక పున్నె మెరుగక
ఆట లెరుగక అల్ల రెరుగక
పాట బాడుచు పసులగాతువె
పాలివాడా ! జాలివాడా!

పంటచేలో పసుల గాచే
పిల్లవాడా ! బీదవాడా !
అల్లరంటే తెలియునా ? నీ
కాటలంటే తెలియునా ?

నాన్నకంటె నచ్చినావు!
నన్నే అంటావు కాని
నాన్నను అనవేమె అమ్మ ?
అన్ని తెల్ల కాగితాలు
అలా పాడుచేస్తుంటే ?

అస్తమాను చదువుకొంటు
అదే పనిగ వ్రాసుకుంటు
తెల్లకాగితాల నన్ని
నల్లగ జేస్తుంటె మరీ!

కట్టుకొందు గాలిపడగ
కాగితమ్ము నిమ్మంటే
కట్టుకొందు నొక్క పడవ
కాగితమ్ము నిమ్మంటే

కసురుతావు గాని నన్ను
అసలుమాట నాన్న ననవె?

నాన్న చదువుచున్న దంత
నాన్న వ్రాయుచున్న దంత

అర్థమవదు నాకు అసలు
అమ్మ! నీకు అర్థమగున

నీకు లాగ నాన్న కథలు
నేర్పుగాను చెప్పలేదు
చిన్ననాడు వాళ్ళ అమ్మ
చెప్పలేదొ తనకు కథలు !

నాన్నకంటె నీవె నాకు
నచ్చినావు అమ్మ ! నిజము
ఎందుకంటే నాన్న కథలు
ఏమి చెప్పలేదు గనక !

తాతా - మనుమడు
తాతా మనుమడు తయారయారు
అట్టలు పెట్టెలు అన్నీ పుచ్చుక
తోటలొ ఉన్నా మామిడి నీడను
తొంబది ఏడుల తాతా, మరి తన
తొమ్మిది ఏడుల మనుమడు కలిసీ
తీయగ కాలం గడుపగ జూతురు !

వయసున భేదం వారికి సున్నా
ఒక్కటె ఉండును చక్కని దోస్తి

చిత్ర చిత్రముగ చిన్నవి పెద్దవి
ఎన్నో మేడలు ఎన్నో మిద్దెలు
అట్టలు పెట్టెలు నమరిచి మనుమడు
ముసి ముసి నవ్వుల మురిసిపోయెను.

నా కాలములో నానా రీతులు
లెక్కకు మిక్కిలి చక్కని మేడలు
చక్కని మిద్దెలు చక్కని శాలలు
నేరుపు మీరా నిర్మించితినీ.

అయితే ఇప్పుడు ఆ భవనాలూ
అందము చిందే ఆ మిద్దెలునూ
కాలగర్భమున కరిగిపోయినవి

చెరిగిన పనులను చెబితే లాభము
లేదు సుంతయనులేదు ఘనతయును

అంటూ లోలో ఆలోచనలో
మునిగెను తాతయు మూసి కన్నులను

కాలము తీరిన తాతకు నేస్తము
కాలతీరమున నిల్చిన మనుమడు!

విలువ దుస్తులు

ఎంత గర్వం ఎంత ఘనత
వింత దస్తులు విలువ దుస్తులు
చూచుకుంటూ చూపుకుంటూ
చోద్యమందే పిల్ల ధనికుల
కెంత గర్వం? ఎంత గర్వం!
వన్నె దుస్తులు ఉన్ని దుస్తులు
వారికంటే ముందునుండియు
పూల పురుగులు కీటకాదులు
వేలు గొర్రెలు దాల్చు టెరుగరొ?
ఎంత గర్వం? ఎంత ఘనత?

రంగు రమ్యత పైకి కాదు
రాణగూర్చు గుణాలు లోపల
మనసుమంచీ మంచి జ్ఞానం
నీతి నీమం సత్యవర్తన

త్యాగబుద్ధీ ధైర్యగుణమూ
కలిగియుంటే ఘనత కలుగును
వలువలెన్నో కూర్పజాలని
విలువ నిచ్చున వవియె నిజముగ

మంచి గుణముల కాంతి యెన్నడు
మాసిపోనిది తీసిపోనిది
తాల్చు కొలదిని వాని తేజము
తరుగ కరుగక వృద్ధి చెందును.

బందీ!

పంజరము నందుంచిరా
చిలుకనూ
బహు ప్రేమతో పెంచిరా
వలసినట్టివి పండ్లనూ
చిలుకకూ
వందలాదిగ నిచ్చిరా
కోరినట్టివి మాటలూ
చిలుకూ
కూరిమితొా బోధించిరా

పండ్ల నన్నియు నిచ్చి
బహు మాటలను నేర్పి

బంగారు పంజరపు
బందిగా నుంచిరా!!!

కనికరం

ఊడల మఱ్ఱీ నీడను పిల్లలు
సాయంకాలం తీయగ గడుపుచు
ఉన్నా రక్కడ ఉత్సాహంలో -

పాడుతు ఆడుతు పరవశించుతూ
కిలకిల కలకల కీరములట్టుల
ఉన్నా రక్కడ ఉత్సాహంలో
తిండి లేక మరి యెండిపోయినా
కోరిక లారిన కొనప్రాణంతో
మాదాకవళం మల్లన ఒక్కడు
తూలుతు తూలుతు సోలుతు సోలుతు
వారికి ప్రక్కనె వచ్చి కూలెనూ

కారణ మేమో కానని బాలలు
బిత్తరపోయీ చిత్తరువుల్లా
యోచన లేకయె చూచిరి వానిని.

బిక్షుకు డంతట పిల్లల గాంచియు
అన్నా డిట్టుల అంత్యపు మాటలు:

''అయ్యా బాబూ అయిపోయిందీ
నాలో సర్వము, నడువలేకను
ఓపిక పోయిన ఉత్తెకట్టె యిది
తిరిగితి తిరిగితి తీరాలన్నీ
అడిగితి అడిగితి అందరి దాతల
కష్టాలన్నీ గడిచితి నింకా
కట్టెను మిగిల్చి యిట్టె తుర్రుమని
ఎగిరిపోవునూ ఎటకో హంస"

కన్నుల నప్పుడు కనికర మొదవగ
చూచిరి పిల్లలు, యోచన చేసిరి
నలువు రప్పుడూ నాలుగు మూలల
పరుగున పోయీ పట్టుకవచ్చిరి

దాహం ఒకడూ తలగడ ఒకడూ
వీవన ఒకడూ చాపయు ఒకడూ
నలువు రప్పుడు నానా రీతుల
సేవ జేసిరీ సేద తీర్చిరీ
దిక్కులేని యీ దీనున కెంతో :

కన్నుల నశ్రుల కార్చుచు దీనుడు
అన్నా డిట్టుల ఆఖరి మాటలు :

"ఏ నా డెక్కడ యిట్టి కనికరం
ఎవ్వరు చూపుట ఎరుగను నాపై
ప్రేమమూర్తులూ పిల్లలు మీరూ
భావి ప్రపంచపు భాగ్య విధాతలు
అందుకొనుడు నా వందన శతముల్
తుది ఘడియల్లో తృప్తినందితిని"
అంటూ కన్నుల మూసెను మల్లన!
ముక్కు పచ్చనీ ముద్దు బాలలూ
బిత్తరపోయీ చిత్తరువుల్లా
లోకపు తీరుల లోలో తలచుక
చూడసాగిరీ సురిగిన దీనుని !

ఆటలు - పాటలు

ఆటలంటె మా కిష్టం
పాటలంటె మా కిష్టం
ఆడుకుంటు పాడుకుంటు
అలా ఉండు టిష్టం

సాధన

ఇది తల, ఇవి భుజాలు
ఇవి చెవులూ, ఇవి కళ్ళు
ఇది ముక్కూ, ఇది నోరు
ఇవి చేతులు, ఇవి కాళ్ళు
ఇవి మోకాళ్ళు, ఇవి వేళ్ళు.

ఎందుకు ?

'ఎందుకు ?' అన్న పిల్లవాని ప్రశ్నలో
అందుకోలేని అద్భుత సందేహమున్నది
ఆ సందేహమును మనం
అవశ్యం నివృత్తి చేయవలసి యున్నది.
సందేహ నివృత్తి జరిగినవాడు
ఆ పిల్లవాడు
చక్కగా వృద్ధి చెందుతాడు.

నవ్వు, నువ్వు

అందరితో ఆడు
అందంగా నవ్వు
అందరితో పాడు
ఆనందంగా నువ్వు.

కుక్కపిల్ల

ముద్దుల నా కుక్కపిల్ల
మురుస్తుంది దినమెల్ల
ఆడుతుంది నాతో, మా
టాడు తుంది నాతో.

గడియారం

గోడ మీద గడియారం
చూడు మనకు చెపుతోంది
"కాలం కడు విలువైనది
గడియ వృథా చేయవద్దు"

తాతయ్య

పాపలంటె తాతయ్యకు బలే బలే ముద్దు
ఈ జగాన చాటినాడు ఎంతో మంచి సుద్దు
బోసి తాత నేర్పినదీ బోలెడంత కద్దు
జేజేలను మనసారా చెప్పుము ప్రతి ప్రొద్దు.

గులాబీలు

గేయనాటిక
ప్రారంభము

గుత్తుల గుత్తుల గులాబి
మత్తు గుబాళింపు సోక
చిత్తమెదోలాగ కాగ
చిరపథికుడు బాటసారి -

రంగు రంగు దుస్తులతో
పొంగుతు వాసనల జిమ్ము
తోటలోని పూలవంక
తొంగిచూచి నిలిచె:

నవ్వులతో సిగ్గులతో
నవనవ చైతన్యముతో
పువ్వులన్ని తనను ప్రేమ
పిలిచినట్లు తలచె.

తోటమాలి :

ఓ బాటసారి, మా వీధి ఈ పూట మంచి పండుగ. బాలల పండుగ. మా పిలుపు మన్నించి ఈ పూట కిక్కడ ఆగండి. మా ఆతిథ్యం స్వీకరించండి. మంచి విశ్రాంతి పొందండి.

గుండె తలుపు తెరిచి పిలిచె

గులాబి తోటకి

రండి హాయి శాంతి దొరకు

నండి మీకిట:

తీయని మీ ఊహల వలె

మాయని మమతల వలె

రంగుల రాగంతో మిము

రంజించును గులాబీలు.

బాటసారి :

ఎంత ప్రేమ : ఆదరం!! నా మీద బాల

ఈ తోటమాలకి, తోటలోని గులాబీలకు!!

ఈ పూట నాకు ఈ గులాబీతోట విడిది.

ఒత్తుగ విరిసిన ఈ గులాబీ గుత్తుల తీరు

నన్నెంతో ముగ్ధుణ్ణి చేస్తున్నది.

తోటమాలి :

రండి బాబూ! మా తోటకు. తోటలోని గులాబీ గుత్తులను చిత్తమలర తిలకించండి.

చిన్న పిల్లల్లాంటివి ఈ చిన్నారి పొన్నారి గులాబీలు. మౌనం వీటి మర్యాద. మందహాసం వీటి ఆహ్వానం. ముద్దుచేస్తే మురిసిపోతాయి. ముట్టుకుంటే కందిపోతాయి.

ఎందరో ఈ పూలను ఇష్టపూర్తిగా ధరిస్తారు. వారందరూ వీటికున్న ముళ్లనూ భరిస్తారు, అదీ చమత్కారం!

అల్లరెరుగని నవ్వులు

అందాలు చిందే పువ్వులు

చిన్న సిగ్గుల నిగ్గులు, ఈ

కన్నె రోజా మొగ్గలు.

బాటసారి :

ఏమి?

ఎర్ర గులాబీ ఏమంటున్నది!

ఎరుంగురు నెహ్రూనే నంటున్నది.

గులాబి మొగ్గలు

గులాబి బుగ్గలు

గురుతుగ నిలిచిన నెహ్రూను. మన

గుణములు మలిచిన నెహ్రూను

ఎరుగుదు: ఎరుగుదు నంటున్నది.

బాల

మొగాన కాంతి

జగానా శాంతి

నించిన ప్రియతమ నెహ్రూను విరి

యించిన ప్రియతమ నెహ్రూను.

ఎరుగుదు ఎరుగుదు నంటున్నది.

పరాభవమ్ము

జభయమ్ము

పట్టి నెట్టినా నెహ్రూను. జగ

జెట్టి యనబరగు నెహ్రూను.

ఎరుగుదు ఎరుగుదు నంటున్నది.

మమతా సమతా

మానవతా, ఇలలో

పెంచిన చాచా నెహ్రూను, కదు

మించిన చాచా నెహ్రూను -

ఎరుగుదు ఎరుగుదు నంటున్నది.

ఎఱ్ఱగులాబీ నెహ్రూ ఎదపై ఎంతో గౌరవస్థానం గడించుకొన్నది. నెహ్రూ ఎదలో చిన్నపిల్లలకూ అంత గౌరవ స్థానం ఉన్నది. ఈ నవంబరు 14న, ప్రపంచ బాలల పర్వదినాన గులాబి మొగ్గలన్నీ బంగారు బాలల బుగ్గల నిగ్గుల్లా మెరిసి పోతున్నాయి. అవి ప్రపంచ పౌరులకు ఎంతో గొప్ప సందేశాన్ని అందిస్తున్నాయి.

గులాబి పువ్వులు :
కలకు కాణాచి
గా నున్న ఈ భువికి
దిగివచ్చినామండి
దివ్య సీమల నుండి
అన్ని దేశాలలో
నున్న బాలల గొప్ప
పండు గిట రెండు
పరికించి పొందు.
వైరాలు మాకద్దురావు
దూరాలు మామధ్య లేవు, జాతి
పరిమళాలనుబంపుతాము, జగమంత
పరవశాలతో నింపుతాము.
శోకాలు సాగించుతాము, ఈ భువిని
నాకముగ మార్చివేస్తాము.
అన్ని దేశాలలో

నున్న బాలల గొప్ప
పండు గిట రండు
పరికించి పొందు.

తోటమాలి:

బాబూ! మా తోటలో అడుగిడిన మీరు, మా వీటికే బంధువైనారు. అన్ని గులాబీలనూ ఆనందంతో చూడండి. ఆ మూల ఒదిగియున్న చిన్న గులాబీలను, సన్న గులాబీలను మరింత సాదరంతో చూడండి.

బాటసారి :

చిగురాకుల నీడనచట

చిన్నదోవు మీరు

ఎందుకలా ఒదిగి దాగినారు?

చిన్న గులాబీలు :

చిన్న గులాబీలము మేము, మీ చెంతజేర భయపడినాము.

బాటసారి :

ఎందుకు మీ కాభయం?

ఇదే మీకు, నా అభయం

ఉన్న సంగతేమొ కాస్త

సన్నగ తెలపండి నాకు.

చిన్న గులాబీలు :

తీరులేని పేరు లేని

ధీరులమూ, హీనులమూ

గొప్పవారి దగ్గరకూ

చప్పున పోలేము.

బాటసారి :

పైన కానవచ్చు రంగు

రూపమ్ముగ కన్న

లోన వెలుగు వాసనాది

పువ్వులన్ని సమానమే

పూజా గౌరవమే.

గుణసంపద మిన్న.

తోటమాలి :

చక్కగా సెలవిచ్చారు బాబూ!

"పువ్వులు పుణ్యాలు ప్రోవులు" అని పెద్దలన్నారు.

బాటసారి :

ఈ గులాబీ తోట శాంతికి నిలయం. ఆనందానికి ఆలయం. ఇక్కడ తగవులుండవు. దగాలుండవు. దారుణాలుండవు. రంగు భేదం ఉండదు. రాజా పేదా తేడా ఉండదు.

నేర్చుకోగలిగితే మనుషులకు ఈ పువ్వులు ఎన్నో మంచి విషయాలు నేర్పుతాయి. మంచి వాసన అందీయడం, మంచిగా బ్రతకడం నేర్పుతాయి. అందరి ప్రేమా గౌరవం అందుకోవడం నేర్పుతాయి. పరహితం పరసేవా వీటి పవిత్ర కర్తవ్యం.

ఈ గులాబీలకు యుగ యుగాల చరిత్ర ఉన్నది. జగ జగాల చరిత్ర ఉన్నది. నవాబుల షాదుషాల, చక్రవర్తుల రాణీసాహెబాల చరిత్రతో వీటి చరిత్ర ముడిపడియున్నది. గులాబీల చరిత్ర గొప్ప చరిత్ర.

ముగింపు (బృందగానం)

ప్రపంచమే ఒక గులాబీ తోటై

ప్రతి మనిషీ ఒక గులాబి పువ్వై

గులాబి పువ్వుల గుబాళింపులా

మనిషి జీవితము మారిననాడు

లోకము నాకము కాగలదు. ము

మ్మాటికి స్వర్గము కాగలదు.

మల్లెలు - మొల్లలు

పిల్లల నాటిక

మల్లెలు మొల్లలు

మా సదనం పిల్లలు

ఆటల పాటల

అలరుల - మూటలు

చిన్న వాళ్లు పిన్నవాళ్లు

ఎన్నో వెలుగులున్న వాళ్లు

పున్నమిరే వెన్నెలసరి

కన్నుల సిరులున్నవాళ్లు

మొగ్గల నను- సిగ్గుకు లే

బుగ్గల తావొగ్గువాళ్లు

చిలుకల పలుకులు కిలకిల

చిలికి, అందమొలుకు వాళ్లు॥

బుడిబుడి వడివడి అడుగులు

తడబడు చిరు-నడలవాళ్లు॥

అందము ఆనందము, కను

విందుగ వెలుగొందువాళ్లు॥

మల్లెలు మొల్లలు వాళ్లు॥

(కిలకిల నవ్వులతో)

బాలలు

బాలలం!

బాలబంధు బాలసదను బాలలం!!

మాటా పాటా ఆటా

మాకు బాగ తెలుసు।।

మమతా సమతా

చక్కని మానవతా తెలుసు!!

బాలలం!
బాలబంధు బాలసదసు బాలలం!!
ఒకడు:
కల్పనా! శాయీ! గిరిజా! ఫణీ!
మణీ! సాలార్! మురళీ! రవీ!
రాజూ! నానీ!

నా మాట ఒకటి వినండి. మనం బాలబంధు తాతయ్య వచ్చేలోపున సర్దాగ ఆడుకుందాం. చదువు మధ్య సర్దా ఆటలు లేకపోతే బాగుండదు.

మరొకడు :

కవీ! ఏం ఆటలు ఆడుకుందాంరా?

రవి : మురళీ, మనం జంతువులాట రంగుల - రైలాట ఆడుకుందాంరా. ఆవుల్లా బర్రెల్లా అరుపులు అరుస్తూ కుక్కల్లా నక్కల్లా కూతలుకూస్తూ అల్లరిగా మనం ఆడుకుందాం. చదువు గొడవ కాస్సేపు మరిచిపోదాం! సరేనా?

ఇంకొక బాలిక కల్పన :

ఆడుకుందాంగాని రవీ! బాలబంధు తాతయ్యకివి తెలిస్తే ఏం చేస్తారో తెలుసా?

రవి : ఏంచేస్తారు కల్పనా?

కల్పన : వీపు విమానంమోత మోగిస్తారు. పట్టిన దయ్యం వదిలిస్తారు.

మిగిలిన కొందరు : బాబో అలాగైతే ఆ జంతువుల ఆట వద్దు. అరుపులు అరవవద్దు. బుద్ధిగ కూర్చొని శ్రద్ధగ చదువుకుందాం ఆటలు సాయంకాలం ఆడుకోవాలి గాని చదువు మధ్య ఏమిటి?

(తాతయ్య వస్తున్న - సకిలింపు. చెప్పుల చప్పుడు)

మణి : (మెల్లగా) ఏమర్రో! సార్ వస్తున్నారు. గప్‌చిప్ సాంబారుబుడ్డి మాట్లాడకుండా కూర్చొని మౌనంగా చదువుకుందాం.

బాలబంధు : ఆహా! వాన వెలిసినట్టు అంతా ఒక్కసారి మౌనముద్ర పట్టేశారేమిటి?

చాటు నుండి మీ మాటలన్నీ విన్నా నర్రా మీరు కుక్కలు, నక్కలు, ఆవులు, బఱ్రెలవంటి జంతువులు కాదలచినందుకు ఎంతో సంతోషించా, ఎందుకో తెలుసా సాలార్?

సాలార్ : తెల్వదుసార్!

బాలబంధు : అయితే చెపుతా వినండి.

జంతువులు మనుషులకంటే చాలా మంచివని అందరూ ఇప్పుడు తెలుసుకున్నారు. మీరు కూడా జంతువుల వంటివాళ్లే చాలావరకు. పిల్లలు : ఎందుచేతనండీ?

బాలబంధు : ఎందుచేతనా? మనుషులు కొట్టు కుంటారు; తిట్టుకుంటారు. ఒకరి నొకరు మోసం చేసుకుంటారు. జంతువులు అలా కాదు. హాయిగా తింటాయి, తిరుగుతాయి మీరూ అంతేగా? బాలలు : మేం అల్లరిచేస్తాం గదండీ?

బాలబంధు : మీరు అల్లరిచేస్తారు. నిజమే. అల్లరి చెయ్యకపోతే మీరు పిల్లలే అనిపించుకోరు. అల్లరి మీకు అందం. అల్లరి మీకు అవసరం కూడ. మీ అల్లరిలో అపాయం లేదు. మీ అల్లరిలో ఆనందం ఉంది. అమాయకత్వం ఉంది. అల్లరి చేయడం అనేది మీకు పుట్టుకతో వచ్చిన ఒక మంచి లక్షణం. అలా ఉంచండి.

మీరు రంగుల రైలాట ఆడుకో దలచారు - కదా? ఆడండి. ఇవాళ మీకు ఆ రైలాటే పాఠం. ఆ యాటలో మీ ఊహలు తెలివితేటలు ఎలా ప్రకటన అవుతాయోచూడాలి.

(గుప్ గుప్ – కూ కూ ధ్వనులతో ఆట ప్రారంభం)

రై రై మంటూ

రంగుల రైలు	ఎక్కండి!
పోతూ ఉంది.	చిన్నలు పెద్దలు
పొగలు చిమ్ముతూ –	స్త్రీల పురుషులు
రండీ అందర	ఎవరైనా సరె

ఎక్కండీ, మరి
టిక్కెట్టు తప్పక
కొనాలి సుమా
ఊళ్లూ బీళ్లూ
నదులూ వాగులు
కొండలు గుట్టలు
దాటుతు పోయే
రంగుల రైలు!
ఎక్కేవాళ్లు! ఎక్కవచ్చును
దిగేవాళ్లూ దిగవచ్చును
ఎక్కడివాళ్లను
అక్కడ చేర్చే
నమ్మకమైనది
రంగుల రైటు.
సర్పంలాగా
సర సర రైలు
పోతూ ఉంటే
ఘోర్సుగ ముందుకు
గిర్రున భూమీ
గిర్రున చెట్లూ తిరుగుతు వెనక్కి
జరుగుతూ ఉందు!
కులాల తేడా
మతాల తేడా
డబ్బూ దర్పం
పదవుల తేడా
పాటించనిదీ! జనతా రైలు!!

బాలబంధు :
భేష్ భేష్ మీ రైలాట
చాలా గొప్పగా ఉంది
రంగుల్లాంటి రకరకాల
భావాలు, చిన్నవాళ్లయినా
మిన్నగ వెల్లడించారు.

బాలలు :
మేం!
మల్లెలం!
మొల్లలం!
మాయా మర్మం తెలియని
పిల్లలం!!

బంగారు పిచ్చుక

బాల నాటిక

కథకుడు

ఒక బంగారు పిచ్చుక పట్టునారతో అందమైన గూడు అల్లుకొని అందులో మెత్తని ఈకలు పరుచుకొని ముచ్చటగ మూడు గ్రుడ్లు పెట్టుకొంది. పిచ్చుక తిరిగివచ్చి చూచుకొంది.

పిచ్చుక అయ్యో నాగూడులేదు. గ్రుడ్లూ లేవు, ఎవరో దొంగిలించుకుపోయారు. కష్టపడి అల్లుకొన్న గూడూ. కన్నగ్రుడ్లు పోయాయి, అయ్యో అయ్యో (గోడు గోడున ఏడుస్తుంది). అలా తిరుగుతున్న కుక్కపిల్ల నడుగుతా. ఓ కుక్క పిల్లా! నా గూడు దొంగిలించావా?

కుక్కపిల్ల : కుయ్యో మొర్రో నేనెరగను. నేనసలు నీ గూడే చూళ్లేదు.

పిచ్చుక : ఆ ఆడుకొనే ఆవుదూడ నడుగుతా. ఓ ఆవుదూడా! నా గూడు దొంగిలించావా?

ఆవుదూడ : అయ్యో అంబా నేనలాంటి పని ఎప్పుడూ చెయ్యను. చేస్తే మా అమ్మ పొడుస్తుంది.

పిచ్చుక : తుమ్మెద నడుగుతా, తూరీగ నడుగుతా చెరువు నడుగుతా. చెట్టు నడుగుతా. పువ్వు నడుగుతా. పిల్ల కాలవ నడుగుతా ఏమర్రా మీరు నా గూడు దొంగలించారా?

అందరు : రామ రామా మేము అలాంటి పని ఎన్నడూ చెయ్యం.

పిచ్చుక : అయ్యో నాగూడు గ్రుడ్లూ ఇంక దొరకవు. ఏమి చేయను? ఎవరికి మొర పెట్టుకోను? (ఏడుస్తుంది)

అందరు : పిచ్చుకమ్మా ఏడవకు. నీ గూడును దొంగిలించిపోయిన దొంగను మేము పసికట్టి పట్టుకుంటాం.

పిచ్చుక: కుక్కపిల్లా నువ్వు దొంగను ఎలా పసికట్టగలవు.

కుక్కపిల్ల: వాడు దొంగైతే నాముందుకేరాడు కరుస్తానన్న భయంచేత.

పిచ్చుక : తుమ్మెదా నువ్వు?.

తుమ్మెద: నారొదవిని చెదరగొట్టడు మనస్సులో బెంగచేత.

పిచ్చుక : తూనీగా నువ్వు?

తూనీగ: నన్ను పట్టుకొని బాధపెట్టడు మనస్సులో దిగులు చేత.

పిచ్చుక : చెరువూ నువ్వు?.

చెరువు : నా గట్టు మీదే నడవడు. పడగొడతానన్న భయంచేత.

పిచ్చుక : చెట్టూ నువ్వు?

చెట్టు : నా నీడనే నిలవడు విరిగి పడతానన్న అనుమానం చేత.

పిచ్చుక: పువ్వూ నువ్వు?.

పువ్వు : నన్ను త్రుంచి వాసనచూడడు మనసు మనసులోలేక.

పిచ్చుక : పిల్లకాలవా నువ్వు?

పిల్లకాలవ: నన్ను దాటిపోడు ముంచుతానన్న అనుమానం చేత.

పిచ్చుక: మీరంతా ఎంతో తెలివైన వాళ్లుగా కనబడుతున్నారు. నామీద మీకెంత దయో! మీవల్ల నాకు తప్పకుండా ఉపకారం జరుగుతుందన్న ఆశగా ఉంది.

అందరు : దొంగను పట్టాలి. పట్టి తీరాలి. బైలు దేరుదాం (కేకలు వేస్తారు)

కథకుడు: గూడు దొంగిలించిన కుర్రవాడు ఈ కేకలు విన్నాడు. కంగారు పడ్డాడు తన దొంగతనం దాగదని భయపడ్డాడు. ఇక చేసేదేమి లేక, చడీ చప్పుడు కాకుండ, పిచ్చుక గూడు గ్రుడ్లతో సహా ఎప్పటి చోటే పెట్టి వస్తున్నాడు. దారిలో అతనికి పిచ్చుకమ్మ ఎదురు పడింది. గుండె గతుక్కుమంది. అప్పుడు

కుర్రవాడు: (బితుకు బితుకు మంటూ) పిచ్చుకమ్మా! నీ గూడు దొంగి లించింది నేనే. నిజం చెప్పుతున్నా. గూడూ గ్రుడ్లూ పదిలంగా తీసిన చోటే పెట్టివస్తున్నా వెళ్లి చూడు ఇంకా నన్నుకోప్పడకు. నా మీద ఎవరికీ కోపం రాకుండా చూడు.

పిచ్చుక : (ఆశ్చర్యంతో) ఆహా! ఎంత గొప్ప నిజాయితీ గల బాబువి? నీ తల్లి కడుపు చల్లగా ఉండా. ఉండది చూచివస్తా (తుర్రున వెళ్లి చూచి వస్తుంది) నా గూడు గ్రుడ్లూ సురక్షితంగా ఉన్నాయి బాబూ. నిజం చెప్పిన నీమీద ఎవరికీ కోపం రాదు. గౌరవం కలుగుతుంది. కలుగుతుంది. (ఆగని సంతోషంతో ప్రేమ అందరూ ఏమర్రో కుక్కపిల్లా, ఆవుదూడా, తుమ్మెదా, తూరీగా, చెరువూ, చెట్టూ. పువ్వూ, పిల్ల కాలవా విన్నారా ఈ

మాట? నా గూడు గ్రుడ్లు దొరికాయి. వాటిని తీసుకు వెళ్లిన ఒక బుజ్జిబాబు తిరిగి తీసుకు వచ్చి ఇచ్చాడు. అతడు దొంగ కాదు. దొడ్డ నిజాయితీ పరుడు. అతడిక్కడే ఉన్నాడు. రండి చూడండి. గౌరవం చూపండి. రండి. రండి.

కథకుడు : వాళ్లందరూ ఆ బుజ్జిబాబు చుట్టు చేరారు. కుక్కపిల్లా ఆవు దూడా చెంగుచెంగున గంతులు వేశాయి. తుమ్మెద ఝుమ్మని గానం చేసింది. తూనీగ పైన ఒయ్యారంగా నాట్యం చేసింది. చెరువు ముత్తైదువులా మురిసి చూసింది. చెట్టు ఆప్యాయంగా నిలబడి నీడ నిచ్చింది. పువ్వు కలకల నవ్వి కమ్మని వాసన విరజిమ్మింది. పిల్లకాలవా ఉల్లాసంగా ఉరుకుతూ ప్రవహించింది. పిచ్చుకమ్మ ఆపుకోలేని ఆనందంతో అశ్రువులు రాల్చింది.

వాళ్లందరూ ఆ బాబుని ఇలా మెచ్చుకొని దీవించారు.

అందరూ

అందాల బాబూ,
అందుకో దీవెనలు.
తప్పు చేసినవారు
ఒప్పుకుంటారా
నిజము తెలిసిన అది
నీకె తగుగాని !!

అందాల బాబూ!
అందుకో దీవెనలు :
నీ పేరు ఘనముగా
నిలుచు శాశ్వతము!!!



బాల సాహిత్య పరిశోధకులకు తరగని గని

పిల్లల్ని ప్రేమించే కుటుంబానికి చిన్నబాలశిక్ష

పిల్లలలో చైతన్యం నింపే ఉపాధ్యాయులకు దారి చూపే దీపం

నాలుగు దశాబ్దాలు పిల్లల ముందు గేయాలు పాడ్తూ కథలు చెప్తూ వారిని పరవశింప చేసిన బాలబంధు బి.వి. నరసింహారావు ఇంట్లో తల్లిదండ్రులు స్కూలులో ఉపాధ్యాయులు పిల్లలకు ఆటా పాటా ఎలా నేర్పాలో రచించి, అలవోకగా వాటిని చెప్పి చూపిన అసాధారణ బాలసాహిత్య సృష్టికర్త.

వాశిలోనూ రాశిలోనూ ఆయన రచనలు విశిష్టమైనవి. మనం పిల్లలకు తెలుగు భాషని ఎంత సులువుగా అందించవచ్చునో విప్పి చెప్పిన బోధకుడు.

చిన్న చిన్న విషయాలు మనసుకు పట్టే కథనాలు, కల్పనలు ఆరోగ్యకరమైన ఆలోచనలు - వీటిని పిల్లల చుట్టూ ఎలా పెంచవచ్చునో చాటిన సంచార తోటమాలి బి.వి.

సంప్రదాయం, సమకాలీనత, కాల్పనికత, సంగీత గుణం కలబోసి అందించిన బి.వి. సమగ్ర సాహిత్య సర్వస్వం ఇది.

నిరాడంబరంగా జీవించి, మంచి స్నేహితులతో గడిపి పిల్లల కోసం రచనలు చేసిన ఒక అసాధారణ ఉపాధ్యాయుని సమగ్ర సాహిత్యం - మూడు సంపుటాలలో...



